UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

Cl. No. 491.5 M26    Acc. No. T/2167

DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

# అలంకార సూత్రము

Centre for Regional Studies
(TELUGU)

శ్రీ రాజానక రుయ్యకుని
అలంకార సర్వస్వసారము

లాక్షణిక శిరోమణి
సాహిత్యవిద్యా భాషాప్రవీణ
శ్రీ జమ్మలమడక మాధవరామశర్మ
ఆంధ్ర విశ్వవిద్యాలయము అకడమిక్ కౌన్సిల్ సభ్యుడు
ఏ. సి. కాలేజి : : గుంటూరు

స్వాయత్తము
౧౦౦౦ : హేమలంబి

యన్నామ కించిదిహ సమ్యగథాన్యథా వా
సాక్షాదలంకృతినయోచితమేతదుక్తం
విద్వేషరోషమపసార్య బుధైః క్షణస్య
తత్రావధేయమియతైవ వయం కృతార్థాః

వెల: ౧—౫౦
౧౮౭౯

శ్రీ కైలాసము
గుంటూ



శ్రీ కల్లూరు సుబ్బారావు

# ఆత్మ నివేదనము

సుహృదయుడు, కావ్యామృత మృదుల మధుర హృదయుడు
కలామయ చేతనా ప్రఖ్యాతా ప్రతిమ ప్రతిమాత్మకుడు
అనేకానేకామూల్యా లలిత భావ బోద్ధ, విద్యావ్యసని
పరదుఃఖకాతరుడు, పరోపకార వ్రతనిరతుడు
నానాప్రాజ్య సాంస్కృతికోద్యమములకు నాన్న
రాయలసీమ రాజకీయ కులపతి
ప్రజాపరాయణుడు, యశశ్శాలి
పుణ్యశ్లోకుడు, ప్రసన్న గంభీర వదనుడు
సాకార సామాజిక సంస్కృతి ప్రతిభా కృతి
సాహిత్యానురాగి, సారస్వత సహయోగి
కవి పండిత వత్సలుడు
ప్రమాతృహృదయ సంవాది

## శ్రీ కల్లూరు సుబ్బారావు సహృదయులకు

షష్టిపూర్త్యంకముగా
సాహితీ స్వతంత్రతా సమర్థకముగా
సచేతః కామనా ప్రతిరూపముగా ప్రకాశితమయిన

## అలంకార సూత్రము

కవి వాచా శ్రీవైదగ్ధ్య సారము
వివిధ విశిష్ట భావుక చమత్క్రియా సర్వస్వము
భావ రసమయ హృదయ కుసుమ వాసితము
ఉపాయనముగా సమర్పించుచున్నాను

# శ్రీ పారిషదము

అప్పటి కయిదారు దినాలుగా అనంతపురంలో శ్రీ సుబ్బారావు షష్టి పూర్తి సన్నాహము సమారంభం అయింది. ఎందరో వచ్చారు. కలశావాహనము దేవతా ప్రతిష్ఠాపనము శాంతిక పౌష్టికాభ్యుదయిక కర్మకలాపమంతా సమర్థులయిన వేదదక్షులు శాస్త్రచక్షువులు చేయించారు. శ్రీ శివగంగపీఠస్వాములు బహుదృశ్వాలు విజయం చేసి స్వయంగా పర్యవేక్షకులై హోమాలు చేయించారు. వేదవిదుల మంత్రబలాకృష్టములై సూర్య మండలమునుండి సర్వతీర్థాలు రాగా మహాస్వామి మహాభిషేకం చేయించారు. ప్రాయశ్చిత్తీయ గంధము లేకుండా ప్రతకర్మ శిష్టులకు విశిష్టతను సంపాదించే వేదవేత్తలు తీర్థాలాహరించి శ్రీ సుబ్బారావుపై శాంత్యుదకం చల్లుతున్నారు. యథావిధిగా అభిషేకం అయింది. శ్రీ సుబ్బారావు తీర్థస్నాతులై సువసనులై వేదఋషుల ఋక్కుల ఆశీర్వచనాలు స్వీకరిస్తున్నారు. "ఇది సమయము. అర్పణ సమర్పణ సమయం. నీ కృతినివేదనాని కిది సమయం. ఇది ఉపాయన సమయం. అలంకారసూత్రము నివేదించి ఉపాయనముగా అర్పించడానికి ఇది సమయం. ఇది మా సమయము" అని శ్రీ స్వామిపాదులు సూచించగానే మా. శర్మ సంస్కృతాగ్నులకు నమస్కరించి ఉపాయనము నివేదించారు. అది కృతినివేదనము.

శుక్రవారము దశమి ఉదయము సాలంకార కాయమానములో సకవులు సకల కవులు సచేతసులు తమహృదయాలతో సమాసీనులయినారు. కృతనివేదనానికై కవిభావుక పరిషత్తు సమావేశ మయింది. శ్రీ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ అధ్యక్షత వహించారు. శ్రీ చిత్తూరు వరదాచార్య గోపాలస్తుతి శ్రీ పుట్టపర్తి శ్రీనివాసాచార్య పరిచయోక్తి సభకు సౌముఖ్యం సంపాదించింది.

"మా. శర్మ నెట్లు పరిచయం చేయగలను. సర్వ సుహృదుడు. సంస్కృతి సౌష్ఠవం కలవాడు. ప్రసన్న గంభీరవాక్కు. భారతీయ సంస్కృతి పరాయణ మయిన సంప్రదాయ తపః ఫలశాలి. సాహిత్య విద్యాదేశికుడై సంస్కృతోపదేశకుడై లోకమంతట ప్రసిద్ధుడయిన సారస్వత సిద్ధుడు. ఇపుడు సభలో పాల్గొనుట సముచితంగా ఉన్నది".

**

అధ్యక్షులు : నమస్సదసే, ఇది మహోత్సవసమయం. సారస్వత ములో కవిసహృదయాఖ్యాతత్వవిజయమున్నది. రాజకీయములో నీతి, సార స్వతములో ధర్మము, కలిసిరాగా ఇట్టి ధర్మనీతికళ్యాణము, నీతిధర్మ వివా హము కన్నులపండువగును. మా. శర్మ చిరమిత్రుడు. ప్రౌఢసుందరుడు, ఇదిగో పరిచయప్రస్తుతికై శ్రీ కళ్ళే సూర్యనారాయణశర్మ అధికారి, "మా శర్మగారు నాకు గురుపాదులు. వాగమృతముచే అంధ్రదేశము పరిప్లావితము చేశారు. పండితకుటుంబమున జన్మించి తండ్రికడ విద్యాభ్యాసమొనరించి శ్రీ రాయడుశాస్త్రి శిష్యులై విశిష్టవ్యాసంగమొనరించి అధీతిబోధాచరణ ప్రచారములు వ్రతముగా సంస్కృతప్రచార మొనరించుచున్నారు. తెనాలి, నెల్లూరు సంస్కృతకలాశాలలందధ్యాపకులై అలంకారశాస్త్రవేత్తలను సిద్ధము చేసిన వ్యక్తి. అలంకారశాస్త్రమును సాధికారంగాచెప్పగల పండి తుడు" అనగానే అనంతకృష్ణులు – "మా. శర్మ సూత్రము నిర్మించుట తగును. సూత్రమల్పాక్షరము. బహ్వర్థము. అలంకారశాస్త్రాధ్యయనము పూర్ణతాసంపాదకము. ఇతరశాస్త్రపరిచయము కావాలి. సర్వాధికార సంపాదకుడు మా. శర్మ. సాహిత్యశాస్త్ర, గ్రంథరచయిత. పండితగాయలు గాయకుడుకూడా. నాదంతో మా సభ మ్రోగింది అన్నాడు. అతని గ్రంథ మును ఇంకా ఇతరములను మా. శర్మ అనువదించారు. మంగళసన్నివేశ సమయంలో ఈ సమర్పణం సముచితం, శర్మ ప్రామాణికుడు. అలంకార సూత్రము పుష్పవాసితము మధురమాధవము భావోపహారాయితము సుప్ర కాశము అవుగావుత."

అని అలంకారసూత్రమును శ్రీహస్తముతో ప్రకటించారు. అపుడు స్తుతప్రస్తుతుడై మా. శర్మ స్వస్పందమును ఈ విధంగా ఆవిష్కరించు కొన్నారు. "సాహిత్యము సర్వపురుషార్థాలకు సర్వప్రకృతులకు సర్వకల లకు సామరస్యము సంపాదించడానికై అవతరించింది. సాహిత్యము నాట్యము కన్న భిన్నముకాదు. నాట్యవేదములో దీన్ని విశదం చేస్తున్నాను. విప్లవా నంతరము శృంఖలారక్షణము సాహిత్యకార్యము. కేవలము రాజకీయముతో గతార్థత కలుగదు. ప్రాక్కాలములో చక్కగా విషయసామరస్యము ఉన్నది. నేడు వ్యక్తులకు సామరస్యమును సంపాదించాలి. లక్షణమును అనుసరిస్తే వ్యక్తిసామరస్యం కలుగుతుంది. అందుకై శాసనసాహిత్యపరిషత్తు

*****

కలగాలి. ఈ సమావేశము రాజకీయసమావేశంకంటె రమ్యము. ఇది సభా సభ్యులకు సంతుష్టినివ్వాలని హృదయావర్జనం చేయాలని ఆశించినట్లె రమ్యముగా జరిగింది"—అన్నారు.

శ్రీ రామకృష్ణరాజు :— మా. శర్మ సభాభాషణం వింటూఉంటె మనస్సుకు కల్లోలం లేకుండా ప్రశాంతత ఏర్పడుతుంది. ఇంతటివారు ఆర్థికంగా బలంకలవారయ్యేటట్లు లోకం పరిశీలించాలి. అందరు దండిగా సహాయం చేయండి. ప్రభుత్వం కొంతద్రవ్యం ప్రత్యేకించి ఇటువంటి వారిని పోషించాలి. దేశాభ్యుదయము వీరివలన వస్తుంది. సంస్కృతి హేతువులయిన ఇటువంటివారిని పోషించాలి. అది మనపని. ప్రభుత్వం పని. అందరిపని.

శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు :— ఈ సాహిత్యగోష్ఠికై నేనీనాడు తీరిక చేసికొన్నాను. మా. శర్మ కృతి యిస్తూఉంటే మా కల్లూరు స్వీకరిస్తూ ఉంటే నేనుపన్యసించక తప్పదు. సంస్కృతంలో పాండిత్యంలో మా. శర్మ మహోగంగ. నాకు చిరపరిచితుడు. అతనికి చాలా గ్రంథాలున్నవి. నేను ఎప్పుడయినా చూస్తాను. పండితులకు ఆత్మగౌరవం కలిగేటట్లు చేయడం జాతీయతా ధర్మం. ఈనాడు మన మనుభవించే స్వరాజ్యం మన ఆధ్యాత్మికతా వికాసానికి సమర్థం కావాలి. ఇప్పటి రాజకీయ స్వాతంత్ర్యంలో అన్నీ వికసించాలి. మా. శర్మ అన్నట్లు ధర్మం సత్యం ధర్మచక్రములోని "సత్యమేవ జయతే" కావాలి. నవసాహిత్యం సృష్టించాలని కోరుతున్నాను. నూతన విషయాలను సమన్వయించుకుంటూ సాహిత్యం నిర్మించడం అవసరం. మా. శర్మ కృషి సఫలం కాగలదని భావిస్తున్నాను. "శర్మగారూ! త్వరలో మీరు అనంతపురం మళ్లీ వచ్చి మాకందరకూ భావ సమారాధనం చేయాలి." అని శ్రీ చిదంబరరెడ్డి అన్నారు. "మీరు తెన్నేటి విశ్వనాథంగారికి సోదరులా? బంధువులా? ఆ పట్టుదల ఆ దీక్ష ఆ ధైర్యం సభలో సాక్షాత్కరించగానే అనుకున్నాను." అని ఇంకా ఇంకా ఎందరో ప్రశంసా వచనాలు పల్కుతూవుంటే అనంతాకాశాన విద్యున్మాలాపరీత కాదంబిని సాక్షాత్కరించింది.

# అలంకృతి

భారతీయాలంకారికుల చరిత్ర చాల గహనంగాను సుందరంగాను ఉంటుంది. అలంకారశాస్త్ర సంప్రదాయ ప్రవర్తకులు యెంతోమంది ఉన్నారు. సంప్రదాయాలు గూడ అనేకవిధాలుగా వచ్చినవి. ఏయే సంప్రదాయ మే విధముగా వచ్చినదిన్నీ పెద్దలు నిరూపించారు. వానిలో అలంకార సంప్రదాయ మొకటి చాలామంది సాహిత్యతాపసుల నాకర్షించింది. భామహుడు అలంకారసంప్రదాయమును ప్రవర్తింప జేశాడు. ఉద్భటుడు రుద్రటుడు దానిని పోషించారు. దండిగూడ అలంకారముల ప్రాధాన్య మంగీకరించాడు. అలంకారము కావ్యానికి ప్రాణమని కొందరు భావించారు. అలంకారం లేకపోతే కావ్య మస్వాభావికంగా ఉంటుంది అనిన్నీ అన్నారు. భరతుడు నాట్యశాస్త్రంలో నాలుగు అలంకారములు చెప్పాడు. కువలయానందము దాకా ఈ అలంకారాలు పెంపుపొంది ౧౧౫ అయినవి. అలంకారముల పేర్లు ఒకటిగా నున్నప్పటికి వాని స్వరూపములో కొందరు చాలా తేడాచూపించారు. భామహుడు చెప్పిన వక్రోక్తి వామనమతంలో మారింది. అలంకారాల వర్గ విభాగములో కూడ కొన్ని నిశ్చిత భావాలు వచ్చినవి. ఔపమ్యము, వాస్తవము, అతిశయము, శ్లేష, అలంకారాలకు మూలమని కొందరు భావించితే ఔపమ్య విరోధ తర్కాదులు అలంకారమూల మని కొందరు సుందరంగా చెప్పటానికి యత్నించారు. అలంకారా లంగీకరించిన వారికి రసతత్త్వం తెలియక పోలేదు. రసాదులు కూడ అలంకారమె అన్నారు. అలంకారముల స్పష్టతత్త్వమును వ్యాఖ్యానించడానికై ధ్వనిని ఆధారము చేసుకోవలసి వచ్చింది.

రససంప్రదాయముతో పాటే అలంకారసంప్రదాయం వచ్చిందనాలి. వేదవాఙ్మయంలో అలంకారా లున్నవి. అగ్నిపురాణంలో అలంకారాల నిరూపణ మున్నది. సాహిత్యలక్షణకారులు అలంకారాలను వివేచించి అలంకారికు లయినారు. భామహుడు అనేకమార్గాలలో నున్న అలంకారాలను ఒకచోట గుమిగూర్చి నిరూపించాడు. అందువలన భామహుని అలంకారవాదులలో ముఖ్యంగా పరిగణించారు. అలంకారాల కంటె ఇతరములను

చెప్పినప్పటికి అలంకారములకు ఒక స్థానగౌరవమును కొంద రంగీకరించారు. లోకంలో రత్నాదిభూషణములు శరీరము నలంకరించినట్లు కావ్యంలో శబ్దార్థముల ద్వారా అలంకరించే వానిని అలంకారములు అని అన్నారు. ఆ అలంకారములు శబ్దార్థము లం దున్నట్లు నిరూపించారు. అనుప్రాసాదిశబ్దాలంకారములు శబ్దరచనలోని విచిత్రతను సూచించేవి కాగా ఉపమాద్యర్థాలంకారాలు అర్థవైచిత్ర్యమును సూచించుతున్నవి. భామహుడు ఉక్తివైచిత్ర్యమును అతిశయోక్తిగా తలచి అలంకారాలన్నీ తన్మూలముగా ఉంటవి అన్నాడు. ఉక్తివైచిత్ర్యమె కావ్యములో అలంకారము. అది అనేకవిధాల ఉంటుంది. రసమె ప్రధానమని భరతుడన్నప్పటికి గుణాలంకారాలను నిరూపించాడు. ఐతే వానికి ప్రాధాన్యం చెప్పలేదు. వాగ్వైదగ్ధ్య మున్నప్పటికి రసమే జీవిత మని అగ్నిపురాణము అన్నది. "అర్థాలంకారరహితా విధవేవ సరస్వతీ" ఇంత బరువయిన మాటలుగూడ అన్నారు. అలంకారాలనేవి కావ్యశోభాకర ధర్మములు అన్నారు. వ్యంగ్యార్థ ముంటేనే అలంకార మలంకార మవుతుందని ఆనందవర్ధను డభిప్రాయపడినీ వాచ్యార్థమున కానంత్యము వస్తుందని అన డము చూస్తే అలంకారాత్మక మయిన కావ్యార్థము ఆయన దృష్టిలో ఒక విధంగా ఉన్నది అని తలచ వచ్చు. మమ్మటుడున్ను శబ్దార్థములు కావ్యమని చెపుతూ అలంకారా లుండడమును నిరూపించాడు. ఒక్కొక చోట లేకపో యినా సరే నన్నప్పటికినీ అలంకారాల సౌందర్యమును మమ్మటుడు బాగా వ్యక్తం చేశాడు. అలంకారములు రసోపస్కారములని వారందరూ నిశ్చ యించారు. మమ్మటుని దృష్టిలో అలంకారములు రసధర్మములు కావు. శబ్దా ర్థము లందుండే అస్థిరధర్మాలు. ఇవి రసముతో నిత్యసంబద్ధములై యుండవు. నీరసకావ్యములో గూడ నివి యుండ వచ్చును. రసముతో కూడా ఉన్నప్ప టికిన్నీ అలంకారము లొకొక్కప్పుడు రసోపకారకములు కాకపోవచ్చు అని కనపడుతుంది. గుణాలు కావ్యశోభాసంపాదకము లయితే అలంకార ములు తదతిశయహేతువు లని వామను డన్నాడు. వామనమతాన్ని అందరూ ఒప్పుకోకపోయినా అలంకారాల స్వరూప నిష్కర్షలోని ఒకభావ మా విధంగానున్న దనుకోవచ్చును. మమ్మటుని తరువాతవారు ధ్వనివాదాన్ని శిరసా వహించారు. ధ్వనిమార్గంలో అలంకారముల పరిష్కారమును గుర్తించి

వారు నిరూపించారు. రమణీయార్థ ప్రతిపాదక మయిన శబ్దము కావ్యమనిన పండితరాయల దృష్టిలో అలంకారాల కొక ప్రత్యేకత కనపడుతూనే ఉన్నది. అయినప్పటికి ధ్వనికారమార్గంలోనే వీరందరూ సంచరించారు. కొంచెము హెచ్చు తగ్గుగా సుప్రసిద్ధు లయిన సాహిత్యవేత్త లందరూ అలంకారముల గొప్పతనాన్ని అంగీకరించారు. అలంకారముల క్రమవికాసంలో భామహుడు, దండి, ఉద్భటుడు, రుద్రటుడు, భోజుడు, మమ్మటుడు, రుయ్యకుడు, జయదేవుడు, శోభాకర మిశ్రుడు, విశ్వనాథుడు, విద్యానాథుడు, అప్పయ్యదీక్షితుడు, పండితరాయలు బాగా శాస్త్రీయంగా పరిపోషం చేశారు. పండితరాజజగన్నాథుని వరకు ఏ యే విధంగా అలంకారవాదము విస్తరించిందో గుర్తించడం చాలా అవసరము. వామనుని సమయం వరకు ౫౨ అలంకారాలు వచ్చినవి. భామహుడు ౩౮ తో ఆరంభించాడు. ఈ ౫౨ అలంకారాలలో రుయ్యకుడు ౭౫ అలంకారాలను స్వీకరించాడు. రుయ్యకుడు ౮౧ శబ్దార్థాలంకారాలను నిరూపించాడు. కొన్నిటిని తాను క్రొత్తగా చెప్పాడు. అన్నిటిని ప్రాచీనుల అలంకారాలనే స్వీకరించాడు. రుయ్యకుని తరువాత కాలంలో ఇంకా యెంతో అలంకారాల విస్తరణం జరిగింది. విశ్వనాథుడు ౮౯ అలంకారాలను నిరూపించాడు. ౫౧ అలంకారాలను తాను క్రొత్తగా చెప్పాడు. అప్పయ్యదీక్షితుడు ౧౧౮ అలంకారాలను నిరూపించాడు. ఆయన నిరూపణములో శబ్దాలంకారములు లేవు. ౧౮ అలంకారాలను దీక్షితుడు క్రొత్తగా నిరూపించాడు. శోభాకరమిశ్రుడు ఇంక చాలా అలంకారములను పరిగణించాడు. ఆ పేర్లుకూడ చాల క్రొత్తగా ఉంటవి. పండితరాజు జగన్నాథుడు తి ర స్కా ర ము అనే ఒక అలంకారాన్ని తాను ప్రత్యేకంగా నిరూపించాడు.

అలంకారాలలో చాలా క్రమవికాసం వచ్చింది. నాట్యకారుడు నాలుగే చెప్పాడు కాని భరతుడు నిరూపించిన ౩౬ కావ్యలక్షణాలు, లాస్యాంగములు, ప్రస్తావనాంగములు, సంధ్యంగములు మొదలయిన వానిని పరిశీలిస్తే అర్వాచీనకాలంలో అంగీకరించిన యెన్నో అలంకారాలు వానిలో నంతర్గర్భంగా నున్న వనిపిస్తుంది. కొందరూరకనే సంఖ్యను పెంచారు. ఆ పెంపకంలో నంతగా మహత్వం కనపడదు. అలంకారాలు ఎన్నయినా

యంగా విషయమును చర్చించి సిద్ధాంతంగా చెప్పడంలో రుయ్యకుని అలంకార సర్వస్వం అసాధారణమయిన ఉత్తమగ్రంథం. ఈ గ్రంథము ధ్వనివాదము వెలువడిన తరువాత ధ్వనివాద ఖండనములు వచ్చినతరువాత ఖండన ఖండనము వెలసిన తరువాత రావడం సాహిత్యసంసారంలో యెంతో సముచితంగా ఉన్నది. మహిమభట్టు వ్యక్తివివేకానికి రుయ్యకుడు తాను వ్యాఖ్యానం వ్రాస్తూ అది ధ్వనివాద ముండనానికి వచ్చినా తాను ధ్వనివాద మండనం చేసి యెన్నో విషయాలు నిరూపించాడు. ఆ వివేకము రుయ్యకున కెంతో బలమును సంపాదించింది. ఆ బలఫలమె అలంకార సర్వస్వము.

పండితరాజానంతర కాలికు లయిన ఆలంకారికులు కొందరు జగన్నాథ వాద ఖండనానికై కొంతగా ఉబలాటపడ్డారు. వారున్నూ రుయ్యకుని ఒక రకంగా అర్థంచేసుకొని అభిమానించి ఉంటారు. అలంకార కౌస్తుభంలోను, మణిహారంలోను, ఇంకా యితర గ్రంథాలలోను ఆ యా కర్తలు దీక్షిత జగన్నాథుల నారాధించుచు రుయ్యకాభివందనము ఆవశ్యకమనే భావించారు. ఆ గ్రంథాలలో ఆ పంక్తులు కనపడుతూనే ఉన్నవి. ఇంతగా అలంకారారాధనం చేసిన ఆలంకారికులు అలంకారసర్వస్వోపజీవనులు కావడము ఆ గ్రంథ ప్రాశస్త్యానికి నిదానము. అస్తు.

అలంకారసర్వస్వ గ్రంథ మొకప్పుడు బాగా పఠన పాఠనాదులలో నుండేది. నే డంతగా కానరాదు. రసగంగాధరము కూడా ఈ మార్గంలో నుండి తప్పిపోతే విద్యాగురువులు శ్రీ రాయుడుశాస్త్రిగారు పోరాడి పాఠ్యంగా చేయించారు. సర్వస్వగ్రంథము పరీక్షార్థులకు కూడ పాఠ్యంగా రాలేదు. ఒకప్పుడు రానట్లు వచ్చింది. ఇప్పుడు లేదు. అలంకార ప్రపంచం కావ్యకవుల నివాసం. అలంకారసర్వస్వం తెలియకపోతే నివాసంలో వాససౌఖ్య మెట్లా ఉంటుంది? కువలయానందం, చిత్రమీమాంస, రసగంగాధరము చదివితే చాలదా! చాలునో చాలదో! అది కాదు. విద్యానాథులు, మల్లినాథులు, జగన్నాథులు సర్వస్వము తెలిసి అంత వారయినారు. ఆ గ్రంథాలు వ్రాశారు. రుయ్యక సర్వస్వం తెలిస్తేనే గాని ఆ గ్రంథాల తెలివిడి గూడా మనకు స్పష్టంగాదు. అందులోను విశేషించి తెలుగువారికి తెలుగు కావ్యాస్వాదంలో సర్వస్వకారచాతుర్యం ఎట్టిదో బాగా తెలియాలి.

ఇన్నాళ్ళూ తెలియనందున వచ్చిన అనర్థం మళ్ళీ రా కూడదు. దానికై అలంకారసర్వస్వ మావిష్కరించడ మావశ్యక మయినది. అలంకారసర్వస్వానికే అలంకారసూత్రమని పేరున్నది. దీనిని రుయ్యకుడు రచించాడా? మంఖకుడు రచించాడా? ఈ చర్చలు లోకానికి అంత రుచికరంగా లేవు. రుయ్యకుడు కాశ్మీరదేశీయుడు. సాహిత్య ధర్మ మర్మజ్ఞుడు. అతని పేరులో 'రాజానక' అనే ఉపాధి యున్నది. ఇది కేవలము కాశ్మీర విద్వాంసుల బిరుదము. అలంకారసర్వస్వము సూత్ర వృత్తి విభాగంలో ఉన్నది. ధ్వన్యాలోక సమాన ప్రతిపత్తిలో అలంకారసర్వస్వము నధ్యయనం చేయాలి. జయరథుడు అలంకారసర్వస్వానికి మంచి వ్యాఖ్యానము వ్రాశాడు. దాని పేరు విమర్శిని. సూత్ర వృత్తి కర్త ఒకడే అని అతని నిశ్చయము. అవి గుర్వలంకారసూత్రము లయినా, నిజాలంకారసూత్రము లయినా భావభేద మక్కర లేదు. మంఖకుడు తన గురువు గా రయిన రుయ్యకుని అలంకారసూత్రాలకు వృత్తివ్రాశాడని సూత్రవృత్తి సమేతమయిన గ్రంథము అలంకారసర్వస్వమని యెవరేమి యన్నప్పటికి నాకు జయరథ విమర్శినిపై బాగా విశ్వాసం ఉన్నది. రుయ్యకుని శిష్యుడు మంఖకుడు రుయ్యకునకు ప్రేమాస్పదుడు. రుయ్యకుని గ్రంథానికి జయరథుడు వ్యాఖ్యాత. జయరథుడు సాహితీ జయరథ మధిష్ఠించిన మహార్థ స్పందవిద్యా చతురుడు. అభినవగుప్తుని తంత్రాలోకమునకు వ్యాఖ్య వ్రాసి అంతటి వా డయినాడు. అతనికి తెలియవలసినదే తెలిసినది. రుయ్యకుడు సర్వస్వ రచయిత అని రాజానక జయరథు డనినాడు. జయరథుడు ఆత్మరథుడని భావించు నేను రాజానక రుయ్యకుడే సర్వస్వకారుడని విశ్వసించాను. రుయ్యకుడు అలంకార శాస్త్రంలో చాలా గ్రంథాలు రచనం చేశాడు. కావ్యప్రకాశ సంకేతం, అలంకార మంజరీ, అలంకార అనుసారిణీ, సాహిత్య మీమాంస, నాటక మీమాంస, అలంకార వార్తికము, సహృదయలీల, వ్యక్తివివేకవిచారము, అలంకారసర్వస్వము. ఇవి అన్ని రాజానక రుయ్యకుని గ్రంథాలు. అన్నీ లభించితే సహృదయలోకం సాహితీతేజోమండలం అవుతుంది. అతని సాహిత్యమీమాంస లభించింది. ఇంకా ఇట్లే సులభం కావాలి.

అలంకారసర్వస్వంపై వ్యాఖ్యానాలు చాలా ఉన్నవట. నేడు జయరథుని విమర్శిని మన కున్నది. సముద్రబంధువ్యాఖ్యాన మున్నది. విద్యాచక్రవర్తి వ్రాసిన సర్వస్వ సంజీవిని దొరక లేదు. వీని నాధారంగా చేసుకొని అలంకారసూత్రం ప్రకటించుచున్నాను. ౭౬ సూత్రాలలో అలంకారసర్వస్వము సర్వస్వము చెప్పినది. వృత్తిలో విషయవిచారణ మున్నది. వివిధములయిన లక్ష్యములు విస్తృతంగా ఉన్నవి. అలంకారసర్వస్వము అలంకారసూత్రము. నా యీ రచన అలంకారసూత్రము. దీనిలో సూత్రాలన్నిటికి సంక్షిప్తంగా అర్థం వ్రాశాను. కొంతగా విస్తరించాను. సముచితంగా ఉదాహరణ లిచ్చాను. యథామతి మంచిపద్యా లనుకొనే వానినే ఉట్టంకించి తాత్పర్యం వ్రాసి సమన్వయగతి చూపించాను. దాదాపు ౧౫౪ పద్యాలు దీని లక్ష్యలోకంలో ఉన్నవి. ఈ పద్యాలను, వీనివక్రతను, వీని పరిశీలనమును, కవిసహృదయపాఠకులు భావించితే పద్యాస్వాదపథము గోచర మవుతుం దనే నమ్మక మున్నది. నవరసగంగాధరము వ్రాసి సంక్షిప్తముగా పండితరాయల నిర్ణయం తెలియడానికై 'రసగంగాధరమణి' ప్రకటించాను. కాబట్టి ఈ యలంకారసూత్రం ప్రకటించడం కూడ సముచిత మనుకున్నాను. ఇన్నాళ్ళుగా అధ్యయనం చేసి, అధ్యాపనం చేసి, అనుసంధానం చేసి ఈ రచన యీ విధంగా ఉండాలని అలంకారసూత్రం అందించుతున్నాను. సచేతోభావుకులు హృదయసంవాదంతో తమ హృదయ మణిదర్పణానికి తోడుగా దీనిని అంతర్లీనము చేసుకొనడానికై అందిచుచున్నాను. స్వీకరించండి.

మాధవరామశర్మ

# అ ను క్ర మ ము

★


ఆత్మనివేదనము

అనుభూతి

అలంకృతి

| | | | |
|---|---|---|---|
| పునరుక్తవదాభాసము | ౩ | ౧౪. దీపకము | ౧౯ |
| ఛేకానుప్రాసము | ౪ | ౧౫. ప్రతివస్తూపమ | ,, |
| వృత్త్యనుప్రాసము | ౫ | ౧౬. దృష్టాంతము | ౨౦ |
| యమకం | ,, | ౧౭. నిదర్శన | ౨౧ |
| లాటానుప్రాసము | ౬ | ౧౮. వ్యతిరేకము | ౨౨ |
| చిత్రము | ౭ | ౧౯. సహోక్తి | ౨౩ |
| అర్థాలంకారములు | | ౨౦. వినోక్తి | ౨౪ |
| ౧. ఉపమ | ౮ | ౨౧. సమాసోక్తి | ,, |
| ౨. అనన్వయము | ౯ | ౨౨. పరికరము | ౨౬ |
| ౩. ఉపమేయోపమ | ,, | ౨౩. శ్లేష | ,, |
| ౪. స్మరణము | ౧౦ | ౨౪. అప్రస్తుతప్రశంస | ౨౮ |
| ౫. రూపకము | ౧౧ | ౨౫. అర్థాంతరన్యాసము | ౩౦ |
| ౬. పరిణామము | ౧౨ | ౨౬. పర్యాయోక్తము | ౩౧ |
| ౭. సందేహము | ౧౩ | ౨౭. వ్యాజస్తుతి | ౩౨ |
| ౮. భ్రాంతిమాన్ | ౧౪ | ౨౮. ఆక్షేపము | ౩౩ |
| ౯. ఉల్లేఖము | ౧౫ | ౨౯. విరోధము | ౩౬ |
| ౧౦. అపహ్నుతి | ,, | ౩౦. విభావన | ౩౭ |
| ౧౧. ఉత్ప్రేక్ష | ౧౬ | ౩౧. విశేషోక్తి | ౩౮ |
| ౧౨. అతిశయోక్తి | ౧౭ | ౩౨. అతిశయోక్తి | ,, |
| ౧౩. తుల్యయోగిత | ౧౮ | ౩౩. అసంగతి | ౪౦ |

| | | |
|---|---|---|
| ౩౪. | విషమము | ,, |
| ౩౫. | సమము | ౪౦ |
| ౩౬. | విచిత్రము | ౪౨ |
| ౩౭. | అధికము | ౪౩ |
| ౩౮. | అన్యోన్యం | ౪౪ |
| ౩౯. | విశేషము | ,, |
| ౪౦. | వ్యాఘాతము | ౪౫ |
| ౪౧. | కారణమాల | ,, |
| ౪౨. | ఏకావళి | ౪౬ |
| ౪౩. | మాలాదీపకము | ౪౭ |
| ౪౪. | సారము | ,, |
| ౪౫. | కావ్యలింగము | ౪౮ |
| ౪౬. | అనుమానము | ౪౯ |
| ౪౭. | యథాసంఖ్యము | ,, |
| ౪౮. | పర్యాయము | ౫౦ |
| ౪౯. | పరివృత్తి | ౫౧ |
| ౫౦. | పరిసంఖ్యా | ,, |
| ౫౧. | అర్థాపత్తి | ౫౨ |
| ౫౨. | వికల్పము | ౫౩ |
| ౫౩. | సముచ్చయము | ౫౪ |
| ౫౪. | సమాధి | ౫౬ |
| ౫౫. | ప్రత్యనీకము | ,, |
| ౫౬. | ప్రతీపము | ౫౭ |
| ౫౭. | మీలితము | ,, |
| ౫౮. | సామాన్యము | ౫౮ |
| ౫౯. | తద్గుణము | ,, |
| ౬౦. | అతద్గుణము | ౫౯ |
| ౬౧. | ఉత్తరము | ,, |
| ౬౨. | సూక్ష్మము | ౬౦ |
| ౬౩. | వ్యాజోక్తి | ౬౧ |
| ౬౪. | వక్రోక్తి | ,, |
| ౬౫. | స్వభావోక్తి | ౬౨ |
| ౬౬. | భావికము | ౬౩ |
| ౬౭. | ఉదాత్తము | ,, |
| ౬౮. | రసవత్ | ౬౫ |
| ౬౯. | ప్రేయము | ,, |
| ౭౦. | ఊర్జస్వి | ,, |
| ౭౧. | సమాహితము | ౬౬ |
| ౭౨. | భావోదయము | ౬౭ |
| ౭౩. | భావసంధి | ,, |
| ౭౪. | భావశబలత | ,, |
| ౭౫. | సంసృష్టి | ౬౮ |
| ౭౬. | సంకరము | ౬౯ |

శ్రీః

# అలంకారసూత్రము

## శ్రీ రాజానక రుయ్యకుని

### అలంకారసర్వస్వసారము

★

శ్రీ భామహోద్భటాది చిరంతనాలంకారకారులు ప్రతీయమానార్థము వాచ్యము నుపస్కరించు నని యలంకారపక్షనిక్షిప్తముగ భావింతురు. ధ్వని మతము వారు గుర్తింప లేదు. ప్రతీయమాన మలంకారమె యనిరి. అలంకార ములె కావ్యమున ప్రధాన మని ప్రాచ్యమతము. వక్రోక్తిజీవితకారుడు వైదగ్ధ్య భంగీభణితి స్వభావ మగు బహువిధ మయిన వక్రోక్తినె ప్రధానముగ భావించి కావ్యజీవిత మనెను. కావ్యమున వ్యాపారప్రాధాన్య మంగీకరించెను. అలంకా రము లభిధాప్రకారవిశేషములే. ప్రతీయమానము త్రివిధముగా నున్నను వ్యాపారరూప మగు భణితిరూ కవిసంరంభగోచరము. సర్వధ్వని ప్రపంచము నుపచారవక్రతాదులచే స్వీకరించెను. కావ్యము కేవల ముక్తివైచిత్ర్యజీవితమె కాని వ్యంగ్యార్థజీవితము కాదు. ఇది యాతని దర్శనము. భట్టనాయకుడు కావ్యమున ప్రౌఢోక్తి పేరు గల వ్యంజనవ్యాపారమున్న దనెను. శబ్దార్థ స్వరూప మధఃకరించిన వ్యాపారమునకె ప్రాధాన్యము చెప్పెను. అభిధావ్యా పారము భావకత్వవ్యాపారముల కన్న వేరగు రసచర్వణాత్మక మయిన భోగవ్యాపారమె ప్రధానముగ విశ్రాంతిస్థాన మని యంగీకరించెను.

ధ్వనికారుడు వ్యంజనవ్యాపార మవశ్య మంగీకరింప వలసి యున్నందున, వ్యాపారము వాక్యార్థము కా నందున, వాక్యార్థ మయిన వ్యంగ్యమె గుణాలంకారోపస్కార్య మగుట ప్రధానము కావున విశ్రాంతిధామ మని, వ్యంగ్యరూప వాక్యార్థమె కావ్యాత్మ యని సిద్ధాంతించెను. వ్యాపారము నకు విషయముఖముననె స్వరూపలబ్ధి యున్నది. విషయప్రాధాన్యముననె ప్రాధాన్య ముండును. వ్యాపారముగా నది విచార్యమె కాదు. విషయమె సమగ్రభర సహిష్ణువు. కావున విషయ మయిన వ్యంగ్యమె జీవిత మన వలెను. వ్యంగ్యమునకె గుణాలంకారము లాదవించు చారుత్వ పరిగ్రహ సామ్రాజ్యము కలదు. రసాదులు జీవితభూతములు. వాని నలంకార మనరాదు. అలంకారము లుపస్కారకములు. రసాదులు ప్రధానము లగుట నుపస్కార్యములు. కావున "వ్యంగ్యము కావ్యజీవిత" మను పక్షమె సహృదయావర్జకము.

వ్యంగ్యనిష్ఠమై వ్యంజనవ్యాపార మున్నది. వ్యంగ్యము ప్రధాన మయిన "ధ్వని" యని, యప్రధాన మయిన "గుణీభూతవ్యంగ్య" మని రెండు కావ్యభేదములు కలుగును. వ్యంగ్య మస్ఫుట మయినచో నలంకార మగును గాన "చిత్ర" మనునది మూడవ కావ్యభేదము. ఇది శబ్దార్థాలంకార స్వభావమున బహుతరప్రభేదము.

## ౧. ఇహార్థపౌనరుక్త్యం శబ్దపౌనరుక్త్యం శబ్దార్థపౌనరుక్త్యం చేతి త్రయః పౌనరుక్త్యప్రకారాః

ఈ శాబ్దప్రస్థానమున అర్థపౌనరుక్త్యము— శబ్దపౌనరుక్త్యము— శబ్దార్థపౌనరుక్త్య మని మూడు పౌనరుక్త్యప్రకారములు. చెప్పబోవు నలంకారములలో కక్ష్యావిభాగ మొనర్చుటకై పౌనరుక్త్యప్రకారముల మొదట నిర్దేశించుట సముచితమె. అర్థపౌనరుక్త్యమున పునరుక్తవదాభాసము, శబ్దపౌనరుక్త్యమున ఛేకానుప్రాసాదికము, ఉభయపౌనరుక్త్యమున లాటానుప్రాస మనునది యిందు కక్ష్యావిభాగము.

## అర్థపౌనరుక్త్యము

## ౨. తత్రార్థపౌనరుక్త్యం ప్రరూఢం దోషః

అం దర్థపౌనరుక్త్యము ప్రరూఢదోషము. ప్రరూఢ మప్రరూఢ మని దోషము ద్వివిధము. దోష మున్నది యున్నట్లె యుండుట ప్రరూఢదోషము.

మొదట హేయము చెప్పుట యుపాదేయవిశ్రాంతి సూచించును. అప్రరూఢ మలంకార మగును. దోషాభావమాత్రముననె యలంకార మనము. అలంకారత్వోచిత మయిన విచ్ఛిత్తివిశేషము నపేక్షితము.

## పు న రు క్త వ దా భా స ము

### 3. ఆపుఖావభాససం పునరుక్తపదాభాసం

కావ్యాలంకారములు లౌకికాలంకార వైలక్షణ్యమున నలంకార్య పరతంత్రములు. ఆరంభమున నవభాసన ముండుట పునరుక్తవదాభాసము అట్లవభాసించిన యర్థ మట్లె పర్యవసానమున విశ్రాంతి పొందక వేరు విధమున విశ్రాంత మగుట యని భావము. కాక భాసించిన విధముననె పర్యవసించి నచో దోష మగును. సుబంత తిఙంతము లందు దీని విశేషములు గోచరించును.

#### సు బం తా పే క్ష ము

అహీన భుజగాధీశ వపుర్వలయ కంకణం
శైలాది నంది చరితం క్షత కందర్ప దర్పకం ౧
వృషపుంగవ లక్ష్మాణం శిఖి పావక లోచనం
ససర్వమంగళం నౌమి పార్వతీసఖ మీశ్వరం. ౨

పార్వతీ సఖు డగు పరమేశ్వరు నమస్కరింతును. శివునకు మహాసర్పము కంకణముగా నున్నది. తచ్చరితము నంది నానంద పెట్టును. ఆతడు మన్మథగర్వ మడచినాడు. శివునకు వృషభశ్రేష్ఠము చిహ్నము. శిఖలు కల యగ్ని లోచనము. ఆ శివుడు సర్వమంగళములు కలిగి యున్నాడు.

ఇందు, అహీన-భుజగాధీశ, వలయ-కంకణ, శైలాది-నంది, కందర్ప-దర్పక- వృష-పుంగవ, శిఖి-పావక, సర్వమంగళ-పార్వతి, పదముల జంట లభిన్నార్థములు. ప్రథమమున పునరుక్తములుగ భాసించును. పర్యవసానార్థమున పునరుక్తి మొదట భాసించిన రీతి లేదు. ఇట్లీపునరుక్తవదాభాస మర్థాశ్రిత మయి నందున అర్థాలంకారమె.

#### తి ఙం తా పే క్ష ము

భుజంగకుండలీ వ్యక్త శశి శుభ్రాంశు శేఖరః
జగంత్యపి సదాపాయా దవ్యా చ్చేతోహరః శివః 3

సర్పములను కుండలములుగ ధరించిన వాడును, వ్యక్తము లయిన చంద్రుని కిరణములు శేఖరముగ గలవాడును, మనోహరుడగు శివు డపాయము నుండి నిత్యము జగముల రక్షించు గావుత.

ఇందు "పాయాత్-అవ్యాత్" అను క్రియాపద గ్రహణమున పునరుక్తార్థ మాదిలో గోచరించును కాని పర్యవసానమున గోచరింపదు.

శబ్దపౌనరుక్త్యము

శబ్దపౌనరుక్త్యము వ్యంజనమాత్ర పౌనరుక్త్యము స్వర వ్యంజన సముదాయ పౌనరుక్త్య మని ద్వివిధము. అలంకారముల ప్రస్తావములో కేవల స్వరపౌనరుక్త్య మరమణీయ మగుట గణింప లేదు. ఇచట కేవల వ్యంజన-స్వరవ్యంజన సముదాయ మాశ్రయించిన రెండలంకారములు లక్షణీయములు.

ఛేకానుప్రాసము

౪. సంఖ్యానియమే పూర్వం ఛేకానుప్రాసః

ఛేకులు = విదగ్ధులు చతురులు. వా రనుమతించిన యనుప్రాసము ఛేకానుప్రాసము. రెండు వ్యంజన సముదాయములకు పరస్పర మనేకధా సాదృశ్య ముండుట సంఖ్యానియమము, సంఖ్యానియమ మున్నచో వ్యంజన మాత్రాశ్రిత మగు ఛేకానుప్రాస మగును.

కిం నామ దర్దుర! దురధ్యవసాయ! సాయం
కాయం నిపీడ్య నినదం కురుషే రుషేవ
ఏతాని కేలిరసితాని సితచ్ఛదానాం
ఆకర్ణ్య కర్ణమధురాణి న లజ్జితోఽసి ౪

మధురభాషుల మధ్యలో కటుభాషి నొకని అప్రస్తుత సరూప కథనమున ప్రతిక్షేపించుట యిందలి సంగతి. ఓరీ! దురుద్యమా! దర్దురా! (కప్ప) సాయంసమయమున కాయము పీడించి రోషమున నేమి బెక బెక లాడెదు? ఈ యంచల కర్ణమధురము లగు కేలీరసితములు విని సిగ్గు పడుట లేదే!

దీనిలో దుర దుర, సాయ సాయ, రుషే రుషే, సిత, సిత, కర్ణ కర్ణ, రెండు రెండు వ్యంజన సముదాయములు మిథః సదృశములు. 'సాయ సాయ కాయ' యనుచోట యకారమాత్ర సాదృశ్యమున వృత్త్యనుప్రాసము నున్నది.

## వృత్త్యనుప్రాసము

## ౫. అన్యథా తు వృత్త్యనుప్రాసః

రసవిషయ వ్యాపారము వృత్తి. అట్టి వ్యాపారము కల వర్ణరచన నిచ్చట వృత్తి యందుము. ఆ వృత్తి పరుష-కోమల-మధ్యమ వర్ణారబ్ధ మగుట మూడు విధము లగును. ఈ యనుప్రాసము తదుపలక్షిత మగుట వృత్త్యనుప్రాసము. ఛేకానుప్రాసము కన్న వేరుగా నున్నచో వృత్త్యనుప్రాస మగును.

ఆటోపేన పటీయసా యదపి సా వాణీ కవేరాముఖే
ఖేలంతీ ప్రథతే తథాపి కురుతే నో మన్మనోరంజనం
న స్యా ద్యావదమంద సుందర గుణాలంకార ఝుంకారితః
సప్రస్యంది లసద్రసాయన రసాసారానుసారీ రసః ౫

సుందర రసాలంకారములచే ఝుంకారితమై ప్రసరించు లసద్రసాయన రసాసార మనుసరించిన యీ రసముల్లసింప నంత వఱకు, సాతిశయాటోపమున కవివాణి యాముఖమున విహరించి ప్రఖ్యాత మయినను నా మనోరంజన మొదవింప జాలదు. రసమె మనోరంజన మొనరించును.

ఇందు పూర్వార్ధమున కేవల వ్యంజనసాదృశ్య మున్నది. అలంకార ఝుంకారిత-యనుచోట వ్యంజన సముదాయముల కే కదాసాదృశ్య మున్నది. రసాయన....రస-యనుచోట త్ర్యాదివ్యంజన సముదాయములకు సాదృశ్య మున్నది. ఇట్లుండుటయే ఛేకానుప్రాసము కన్న నన్యథాభావము.

## యమకము

## ౬. సర్వవ్యంజన సముదాయ పౌనరుక్త్యం యమకం

స్వరవ్యంజనముల సముదాయపౌనరుక్త్య ముండుట యమకము. వ్యంజన మాత్రాశ్రయ మలంకారద్వయ ముపలక్షిత మయినది. ఇది స్వరవ్యంజనాశ్రయము.

యో యః పశ్యతి తన్నేత్రే రుచిరే వనజాయతే
తస్య తస్యాన్యనేత్రేషు రుచిరేవ న జాయతే ౬

వనజములవలె నాయతము లయిన రుచిరము లయిన యీ నేత్రముల నెవ డెవడు చూచునో వాని వాని కన్యనేత్రములందు రుచియే కలుగదు.

దీనిలో 'రుచిరే వనజాయతే' యనునది ద్వితీయచతుర్థపాదము లం దేక విధమున నున్నది. స్వర వ్యంజన సముదాయ మట్లు పౌనరుక్త్యమున నున్నది. పర్యవసితార్థమున పునరుక్తి లేదు.

## ౭. శబ్దార్థ పౌనరుక్త్యం ప్రరూఢం దోషః

శబ్దార్థముల రెండిటి పౌనరుక్త్యము ప్రరూఢ మగు దోషము. ఇతరుల వచన మనువదించు పట్ల కాక యన్యస్థలము లందు చెప్పిన శబ్దార్థములనె చెప్పుట పౌనరుక్త్య మను దోష మని యభియుక్తు లనిరి. వక్ష్యమాణ లాటానుప్రాసాలంకారమున కన్న నిది విలక్షణ మని సూచించుటకే 'ప్రరూఢ' పద ముపాత్తము.

### లాటానుప్రాసము

## ౮. తాత్పర్యభేదవత్తు లాటానుప్రాసః

శబ్దార్థ పౌనరుక్త్యము తాత్పర్యభేదము కల దయినచో నప్రరూఢ దోషము లాటానుప్రాస మలంకార మగును. తాత్పర్య మన్నది యన్యపరత్వము. ఈ యలంకారమున తాత్పర్యము భిన్నముగ నుండును. శబ్దార్థముల స్వరూప మట్లె యుండును. మొదట శబ్దము వలె నర్థము నభిన్నముగనె యవభాసించును. పర్యవసానమున భిన్నముగ భాసించును.

కాశాః కాశా ఇవాభాంతి సరాంసీవ సరాంసి చ
చేతాంస్యాచిక్షిపుర్యూనాం నిమ్నగా నిమ్నగా ఇవ ౭

కాశములు కాశముల వలె నున్నవి. సరసులు సరసుల వలె భాసించినవి. నదులు నదుల వలె నున్నవి. ఇవి యువకుల చిత్తముల విక్షేప మొనర్చినవి.

దీనిలో కాశ సరో నిమ్నగ పదములు తదర్థములును పునరుక్తములె. పర్యవసానమున వ్యంగ్యార్థ మందు వాచ్య విశ్రాంతి యున్నందున పౌనరుక్త్యము తాత్పర్యభేదము కల దయినది. లాటానుప్రాసము నందు శబ్దైక్యము సాక్షాత్ ప్రయోజకముగా నిగ్రాహ్యము. శబ్దైక్యము లేకున్న నిది యుత్థితమె కాదు.

## ౯. తదేవం పౌనరుక్త్యే పంచాలంకారాః

ఇట్లు పౌనరుక్త్యమున నయి దలంకారములు కల్గినవి. పునరుక్తవదాభాస మర్థపౌనరుక్త్యాశ్రితము. ఛేకానుప్రాసాదులు మూడు శబ్దపౌనరుక్త్యా


శ్రయములు. లాటానుప్రాస ముభయాశ్రితము. ఇట్టి యయిదు పౌనరుక్త్యము నాశ్రయించిన యలంకారము లయినవి.

## ౧౦. వర్ణానాం ఖడ్గాద్యాకృతి హేతుత్వే చిత్రం

వర్ణములు ఖడ్గాద్యాకృతి హేతువు లయినచో చిత్ర మగును. వర్ణముల యుచ్చారణకాలమున ఖడ్గాదిసన్నివేశ ముండదు. మషీబిందు రూపములగు లిప్యక్షరముల సన్నివేశమున నీ యాకృతి కల్గును. అట్లు సంఘటితాక్షరముల ప్రతీతి ప్రత్యయమున నిది వాచకాలంకారము కా వచ్చును. యథావ్యుత్పత్తి ఖడ్గాద్యాకృతు లనేకము లున్నవి. పద్మబంధ మిచట పరిగ్రాహ్యము. ఇది యష్టదళ పద్మబంధము.

భాసతే ప్రతిభాసార రసాభాతా హతావిభా
భావితాత్మా శుభా వాదే దేవాభా బత తే సభా

ఇది యష్టదళ పద్మబంధము. ఇందు దిగ్దళములలో నిర్గమప్రవేశముల శ్లిష్టాక్షరములు కలవు. విదిగ్దళములందు వేరుగా గలవు. కర్ణికాక్షరము శ్లిష్టమె.




ఈ పద్యమున కర్ణానుకూలముగా నిట్లు పదసంయోజనము భావింపవలెను. "ప్రతిభాసార! తే సభా రసాభాతా హతావిభా భావితాత్మా వాదే శుభా దేవాభా భాసతే." ప్రతిభాసార! నీ సభ రసమున దీప్తము అజ్ఞానము పోగొట్టినది. ఆత్మభావనము చేసినది. వాదమున శుభముగ నున్నది. దేవసదృశమై శోభించు చున్నది.

## అర్థాలంకారములు : ౧ ఉపమ

## ౧౧. ఉపమానోపమేయయోః సాధర్మ్యే భేదాభేద తుల్యత్వే ఉపమా

ఉపమానోపమేయములకు సాధర్మ్యము భేదాభేదతుల్యముగ నున్నచో నుపమాలంకార మగును. సాధర్మ్యమున మూడు ప్రకారము లున్నవి. వ్యతిరేకాదులందు భేదప్రధానము. రూపకాదు లందభేదప్రధానము. ఈ యుపమలో వలె భేదాభేదప్రధానమును. అనేకప్రకార వైచిత్ర్యమున నుపమయే యనేకాలంకారబీజభూతము. కావున ప్రథమనిరూపణ ముచితము.

ప్రభామహత్యా శిఖయేవ దీపః త్రిమార్గయేవ త్రిదివస్య మార్గః
సంస్కారవత్యేవ గిరా మనీషీ తయా స పూతశ్చ విభూషితశ్చ ౯

ప్రభామహతి శిఖచే దీపము వలె, వియన్నదిచే స్వర్గమార్గము వలె, సంస్కారము కల వాక్కుచే విద్వాంసుడు వలె నా పార్వతిచే నా హిమవానుడు పూతుడు విభూషితుడు నయ్యెను. ఇందు దీపాదు లుపమానములు. హిమవాను డుపమేయము. పూతత్వ విభూషితత్వము లనుగామి ధర్మము లగుట నేకరూపమున నిర్దిష్టము లయినవి.

యాంత్యా ముహుర్వలిత కంధరమాననం త
దావృత్త వృంత శతపత్ర నిభం వహంత్యా
దిగ్ధోఽమృతేన చ విషేణ చ పక్ష్మలాక్ష్యా
గాఢం నిఖాత ఇవ మే హృదయే కటాక్షః ౧౦

ఆవృత్త వృంత పద్మసమాన మగు వలిత గ్రీవ మాననము వహించి గమించు నా పక్ష్మలాక్షి నా హృదయమున నమృతదిగ్ధము విషదిగ్ధము నయిన కటాక్షమును గాఢముగా పాదుకొల్పె నటు లున్నది. ఇందు వలితత్వ మావృత్తత్వ మేకవిధమె యయినను సంబంధిభేదమున వేరువేరుగా నిర్దిష్టము లయినవి. ఇట్టిది వస్తుప్రతివస్తుభావము కల సమానధర్మ మందురు.

పాండ్యోఽయమంసార్పిత లంబహారః క్లృప్తాంగరాగో హరిచందనేన
ఆభాతి బాలాతపరక్త సానుః సనిర్ఝరోద్గార ఇవాద్రిరాజః ౧౧

భుజార్పితహారుడు శ్రీచందనక్లుప్తాంగరాగుడీ పాండ్యరాజు సెలయేర్లుబుకు, బాలాతపరక్త సానువు పర్వతరాజు వలె ప్రకాశించుచున్నాడు. ఇందు హారాంగరాగములకు నిర్ఘరబాలాతపములు ప్రతిబింబములుగ కూర్పు పొందినవి. ఉపమానోపమేయ ధర్మములు నిర్ఘరహారములు బాలాతపాంగరాగములు భిన్నములయినను పరస్పర సాదృశ్యమున నున్నవి. పృథగుపాత్తము లయినవి. ఇట్టిది బింబప్రతిబింబభావ మందురు.

## ౨. అనన్వయము

## ౧౨. ఏకస్యైవోపమానోపమేయత్వేఽనన్వయః

ఒకదానికే యుపమానోపమేయత్వ మున్నచో ననన్వయ మగును. సాదృశ్య ముభయనిష్ఠ మయిననె సంభవించును గాని యేకవస్తువునకు కుదురదు. అయినను విరుద్ధధర్మసంసర్గము ద్వితీయ సబ్రహ్మచారి నివృత్త్యర్థ మని గుర్తించునది.

యుద్ధేఽర్జునోఽర్జున ఇవ ప్రథితప్రతాపో
భీమోఽపి భీమ ఇవ వైరిషు భీమకర్మా
న్యగ్రోధవర్తినమథాధిపతిం కురూణాం
ఉత్పాసనార్థ మభిజగ్మతురాదరేణ ౧౨

యుద్ధమున ప్రసిద్ధప్రతాపము కల యర్జునసదృశు డయిన యర్జునుడు, శత్రువుల విషయమున భీమకర్ముడగు భీమసదృశు డయిన భీముడును వటచ్ఛాయ నున్న కురుపతి నుపహసించుటకుగా సమాదరమున సమీపమున కేగిరి.

ఏకార్థమె శబ్దమున ద్విరుక్త మయినచో భిన్నముగ గోచరించును. అట్టి యవభాసమున సాదృశ్య మున్నట్లు గోచరించును. కాని భీమార్జునులకు భీమార్జునులె సాటి యనుటచే రెండవ సదృశము లేదని భాసించును. అందుననె యనన్వయమను నామమును సార్థముగ నున్నది.

## 3. ఉపమేయోపమ

## ౧3. ద్వయోః పర్యాయేణ తస్మిన్నుపమేయోపమా

ఉపమానోపమేయములకు పర్యాయమున నుపమానోపమేయత్వ మున్నచో నుపమేయోపమ యగును. యౌగపద్యము లేమి పర్యాయము. అందుననె యిందు వాక్యభేద ముండును.

ఖమివ జలం జలమివ ఖం హంసశ్చంద్ర ఇవ హంస ఇవ చంద్రః
కుముదాకారాస్తారాః తారాకారాణి కుముదాని ౧౩

ఆకసము వలె జల మున్నది. జలము వలె నాకస మున్నది. హంస చంద్రుని వలెనున్నది. హంస వలె చంద్రు డున్నాడు. తారలు కుముదాకారమున నున్నవి. కుముదములు తారాకారమున నున్నవి. ఇందు జలాకాశములకు పర్యాయమున నుపమానోపమేయత్వము స్పష్టమె.

సచ్ఛాయాంభోజవదనాః సచ్ఛాయవదనాంబుజాః
వాప్యోఽంగనా ఇవాభాంతి యత్ర వాప్య ఇవాంగనా ౧౪

కాంతియుత వదనముల బోలు పద్మములు కల వాపికలు కాంతియుత పద్మములబోలు వదనములు కల వనితల వలె భాసించు చున్నవి. కాంతియుత పద్మములబోలు వదనములు కల వనితలు కాంతియుతవదనముల బోలు పద్మములు కల వాపికల వలె భాసించుచున్నారు. ఇందు సచ్ఛాయాంభోజవదనత్వ మను ధర్మ మొక్కటియె వాప్యంగనా సంబంధి భేదమున భిన్నముగా వస్తుప్రతివస్తుభావమున నిరూపిత మయినది.

## ౪. స్మరణము

### ౧౫. సదృశానుభవాత్ వస్త్వంతరస్మృతిః స్మరణం

సదృశానుభవమున సదృశవస్త్వంతరము స్మరించుట స్మరణాలంకారము. స్మర్యమాణమున ననుభూయమానమునకు, ననుభూయమానమున స్మర్యమాణమునకు సాదృశ్యపరికల్పన మీ యలంకారమున నుండును.

అతిశయిత సురాసుర ప్రభావం శిశుమవలోక్య తథైవ తుల్యరూపం
కుశికసుత మఖద్విషాం ప్రమాథే ధృతధనుషం రఘునందనం స్మరామి ౧౫

సురాసుర ప్రభావ మతిశయించినవాడును నీ సమానరూపు డయిన శిశువును చూచి విశ్వామిత్రుని యాగవిధ్వంసకుల నాశమున ధనువు ధరించిన రఘువంశనందనుని శ్రీరాముని స్మరింతును. ఇందు శిశుదర్శనమున రఘునందనుడు స్మృతికి వచ్చినా డనుట శిశు రఘునందనులకు సాదృశ్య మున్న దని స్పష్టము సాదృశ్యము లేని స్మరణ మలంకారము కాదు. సదృశానుభవమునకు వస్త్వంతరస్మృతి కిందు వ్యాప్తి లే నందున ననుమానము కాదు.

## ౫. రూపకము

### ౧౫. అభేదప్రాధాన్యే ఆరోపే ఆరోపవిషయానపహ్నవే రూపకం

ఇప్పటికి నాలుగలంకారములు భేదాభేదతుల్యత్వము కల సాదృశ్యాశ్రయమున నుండునవి నిరూపితము లయినవి. ఇక నభేదప్రాధాన్యమున నుండు సాదృశ్యాశ్రయమున గలుగు నలంకారములు నిరూపింతుము. అందు రూపకము మొదటిది. అభేదము ప్రధానముగా నున్న యారోప ముండుట యారోపవిషయ మపహ్నుతము కాకుండుట రూపకాలంకార మగును. ఇందారోపమె ప్రధాన మగుట భేద మున్నది యుండు నని గుర్తింప వలెను. అన్యత్రాన్యావాప మారోపము. విషయిచే విషయము రూపము కల దగును గాన రూపకము. ఇందు సాధర్మ్యము పూర్వములలో వలె ననుగతమె. ఈ రూపకము నిరవయవము, సావయవము, పరంపరితము నని త్రివిధము. ఇంక ఇంక ననేకభేదములు కలవు.

నిరవయవరూపకము

దాసే కృతాగసి భవత్యుచితః ప్రభూణాం
పాదప్రహార ఇతి సుందరి! నాస్మి దూయే
ఉద్యత్కఠోర పులకాంకుర కంటకాగ్రైః
యత్ఖిద్యతే తవ పదం నను! సా వ్యథా మే ౧౬

సుందరి! నేను దాసుడను, అపరాధమొనర్చితిని ప్రభువులు పాదప్రహార మొనరించుట సముచితమె కావున నేను వ్యథ పడుట లేదు. కాని నీ పాదస్పర్శమున నా తనువు నందు పులకాంకురము లతిశయించినవి. అవి కఠోరకంటకాగ్రములు. అట్టివానిచే నీ పదము నొచ్చునో యని నా కా వ్యథ కలుచు చున్నది సుమా! ఇందు పులకాంకుర మొక్కటియె కంటకమున రూపిత మయినది. పాదాదు లం దారోపము లేదు. కావున నిరవయవము.

సావయవరూపకము

విస్తారశాలిని నభస్తల పత్ర పాత్రే
కుందోజ్జ్వలప్రభ భసంచయ భూరి భక్తం
గంగాతరంగ ఘనమాహిష దుగ్ధదిగ్ధం
జగ్ధం మయా నరపతే! కలికాలకర్ణ! ౧౭

విశాలమయిన నభస్స్థలమను విస్తరిలో మల్లెపూవుల కాంతి కల చుక్కలగుంపను మంచి యన్నమును వియన్నదీతరంగము లనెడు చిక్కని గేదెపాలతో కలిపి భుజించితి నయ్యా! నరపతీ! కలికాలకర్ణా! ఇందు భసంచయము (చుక్కలగుంపు) అవయవి. అది యన్నముగా రూపితము, నభస్స్థలము గంగాతరంగ మవయవములు పత్రపాత్రముగా మహిషదుగ్ధముగా రూపితములు, కావున నిది సావయవము.

పరంపరితరూపకము

కిం పద్మస్య రుచిం న హంతి ? నయనానందం విధత్తే న కిం ?
వృద్ధిం వా ఝషకేతనస్య కురుతే నాలోకమాత్రేణ కిం ?
వక్త్రేందౌ తవ సత్యయం యదపరః శీతాంశురుజ్జృంభతే
దర్పః స్యాదమృతేన చేదిహ తదప్యస్త్యేవ బింబాధరే ౧౫

నీ ముఖము పద్మకాంతిని పోగొట్టదా ? నయనానందము కూర్పదా ? ఆలోకమాత్రమున కామవృద్ధి కలుగజేయదా ? నీ ముఖ మున్నను నీ యపర చంద్రుడు డుదయించుచున్నాడె! అమృతముచే నయిన గర్వమా ? అట్లయిన నదియు బింబాధరమున నుండనే యున్నది. దీనిలో ముఖమున చంద్రరూపణము, అధరరసమున నమృతరూపణమును సంజాత పరంపరములు, వక్త్రేందు రూపణ మున్నగాని యధరరసామృత రూపణ ముపపన్నము కాదు. కావున పరంపరితరూపకము.

౬. పరిణామము

## ౧౬. ఆరోప్యమాణస్య ప్రకృతోపయోగిత్వే పరిణామః

ఆరోప్యమాణము ప్రకృతోపయోగి యయినచో పరిణామము. రూపకము నం దారోప్యమాణము ప్రకృతోపరంజకముగా నుండును. పరిణామము నం దారోప్యమాణము ప్రకృతాంగ మగును. ప్రకృత మారోప్యమాణరూపమున పరిణమించును. ప్రకృత మప్రకృతవ్యవహార విశిష్టమై యుండును. ప్రకృతస్వరూపముననె యున్నచో ప్రకరణార్థము నిష్పన్నము కాదు. మన్ను ఘటముగా పరిణమించిననె జలాహరణక్షమ మగును. సాంఖ్యులపరిణామము వేరు. ఈ పరిణామము వేరు. సామానాధికరణ్య వైయధికరణ్యమున నిది ద్వివిధము.

### సామానాధికరణ్య పరిణామము

తీర్త్వా భూతేశమౌళిస్రజ మమరధునీమాత్మనాసౌ తృతీయః
తస్మై సౌమిత్రిమైత్రీమయ ముపకృతవానాతరం నావికాయ
వ్యామగ్రాహ్యస్తనీభిః శబరయువతిభిః కౌతుకోదంచదక్షం
కృచ్ఛ్రాదన్వీయమానస్త్వరితమథ గిరిం చిత్రకూటం ప్రతస్థే ౧౯

శ్రీరాముడు శివజటామాలిక గంగను దాటి యా నావికునకు లక్ష్మణ మైత్రీమయ మయిన యాతర (ఆతరము—తరిపణ్యము—పడవ కేవు) ముపకరించెను. ఇటుపై విపులకుచలు శబరవనితలు కౌతుకమున స్ఫురదక్షములతో చూచుచు ననుసరింపగా వేగముగా చిత్రకూటపర్వతమునకు ప్రయాణ మయ్యెను. ఇందు సౌమిత్రిమైత్రి ప్రకృతము. అది యాతరముగా పరిణమించినది. ఆతరము మైత్రీరూపముగా ప్రకృతములో నుపయోగించును. సమాసోక్తిలో వలె నారోప్యమాణ మిందును ప్రకృతోపయోగి.

### వైయధికరణ్య పరిణామము

అథ పక్త్రిమతాముపేయివద్భిః సరసైః వక్రపథాశ్రితైర్వచోభిః
క్షితిభర్తురుపాయనం చకార ప్రథమం తత్పరతస్తురంగమాద్యైః ౨౦

పరిపాకము కలిగి సరసములై వక్రము లయిన వాక్కులతో మొదట రాజున కుపాయన మొనరించెను. పిమ్మట తురంగమాదులతో నుపాయన మొనరించెను. ఇందు రాజసంఘటనములో నుపాయన ముచితము. అది యిందు వచోరూపమున నున్నది. రెండును భిన్న విభక్తికములగుట పరిణామ మయినది.

## ౭. సందేహము

### ౧౭. విషయస్య సందిహ్యమానత్వే సందేహః

ఆరోప మభేద ప్రధాన మగుట ఇందు నున్నది. విషయము ప్రకృతార్థము. అది భిత్తిగా నప్రకృతము సందిహ్యమానమగును. అప్రకృత సందేహమున విషయమును సందిహ్యమానము కావచ్చును. సందేహము కవిప్రతిభోత్థాపితమై ప్రకృతాప్రకృతగతముగా నుండును.

కిం తారుణ్యతరోరియం రసభరోద్భిన్నా నవా మంజరీ
లీలాప్రోచ్ఛలితస్య కిం లహరికా లావణ్యవారాన్నిధేః
ఉద్గాఢోత్కలికావతాం స్వసమయోపన్యాసవిస్రంభిణః
కిం సాక్షాదుపదేశయష్టి రథవా దేవస్య శృంగారిణః ౨౧

ఈమె రసోద్భిన్న మయిన తారుణ్యతరు నవమంజరియా ? లీలా సంచలిత మయిన లావణ్యసాగర లహరియా ! గాఢోత్కంఠ కుల వారలకు స్వసమయ సంకేత మిచ్చుశృంగారదేవుని యుపదేశమా ! ఇందొక వనితను ఇట్లనేక విధముల మంజర్యాది రూపముగా భావించుటలో సందేహమున్నది. తన్వి సందేహప్రతీతివిషయము కాదు. విషయిగా నున్న మంజర్యాదులే యట్టివి.

## ౮. భ్రాంతిమాన్

## ౧౮. సాదృశ్యాత్ వస్త్వంతర ప్రతీతిః భ్రాంతిమాన్

సందేహానంతరము దీనిని చెప్పుట సముచితము. భ్రాంతి యనెడు చిత్తధర్మము కల భణితి ప్రకారము 'భ్రాంతిమాన్' అనదగును. భ్రాంతి సాదృశ్యప్రయుక్తమే కావలయును.

ఓష్ఠే బింబఫలాశయాఽలమలకేషూత్పాత జంబూధియా
కర్ణాలంకృతిభాజి దాడిమఫలభ్రాంత్యా చ శోణే మణౌ ।
నిష్పత్యా సకృదుత్పలచ్ఛదదృశామాత్తక్లమానాం మరౌ
రాజన్! గూర్జరరాజ పంజరశుకైః సద్యః తృషామూర్ఛితం॥ ౨౨

రాజా ! గూర్జర రాజు పంజర శుకములు దప్పికచే మూర్ఛపొందినవి. మరుభూమిలో పద్మనేత్రలు శ్రమపడి సంచరింప ఓష్ఠమున బింబఫలాశపడి, అలక లందు జంబూబుద్ధి కలిగి, కర్ణమణిపై దాడిమ ఫలభ్రాంతి పొంది తుదకు మూర్ఛ నందినవి. ఇందు ఓష్ఠాదులందు బింబఫలాది భ్రాంతి యలంకారవిషయమయినది. గాఢ మర్మప్రహారాదికమున కలుగు భ్రాంతి ఈ యలంకార విషయము కాదు. సాదృశ్యహేతుక మయిన భ్రాంతియు కవి ప్రతిభా జన్యమె యగును.

## ౯. ఉల్లేఖము

## ౧౯. ఏకస్యాపి నిమిత్తవశాదనేకధా గ్రహణ ముల్లేఖః

ఒకటియే వస్తువు తత్తత్కారణవశమున ననేకవిధముల సంగృహీత మయినచో నుల్లేఖ మగును.

నారాయణ ఇతి పరిణతవయోభిః, శ్రీవల్లభ ఇతి తరుణీభిః,
బాలాభిః పునః కౌతూహలేన ఏ న మే వ దృష్టః ౨౩

ప్రౌఢ కాంతలు నారాయణుడని, స్త్రీలు శ్రీవల్లభుడని బాలికలు కౌతూహలమున యథాదృష్టముగ భావించిరి. ఇందు ప్రౌఢకాంతల కభిరుచులు స్త్రీల కర్థితయు, బాలికలకు వ్యుత్పత్తియు, అనుసంధానమున భావింప దగును. ఒకడే ఇట్లనేక విధముల సముల్లిఖితు డగుట యున్నది.

## ౧౦. అపహ్నుతి

## ౨౦. విషయాపహ్నవే అపహ్నుతిః

విషయమును కప్పిపుచ్చగా వస్త్వంతర ప్రతీతి యుండుట. ఆరోపవిషయము అపహ్నుత మగుటయు ఆరోప్యమాణము గోచరించుటయు నీ యలంకారరూపము. ఇందు బంధచ్ఛాయ మూడు విధముల నున్నది. అపహ్నవపూర్వకారోపము, ఆరోపపూర్వకాపహ్నవము; అసత్యత్వమునుచెప్పు ఛలాది శబ్దములచే నపహ్నవించుట.

జ్యోత్స్నాభస్మచ్ఛురణ ధవళా బిభ్రతీ తారకాస్థీ
న్యంతర్ధాన వ్యసన రసికా రాత్రికాపాలికీయం
ద్వీపాద్ద్వీపం భ్రమతి దధతీ చంద్రముద్రాకపాలే
న్యస్తం సిద్ధాంజన పరిమళం లాంఛనస్య ఛలేన ॥ ౨౪

ఈ రాత్రి కాపాలికి జ్యోత్స్నాభస్మచ్ఛురణమున ధవళయై తారకాస్థికలను ధరించి యంతర్హిత యగుచు, చంద్రముద్రాకపాలమున లాంఛనచ్ఛలముతో సిద్ధాంజన పరిమళము పట్టి ద్వీపము ద్వీపము తిరుగు చున్నది. ఇందు సిద్ధాంజనము లాంఛనమున నాచ్ఛాదిత మయినది. ఛలశబ్దమున నసత్యతయు నున్నది.

ఇప్పటికీ యలంకారము లభేదప్రధానమున నారోప గర్భములు. ఇటుపై అధ్యవసాయగర్భాలంకారములను చెప్పుట సముచితము.

## ౧౧. ఉత్ప్రేక్ష

## ౨౧. అధ్యవసాయే వ్యాపారప్రాధాన్యే ఉత్ప్రేక్షా

విషయమను నిగీర్ణము చేసి విషయితో నభేద మాపాదించుట అధ్యవసాయము. వ్యాపార ప్రాధాన్యమున నధ్యవసాయ మున్నప్పుడు ఉత్ప్రేక్షాలంకార మగును. అధ్యవసాయము రెండు విధములు. సాధ్యము, సిద్ధము, అని విషయి పదార్థ మసత్యముగా గోచరించునపుడు విషయము విషయి రూపమున నవభాసించుట; సాధ్యాధ్యవసాయమను విషయి యందలి ధర్మము విషయము నందు కూర్చినపుడు సంభవాసంభవముగా నుండుటయే విషయి అసత్యముగా గోచరించుట. గుణక్రియారూప మయిన ధర్మము సంభవించునా? సంభవించదా? యన్న ప్రతీతిలో సాధ్యాధ్యవసాయమే యున్నది. ఇందు వ్యాపార ప్రాధాన్య మవశ్యముగా నుండును. సిద్ధాధ్యవసాయ మీ విధమున నుండును. విషయి యసత్య మయినను సత్యముగా గోచరించుట. అసత్యత్వము గోచరింపదేని సత్యత్వము భాసించును. ఇందు అధ్యవసితమునకు ప్రాధాన్య మున్నది. కాగా అధ్యవసాయము సాధ్యముగా గోచరించునపుడు ఉత్ప్రేక్ష యగును. దీనినే సంభావనము, అభిమానము, తర్కము, ఊహము అని యందురు.

అప్రకృతము నందలి గుణక్రియల సంబంధమున ప్రకృతము నప్రకృతముగా సంభావించుట యుత్ప్రేక్షాలంకార మగును. జాతి క్రియా గుణ ద్రవ్య రూపముగా నప్రకృత మన్యవసేయ మగును. కాగా చతుర్విధ మయిన యుత్ప్రేక్ష భావాభావాభిమానమున నెనిమిది విధము లగుచున్నది.

### జాత్యుత్ప్రేక్ష

స వః పాయాదిందుః నవ బిసలతా కోటి కుటిలః
స్మరారేర్యో మూర్ధ్ని జ్వలనకపిశే భాతి నిహితః
స్రవన్మందాకిన్యాః ప్రతిదివససిక్తేన పయసా
కపాలేనోన్ముక్తః స్ఫటికధవలేనాంకుర ఇవ ౨౫

శివశిరమున నున్న వక్రచంద్రుడు మిమ్ము రక్షించు గావుత. ప్రతిదినము మందాకినీ జలము తడుపగా స్ఫటికధవళకపాలము వెలువరించిన యంకురమో యనునట్లు వక్రచంద్రు డున్నాడు. దీనిలో నంకురశబ్దము జాతి శబ్దము. అది యుత్ప్రేక్షిత మయినది.

క్రియోత్ప్రేక్ష

లింపతీవ తమోఽంగాని వర్షతీవాంజనం నభః
అసత్పురుషసేవేవ దృష్టిః విఫలతాం గతా ౨౬

అంధకార మంగములను పూయుచున్నదో! ఆకాస మంజనము వర్షించుచున్నదో! దుష్టసేవ వలె దృష్టి విఫల మయినది. దీనిలో నుత్తరార్థమున నుపమయే గాని యుత్ప్రేక్ష కాదు. పూర్వార్థమునందే యుత్ప్రేక్ష కలదు. లేపన వర్షణక్రియలు తమోనభోగతములుగ నిం దుత్ప్రేక్షితము లయినవి.

గుణోత్ప్రేక్ష

సైషా స్థలీ యత్ర విచిన్వతా త్వాం భ్రష్టం మయా నూపురమేకముర్వ్యామ్
అదృశ్యత త్వచ్చరణారవింద విశ్లేష దుఃఖాదివ బద్ధ మౌనమ్ ౨౭

ఇది ఆ స్థలము. నిన్ను వెతకు నపుడు జారిన నూపుర మొకటి లభించినది. ఆది నీ పాదవియోగ దుఃఖమున గాబోలు మౌనము కలిగి కన్పడినది. ఇందు విశ్లేషదుఃఖము గుణము.

ద్రవ్యోత్ప్రేక్ష

పాతాలమేతత్ నయనోత్సవేన విలోక్య శూన్యం మృగలాంఛనేన
ఇహాంగనాభిః స్వముఖచ్ఛలేన కృతాంబరే చంద్రమయీవ సృష్టిః ౨౮

పాతాళము చంద్రశూన్యముగా నున్నదని చూచి స్త్రీలు స్వముఖచ్ఛలమున నాకాశమునందు చంద్రమయసృష్టి యొనర్చినారు. చంద్రు డొకడే గావున ద్రవ్యము. ఇవి యన్నియు భావోత్ప్రేక్షలు. అధ్యవసాయము సాధ్యము కాగా నుత్ప్రేక్ష యిట్లున్నది. అధ్యవసాయము సిద్ధమయినచో నతిశయోక్తి కలుగును.

## ౧౨. అతిశయోక్తి

### ౨౨. అధ్యవసిత ప్రాధాన్యే త్వతిశయోక్తిః

అధ్యవసాయమునందు మూడు అంశము లున్నవి. స్వరూపము, విషయము, విషయి అని. విషయము విషయిచే నిగీర్ణ మయినచో అధ్యవసాయ

స్వరూపము గోచరించును. సాధ్య మగుటలో స్వరూప ప్రాధాన్య మున్నది. సిద్ధ మగుటలో నధ్యవసిత ప్రాధాన్య మున్నది. అధ్యవసాయమునందు విషయ ప్రాధాన్య ముండదు. అధ్యవసిత ప్రాధాన్య ముండగా నతిశయోక్తి యగును. భేదమున నభేదము, అభేదమున భేదము, సంబంధమున నసంబంధము, అసంబంధమున సంబంధము కార్య కారణపౌర్వాపర్య విధ్వంసము. అని యతిశయోక్తి యయిదు విధములు.

లావణ్యద్రవిణవ్యయో న గణితః క్లేశో మహానార్జితః
స్వచ్ఛందం చరతో జనస్య హృదయే చింతాజ్వరో నిర్మితః
ఏషాపి స్వగుణానురూప రమణాభావాత్ వరాకీ హతా
కోర్థశ్చేతసి వేధసా వినిహితః తన్వ్యాస్తనుం తన్వతా ౨౯

ఈ తన్వీ తనువు నిర్మాణించు బ్రహ్మమనసులో నేమి తలచినాడు? లావణ్యద్రవిణవ్యయము గణింప లేదు. మిక్కిలి క్లేశపడినాడు. స్వేచ్ఛగా తిరుగు జనుని హృదయమున చింత కూర్చినాడు. ఈ తన్వియు తనకు తగిన వల్లభుడు లభింపనందున గతించినది. దీనిలో తన్వీతను నిర్మాణములో తన్వీ లావణ్య ప్రకర్షను ప్రదర్శించుటకై లావణ్యద్రవ్యము యొక్క వ్యయ సంబంధ మున్నను అసంబంధము నిరూపితమయినది. ఉత్ప్రేక్ష అతిశయోక్తి ఈ రెండును అధ్యవసాయాశ్రితము లయిన యలంకారములు. ఇక గమ్యమానౌపమ్యము నాశ్రయించు అలంకారములను చెప్పవలయును.

౧౩. తుల్యయోగిత

౨౩. ఔపమ్యస్య గమ్యత్వే పదార్థగతత్వేన ప్రస్తుతానాం అప్రస్తుతానాం వా సమానధర్మాభిసంబంధే తుల్యయోగితా

ఔపమ్యము గమ్యమగుచో ప్రస్తుతములకు గాని, యప్రస్తుతములకు గాని సమానధర్మ సంబంధము వర్ణిత మయిన తుల్యయోగిత యగును. సాధర్మ్యవాచకము లగు పదములు లేకున్నచో నౌపమ్యము గమ్యమగును. కేవల ప్రాకరణికార్థములకు, సమాన గుణ క్రియాభిసంబంధ మున్నను కేవలా ప్రాకరణికార్థముల కున్నను తుల్యయోగిత యగును.

సంజాత పత్రప్రకరాంచితాని సముద్వహంతిస్ఫుటపాటలత్వం
వికస్వరాణ్యర్కకరప్రభావాత్ దినాని పద్మాని చ వృద్ధిమీయుః ౩౦

పత్రప్రకరముల శోభ కలవి, పాటలత్వము వహించినవి, సూర్యకర ప్రభావమున వికస్వరము లయినవి యగు దినములు, పద్మములు వృద్ధి పొందినవి. ఇందు ఋతువర్ణనము ప్రక్రాంతము. కాగా దినములు పద్మములు ప్రకృతములే యయినందున వాని వృద్ధిగమనక్రియ సమానయోగముతో నున్నది.

త్వదంగమార్దవం ద్రష్టుః కస్యచిత్తే న భాసతే
మాలతీ శశభృల్లేఖా కదళీనాం కఠోరతా 30

నీ శరీర మార్దవము చూచు నెవనికి మనసులో మాలతీ, చాంద్రీ, కదళీ కఠోరత భాసింపదు ? దీనిలో కఠోరత్వ మన్నది గుణము. మాలత్యాదులు అప్రాకరణికములు. ప్రస్తుతాప్రస్తుతములు వ్యస్తముగా నుండగా తుల్యయోగిత యైనది. అది సమస్తముగా నున్నప్పుడు దీపక మగును.

౧౪. దీపకము

౨౪. ప్రస్తుతానా మప్రస్తుతానాం చ దీపకమ్

ప్రస్తుతముల కప్రస్తుతములకును సామస్త్యమున సమాన గుణ క్రియాభిసంబంధము నిరూపిత మగుచో దీపక మగు నని భావము. ఔపమ్యము గమ్య మగుట ఇందును గలదు. ప్రాకరణికాప్రాకరణికములలో నొకచో నిరూపిత మైన సమానధర్మము ప్రసంగమున నితరముల కుపకరించును. దీపసాదృశ్య ముండుటచే దీపక మను పేరు సంగత మైనది.

సంచారపూతాని దిగంతరాణి కృత్వా దినాంతే నిలయాయ గంతుమ్
ప్రచక్రమే పల్లవరాగతామ్రా ప్రభా పతంగస్య మునేశ్చ ధేనుః 3౧

దిగంతములను పవిత్ర మొనర్చి సాయంతన మింటికి జేరుటకై పల్లవారుణ మైన పతంగ ప్రభయును, ముని ధేనువును ప్రారంభించెను. దీనిలో మునిధేనువు ప్రకృతము. పతంగప్రభ అప్రకృతము. పల్లవరాగ తామ్రత, క్రమణము సమానధర్మములుగా నున్నవి. ప్రభాసాదృశ్యము వ్యంగ్య మగును. పూర్వార్థములోని యంశములు తదనుకూలముగనే యున్నవి.

౧౫. ప్రతివస్తూపమ

౨౫. వాక్యార్థ గతత్వేన సామాన్యస్య వాక్యద్వయే
పృథగ్ నిర్దేశే ప్రతివస్తూపమా

రెండు వాక్యము లందు సామాన్యధర్మము వాక్యార్థగతముగా నిరూపిత మగుచో ప్రతివస్తూపమ యగును. వాక్యార్థము పదార్థారబ్ధ మై నందున

వాక్యార్థగతాలంకారము చెప్పుట సముచితముగనే యున్నది. ఒకటియే యైన సమానధర్మమును భిన్నశబ్దములచే భిన్నముగా చెప్పుట దీనిలో నుండును. ధర్మ నిర్దేశమున విభాగ మిట్లున్నది. సామాన్య ధర్మమునకు సకృన్నిర్దేశ మున్నను అసకృన్నిర్దేశ మున్నను వాచకపదము లుండునేని ఉపమ యగును. వాచకములు లేకున్న, సకృన్నిర్దేశములో దీపకము, తుల్యయోగిత యగును. సామాన్యధర్మమును వేరు వేరుగా చెప్పుటయు రెండు విధములు. శుద్ధసామాన్యరూపము మొదటిది. బింబ ప్రతిబింబభావము రెండవది. శుద్ధసామాన్యరూపమున ప్రతివస్తూపమాలంకార ముండును. ప్రతివాక్యార్థమునను సామ్య ముండునని నామమే చెప్పును.

చకోర్య ఏవ చతురాః చంద్రికాఽచామకర్మణి
ఆవంత్య యేవ నిపుణాః సుదృశో రతనర్మణి 33

వెన్నెల త్రాగుటలో చకోరికలు చతురములు. రతనర్మములో అవంతీ వనితలే నిపుణలు. దీనిలో చతురత్వ ముపమానవాక్యమున సమానధర్మము. అదియే ఉపమేయ వాక్యమున నిపుణ పదమున నిర్దిష్ట మైనది.

౧౬. దృష్టాంతము

౨౬. తస్యాపి బింబప్రతిబింబతయా నిర్దేశే దృష్టాంతః

బింబ ప్రతిబింబభావమున సమానధర్మము గూడ నిర్దేశించినచో దృష్టాంత మగును. ఉపమానోపమేయ ధర్మములు భిన్నము లైనను, పరస్పర సాదృశ్యమున నభిన్నముగా నుండునట్లు నిరూపించుట బింబప్రతిబింబ భావ మగును.

దైవీం వాచ ముపాసతే హి బహవః సారం తు సారస్వతం
జానీతే నితరామసౌ గురుకులక్లిష్టో మురారిః కవిః
అబ్ధిర్లంఘిత ఏవ వానరభటైః కింత్వస్య గంభీరతాం
ఆపాతాళ నిమగ్న పీవర తనుః జానాతి మంథాచలః 34

వాగ్దేవి ననేకు లుపాసింతురు. కానీ, గురుకులక్లేశ మనుభవించిన మురారి కవియే సారస్వతసారము గుర్తించి నాడు. వానరు లెందరో సముద్రము లంఘించిరి. కానీ ఆపాతాళ మనుగత మైన మంథాద్రి మాత్రమే సాగర గంభీ

రతను తెలియ గలదు. దీనిలో 'జానాతి' 'జానీతే' అను పదములచే జ్ఞాన మొకటియే నిర్దిష్టము. కానీ అది యిందు వివక్షితము కాదు. మంథాద్రి యుప మానము. మురారి యుపమేయము. తత్తద్ధర్మములు వేరు వేరుగనే యున్నవి. సామర్థ్య యోగితా రూప మైన యభేదము ఆ ధర్మములందు గోచరించును. ఇట్లు బింబ ప్రతిబింబభావమున దృష్టాంతము సంగతము కాగలదు.

౧౭. నిదర్శన

౨౭. సంభవతాఽసంభవతా వా వస్తుసంబంధేన గమ్యమానం ప్రతిబింబకరణం నిదర్శనమ్

సంభవత్ వస్తు సంబంధమున అసంభవత్ వస్తు సంబంధమునను సాదృశ్య మవభాసింప నిదర్శన యగును. ఒకానొకచో వస్తుసంబంధము సంభవించు నది గనే యుండి తన సామర్థ్యమున బింబప్రతిబింబభావము కల్పించును. వేరొకచో సంభవించనదే యైనను ప్రతిబింబన మవభాసింప జేయును. ఇట్లు నిదర్శన రెండు విధములు.

చూడామణిపదే ధత్తే యో దేవం రవి మాగతం
సతాం కార్యాఽతిథేయీతి బోధయన్ గృహమేధినః ౩౫

యోగ్యులకు ఆతిథ్య మిండు! అని గృహాగతుల బోధనసమర్థుల జేయుచు, సమాగతుడైన రవిదేవుని ఉదయగిరి చూడామణి పదమున ధరించు చున్నది. ఇందు 'బోధయన్' అనునది బోధన సమర్థుల నొనరించుట యను నర్థము సూచించును. కాగా, గిరి యందు దున్న రవిధారణక్రియ, సంభవద్వస్తు సంబంధము కల దనియే భావింప వచ్చును.

అద్యాత్సవో యస్య నిసర్గవక్రః స్పృశత్యధిజ్య స్మర చాప లీలాం
జటా పినద్ధోరగరాజ రత్న మరీచిలీఢోభయ కోటి రిందుః ౩౬

శివుని జటాజూటమున నున్న నాగ రత్న కాంతులచే, రెండంచులు లీఢ ములు కాగా సహజవక్రు డైన చంద్రుడు, మన్మథుని ధనుర్లీల నందుకొను చున్నాడు. దీనిలో చంద్రలీలకును, చాపలీలకును భేద మున్నది. ఇది అసంభ వద్వస్తు సంబంధము. ఐనను, లీలా సదృశ లీలను గోచరింప జేయ గలదు. ఇదియు పదార్థ వాక్యార్థ వృత్తి భేదమున రెండు విధములు. ఈ యుదాహ

రణమె పదార్థవృత్తి నిదర్శనము. ఇందు స్మర చాప లీలలు పదార్థ రూపములు. వాక్యార్థవృత్తి నిదర్శన మిట్లుండును.

త్వత్పాదనఖరత్నానాం యదలక్తకమార్జనమ్
ఇదం శ్రీఖండలేపేన పాండరీకరణం విధోః 38

నీ పాద నఖ రత్నములకు లాక్షా మార్జన మనునది చంద్రునకు శ్రీచందనమున పాండరీకరణము. దీనిలో సాపేక్ష వాక్యార్థములకు బింబప్రతిబింబభావమున్నది. యదిదం శబ్దములు సాపేక్షతనే సూచించును. నిదర్శనాలంకారము మాలా రూపమున గూడ నున్నది.

అరణ్యారుదితం కృతం శవశరీర ముద్వర్తితం
స్థలేఽబ్జమవరోపితం సుచిరమూషరే వర్షితం
శ్వ పుచ్ఛ మవనామితం బధిరకర్ణజాపః కృతః
ధృతోఽన్ధముఖదర్పణో యదబుధో జనస్సేవితః 39

అపండిత జన సేవన మన నరణ్యరోదన మొనర్చుట, శవశరీరము నలుగు పెట్టుట, మెఱకపై పద్మ మారోపించుట, ఊషరమున చిరము వర్షించుట, కుక్క తోక సరి దిద్దుట, చెవిటి వానికి రహస్యము చెప్పుట, గ్రుడ్డివానికి అద్దము పట్టుట, దీనిలో నబుధజన సేవా రూప మయిన వాక్యార్థమున అరణ్యరుదితకరణాదు లనేకవాక్యార్థములు సమారోపితము లయినవి.

## ౧౮. వ్యతిరేకము

## ౨౮. భేదప్రాధాన్యే ఉపమానా దుపమేయస్య ఆధిక్యే విపర్యయే వా వ్యతిరేకః

భేదప్రధానాలంకారములలో నిది మొదటిది. భేద మనునది వైలక్షణ్యము. ఉపమానము కన్న నుపమేయమున కధిక గుణత్వము చెప్పినను న్యూన గుణత్వము చెప్పినను వైలక్షణ్యము కుదురును. కాగా భేదప్రాధాన్యమున నుపమానము కన్న నుపమేయమున కాధిక్యము కాని విపర్యయము కాని వర్ణిత మగుచో వ్యతిరేక మగునని సూత్రార్థము.

దిదృక్షవః పక్ష్మలతావిలాస మక్ష్ణాం సహస్రస్య మనోహరం తే
వాపీషు నీలోత్పలినీ వికాస రమ్యాసు నందంతి న షట్పదౌఘాః 40

తుమ్మెదలు నీ వేయి కన్నుల మనోహర పక్ష్మలతా విలాసమును చూడ దలచినవై నీలోత్పలినీ వికాస రమ్యము లైన వాపీ ప్రదేశములందు నానంద పడుట లేదు. దీనిలో వికస్వరనీలోత్పలిని కన్న, అక్షిసహస్రమునకు పక్ష్మలత విలక్షణముగా నుండుట అధికగుణ మైనది. తుమ్మెద లానందించక పోవుటచే నది ద్యోతితము.

క్షీణః క్షీణోపి శశీ భూయో భూయో వివర్ధతే సత్యం
విరమ! ప్రసీద! సుందరి! యౌవన మనివర్తి యాతం తు ౪౦

సుందరి! చంద్రుడు క్షీణక్షీణు డయ్యు మరల మరల వృద్ధి బొందు చున్నాడు గదే! నీ కింక కోప మేల? యౌవనము తిరిగి రానే రాదు. ఇట్లు నుటలో చంద్రుని కన్న యౌవనము న్యూనగుణ మన్నట్లైనది. చంద్రుడు మరల మరల వచ్చును. యౌవన మట్లు రాదు. ఈ వ్యతిరేకమున ఉత్కర్షా పకర్షములు గోచరించుటచే భేదప్రాధాన్యము స్ఫుటముగనే ఉన్నది.

## ౧౯. సహోక్తి

### ౨౯. ఉపమానోపమేయయో రేకస్య ప్రాధాన్య నిర్దేశే అపరస్య సహార్థసంబంధే సహోక్తిః

ఇందును భేదప్రాధాన్య మావశ్యకము. సహార్థమున ప్రధానతా ప్రధాన తలు గోచరించును. దీనిలో ఉపమానోపమేయభావము రెండును ప్రాకరణి కములగుట వలన వివక్షాధీనము. ఉపమాన మప్రాకరణికము, ఉపమేయము ప్రాకరణికము అనునది ప్రసిద్ధవ్యవస్థ. సహార్థమున రెండు నిందు సమకక్ష్య ములుగా నుండును. మాలా రూపమున గూడ సహోక్తి యున్నది.

ఉత్క్షిప్తం సహ కౌశికస్య పులకైః సార్థం ముఖైర్నామితం
భూపానాం, జనకస్య సంశయధియా సాకం సమాస్ఫాలితం
వైదేహ్యా మనసా సమం చ సహసా కృష్టం తతో భార్గవ
ప్రౌఢాహంకృతి కందలేన చ సమం తద్భగ్నమైశం ధనుః ౪౧

విశ్వామిత్రుని పులకలతో ధనువుత్క్షిప్త మైనది. సభాసామంతుల ముఖములతో నామిత మైనది. జనకుని సంశయబుద్ధితో సమాస్ఫాలిత మైనది. వైదేహీ మనస్సుతో వెంటనే సమాకృష్టమైనది. ఇంక నటుపై భార్గవ

ప్రౌఢాహంకృతి కందలముతో బాటు శివధనువు భగ్నమైనది. ఇందు ధను వొక్కటియే. దాని యుత్క్షేపణాదులలో కౌశికపులకాదులతో సహార్థసంబంధము మాలారూపమున నున్నది.

## ౨౦. వినోక్తి

## ౩౦. వినా కించిదన్యస్య సదసత్త్వాభావో వినోక్తిః

ఈ వినోక్తి, సహోక్తి ప్రతిభటము. వేరొకటి లేనందున శోభనత్వమశోభనత్వము వర్ణితమైనచో వినోక్తి యగును. సత్త్వము శోభనత్వమని, ఇందు గుర్తింప దగును.

వినయేన వినా కా శ్రీః? కా నిశా శశినా వినా?
రహితా సత్కవిత్వేన కీదృశీ వాగ్విదగ్ధతా? ౪౨

వినయము వినా శ్రీ ఏమి? శశి లేక నిశి ఎట్టిది? సత్కవిత లేక వాగ్వైదగ్ధ్య మేమి? దీనిలో వినయాది సన్నిధి లేనందున శ్రీ విరహాదులను సూచించుటలో అశోభనత్వము నిరూపితమైనది.

మృగలోచనయా వినా విచిత్ర వ్యవహార ప్రతిభాప్రభాప్రగల్భః
అమృతద్యుతి సుందరాశయోఽయం సుహృదా తేన వినా నరేంద్ర సూనుః ౪౩

ఈతడు మృగలోచన లేకున్నను చిత్రోక్తి ప్రతిభా ప్రగల్భుడైనాడు. ఆ స్నిగ్ధ సహృదయుడు లేకున్నను ఈ రాజకుమారుడు చంద్రసుందరాశయుడైనాడు. ఇందు శోభనత్వము అశోభనత్వాభావరూపముగా నున్నది. కాతర్యము, దుర్హృదయత్వము, అశోభనత్వము. ప్రాగల్భ్యము, సుందరాశయత్వము, శోభనపదార్థములు.

ఇక విశేషముల విచ్ఛిత్తి నాశ్రయించిన యలంకారముల జెప్పవలసియున్నది. అందు సమాసోక్తి మొదటిది. దీనిలో విశేషణముల సామ్యావష్టంభ ముండును.

## ౨౧. సమాసోక్తి

## ౩౧. విశేషణ సామ్యా దప్రస్తుతస్య గమ్యత్వే సమాసోక్తిః

విశేషణముల సామ్యమున నప్రస్తుతము గమ్య మగునేని సమాసోక్తి యగును. సామ్యవశమున విశేషణ విచ్ఛిత్తి కలుగుట సమాసోక్తిలో నున్నది.

సాభిప్రాయత్వమున విచ్ఛిత్తి కలుగుట పరికరములో నుండును. ప్రస్తుతాప్రస్తుతము లొకచో వాచ్యముగ నుండుటయు నొకచో గమ్యముగ నుండుటయు నున్నది. వాచ్యత్వము శ్లేషనిర్దేశమున రా వచ్చును. పృథగుపాదానమునను రా వచ్చును. ఈ ద్వైవిధము శ్లేషాలంకారమున గలదు. గమ్యత్వము ప్రస్తుతనిష్ఠ మయినచో నప్రస్తుతప్రశంసాలంకార మగును. అప్రస్తుతనిష్ఠ మయినచో సమాసోక్తి యగును. ఇందు విశేషణములు సామ్యమున నుండుట నిమిత్తము. విశేష్యము కూడ సామ్యమున నుండెనేని శ్లేషయే యనవలెను. ఈ సమాసోక్తిలో విశేషణముల సామ్యవశమున గోచరించు నప్రస్తుతము ప్రస్తుతావచ్ఛేదకముగా ప్రతీత మగును. అందువలననే యిందు వ్యవహార సమారోపమె యుండును గాని రూప సమారోప ముండదు. రూపసమారోప మున్నచో రూపకమె యగును. ఈ సమాసోక్తిలో విశేషణసామ్య మనేకవిధముల నుండును.

తన్వీ మనోరమా బాలా లోలాక్షీ పుష్పహాసినీ
వికాస మేతి సుభగ! భవద్దర్శనమాత్రతః! ౪౪

సుభగా! నీ దర్శనముననె యీ మనోరమ చలనేత్ర పుష్పహాస బాల వికాసము పొందుచున్నది. దీనిలో విశేషణముల సాధారణ్య మున్నది. తన్వి మొదలగు విశేషణముల సామ్యమున స్త్రీయందు లతావ్యవహారము గోచరించును. లతయందె యుండు వికాసధర్మ మారోపించుట నిమిత్త మయినది. సమాసోక్తిలో విశేషణ సామ్య మయిదు విధముల నుండును. అంతట వ్యవహారసమారోపమె యిందు జీవితము.

విలిఖతి కుచావుచ్చైః గాఢం కరోతి కచగ్రహం
లిఖతి లలితే వక్త్రే పత్రావలీమసమంజసాం
క్షితిప! ఖదిరః శ్రోణీబింబాద్వికర్షతి చాంశుకం
మరుభువి హఠాత్త్రస్యంతీనాం తవారిమృగీదృశాం ౪౫

రాజా! నీ శత్రువనితలు మరుభూమిలో భయపడిరి. ఖదిరము వారి కుచముల లిఖించును. గాఢముగా కచము పట్టును. లలితవదనమున నసముచితముగా పత్రావలి కూర్చును. జఘనము నుండి వస్త్రము జార్చును. ఇందు ఖదిరమున హఠాత్కాముకుని వ్యవహారము ప్రతీత మగును. ఇట్లనేకప్రకారములు సమాసోక్తిలో నున్నవి.

## ౩౨. పరికరము

### 3౨. విశేషణ సాభిప్రాయత్వం పరికరః

విశేషణములు సాభిప్రాయములుగా నుండుట పరికరాలంకార మగును. విశేషణముల వైచిత్ర్యప్రస్తావమున దీని నిచట నిర్దేశించుట సముచితము. విశేషణములు సాభిప్రాయముగా నుండుట ప్రతీయమానార్థమును గర్భీకరించుకొనుట. అందుననే ప్రసన్న గంభీర పదములు కలిగియు, నిది ధ్వని విషయము కాదు. ప్రతీయమానాంశము వాచ్యోన్ముఖముగా నుండుట వలన నిది పరికర మయినది.

రాజ్ఞో మానధనస్య కార్ముకభృతః దుర్యోధనస్యాగ్రతః
ప్రత్యక్షం కురుబాంధవస్య మిషతః కర్ణస్య శల్యస్య చ
పీతం తస్య మయాద్య పాండవ వధూ కేశాంబరాకర్షిణః
కోష్ణం జీవత ఏవ తీక్ష్ణ కరజ క్షుణ్ణాదసృగ్వక్షసః ౪౬

రాజు మానధనుడు, ధనుర్ధారి దుర్యోధనుని యెదుట కురుబాంధవుడు సావధానముగా నున్న వాడయిన కర్ణుని శల్యుని సమక్షమున పాండవ వధూ కేశాంబరము లాకర్షించిన యా దుశ్శాసనుని కోష్ణరక్తమును బ్రతికి యుండగనే గోళ్ళతో గుండెలు చీల్చి త్రాగితిని. దీనిలో విశేషణములు పరిహాస పరములై యున్నవి. పదములు ప్రసన్న గంభీరముగా నున్నవి.

## ౩౩. శ్లేష

### 33. విశేష్యస్యాపి సామ్యే ద్వయోర్వా ఉపాదానే శ్లేషః

కేవలము విశేషణముల సామ్యముండుట సమాసోక్తిలో నున్నది. విశేష్యయుక్త విశేషణ సామ్యము శ్లేషలో నుండును. రెండు ప్రాకరణికములకు రెండప్రాకరణికములకు, రెండు ప్రాకరణికాప్రాకరణికములకు శ్లిష్టపదోపనిబంధ మున్నచో శ్లేష యగును. మొదటి రెండు ప్రకారములు విశేష్య విశేషణముల రెండింటి సామ్యమున కలుగును. మూడవది విశేషణసామ్యముననే కనుగును. విశేష్యసామ్యము గూడ నున్నచో ధ్వని యగును.

యేన ధ్వస్తమనోభవేన బలిజిత్కాయః పురా స్త్రీకృతః
యశ్చోద్వృత్త భుజంగ హారవలయోగం గాం చయో ధారయత్
యస్యాహుః శశిమచ్ఛిరో హర ఇతి స్తుత్యం చ నామామరాః
పాయాత్స స్వయమంధక క్షయకరస్త్వాం సర్వదో మాధవః ౪౭

ఇందు శివకేశవ పరములుగా రెండర్థము లున్నవి. శివార్థము :— మన్మ ధుని నశింపజేసిన శివుడు, బలిని జయించిన విష్ణుని శరీరమును పూర్వ మస్త్ర ముగా జేసినాడు. సాతిశయ భుజంగములను హారములుగా వలయములుగా నొనర్చినాడు. గంగను ధరించినాడు. శివుని శిరమున శశి యున్నది. హర యనునది స్తుతింప దగిన యాతని నామము. అంధకాసురుని శివుడు సంహరించి నాడు. ఆతడు సర్వదుడు. ఉమాధవుడు. మిమ్ము నిత్యము రక్షించు గావుత !

కేశవార్థము :— జనన రహితు డగు హరి శకటము భంజించినాడు. బలి నిగ్రహ మొనర్చిన తనదేహము నప్పుడు స్త్రీ గా చేసినాడు. కాళియ భుజం గుని సంహరించినాడు. మురళీ రవ లయము కలవాడు. గోవర్ధనమును భూమిని ధరించినాడు. అమరు లందరు నీతని రాహు శిరోహరుడని యందురు. అంధక క్షయ (గృహ) మొనరించిన యాతడు మాధవుడు సర్వదా మిమ్ము రక్షించు గావుత ! — దీనిలో స్తోతవ్యు లయిన శివకేశవు లిద్దరును ప్రకృతులు.

నీతానా మాకులీభావం లుబ్ధై ర్భూరిశిలీముఖైః
సదృశే వనవృద్ధానాం కమలానాం తదీక్షణే                    ౭౫

ఆమె నేత్రములు కమలములకు సదృశములు. కమలములు వనవృద్ధ ములు. వనములో వృద్ధిపొందినవి. నానాశిలీముఖములుకల లుబ్ధులు వ్యాధులు కమలములకు వ్యాకులపాటుకలుగ జేసినారు. కమలములు వనమృగములు. తత్పరముగ నీ యర్థము సంగతము. పద్మపరముగా కమలార్థము భావించినపుడు లుబ్ధము లయిన తుమ్మెదలు వ్యాకులపాటును కలుగ జేయుటను భావింప వచ్చును. అప్రకృతము లయిన కమలములకు అర్థద్వయానుసంధాన మున్నది. ఇట్లు భేదాంతరము లభ్యూహ్యములు.

అలంకార్యాలంకరణ భావము లోకములో వలె నాశ్రయాశ్రయి భావమున నుపపన్న మగును. అర్థద్వయాశ్రిత మగుచోట నిది యర్థాలంకార మని, శబ్దద్వయాశ్రిత మయిన స్థలమున శబ్దాలంకార మని, ఇతరాలంకార బాధక మగుట వలన శ్లిష్టపద మొకటి యున్నను శ్లేష యనవలె నని కొందరందరు. శ్లేష కేవలము నిరవకాశము కాదు. అందుననే యన్యబాధకమును కాదు. కాని సూక్ష్మముగా పరీక్షింపగా నలంకారాంతరవివిక్త మయిన విష యము శ్లేషాలంకారమునకు లేదు. అందుచే శ్లేష సర్వాలంకారాపవాద మని గోచరించును.

## ౨౮. అప్రస్తుతప్రశంస

### ౩౪. అప్రస్తుతాత్ సామాన్యవిశేషభావే, కార్యకారణభావే సారూప్యే చ ప్రస్తుతప్రతీతేః అప్రస్తుతప్రశంసా

ప్రస్తుతమున నప్రస్తుతము గోచరము కాగా సమాసోక్తి యయినది. తద్విపరీతముగ నప్రస్తుతమున ప్రస్తుతము ప్రతీతము కాగా నప్రస్తుత ప్రశంస యగును. అప్రస్తుతమున ప్రస్తుతము ప్రతీతమగుటలో సామాన్యవిశేష భావము, కార్యకారణ భావము, సారూప్యము నని మూఁడు తెఱఁగు లున్నవి. అప్రస్తుత మప్రస్తుతమగుట వలన వర్ణనమె తగదు. అది ప్రస్తుతపర మయినచో యుక్తము కా వచ్చును. సంబంధము లేక ప్రస్తుతప్రతీతి కలుగదు. సంబంధ మున్ననే కలుగు నా ప్రతీతి త్రివిధసంబంధ మతిక్రమింపదు. ఆ సంబంధ మీా చెప్పిన విధమున నున్నది. సామాన్యవిశేష భావమున, సామాన్యమున విశేషము, విశేషమున సామాన్యము నని రెండు భేదము లున్నవి. కార్యకారణ భావమున గూడ నిట్లే రెండు విధములు. సారూప్యమున నొక భేదము. ఇట్లప్రస్తుతప్రశంస పంచవిధ మయినది. ఇంక నంతఃప్రకారములతో ననేక భేదములం కలుగవచ్చును.

ఏతత్తస్య ముఖాత్ కియత్కమలినీపత్రే కణం వారిణః
యన్ముక్తామణిరిత్యమంస్త స జడః శృణ్వన్యదస్మాదపి
అంగుల్యగ్ర లఘుక్రియా ప్రవిలయిన్యాదీయమానే శనైః
తత్రోడ్డీయ గతో మమేత్యనుదినం నిద్రాతి నాంతశ్శుచా ౪౯

దీనిలో విశేషమున సామాన్యము గోచరించును. జడజనుల కస్థానము ననే సముద్యమ ముండు ననుట యిందలి సామాన్యార్థము. ఇందలి విశేషార్థ మిట్లున్నది. తామరపాకుపై నీటి బొట్టును ముత్యమని వాడు తలచును. మొదటి నుండియు వాడు నట్లె. ఇట్టిదె వా డెంత విన్నను నట్లె తలచును. వ్రేలితాకున పోవు నా జలకణమును నాది నాది యని యనుదినము ఎగిరి గంతు వేయును. అంతఃశ్శోకమున నాతడు నిద్రించుటయె లేదు. ఇది యంతయు నేమి ? దీనిలోని యిట్టి విశేషార్థము మందభావులగు వారు వ్యర్థముగా నసము చితమున నభినివేశము పెట్టికొందు రని గోచరించును.

పశ్యామః కిమియం ప్రపద్యత ఇతి స్థైర్యం మయాఽఽలంబితం
కిం మాం నాలపతీత్యయం ఖలు శఠః కోప స్తయాప్యాశ్రితః
ఇత్యన్యోన్య విలక్ష దృష్టి చతురే తస్మిన్నవస్థాంతరే
సవ్యాజం హసితం మయా ధృతిహరో బాష్పస్తు ముక్త స్తయా ౫౦

దీనిలో కారణమున కార్యప్రతిపత్తి యున్నది. ఈమె యేమి చేయునో చూచెద నని నేను స్థైర్య మవలంబించితిని. "నన్నితడు పలుకరింపడేమి ? వీడు శఠుడు". అని ఆమె కోపము వహించినది. ఇట్లన్యోన్యము విలక్షదృష్టితో నుండు నా సమయములో నేనేదో మిషగా నవ్వితిని. ఆమె పట్టు విడనాడు బాష్పము విడచినది. ఈ యర్థము కారణరూపమున నప్రస్తుతము. నీ ప్రియురాలి యధిరూఢప్రణయకోప మెట్లు పోయినది ? యను కార్యము ప్రస్తుతమిందు గోచరించును.

రాజన్ రాజసుతా న పాఠయతి మాం దేవ్యోఽపి తూష్ణీం స్థితాః
కుబ్జే భోజయ మాం కుమారసచివైః నాద్యాపి కిం భుజ్యతే
ఇత్థం రాజశుక స్తవారిభవనే ముక్తోఽధ్వగైః పంజరాత్
చిత్రస్థానవలోక్య శూన్యవలభా వేకైక మాభాషతే ౫౧

నీ శత్రుభవనము నందలి రాజశుకమును పాంథులు పంజరము నుండి విడచి పెట్టిరి. అది శూన్యవలభిలో చిత్రగతు లయిన వారి జూచి యొక్కొకరి ని ట్లనుచున్నది. రాజా ! రాజసుత నన్ను చదివించుట లేదు. ఈ దేవీ జనము కూడ యూరకనే యున్నారు. ఓసీ ! పొట్టిదానా ! న న్నన్నము తినిపింపవే ! కుమారసచివు లింకను భుజింప కున్నా రేమి ? ఈ పద్యములో మహారా జొకడు దండయాత్ర కుద్యమింపగా శత్రువు లందరు పలాయితు లయినారు. అనెడు కారణరూపార్థము ప్రస్తుతము. పద్యములోని యర్థము కార్యరూప మప్రస్తుతము. రాజశుక వృత్తాంతము ప్రస్తుతమునకై స్వాత్మార్పణము చేయు చున్నది. ఇట్లింద ప్రస్తుతప్రశంసయే, న్యాయ్య మగును.

క స్త్వం భోః కథయామి దైవహతకం మాం విద్ధి శాఖోటకం
వైరాగ్యాదివవక్షి ! సాధు విదితం కస్మా దిదం ? కథ్యతే
వామేనాత్ర వటః తమధ్వగజనః సర్వాత్మనా సేవతే
న చ్ఛాయాపి పరోపకారకృతయే మార్గస్థితస్యాపి మే ౫౨

ఓయీ! నీవెవరు? చెప్పెదను. నే నొక దైవహత ప్రాణి. నన్ను శాఖోటక మందురు. వైరాగ్యమున పల్కుచున్నావేమి? అవును చక్కగా గుర్తించితివి. ఏల నీకీ విరక్తి? ఇదిగో! చెప్పెదను. ఇటు దూరముగా నెడమ వైపుగా వట మున్నది. దాని పాంథులు అన్ని విధముల సేవింతురు. నేను మార్గము నం దుంటిని. నా నీడ కూడ పరోపకారమునకు కాలేదు కదా! దీనిలో నచేతన మయిన శాఖోటకముతో ప్రశ్నోత్తరిక సంభవింపదు. వాచ్యము సంభవింపకయే నన్యము గోచరింప జేయుట యిం దున్నది. అప్రస్తుతము వాచ్యము కాగా, ప్రస్తుతము గమ్య మయినచో నప్రస్తుతప్రశంస యగు నన్న నిర్ణయ మిందును సంగత మగును.

## ౨౫. అర్థాంతరన్యాసము

## ౩౫. సామాన్యవిశేషకార్యకారణభావాభ్యాం నిర్దిష్టప్రకృతసమర్థన మర్థాంతరన్యాసః

సామాన్య విశేషభావమున గాని, కార్యకారణభావమున గాని నిర్దిష్ట మయిన ప్రకృతమును సమర్థించుట యర్థాంతరన్యాసము. నిర్దిష్ట మభిహితము సమర్థనార్హ మయిన ప్రకృతమును సమర్థించుట యర్థాంతరన్యాస మగును. సామాన్యము విశేషసమర్థక మగును. విశేషము సామాన్యసమర్థకమును అగును. అట్లె కార్యము కారణమునకు, కారణము కార్యమునకు సమర్థక మగును.

అనంతరత్నప్రభవస్య యస్యహిమం న సౌభాగ్య విలోపి జాతం
ఏకో హి దోషో గుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః ౫౩

హిమవంత మనంతరత్న ప్రభవము. హిమము దాని సౌభాగ్యము నే మాత్రము విలోపింప చేయలేదు. ఒక్క దోషము గుణసమూహములో చంద్రకిరణము లం దంకము వలె నిమగ్న మగును. దీనిలో హిమరూప మయిన దోషవిశేషము రత్నరూప గుణవిశేష సముదాయము గల హిమవాను నందు సౌభాగ్య విలోపి కాలేదు. గుణసన్నిపాత ముండగా దోషము నిమగ్నమై యకించిత్కర మగునను సామాన్యార్థమున విశేషార్థము సమర్థిత మయినది.

పృథ్వి స్థిరీభవ భుజంగమ ధారయైనాం
త్వం కూర్మరాజ తదిదం ద్వితయం దధీథాః
దిక్కుంజరాః కురుత తత్త్రితయే దిధీర్షాం
దేవః కరోతి హరకార్ముక మాతతజ్యాం ౫౪

భూమీ ! స్థిరముగా నుండుము. సర్పరాజా ! నీవు దీనిని ధరింపుము. కూర్మరాజా ! నీ వీ రెండిటిని ధరింపుము. ఓ ! దిగ్గజములారా ! మీ రీ మూటిని ధరింప వలసి యుండును. రామదేవుడు శివధనువు నెక్కుబెట్ట నున్నాడు సుమా ! దీనిలో శివధనువు నెక్కుబెట్టుట పృథ్వీస్థైర్యాది ప్రవర్తకత్వమున కారణమై సమర్థకముగా నున్నది.

౨౬. పర్యాయోక్తము

౪౬. గమ్యస్యాపి భంగ్యంతరేణాభిధానం పర్యాయోక్తమ్

గమ్యమునే భంగ్యంతరమున జెప్పుట పర్యాయోక్తము. ఏది గమ్యమగునో దానినే చెప్పుట. గమ్యమునే చెప్పుట యెట్లు ? గమ్యమగు విధానము కన్న ప్రకారాంతరమున నభిధానించుట ఇందలి తాత్పర్యము. ఒకే యంశమున కప్పుడే యా విచ్ఛిత్తి విశేషముననే గమ్యత్వము వాచ్యత్వము లభింపదు. కావున కార్యాది ద్వారమున నభిధానము సంగత మగును.

స్పృష్టాస్తా నందనే శచ్యాః కేశ సంభోగ లాలితాః
సావజ్ఞం పారిజాతస్య మంజర్యో యస్య సైనికైః ౫౫

హయగ్రీవుడు స్వర్గవిజయము సాధించినాడు. ఇది యప్పటికథ. నందన వనములో శచీదేవి కేశలాలితము లయిన పారిజాత మంజరులను హయగ్రీవ సైనికులు సావజ్ఞముగా స్పృశించిరి. కారణమున వలె కార్యమున గూడ ప్రభావాతిశయ ప్రతిపాదన మున్నది. కాన కార్యము వర్ణనీయము. కావున నిది పర్యాయోక్త విషయము. సైనిక కర్తృక మయిన సావజ్ఞ పారిజాత మంజరీ స్పర్శనము స్వర్గవిజయరూప మగు కారణము లేకయే కలుగదు. కారణరూపము గమ్య మగునది కార్యాత్మక భంగ్యంతరమున నిరూపిత మగుట పర్యాయోక్త మయినది.

## ౨౭. వ్యాజస్తుతి

### ౩౭. స్తుతినిందాభ్యాం నిందాస్తుత్యోర్గమ్యత్వే వ్యాజస్తుతిః

స్తుతినిందలచే నిందాస్తుతులు గమ్యము లగునేని వ్యాజస్తుతి యలంకార మగును. మొదట స్తుతి చెప్పినను అది ప్రమాణాంతరమున బాధితమై నిందలో పర్యవసించును. ఇట్టి స్తుతి యసత్యమగుట వ్యాజరూపమయిన స్తుతి. ఇట్టి దొక వ్యాజస్తుతి యగును. శబ్దమున చెప్పిన నింద ప్రమాణాంతరమున బాధితమై స్తుతిలో పర్యవసానము పొందును. ఇట్టిది రెండవ వ్యాజస్తుతి. వ్యాజమున నిందారూపమున స్తుతి చేయుట యనునది ఇందు సంగత మగును. స్తుతినిందాత్మక మయిన విచ్ఛిత్తి విశేష మిం దుండుటచే నప్రస్తుతప్రశంస కన్న వివేక మూహింప వచ్చును.

హే ! హేలాజితబోధిసత్త్వ ! వచసాం కిం విస్తరైస్తోయధే !
నాస్తి త్వత్సదృశః పరః పరహితాధానే గృహీతవ్రతః
తృష్యత్పాంథజనోపకార ఘటనా వైముఖ్యలబ్ధాయశో
భారప్రోద్వహనే కరోషి కృపయా సాహాయకం యన్మరోః ౫౬

ఓ ! సాగరా ! హేలాజితబోధిసత్త్వుడా ! మాటల విస్తర మేల లే ! పరహితము కూర్ప వలె ననుటలో వ్రతము పట్టిన నీ వంటివా డొరుడు లేడోయి ! దప్పిక గొనిన పాంథజనులకు నుపకారము గూర్చుటలోని వైముఖ్యముచే లంభించిన అపయశోభారము వహించుటలో దయతో మరుభూమికి నీవు సాహాయ్యక మాచరించుచున్నావు. దీనిలో విపరీతలక్షణచే వాచ్యవైపరీత్యము గోచరించును.

ఇందోర్లక్ష్మ త్రిపురజయినః కంఠమూలం మురారిః
దిఙ్నాగానాం మదమలమషీభాంజి గండస్థలాని
అద్యాప్యుర్వీవలయతిలక శ్యామలిమ్నానులిప్తా
న్యుద్భాసన్తే వద ధవలితం కిం యశోభిస్త్వదీయైః ౫౭

ఓ రాజా ! నీ యశములు ఏమి తెల్ల జేసినవయ్యా ! చంద్రకలంక మట్లే యున్నది. నీలకంఠుని కంఠమూలము, శ్రీవిష్ణువు, దిగ్గజముల మదధారల మసి పట్టిన గండస్థలములు, కాలిమ పూతపట్టి యట్లే యున్నవి. ఇందు నింద పర్యవసానము పొందక స్తుతి గోచరింప జేయును. ధవలతాహేతు వయిన

యశముచే ధవలీకరింప దగిన విషయముల ననవక్లృప్తిని ప్రతిపాదించుట చూడ "విశేషప్రతిషేధే శేషాభ్యనుజ్ఞానమ్" అను న్యాయమున నీ చెప్పిన పదార్థములను కాక రాజయశము సర్వవస్తువుల ధవలీకరించిన దని ప్రతీత మగును. కొన్ని వ్యాజస్తుతులలో క్లిష్టరీతి యున్నది. చూడుడు.

> కిం వృత్తాంతైః పరగృహగతైః కిం తు నాహం సమర్థః
> తూష్ణీం స్థాతుంప్రకృతిముఖరో దాక్షిణాత్య స్వభావః
> గేహే గేహే విపణిషు తథా చత్వరే పానగోష్ఠ్యామ్
> ఉన్మత్తేవ భ్రమతి భవతో వల్లభా హంత! కీర్తిః ౫౮

పరాయి గృహముల లోని వృత్తాంతములు మా కేల? కాని మే మూరకనె నోరు మూసుకొని యుండలేము. దాక్షిణాత్యస్వభావము ప్రకృతిముఖరము. నీ వల్లభ కీర్తి ఇంటింటిలో తిరుగు చున్నది. దుకాణములలో నున్నది. చత్వరముల సంచరించుచున్నది. పానగోష్ఠిలో నున్నది. పిచ్చి యెత్తిన విధమున నంతట నున్నది. దీనిలో నింద ప్రక్రాంత మయినను స్తుతిపర్యవసానము పొంది "హంత! కీర్తిః" అను భణితిప్రకారముచే నున్మీలిత మయినది కాని ప్రరోహము పొందలేదు. హంత శబ్దము విషాదద్యోతకము నిందాపర్యవసానము పొందును. నిందకే ప్రరోహము కలుగును. పోనీ! హంత శబ్దమును హర్ష ప్రతిపాదకముగా భావింతు మేని యుపక్రమముననే నింద యున్మీలిత మగును. ఇక స్తుతి గోచరము కాదు. ఇది క్లిష్టరీతి. ఇట్టి యుదాహరణములు తగవు.

### ౨౮. ఆక్షేపము

### ౩౮. ఉక్తవక్ష్యమాణయోః ప్రాకరణికయోః విశేషప్రతిపత్త్యర్థం నిషేధాభాస ఆక్షేపః

ప్రాకరణికము లయిన ఉక్తవక్ష్యమాణములను విశేషము గోచరింప చేయుటకై నిషేధాభాసరూపమున చెప్పుట ఆక్షేప మగును. ప్రాకరణిక మయినందున ప్రాకరణికార్థము నిరూపించుట కర్హము. అది విధానార్హము. నిషేధింప తగదు. అది ఏలనో బాధిత మయిన దని నిషేధింప తగిన దగును. అపుడు నిషేధాభాసము సంపన్న మయినది. ఇదియంతయు విశేషప్రతిపత్తి

కొఱవ కావలయును. కాకున్న గజస్నాన మగును. ఆభాసమాన మగు నిషేధము చెప్పిన యర్థమునకే కలుగవచ్చును. వక్ష్యమాణమునకేని కలుగవచ్చును.

ప్రసీదేతి బ్రూయామిదమసతి కోపే న ఘటతే
కరిష్యామ్యేవం నో పునరితి భవేదభ్యుపగమః
న మే దోషోఽస్తీతి త్వమిదమపి హి జ్ఞాస్యసి మృషా
కిమే తస్మిన్ వక్తుం క్షమమితి న వేద్మి ప్రియతమే! ౫౯

ప్రసన్నవు కమ్మందునా! నీకు కోపము లేకున్న నిది కుదురదు కదా! "నేనిక నిట్లొనర్పను" అన్నచో అంగీకరించినట్లె యగును. నా దోషమేమియు లేదన్న నిది యసత్యమని తెలిసికొందువు. ఇందు నేనేమి చెప్పుట యుక్తమొ తెలియనుగా ప్రియా! దీనిలో భణితినిషేధ మున్నది. ఈ పద్యము నందలి భణితి కోప లక్షణ కారణము లేనందున నభ్యుపగమమనెడి యనిష్టప్రసంగమున మిథ్యాప్రతిపత్తి విషయ మయినందున వ్యర్థమె యగును. ఇట్టి విశేషప్రతిపత్తి కొఱకే ప్రాకరణిక నిషేధాభాస మున్నది. నిషేధ్యము నందలి విశేషప్రతీతియే యిందు ప్రయోజనము.

జ్యోత్స్నా తమః హితవచః క్రకచస్తుషారః
మృణాలవలయాని కృతాన్తదంతాః
సర్వం దురంతమిదమద్య శిరీషమృద్వీ
సా నూనమాః! కిమథవా హతజల్పితేన ౬౦

వెన్నెల చీకటి, కోకిలకూత రంపము, హిమశీకరము క్షారము, తామర తూండ్లు మృత్యుదంతములు, అంతయు నిది దురంతముగా నున్నది. ఇప్పుడా శిరీషకోమల, ఆ ఈ పాడు మాట లేల? దీనిలో సామాన్యముగా నిష్టాంశము నిరూపితము. అంశాంతరము చెప్పదలచినది నిషిద్ధ మయినది. ప్రతిపాద్యమిక శక్యవచనము కాదు. అని యిందలి విశేషము.

ఈ యుదాహరణముల లోని విశేషము భావింపుడు.

సాహిత్యపాథోనిధిమంథనోత్థం కావ్యామృతం రక్షత! హే! కవీంద్రాః
యత్తస్య దైత్యా ఇవ లుంఠనాయ కావ్యార్థచోరాః ప్రగుణీభవన్తి ౬౧
గృహ్ణాంతు సర్వే యది వా యథేచ్ఛం నాస్తి క్షతిః కాపి కవీశ్వరాణాం
రత్నేషు లుప్తేషు బహుష్వమర్త్యైః అద్యాపి రత్నాకర ఏవ సింధుః ౬౨

ఓ కవీంద్రులారా! సాహిత్యసాగరమథనములో జనించిన కావ్యామృతమును రక్షింపుడు. అరుగో! దైత్యులవలె కావ్యార్థచోరులు తదపహారమున గుమిగూడు చున్నారు. పోనిండు. అందరు యథేష్టము స్వీకరింతురు గావుత! కవీశ్వరుల కేమియు క్షతి లేదు. దేవత లెన్ని రత్నములు తీసికొన్నను నేటికిని సాగరము రత్నాకరమె. ఇం దాక్షేప మున్నదని తలచ వలదు. ఇది విహిత నిషేధము. ఇందలి చమత్కారము నిషేధహేతుకమే యయినను అంతమాత్రమున నాక్షేప ధీ తగదు.

ఇష్టనిషేధమున నాక్షేపము నిరూపిత మయినది. ఇట్లే యనిష్టవిధిలో కూడ నాక్షేపమే యగును.

## ౩౯. అనిష్టవిధ్యాభాసః

ఇష్ట మిష్ట మయినందున నిషేధ మనుపపన్న మయినట్లు అనిష్ట మనిష్ట మగుట విధానము నుపన్నము కాదు. అట్టి విధానము ప్రస్థలద్రూపమై నిషేధముననె పర్యవసించును. కాగా విధికి నిషేధ ముపకరణ మగును. అనిష్టవిశేష మున పర్యవసించును.

గచ్ఛ! గచ్ఛసి చేత్కాంత! పంథానస్సంతు తే శివాః
మమాపి జన్మ తత్రైవ భూయాద్యత్ర గతో భవాన్ ౬౩

నాథా! పోదువా! పొమ్ము! నీ మార్గము భద్ర మవుగావుత! నీ వెచ్చటికి పోదువో! అచ్చటనే నాకు జన్మ కలుగు గావుత! కాంతుడు ప్రస్థానమునకై బయలుదేరగా నొకతె యది తన కనిష్ట మయినను అనిరాకరణమున విధించు చున్నది. అనిష్ట మయినందున గమనవిధి యుక్తము కాదు. ఇది నిషేధముననె భాసింప జేయును. "ఈ ప్రయాణము నా కభీష్టము కాదు. ఏ మాత్ర మిది తగదు" అనియే యిందలి భావము. "అచటనే నాకును జన్మ కలుగు గావుత!" అను ననిష్ట పర్యవసాయ్యంశమున నిది వ్యంజితము.

నో కించిత్కథనీయమస్తి సుభగ! ప్రౌఢాః పరం త్వాదృశాః
పంథానః కుశలా భవంతు భవతః కో మాదృశామాగ్రహః
కిం త్వేతత్కథయామి సంతత రతక్లాంతిచ్ఛిద స్తాస్త్వయా
స్మర్తవ్యాః శిశిరాః సహంసగతయః గోదావరీ వీచయః ౬౪

సుభగా! నేను పలుక వలసిన దేదియు లేదు. మీ వంటి వారు ప్రౌఢులు, నీ మార్గములు కుశలము లగు గావుత! మా వంటి వారలకు పట్టు దల గూడనా! కాని యొకటి యుండును. నిరంతర నిధువన శ్రమను పో గొట్టిన హంససంచారములు కల చల్లని యా గోదావరీ వీచికలను స్మరింపుము. ఇందును కాంతుని ప్రస్థాన మభిప్రేతము కాదు. అది మొదటనే యంగీకరించి నట్లు కన్పడును. అది యనిష్టవిధి. కావుననె యాక్షేప మయినది. "స్మరింపుము!" అని యనుటయు గమననివృత్తికె బల మిచ్చును. ఇట్లాక్షేపము లోని యిష్టనిషేధమున ననిష్టవిధిలో వైరుద్ధ్యము ప్రవేశించినది. ఈ ప్రస్తావమున విరోధగర్భాలంకారవర్గము నిరూపింప దగి యున్నది.

## ౨౯. విరోధము

### ౪౦. విరుద్ధాభాసత్వం విరోధః

విరుద్ధాభాస ముండుట విరోధము. విరోధాలంకారమున గూడ విరోధమాత్ర మలంకారము కాదు. విరోధము లే కున్నను విరోధ మున్నట్లుగా భాసించుట విరుద్ధాభాస మగును. జాతి గుణ క్రియా ద్రవ్యము లను నాలుగు పదార్థములలో పరస్పరము ప్రత్యేకము వైరుద్ధ్య మున్నట్లు ప్రదర్శించుట విరోధాలంకార మగును. ఆ విరోధము తగిన సమాధానము లే కున్నచో ప్రరూఢ దోష మగును. సమాధాన మున్నచో విరోధము ప్రముఖావభాసమె కావున విరోధాభాస మగును. ఇందనేక భేదములు సంభవించును.

పరిచ్ఛేదాతీతః సకలవచనానా మవిషయః
పునర్జన్మ న్యస్మిన్ననుభవపథం యో న గతవాన్
వివేకప్రధ్వంసా దుపచిత మహామోహ గహనో
వికారః కోఽప్యంతర్జడయతి చ తాపం చ కురుతే ౬౫

ఏదియో యంతర్వికార మొకటి యిది యది యని నిర్ణయింప వలను గాక ఏ మాటకు విషయము గాక ఈ జన్మలో నెన్న డనుభవమునకు రానిదై వివేకవినాశము వలన మహామోహము నతిశయింప జేసి యంతరమును జడీకరించు చున్నది. తాప పెట్టు చున్నది. ఇందు జడీకరణ తాపకరణములకు విరోధ మున్నది. అయినను ప్రియాప్రాప్తిలో పర్యవసించు వస్తుసౌందర్య

మున పరిహృత మగును. ఇందు క్రియావిరోధము విశదము. ఇట్లె యితర విరోధములు గ్రాహ్యములు. ఇది విరోధము. ఇంక విరోధమూలాలంకారము లున్నవి. వానిలో విభావన కార్యకారణభావ మూలము.

30. విభావన

౪౧. కారణాభావే కార్యస్యోత్పత్తి ర్విభావనా

కారణము లేకున్నను కార్యోత్పత్తి వర్ణించుట విభావన యగును. కారణ మున్ననే కార్య ముండును. అది లేకున్న నిది యుండదు. ఎట్లేని కారణము లేకనే కార్యము నిబద్ధ మయినచో విభావనాలంకార మగును. విశిష్టముగా కార్యవిభావన ముండును గావున నిది విభావనము. ఈ విశిష్ట భంగి విశిష్టకారణము లేనందున సంగత మన వలెను. అప్రసిద్ధకారణ మేదేని యుండును. ఈ యలంకారములో కార్యము బాధ్యమానమై గోచరించును. వక్ష్యమాణ విశేషోక్తిలో కారణసత్తయె బాధ్యమానమగును.

అసంభృతం మండన మంగయష్టే రనాస వాఖ్యం కరణం మదస్య
కామస్య పుష్పవ్యతిరిక్త మస్త్రం బాల్యా త్పరం సాఽథ వయః ప్రపేదే ౬౬

ఆ పార్వతీదేవి బాల్యానంతర వయస్సును పొందినది. ఆ వయ సామె దేహమునకు సంపాదింపని యలంకారము. మద్యము కాని మదంకరణము. కామునకు పుష్పవ్యతిరిక్త మయిన యస్త్రము. ఇందు రెండవపాదములో మదమునకు ప్రసిద్ధకరణ మాసవము. అది లేకున్నను యౌవనహేతువుగా నుపనిబంధ మున్నది. ఆసవ జన్యమదము వేరు. యౌవనహేతుకము వేరు. ఇందు యౌవనహేతుకమె వివక్షితము. అయినను రెండిటి కభేదాధ్యవసాయమున నిం దేకత్వ మతిశయోక్తిచే గలుగును. అట్టి యతిశయోక్తి యిట్టి వానిలో తప్పదు. ఈ విభావన యతిశయోక్త్యనుప్రాణితమై యుండును. విభావన మాలారూపమున గూడ గోచరించు చున్నది.

అనిద్రో దుఃస్వప్నః ప్రపతనమనద్రిద్రుమతటం
జరాహీనః కంపః తిమిరరహితస్త్రాసనమయః
అనాఘాతం దుఃఖం విగతనిగలా బంధనధృతిః
సజీవం జంతూనాం మరణ మవనీశాశ్రయ రసః ౬౭

జనులకు రాజాశ్రయ రసము నిద్రలేని దుఃస్వప్నము. పర్వత వృక్షతటములు లేని ప్రపాతము. ముసలితనము లేని కంపము. తిమిరము లేని త్రాసము. ఆఘాతములేని దుఃఖము. గొలుసు లేని బంధనము. జీవమున్న మరణము. దీనిలో నవనీశాశ్రయరస మొక్కటియె దుఃస్వప్నాద్యారోపములతో నున్నది. దుఃస్వప్నాదులు కార్యములు. నిద్రాదులు కారణములు. నిద్రాది బహుకారణాభావోపనిబంధన మున్నందున మాలాత్వ మభ్యూహ్యము. సజీవ మరణ మనుచోట జీవాభావరూప మగు హేతువు లేకున్నను మరణకార్యము నిరూపిత మని భావించునది.

## ౩౦. విశేషోక్తి

### ౪౨. కారణసామగ్ర్యే కార్యానుత్పత్తిః విశేషోక్తిః

విశేషోక్తి విభావనా విపర్యయ స్వరూపము. సమగ్రములైన కారణములు నియమమున కార్యము నుత్పాదించుట లోకమున ప్రసిద్ధము. సామగ్రి యుండియు కార్యము కలుగజేయక పోయినచో విశేషోక్తి యగును. ఇట్టిచో నేదేని విశేష మభివ్యంగ్య మగును.

కర్పూర ఇవ దగ్ధోఽపి శక్తిమాన్ యో జనే జనే
నమోఽస్త్వవార్య వీర్యాయ తస్మై మకరకేతవే ౬౫

కర్పూరము వలె దగ్ధుడైనను, ప్రతిజను నందు శక్తిమంతుడైన యవార్యవీర్యుడా మన్మథునకు నమస్కారము. ఇందు దాహ మనునది అవికలకారణము. అది యున్నను అశక్తత్వకార్య ముదయింప లేదు. అట్టికార్యానుత్పత్తి శక్తిమత్వరూపమగు విరుద్ధధర్మమున నిం దున్నది. మన్మథుని అవార్యవీర్యత యిందు నిమిత్తముగా నుపాత్తమైనది.

## ౩౧. అతిశయోక్తి

### ౪౩. కార్యకారణయోస్సమకాలత్వే పౌర్వాపర్యవిపర్యయే చాతిశయోక్తిః

అతిశయోక్తి పూర్వము నిరూపితమైనది. ఐనను కార్యకారణప్రస్తావమున తద్భేద మొకటి యిచట నిరూపిత మగును. కార్యకారణములు సమకాలమునం దున్నట్లు చెప్పినచో వాని పౌర్వాపర్యవిపర్యయము నిరూపించినచో

అతిశయోక్తి యగును. కారణము నియతముగా పూర్వకాలభావి యని, కార్యము నియతముగా పశ్చాత్కాలభావి యని కార్యకారణధర్మము లోకమున ప్రసిద్ధము. ఒకానొక విశేషము చెప్పుటకై వాని యీ రూప మపగతమైనచో నీ యతిశయోక్తి యగును. ఈ రూపాపగమము కాలసామ్యనిబంధనమును కా వచ్చును. కాలవిపర్యాస నిబంధనమును కా వచ్చును.

> పశ్యత్సూద్గత సాంద్రవిస్మయ రస ప్రోత్ఫుల్ల నేత్రోత్పలం
> భూపాలేషు తవాత్రసూక్ష్మనిశితే నిస్త్రింశధారాధ్వని
> కీర్త్యా చ ద్విషతాం శ్రియా చ యుగపద్రాజన్యచూడామణే!
> హేలానిర్గమన ప్రవేశవిధినా పశ్యేంద్రజాలం కృతమ్ ౬౯

ఓ రాజన్యచూడామణీ! నీ సూక్ష్మనిశిత మైన ఖడ్గధారామార్గమున నాశ్చర్య వికసిత నేత్రులై రాజులు చూచుచుండగనే నీ కీర్తియు శత్రువుల శ్రీయు సవిలాసముగా నిర్గమన ప్రవేశ విధమున నింద్రజాల మాచరించినది. చూడుము! దీనిలో ప్రౌఢోక్తి నిర్మితార్థ మున్నది. ఖడ్గధార, కీర్తినిర్గమము, శత్రుశ్రీప్రవేశము లోకసంభూతములు కావు. అవి ప్రౌఢోక్తినిర్మితములు. ఇందు శత్రుశ్రీ ప్రవేశము కీర్తినిర్గమన కారణము. రెండును భిన్నకాలములు. ఐనను సమకాలత్వము నిరూపిత మైనది. కావుననే కాలసామ్య హేతుక మైన అతిశయోక్తి.

> పథి పథి శుకచంచూ చారురాభాంకురాణాం
> దిశి దిశి పవమానో వీరుధాం లాసకశ్చ
> నరి నరి కిరతి ద్రాక్ సాయకాన్ పుష్పధన్వా
> పురి పురి చ నివృత్తా మానినీ మానచర్చా ౭౦

మార్గ మార్గమునను అంకురముల కాంతి చిలుకముక్కుల వలె నున్నది. దిక్కుదిక్కునను వాయువు లతలకు లాస్యము నేర్పుచున్నాడు. నరునరునందు మదనుడు బాణములు వేయుచున్నాడు. పురిపురిలో కామినీకలహ వార్త లేదు. దీనిలో మానినీ మాన నివృత్తి స్మరశర ప్రకరణ కార్యము. వాని పౌర్వాపర్యము మారిపోయినది. 'పురిపురినివృత్తా' అనుచోట కార్య మగు మాననివృత్తి, 'నివృత్తా' అని భూతకాలవిషయకముగా నున్నది. 'నరి నరి కిరతి' కారణభూత మైన స్మరశర కిరణము 'కిరతి' అని వర్తమానకాల

ముగా నున్నది. అందుచే సాధ్యకాలత గోచరించును. అందుచే పశ్చాత్కాలత్వమును గోచరించును. ఇట్టి వ్యత్యయమైన నిర్దేశ ముండుటచే నిది యతిశయోక్తి యైనది. కార్యము వేగమే జరుగుట యిందున్న విశేషము.

33. అసంగతి

౪౪. తయోర్విభిన్న దేశత్వే అసంగతిః

కార్యకారణములు వేర్వేరు ప్రదేశము లందున్నట్లు వర్ణించినచో అసంగతి యను నలంకారము. కారణ మే దేశమున నుండునో కార్య మా దేశముననే యుండునని లోకప్రసిద్ధము. మహానసములోని యగ్ని పర్వతములో ధూమము నుత్పాదింపదు. కాగా కారణ మొక దేశమునను, కార్యము వేరొక దేశమునను వర్ణించినచో సముచితసంగతి లేనందున నసంగతి అలంకార మగును.

సా బాలా వయ మప్రగల్భవచసః సా స్త్రీ వయం కాతరాః
సా పీనోన్నతిమత్పయోధరభరం ధత్తే సఖేదా వయం
సా క్లాంతా జఘనస్థలేన గురుణా గంతుం న శక్తా వయం
దోషైరన్యజనాశ్రయైరపటవో, జాతా స్మ ఇత్యద్భుతమ్ ౭౦

ఆమె బాల. మాకు ప్రగల్భవాక్కులు లేవు. ఆమె స్త్రీ. మేము కాతరులము. ఆమె పీనపయోధరభార. మేము ఖేద పడుచున్నాము. ఆమె గురుజఘన. మేము నడువ లేకున్నాము. అన్యజనుల దోషములచే మే మసమర్థుల మగుట యద్భుతముగా నున్నది. దీనిలో బాల్య నిమిత్తక మైన అప్రగల్భవచనము వేరు. స్మరనిమిత్తక మైన అప్రగల్భవచనము వేరు. ఐనను వానికభేదాధ్యవసాయ మున్నది. ఇట్లే అంతట నిగ్రాహ్యము.

3౪. విషమము

౪౫. విరూపకార్యానర్థయోరుత్పత్తిః విరూపసంఘటనా చ విషమమ్

కారణ గుణ ప్రక్రమమున కార్యము కలుగునని ప్రసిద్ధి యున్నది. విరూపకార్యము కలిగి నట్లు వర్ణించినచో నది యొక విషమ మగును. అనర్థ సముత్పత్తి రెండవ విషమము. ఒక యర్థమును సాధింప యత్నించిన వానికది లభింపక పోవుటే కాక అనర్థప్రాప్తి యుండుట యీ విషమవిశేషము.

అత్యంతము అననురూప సంఘటనము కల విరూపముల సంఘటనము మూడవ విషమము. అననురూప సంసర్గ మని భావము.

అరణ్యానీ క్వేయం ధృతకనకసూత్రః క్వ స మృగః
క్వ ముక్తాహారోఽయం క్వ చ స పతగః క్వేయమబలా
క్వ తత్కన్యారత్నం లలితమహిభర్తుః క్వ చ వయం
స్వమాకూతం ధాతా కిమపి నిభృతం పల్లవయతి ౭౨

ఈ యరణ్య మెక్కడ? బంగారు సూత్రము గల యా మృగ మెక్కడ? ఈ ముక్తాహార మెక్కడ? ఆ పక్షి యెక్కడ? ఈ పిల్ల యెక్కడ? ఆ కన్యారత్న మెక్కడ? మే మెక్కడ? విధాత తన యాకూతము నేదో నిభృతముగా పల్లవింప జేయును కదా! దీనిలో నత్యంత మననురూపములైన 'అరణ్యాని' మొదలగువానికి పరస్పరసంఘటన మున్నది.

౩౫. సమము

౪౬. తద్విపర్యయస్సమం

విషమమైధర్మ్యము సమములో నున్నది. విషమవిపర్యయము సమాలంకార మగును. విషమములో మూడు భేదము లున్నవి. అయినను తద్విపర్యాయ మను తచ్ఛబ్దమున సంభవము ననుసరించి చివరి భేద మె పరామృష్ట మగును. మొదటి భేదద్వయ విపర్యయ మలంకారము కా నేరదు. చివరి భేదమున విపర్యయమె సమ మను నలంకార మగును.

త్వమేవంసౌందర్యా స చ రుచిరతాయాం పరిచితః
కలానాం సీమానం పరమిహ యువామేవ భజథః
అయి! ద్వంద్వం దిష్ట్యా తదిహ సుభగే! సంవదతి వా
మతః శేషం చేత్ స్యాజ్జితమథ తదానీం గుణితయా ౭౩

ఓసి! సుభగా! నీ వింతటి సౌందర్యము కలదానవు. ఆతడును రుచిరతా పరిచయము కలవాడు. కలాపారమ్యమును మీరే కాంచినారు. మీ యీ ద్వంద్వము దైవయోగమున ననుకూల పడినది. ఇంక నేమేని యున్నచో నది మీ గుణితచే నయిన విజయము. దీనిలో నభిరూప నాయక యుగమున నుచిత మయిన సంఘటన మాశంసితము.

### ౩౮. అన్యోన్యము

### ౪౯. పరస్పరం క్రియాజననే అన్యోన్యమ్

ఇందును విరోధప్రస్తావ మున్నది. పరస్పరము క్రియాజననము విరుద్ధము. క్రియాద్వారకముగ పరస్పరోత్పాదకత్వ మున్నచో అన్యోన్యాలంకారము. ఈ పరస్పరోత్పాదకత స్వరూపనిబంధనముగా నుండదు.

కంఠస్య తస్యాః స్తనబంధురస్య ముక్తాకలాపస్య చ నిస్తలస్య
అన్యోన్యశోభాజననాత్ బభూవ సాధారణో భూషణ భూష్యభావః ౭౮

కుచసుందర మయిన పార్వతీకంఠమునకు, స్వచ్ఛరమ్య మయిన ముక్తాహారమునకు పరస్పరము శోభ యుండుటచే భూషణభూష్యభావ ముభయసాధారణ మయినది. కంఠము హారము నలంకరించినది. హారము కంఠము నలంకరించినది. ఇందు పరస్పరజననము శోభా క్రియాముఖముగ నున్నది. భూషణాదిక్రియ జన్యము. కంఠముక్తాకలాపములు జనకములు. క్రియాగత మయిన జన్యత్వము కంఠహారనిష్ఠముగా మొదట గోచరించును కావున విరోధము స్ఫురించును.

### ౩౯. విశేషము

### ౫౦. అనాధార మాధేయ మేక మనేకగోచర మశక్యవస్త్వంతకరణం చ విశేషః

ఆధారము లేక ఆధేయ ముండదు. అయిననానాధారముగ నాధేయము వర్ణిత ముగుచో నది విశేషాలంకార మగును. ఒకటియే పరిమితమగు వస్తువు సమసమయమున ననేకము లం దున్నట్లు వర్ణించిన రెండవ విశేషము. అశక్యవస్త్వంతరకరణము మూడవ విశేషము.

ప్రాసాదే సా పథి పథి చ సా పృష్ఠతః సా పురః సా
పర్యంకే సా దిశి దిశి చ సా తద్వియోగాకులస్య
హం హో! చేతః ప్రమితిరపరా నాస్తి తే కాపి సా
సా సా సా సా జగతి సకలే కోఽయమద్వైతవాదః ౭౯

ప్రియావియోగ వ్యాకులు డైన వానికి ప్రాసాదమున నామె, మార్గములో నామె, వెనుక నామె, ఎదుట నామె, శయ్యలో నామె, దిశలో నామె, నంతట నామెయె. వేరొక చిత్తప్రకృతి లేనే లేదు. ఈ జగ

మంతట ఆమె ఆమె ఆమె అని యేమి యీ అద్వైతవాదము ! వీనిలో నొక తెయే వనిత. ప్రాసాదాదులలో నేకసమయమున నే యున్నట్లు వర్ణిత యైనది.

## ౪౦. వ్యాఘాతము

### ౫౧. యథాసాధితస్య తథైవాన్యేనాన్యథాకరణం వ్యాఘాతః

ఏదియేని ఉపాయవిశేష మవలంబించి ఒక డొకటి కూర్పగా వాని ప్రతిద్వంద్వి వేరొకడు ఆ యుపాయవిశేషముననే దాని నన్యథీకరించినచో వ్యాఘాత మగును. పూర్వవస్తువున కిది వ్యాహతి హేతువు కావున వ్యాఘాతము.

దృశా దగ్ధం మనసిజం జీవయంతి దృశైవ యాః
విరూపాక్షస్య జయినీః తా స్తువే వామలోచనాః ౭౦

చూపుచే నశించిన మన్మథుని చూపుచేతనే జీవింపచేయు, విరూపాక్షుని జయించిన వామలోచనలను స్తుతింతును. హరుడు దృష్టినుపాయము చేసికొని మన్మథుని దహించినాడు. స్త్రీలు దృగుపాయముననే వానిని జీవింప జేసినారు. కావున వ్యాఘాత మయినది. ఈ యలంకార మిచట వ్యతిరేక నిమిత్తముగా నున్నది. విరూపాక్ష వామలోచనశబ్దము లీ యర్థమునే చెప్పును. ఈ వ్యాఘాతాలంకారము వేరువిధముగ కూడ కలుగును.

### ౫౨. సౌకర్యేణ కార్యవిరుద్ధక్రియా చ

కారణ మొకటి యొక కార్యమునకై సంభావితము కాగా తత్కార్య విరుద్ధ నిష్పాదకముగా నది సిద్ధమైనచో వ్యాఘాత మగును. కార్యవిరుద్ధ కార్యనిష్పత్తి కార్యముకన్న సుకరము. "నీవు బాలుడవు. రక్షణీయుడవు. యుద్ధమునకు రావలదు". "నేను బాలుడను రక్షణీయుడ నయినచో నీ వెంటగొని పొమ్ము". ఇందు వ్యాఘాతము సంగత మగును.

## ౪౧. కారణమాల

### ౫౩. పూర్వపూర్వస్య ఉత్తరోత్తరహేతుత్వే కారణమాలా

ఇప్పటికి విరోధమూలకాలంకారము లయినవి. శృంఖలాబంధమున విచిత్రము లయిన యలంకారములను నిరూపింప వలెను. అందిది మొదటిది.

పూర్వపూర్వము క్రమముగా ఉత్తరోత్తరమున హేతు వయినచో కారణ మాల యగును.

జితేంద్రియత్వం వినయస్య కారణం గుణప్రకర్షో వినయాదవాప్యతే
గుణప్రకర్షేణ జనోఽనురజ్యతే జనానురాగప్రభవా హి సంపదః ౧౧

జితేంద్రియత్వము వినయమునకు కారణము. వినయమున గుణాతిశయము కలుగును. గుణాతిశయమున జనానురాగము కలుగును. జనానురాగమున సంపద లుదయించును. మాలలోవలె కారణము లనేకము లున్నందున కారణమాల యయినది. వినయాదు లన్నిటి కింద్రియజయము కారణ మని వివక్షితము కాని దాని నట్లు చెప్పుట సుందరము కాదు. కాననే యీ క్రమము కా వలసి వచ్చినది.

౪౭. ఏ కా వ ళి

## ౫౪. యథాపూర్వం పరస్య విశేషణతయా స్థాపనేఽపోహనే వా ఏకావళీ

పూర్వపూర్వమున పరము పరము విశేషణ మైనచో ఏకావళి యగును. విశేషణ మగుటయు స్థాపనమున నుండును, నివర్తనమున నుండును.

గృహాణి యస్యాం సవరాంగనాని వరాంగనారూప పురస్కృతాంగ్యః
రూపం సమున్మీలితసద్విలాసం అస్త్రం విలాసాః కుసుమాయుధస్య ౧౨

ఇందు స్థాపనమున విశేషభావ మున్నది. ఉత్తమ వనితలు కల గృహము లచట కలవు. ఆ వనితలు సురూపలు. ఆ రూపము విలాససహితము. విలాసములు మన్మథుని యస్త్రములు. దీనిలో వరాంగనలు గృహములకు విశేషణముగా స్థాపనమున గోచరించు చున్నారు. అట్లే యనంతరమును గలదు.

న తజ్జలం యన్న సుచారుపంకజం న పంకజం తద్యదలీన షట్పదం
న షట్పదోఽసౌ న జుగుంజ యః కలం న గుంజితం తన్న జహార యన్మనః ౧౩

రమ్యపద్మములు లేని దది జలము కాదు. తుమ్మెదల వ్యాప్తి లేని దది పద్మమును కాదు. కలగుంజిత మొనర్ప కున్న నది తుమ్మెదయు కాదు. మనము హరింపని దది గుంజితము కాదు. ఇందు జలమునకు సుచారుపంకజత్వము విశేషణము. అది నిషేధ్యముగా నిబద్ధ మైనది.

## ౪౩. మా లా దీ ప క ము

### ౫౫. పూర్వపూర్వస్యోత్తరగుణావహత్వే మాలాదీపకమ్

ఉత్తరోత్తరము పూర్వపూర్వమున విశేషణమైనచో నేకావళి యైనది. పూర్వపూర్వ ముత్తరోత్తరమున నుత్కర్ష నిబంధన మైనచో మాలా దీపకము. మాలాత్వమున రమ్యమగుటచే దీపకప్రస్తావమున కాక యిచట లక్షిత మైనది.

సంగ్రామాంగణసంగతేన భవతా చాపే సమారోపితే
సంప్రాప్తే ప్రతిబంధయోధనివహే సామ్ముఖ్య మాసాదితాః
కోదండేన శరాః శరై రరిశిరః తేనాపి భూమండలం
తేన త్వం నృపతే ! త్వయా సితయశః తేనాపి లోకత్రయమ్ ౮౪

సంగరమునకు వచ్చిన నీవు ధను వారోపింపగనే శత్రువులు రాగానివి యన్నియు జరిగినవి. కోదండము శరములను గ్రహించినది. శరము లరిశిరము లను పట్టినవి. శిరము భూమండలము చేరినది. భూమి నిన్నందుకొన్నది. నీవు యశము పొందితివి. యశము లోకత్రయము వ్యాపించినది. దీనిలో కోదండా దులచే క్రమముగా శరాదుల కుత్కర్షము నిరూపిత మైనది. కోదండాదులు శరాదులను పట్టుటచే శరాదుల కుత్కర్షము కలిగినది. ఉత్కృష్టమునే లోకము పొందును కదా! అరిశిరఃప్రాప్తి యుండుటచే కూడ శరమున కుత్కర్ష యున్నది.

## ౪౪. సా ర ము

### ౫౬. ఉత్తరోత్తరముత్కర్షః స్సారః

పూర్వపూర్వము కన్న నుత్తరోత్తరమున కుత్కర్షను చెప్పినచో సారా లంకార మగును.

రాజ్యే సారం వసుధా వసుంధరాయాం పురం పురే సౌధం
సౌధే తల్పం తల్పే వ రాం గ నా నం గ స ర్వ స్వ మ్ ౮౫

రాజ్యములో భూమి సారము. భూమిలో పట్టణము సారము. పట్టణ ములో సౌధము సారము. సౌధమున తల్పము సారము. తల్పమున వరాంగనా నంగసర్వస్వమె సారము. సమన్వయము స్పష్టము. ఇంతవఱకివి శృంఖలాలం కారములు. ఇక తర్కన్యాయాశ్రయమున నలంకారద్వయ మున్నది. అందు—

## ౪౫. కావ్యలింగము

## ౫౭. హేతో ర్వాక్యపదార్థత్వే కావ్యలింగమ్

హేతువు వాక్యగతముగా పదార్థగతముగా నుండునేని కావ్యలింగాలంకార మగును. హేతువు కారణరూప మగును. అది వాక్యార్థగతముగా విశేషణద్వారమున నుండును. పదార్థగతిగా లింగరూపమున నుండును. తర్కము కన్న వైలక్షణ్యము సూచించుటకై కావ్యలింగ మనుట సముచితము. ఏదియేని హేతువుచే నొక యర్థప్రతీతి గలుగుట తర్కన్యాయము. సాధనత్వ మర్థసామర్థ్యలభ్య మేని కావ్యలింగ మగును. శబ్దప్రతిపన్నమైనచో ననుమాన మగును. వాక్యార్థగతముగా కావ్యలింగమును నిబంధించు నపుడు హేతువుగనే నిబంధింప వలెను. సముపనిబద్ధమునకు హేతుత్వ మిందు తగదు.

> యత్త్వన్నేత్ర సమానకాంతి సలిలే మగ్నం తదిందీవరం
> మేఘైరంతరితః ప్రియే తవ ముఖచ్ఛాయానుకారీ శశీ
> యేఽపి త్వద్గమనానుకారిగతయ స్తే రాజహంసా గతాః
> త్వత్సాదృశ్యవినోద మాత్రమపి మే దైవేన న క్షమ్యతే ౧౬

ప్రియురాలా ! నీ నేత్రసమానకాంతి గల పద్మము జలములో మునిగినది. నీ ముఖ మనుకరించి చంద్రుడు మేఘాంతరితు డైనాడు. నీ గమనము ననుసరించు రాజహంసలు పోయినవి. నీ సాదృశ్యవినోదము నైనను దైవము సహింప కున్నాడు. దీనిలో పై పాదత్రయ మందలి యర్థము నానావాక్యార్థరూపముగా నుండి చతుర్థపాదార్థమున హేతువుగా నున్నది.

> యద్విస్మయ స్తిమిత మస్తమితాన్యభావం
> ఆనందమంద మమృతప్లవనాదివాభూత్
> తత్సన్నిధౌ తదధునా హృదయం మదీయం
> అంగారచుంబితమివ వ్యథమాన మాస్తే ౧౭

ఆమె సన్నిధిలో నప్పుడు నా హృదయము విస్మయ స్తిమితమై యన్యభావము లస్తమింప నానందమందమయి యమృతమున నీది నట్లయ్యెను. ఇప్పు డగ్నిలో పడి యుడికి పోవుచున్నది. దానిలో నస్తమితాన్యభావ మనుచోట విస్మయస్తిమిత మను పదార్థము హేతువుగా నున్నది.

## ౪౬. అనుమానము

### ౫౮. సాధ్యసాధననిర్దేశోఽనుమానమ్

శబ్దగతముగ పక్షధర్మతాన్వయవ్యతిరేకములు కల సాధనము సాధ్యప్రతీతికై నిర్దిష్టమగునేని యనుమానాలంకార మగును. అర్థవశమున నిందు విచ్ఛిత్తివిశేషము నూహింప వచ్చును.

యత్రైతా లహరీచలాచలదృశో వ్యాపారయన్తి భ్రువం
యత్తత్రైవ పతన్తి సన్తతమమీ మర్మస్పృశో మార్గణాః
తచ్చక్రీకృతచాప మంచితశర ప్రేంఖత్కరః క్రోధనో
ధావత్యగ్రత ఏవ శాసనధరః సత్యం సదాఽసాం స్మరః ౮౮

ఈ చలనేత్రలు భ్రూవ్యాపార మొనరించినచోట మర్మభిదురము లైన మదనమార్గణములు ప్రసరించు చున్నవి. కావున చాపము చక్రీకరించుకొని శరములను కరమున బట్టి శాసనధారియై కోపనుడైన కాముడు వీరి ముందు సంచరించుచున్నాడు. అని భావింపవచ్చును. దీనిలో స్త్రీల భ్రూవ్యాపారమున బాణప్రసార మనునది సాధ్యమైన స్మరపురోగామిత్వములో సాధనమైనది. కవిప్రౌఢోక్తి నిష్పన్నమైనందున చమత్కారవిశేషమును కలదు.

## ౪౭. యథాసంఖ్యము

### ౫౯. ఉద్దిష్టానామర్థానాం క్రమేణానూద్దేశో యథాసంఖ్యమ్

ఊర్ధ్వము నిర్దిష్టములు నిర్దిష్టములు. అనంతరనిర్దేశములు నిర్దేశములు. ఉద్దేశార్థములకు క్రమమున ననునిర్దేశ మున్నచో యథాసంఖ్య మగును. ప్రథమపశ్చాన్నిర్దిష్టములు వేరువేరుగా నుండును. అదియే పశ్చాన్నిర్దిష్టమైనచో పౌనరుక్త్యము కల్గును. అనునిర్దేశ మనునది యొక్కొక పదార్థము నందొక్కొక సంసర్గము నిరూపించుట. ఇందు సంబంధము సామర్థ్యవశమున భాసించును. ప్రథమనిర్దిష్టార్థములకు పశ్చాన్నిర్దిష్టార్థములతో క్రమముగా సంబంధ ముండునేని యథాసంఖ్య మగునని వాక్యార్థము. కొందఱు దీనిని క్రమాలంకార మందురు.

కజ్జల హిమ కనక రుచః సువర్ణ వృష హంసవాహనాః శం వః
జలనిధి గిరి కమలస్థా హరి హర కమలాసనా దదతు ౮౯

కజ్జలకాంతి హిమకాంతి కనకకాంతి కలవారు, గరుడ వృష హంస వాహను లైనవారు సాగర గిరి వారిజ గతులు హరి హర బ్రహ్మలు సుఖ

మిత్తురు గావుత. దీనిలో కజ్జలాదులు సుపర్ణాదులతో సంబంధించి జలనిధ్యాదులు సాగరాదులతో సంబంధించి యుండుట గోచరించును. అసమస్తపదము లసమస్తపదములతో సంబంధించుట యర్థద్వారకముగా నున్నది. అందులో క్రమసంబంధము స్పష్టము. అట్టిది శాబ్ద యథాసంఖ్యము. దీనిలో సమాస మున్నది. సముదాయము సముదాయముతో సంబంధించుట శాబ్దముగనే యున్నను నర్థానుగుణ్య పర్యాలోచనమున నవయవగత మైన క్రమసంబంధము గోచరించుచున్నది. కావున నది యార్థ యథాసంఖ్యము. సముదాయ సంబంధము సముదాయిసంబంధము లేక కుదురదు. కజ్జలకాంత్యాది ధర్మములు హరిప్రభృతు లందరిలో సంభవింపవు. ఒక్కొక్క ధర్మమున కొక్కొక ధర్మితో సంబంధము చెప్పుటలో సంఖ్య నతిక్రమింపక చెప్పవలెను. అందుననే యిది యార్థము.

## ౪౨. పర్యాయోక్తము

### ౬౦. ఏక మనేకస్మి న్ననేక మేకస్మి న్వా క్రమేణ పర్యాయః

ఒకయాధేయ మనేకాధారమున నుండుట యొక పర్యాయము. కేవల ముండుట విశేషాలంకార మగును. క్రమముగా నుండుట పర్యాయాలంకార మగును. ఒక యాధారమున ననేకాధేయ ముండుట రెండవ పర్యాయము. ఇందును క్రమముగా నుండుట వివక్షితము. కాకున్న వక్ష్యమాణ సముచ్చయ మగును.

నన్వాశ్రయస్థితిరియం తవ కాలకూట !
కేనోత్తరోత్తర విశిష్ట పదోపదిష్టా
ప్రాగర్ణవస్య హృదయే వృషలక్ష్మణోఽథ
కంఠేఽధునా వససి వాచి పునః ఖలానామ్ ౯౦

కాలకూటమా ! ఉత్తరోత్తరము విశేషము గల నీకీ యాశ్రయస్థితి నెవ రుపదేశించిరి ? మొదట సముద్రహృదయమున పిమ్మట శివకంఠమున నిప్పుడు ఖలుల వచనమున నివసించుచున్నావు. ఇందు కాలకూట మొకటి యనేకాశ్రయమున క్రమముగా నున్నట్లు నిరూపితము. హృదయ కంఠ వాక్కు లందు కాలకూట కలనము ఖలస్వాభావమునై వారు నిలువెల్ల విష మనియు గోచరించును.

యత్రైవ ముగ్ధేతి కృశోదరీతి ప్రియేతి కాంతేతి మహోత్సవోఽభూత్
తత్రైవ దైవాద్వదనే మదీయే పత్నీతి భార్యేతి గిరశ్చరన్తి ౯౧

పూర్వము నా ముఖమున ముగ్ధ యని కృశోదరి యని ప్రియ యని కాంత యని మహోత్సవ ముండెను. దైవవశమున నా వదనమునందే యిప్పుడు పత్ని యని భార్య యని మాటలు పుట్టినవి. ఇందు వదన మొకటియే యాశ్రయము. అందు ముగ్ధత్వాది వర్గము సంహతరూపముగా ననేకము క్రమముతో నున్నట్లు నిరూపితమైనది. ఇందు వర్గ మనురాగ విరాగ ప్రయుక్త మని భాసించును.

౪౯. పరివృత్తి

౬౧. సమన్యూనాధికానాం సమాధిక
న్యూనై ర్వినిమయః పరివృత్తిః

సమన్యూనాధికములకు సమానన్యూనాధికములతో వినిమయ ముండుట పరివృత్తి అలంకార మగును. ఇందు వినిమయ మనునది యొకటి విడచి వేరొకటి స్వీకరించుట. సమ మిచ్చి సమము గ్రహించుట, అధికగుణ మిచ్చి హీన గుణము పరిగ్రహించుట. హీనగుణ మిచ్చి యధికగుణము స్వీకరించుట. ఇట్లది మూడు విధములు. ఇందును క్రమప్రతిభాస మున్నది.

దత్వా దర్శనమేతే మత్ప్రాణా వరతను! త్వయా క్రీతాః
కిన్త్వపహరసి మనో యద్దదాసి రణరణక మేత దసత్ ౯౨

ఓసి వరతనూ! నీవు దర్శన మిచ్చి నా యీ ప్రాణములను కొంటివి. కాని మన మపహరింతువు. రణరణక మిత్తువు. ఇది తగదు. దీనిలో పూర్వార్థము నందు సమపరివృత్తి యున్నది. దర్శనము ప్రాణములును కాములకు సమానములు. కావున నవి తుల్యగుణములు. ఒకటి యిచ్చి యనేకములు కొంట యను సంఖ్యావ్యత్యాస మున్నను పై భావము రమణీయము. ఉత్తరార్థమున న్యూనపరివృత్తి యున్నది. రణరణక మిచ్చి మనము తీసుకొనుట వలన నిది స్పష్టము.

౫౦. పరిసంఖ్య

౬౨. ఏకస్యానేకత్ర ప్రాప్తా ఏకత్ర నియమనం పరిసంఖ్యా

ఏకానేకప్రస్తావమున నిది యుక్తము. ఒకటియే వస్తువనేకము లందొకపరి సంభావితము కాగా దాని నొకచో నితరముల పరిహరించి నియ

మించుట పరిసంఖ్య యగును. ఇతరముల వర్జించి యొకచో నొకదాని వర్జనీయముగ గణించుట పరిసంఖ్య యని భావము.

భక్తిర్భవే న విభవే వ్యసనం శాస్త్రే న యువతికామాస్త్రే
చిన్తా యశసి న వపుషి ప్రాయః పరిదృశ్యతే న మహతామ్ ౯౩

మహాత్ములకు భవునందే భక్తి యుండును. విభవము నం దుండదు. శాస్త్రమునందె వ్యసన ముండును. కామినీకామాస్త్రము నం దుండదు. యశమునందె చింత యుండును. శరీరము నం దుండదు. సామాన్యముగ నిట్లె గోచరించును. దీనిలో భక్తి భవవిభవములందు సంప్రాప్తము కాగా విభవమున నిషేధించి భవునందే నియమించుట కలదు.

కౌటిల్యం కచనిచయే కరచరణాధర దళేషు రాగస్తే
కాఠిన్యం కుచయుగలే తరళత్వం నయనయో ర్వసతి ౯౪

కచములందు కుటిలత కరచరణాధరములందు రాగము కుచమున కఠినత, నయనములందు తరళత నీకు కలదు. కౌటిల్యాదులు కచాదులందే నియతములై దీనిలో గోచరించును. వర్జనీయ మిం దభ్యూహ్యాము. మీమాంసకు లంగీకరించు పరిసంఖ్య కన్న నిది విలక్షణము.

## ౫౧. అర్థాపత్తి

### ౯౩. దండాపూపికయాఽర్థాంతరాపతన మర్థాపత్తిః

"దండాపూపయోర్భావో దండాపూపికా" "దండాపూపే విద్యేతే యస్యాం సా దండాపూపికా నీతిః", "దండాపూపావివ దండాపూపికా!" ఇట్లు మూడు విధముల దండాపూపికార్థ మున్నది. మూషికము కఱ్ఱ కొఱికినది. కట్టనున్న యపూపమును గూడ భక్షించిన దని సిద్ధ మగును. ఈ న్యాయమే దండాపూపికాశబ్దార్థము. దండభక్షణమున నపూపభక్షణ మర్థలభ్య మగును. అట్లే యొక యర్థసామర్థ్యమున నర్థాంతర సిద్ధి యున్నచో నర్థాపత్తి యగును. అర్థాపత్తి యనునది వాక్యవిదులైన మీమాంసకుల నియమము. దండాపూపికా న్యాయమున అర్థాంతర సిద్ధి యర్థాపత్తి యగునని సూత్రార్థము.

అలంకార శ్శంకాకర నరకపాలం పరిజనో
విశీర్ణాంగో భృంగీ వసు చ వృష ఏకో బహువయాః
అవస్థేయం స్థాణోరపి భవతి సర్వామరగురోః
విధౌ వక్రే మూర్ధ్ని స్థితవతి వయం కే పునరమీ! ౯౫

సర్వదేవగురువైన శ్రీశివునకు నెట్టి యవస్థ పట్టినది! శంక నొదవించు నరకపాల మలంకారము. అంగములు జారిన భృంగి పరిజనము. ముసలి యెద్దొకటి ధనము. స్థాణు వవస్థయు నిట్లున్నది. తలపై వక్రకల యుండగా నేమి కాదు? ఇక మేమేమి లెక్క? అంతటి శివుడే యట్లు కాగా నిక మా సంగతి సిద్ధప్రాయమే, అని యర్థలభ్య మగును. దీనిలో "విధౌ వక్రే" యనునది శ్లిష్టముగా నున్నది. వక్రత కల విధివ్రాత యని వక్రచంద్రు డని రెండర్థములు దీన లభించును. వక్రశబ్దమును ప్రాతికూల్య మనార్జవ మను నర్థ ద్వయమును చెప్పును. శివవృత్తాంత మప్రాకరణికము. ప్రాకరణికార్థము దాన గోచరించును.

## ౫౨. వికల్పము

### ౬౪. తుల్యబల విరోధో వికల్పః

సమానప్రమాణానుశిష్టము లైన సమానబలము కల రెండువిరుద్ధములు సమసమయమున సంప్రాప్తము లగునపుడు యౌగపద్యము సంభవింపదు. అట్టి యపుడు వికల్పాలంకార మగును. ఔపమ్యగర్భ మగుటచే నిందు చారుత్వ మున్నది.

> భక్తిప్రహ్వా విలోకన ప్రణయినీ నీలోత్పలస్పర్ధినీ
> ధ్యానాలంబనతాం సమాధినిరతై ర్నీతే హితప్రాప్తయే
> లావణ్యస్య మహానిధీ రసికతాం లక్ష్మీదృశో స్తన్వతీ
> యుష్మాకం కురుతాం భవార్తిశమనం నేత్రే తనుర్వా హరేః ౯౬

ఇందు శ్లేషావష్టంభమున వికల్పాలంకార మున్నది. ఇందు హరినేత్ర పరముగా నొక యర్థము కలదు. అది యిట్లుండును. శ్రీవిష్ణు నేత్రములు భక్తిచే నమ్రములగు వారిని చూడ నాసక్తి కలవి. నీలోత్పల సమానములు. సమాధినిరతు లగువారు హితప్రాప్తికై వానిని ధ్యానాలంబనము చేసికొందురు. అవి లావణ్యమహానిధులు. లక్ష్మీదేవీ నేత్రముల కవి రసికత్వము గూర్చును. అట్టి యా నేత్రములు మీ సంసారక్లేశమును పోగొట్టు గావుత!

హరి శరీరపరముగా రెండవ యర్థ మున్నది. అది యిట్లుండును. శ్రీ విష్ణువు శ్రీ శరీరము భక్తుల దృష్టి కామోద మిచ్చును. నల్లగలువల యాకారము కలది. సమాధిరతు లగువారు ఈహిత సంప్రాప్తికై ధ్యానాలంబనము

చేయుదురు. ఆ దేహము లావణ్యమునకు మహానిధి. శ్రీదేవీదృక్కులకు రాగ మాపాదించును. అట్టి యా తనువు భవబాధలను శమింప జేయుగావుత! నేత్ర తను పక్షము లైన రెండర్థము లుత్తమము లై నందున తుల్యప్రమాణము కలవి "నేత్రే తనుర్వా హరేః" అనుచోట 'వా' శబ్దము సముచ్చయార్థక మనరాదు. మహాకవి వ్యవహారము నం దట్లు ప్రయోగ ముండదు. ఇందు వికల్ప మిట్లు సంగతము కాగలదు. తను మధ్యము నందు నేత్రములు గూడ చేరి యున్నందున వానిని వేరుగా చెప్పనే రాదు. చెప్పినచో స్పర్థ యొకటి స్పష్ట మగును. స్పర్థయుంటచే విరోధ మూహింప వచ్చును. నేత్రములు కాని సర్వశరీరము కాని అనెడు వికల్ప మిందు సుప్రత్యయమే యగును. దీనిలో వికల్పము లింగ వచన శ్లేష యున్నందున శ్లేషాశ్లిష్ట మని భావింపవలెను, ఈ వికల్పాలంకారము సముచ్చయమునకు ప్రతిపక్షము. పూర్వులు వివేక మొనరింప లేదు.

## ౫౩. సముచ్చయము

### ౬౫. గుణక్రియాయౌగపద్యం సముచ్చయః

వైమల్యాదిగుణములకు క్రియలకు నొకే సమయమున స్థితి వర్ణించుట సముచ్చయాలంకార మగును. సముచ్చయము వికల్పప్రతిపక్షము.

బిభ్రాణా హృదయే త్వయా వినిహితం ప్రేమాభిధానం నవం
శల్యం యద్విదధాతి సా విధురితా సాధో! తదాకర్ణ్యతాం
శేతే శుష్యతి తామ్యతి ప్రలపతి ప్రమ్లాయతి ప్రేంఖతి
భ్రామ్యత్యుల్లుఠతి ప్రణశ్యతి దలత్యున్మూర్ఛతి త్రస్యతి ౯౭

ఓయీ! మంచిపిల్లవాడా! నీవు నిక్షేపించిన ప్రేమ యనెడి నవశల్యమును హృదయమున ధరించి యా వివశురాలు యేమి యొనర్చుచున్నదో చెప్పెదను వినుము. శయనించుచున్నది, ఎండిపోవుచున్నది, వ్యథపడుచున్నది, ఏమియో పలుకుచున్నది. బాగుగ నిట్ట చూచు చున్నది, భ్రాంతిపడినది, పొర్లాడినది, దిగజారినది, మనసు బద్ధలైనది, మూర్ఛపడినది, బెదరినది. ఇ ట్లేకాధికరణముగా నిన్ని క్రియలు నిరూపించుట సముచ్చయ మైనది. ఇది క్రియాసముచ్చయము. ఇట్లే గుణసముచ్చయము గుణక్రియాసముచ్చయము నూహించునది. ఇదిగాక రెండవ సముచ్చయ మొకటి కలదు.

## ౬౬. ఏకస్య సిద్ధిహేతుత్వేఽన్యస్య తత్కరత్వం చ

ఒక కారణ మొక కార్యసిద్ధిహేతువై ప్రక్రాంతము కాగా వేరొక కారణము స్పర్థతో దాని నొనరించిన రెండవ సముచ్చయ మగును. దీనిలో రెండవకారణము కాకతాలీయమున రాదు. ఖలేకపోతికగా వచ్చును.

శశీ దివసధూసరో గలితయౌవనా కామినీ
సరో విగతవారిజం ముఖమనక్షరం స్వాకృతేః
ప్రభుర్ధనపరాయణః సతతదుర్గతిస్సజ్జనః
నృపాంగణగతః ఖలో మనసి సప్తశల్యాని మే ౯౨

ధూసరితు డైన పగటి చంద్రుడు, యౌవనము జారిన యాడుది, పద్మములేని సరము, అక్షరము లేని అందగాని ముఖము, ధనాసక్తుడైన ప్రభువు, దుర్గతిపడు సజ్జనుడు, రాజాంగణము జేరిన మూర్ఖుడు నీ యేడును నా మనసునకు శల్యములు. దీనిలో శశి స్వాభావశోభను డైనను దివసధూసరు డై నందున నశోభను డై నాడు. సముచ్చయము సద్యోగమున నసద్యోగమున సదసద్యోగమునను గలుగును. దీనిలో శోభనాశోభనము లైన సదసత్తుల యోగమున సముచ్చయ మున్నది. కామిని శోభన. యౌవనములేమి యశోభనత. అట్లే ఇతరమును. రాజప్రాంగణముననున్న ఖలు డనుచోట నిట్టివా డశోభనుడు. ఇతరులు శోభనులు అను నర్థము రా బట్టకూడదు. ఇచట ఖలార్థకథనము ప్రక్రమ భేదమున దుష్ట మనియే కొందరు భావించిరి. ఇది సౌందర్యనిమిత్తము కాదనిరి. ఖలుడు నృపాంగణగతు డౌట శోభనత్వము. ఖలుడగుటచే నశోభనత్వము నని సమర్థింప వచ్చును. విశేష్యము శోభన మగుటయు, విశేషణ మశోభన మగుటయు మొదటి వానిలో నున్నది. ఇందు విశేష్యమే అశోభన మగుట నిరవద్యముగ లేదు. కాని యొకటి కలదు. శోభన మగునది యశోభనమైనదే! యనెడి వివక్షయే యిందు ముఖ్యము. కావుననే యిన్నిటిని కలయ కలిపి కవి మనశ్శల్యము లనినాడు. ఎంతటి సుందరమైన నది యనంతః ప్రవిష్టమై వ్యథ పెట్టును. ఇట్టి పరిశీలనమున నిందలి సముచ్చయ సమన్వయ మెఱుంగునది.

### ౫౪. సమాధి

### ౬౭. కారణాన్తరయోగాత్కార్యసుకరత్వం సమాధిః

కారణాంతరసంబంధమున కార్యసౌకర్య ముండుట సమాధి. ఒక డారంభించిన కార్యము కారణాంతర సంబంధమున సుకర మైనచో సమ్యగాధాన ముండుటచే నిది సమాధి యైనది.

మానమస్యా నిరాకర్తుం పాదయోర్మే పతిష్యతః
ఉపకారాయ దిష్ట్యేద ముదీర్ణం ఘనగర్జితమ్ ౯౯

ఆమె కోపము పోగొట్టవలె నని పాదములపై నేను పడబోగా నా యుపకారమునకై యదృష్టవశమున మేఘగర్జన మతిశయించినది. కోపము పోగొట్టుట కార్యము. పాదపతన మందు కారణము. తత్సౌకర్యమునకై కారణాంతరముగా ఘనగర్జితము వచ్చిపడినది. ఉపకారపదమున నా సౌకర్యము సూచితము.

### ౫౫. ప్రత్యనీకము

### ౬౮. ప్రతిపక్షప్రతీకారాఽశక్తౌ తదీయతిరస్కారః ప్రత్యనీకం

ఇది మొదలు కొన్ని యలంకారములు లోకన్యాయ మాశ్రయించి యున్నవి. బలము గల ప్రతిపక్షమున దుర్బలుడు ప్రతీకార మొనరింప శక్యము కాదు. కావున ప్రతిపక్షసంబంధి దుర్బలుని బాధించి తిరస్కార మొనరించుట ప్రత్యనీకాలంకార మగును. అనీక మనునది సైన్యము. సైన్య ప్రతినిధి ప్రత్యనీక మనతగును. తత్సమాన మగుటచే నిదియు ప్రత్యనీక మగును. సేన నెదుర్కొన వలసి యున్నపుడు సామర్థ్యము లేక తత్ప్రతినిధిని వ్యామోహమున నెదుర్కొనినట్లు ప్రతిపక్షము జయింపవలసి యుండ దుర్బల తదీయ తిరస్కరణము ప్రత్యనీకాలంకార మగుచున్నది. ప్రతిపక్షగత మైన బలాతిశయము చెప్పుట యిందలి ప్రయోజనము.

యస్య కించిదపకర్తుమక్షమః కాయనిగ్రహగృహీత విగ్రహః
కాంతవక్త్రసదృశాకృతిం కృతీ రాహురిందుమధునాపి బాధతే ౧౦౦

రాహువు శ్రీకృష్ణు నపకరింప సమర్థుడు కా లేక కాయనిగ్రహమున విగ్రహము (వైరము) పూని యాతని ముఖసమానాకృతి కల చంద్రు నిప్ప

టికి బాధించుచున్నాడు. దీనిలో రాహువు కన్న కృష్ణుడు బలవత్ప్రతిపక్షము. దుర్బలచంద్రుడు తదీయుడు. రాహువు చంద్రునందే పరాక్రమించుటచే కృష్ణాతిశయము గోచరించును.

౫౬. ప్రతీపము

౬౯. ఉపమానస్యాక్షేపః ఉపమేయతా కల్పనం వా ప్రతీపం

ఉపమేయమే ఉపమాన భారము వహించుటలో సమర్థ మైనందున నుపమాన మేల యని యనుట యొక ప్రతీపాలంకార మగును. ఉపమానమునకు ప్రతికూల మగుటచే నుపమేయమునకు ప్రతీప మని వ్యపదేశము కలిగినది. ఉపమానముగా ప్రసిద్ధ మగు దానికి నుపమానాంతర ప్రతిపాదనమున ననాదరము చెప్పుటకై యుపమేయత్వము కల్పించిన రెండవ ప్రతీప మగును.

అయి ! ఏహి ! తావత్ సుందరి ! కర్ణం దత్వా శృణు
వచనీయం తవ ముఖేన కృశోదరి! చంద్ర ఉపమీయతే జనేన ౧౦౧

ఓసీ పిల్లదానా ! సుందరీ ! ఇటు రమ్ము. చెవి పట్టి యీ వచనీయము వినుము. ఓ కృశోదరీ ! నీ ముఖముతో జనుడు చంద్రు నుపమించు చున్నాడు. దీనిలో నుపమానముగా ప్రసిద్ధుడైన చంద్రునకు నికర్షకై యుపమేయత్వము కల్పిత మైనది. వదనమున నుపమానత్వ వివక్ష యిందు మూలము.

అహమేవ గురుస్సుదారుణానామితి హాలాహల! మాస్మ తాత! దృప్యః
ననుసంతి భవాదృశాని భూయో భువనేఽస్మిన్వచనాని దుర్జనానామ్ ౧౦౨

ఓరీ ! హాలాహలా ! నాయనా ! దారుణములలో నేనే గొప్ప యని గర్వింపకురా ! యీ భూమిలో నీ వంటివి దుర్జనుల వచనము లున్నవి గదోయీ ! దీనిలో హాలాహలము ప్రకృష్టదోషము కలదై యున్నందున సాటిలేనిది. ఐన నుపమానముగా నిరూపిత మైనది.

౫౭. మీలితము

౭౦. వస్తునా వస్త్వంతరనిగూహనం మీలితం

అపాంగతరళే దృశౌ మధురవక్రవర్ణా గిరో
విలాసభరమంథరా గతి రతీవ కాన్తం ముఖం
ఇతి స్ఫురితమంగకే మృగదృశాం స్వతో లీలయా
తదత్ర న మదోదయః కృతపదోఽపి సంలక్ష్యతే ౧౦౩

దృక్కులు చంచలములు. మాటలు వక్రములు. గమనము మంథరము. ముఖ ముజ్జ్వలము. స్త్రీల శరీరమున సహజముగా నిట్టి స్ఫురణ మున్నది. మద్యమద మడుగు పెట్టినను గోచర మగుట లేదు. దీనిలో నుత్కృష్ట గుణముచే నికృష్టగుణ తిరోధాన మున్నది. దృక్తరళత్వాది స్వాభావిక విశేషముచే మదోదయ కృతము లైన తారళ్యాదులు తిరోహితము లైనవి.

౫౮. సామాన్యము

౭౧. ప్రస్తుతస్యాన్యేన గుణసామ్యాదైకాత్మ్యం సామాన్యం

గుణసమానత్వమున ప్రకృతమున కితరముతో నేకాత్మత యుండుట సామాన్యాలంకార మగును. ప్రస్తుత వస్తువున కప్రస్తుతసాధారణ గుణయోగ మున్నందున నభేదాధ్యవసాయమున నేకరూపత్వము నిబద్ధమైనచో సమానత్వ సంబంధమున నిది సామాన్యాలంకార మైనది.

మలయజ రజోవిలిప్త తనవో నవహారలతా విభూషితాః
సితతర దంతపత్రకృత వక్త్రరుచో రుచిరామలాంశుకాః
శశిభృతి వితతధామ్ని ధవలయతి ధరామవిభావ్యతాం గతాః
ప్రియవసతిం ప్రయాంతి సుఖమేవ విముక్తభియోఽభిసారికాః ౧౦౪

అభిసారికలు భయము లేక ప్రియుల వసతుల కేగుచున్నారు. వారి వేషము లిట్లున్నవి. మంచిచందనముచే శరీరము పూతలు పూసికొన్నారు. నవ హారము లలంకరించు కొనినారు. తెల్లని దువ్వెనలు పట్టినారు. ముఖశోభ దిద్దుకొనినారు. విమలరమ్యవస్త్రముల ధరించినారు. చంద్రుడు భూమిని తెల్ల చేయుచుండ వారు గోచర లగుట లేదు. దీనిలో మలయజరస విలేపనాదులు చంద్రప్రభతో కలసిపోయి గోచరము లగుట లేదు.

౫౯. తద్గుణము

౭౨. స్వగుణత్యాగా దత్యుత్కృష్ట గుణస్వీకారః తద్గుణః

పరిమితగుణక మైన వస్తువు సమీపమునందున్న ప్రకృష్టగుణవస్తు గుణమును స్వీకరించుట తద్గుణము. దాని గుణములు దీని యందుండుటచే నిది తద్గుణ మైనది.

విభిన్నవర్ణా గరుడాగ్రజేన సూర్యస్య రథ్యాః పరితః స్ఫురంత్యా
రత్నైః పునర్యత్ర రుచా రుచం స్వా మానిన్యిరే వంశకరీరనీలైః ౧౦౫

సూర్యాశ్వములు ప్రదేశ మంతట ప్రసరించిన యరుణవర్ణములై విభిన్నవర్ణములై యా పట్టణములోని గారుడమణుల కాంతిచే స్వకీయ కాంతిని మరల బొందినవి. దీనిలో సూర్యాశ్వము లరుణవర్ణమును అది గారుత్మత మణి ప్రభలను స్వీకరించుట యున్నందున తద్గుణము.

## ౬౦. అ త ద్గు ణ ము

### ౮౩. సతి హేతౌ తద్రూపానుహారోఽతద్గుణః

అతద్గుణము తద్గుణ విపర్యయము. న్యూనగుణ మగునది యుత్కృష్ట గుణక పదార్థధర్మమును స్వీకరించుట న్యాయ్యము. ఉత్కృష్టగుణ సన్నిధాన మన్న హేతు వున్నను, నుత్కృష్టగుణమును న్యూనగుణ మనువర్తింపక పోవుట యతద్గుణాలంకారము. ఆ యుత్కృష్టగుణ గుణములు దీనియందు లేవు. అందుచే నతద్గుణము.

ధవళోఽసి యద్యపి సుందర ! తథాపి త్వయా మమ రంజితం హృదయం
రాగభరితేఽపి హృదయే సుభగ ! నిహితోఽపి న రక్తోఽసి ౧౦౬

సుందరా ! నీవు స్వచ్ఛమైన వాడవు. అయినను నీవు నా హృదయము రంజితము చేసితివి. ఓయీ ! సుభగా ! రాగభరిత మైన నా హృదయమున నిన్నుంచితిని. అయినను నీవు రక్తుడవు కా లేదోయి. దీనిలో రక్తహృదయ సంపర్కమున ధవళనాయకునకు రక్తత్వము సంపన్నము కా లేదు. అందుచే నతద్గుణము.

## ౬౧. ఉ త్త ర ము

### ౮౪. ఉత్తరా త్ప్రశ్నోన్నయన మసకృ దసంభావ్య ముత్తరం చోత్తరం

వాక్యములో కూర్చిన యుత్తరము వలన కూర్పు పొందని ప్రశ్న సమున్నీతమైనచో నుత్తరాలంకార మగును. ప్రశ్న పూర్వకముగా నసంభావనీయ మగు నుత్తర మనేక పర్యాయము లున్న నుత్తరాలంకార మగును. ఇట్టి యుత్తర మొక్క పర్యాయమున్న చారుత్వము కలుగదు.

ఏకాకినీ య దబలా తరుణీ తథాఽహం
అస్మిన్ గృహే గృహపతి శ్చ గతో విదేశం
కం యాచసే ? తదిహ వాసమియం వరాకీ
శ్వశ్రూ ర్మమాఽంధ బధిరా నను మూఢ ! పాంధ! ౧౦౭

నే నొక్కతెను. అబలను. ఈగృహమున తరుణిని. గృహపతియు విదేశము పోయినాడు. ఓయి మూఢ పాంథ! నీ వెవని నివాస మడుగుదువయ్యా! మా యత్త యంధ బధిర పాపము! దీనిలో నా కిచట నివాస మీయవలసినది యిచ్చెదరా? యన్న ప్రశ్నము నీ యుత్తరమున నూహింప వలెను.

కా విషమా దైవగతిః కిం లబ్ధవ్యం జనో గుణగ్రాహీ
కిం సౌఖ్యం సుకలత్రం కిం దుఃఖం యత్ఖలు లోభః ౧౦౭

విషమ మేది? దైవగతి. పొందదగిన దేది? గుణము గ్రహించు జనుడు. సౌఖ్య మేది? సుకలత్రము. దుఃఖ మేమి? లోభము. ఇందు దైవ గత్యాదులు నిగూఢము లైనందున నసంభావ్యోత్తరములు. నానా ప్రశ్న పూర్వక మైన యుత్తర మిందున్నది.

## ౬౨. సూక్ష్మము

## ౮౫. సంలక్షిత సూక్ష్మార్థ ప్రకాశనం సూక్ష్మమ్

స్థూల మతులు గుర్తింప లేని సూక్ష్మార్థమును ప్రకాశింప జేయుట సూక్ష్మాలంకారము. ఇట్టి సూక్ష్మార్థమును కుశాగ్రీయ బుద్ధులగువా రింగితాకారములతో తెలుసు కొందురు. అట్లు సంలక్షిత మైన సూక్ష్మార్థములు విదగ్ధులకై ప్రకాశింప జేయుదురు.

వక్త్ర స్యంది స్వేద బిందు ప్రబంధైః
దృష్ట్వా భిన్నం కుంకుమం క్వాపి కంఠే
పుంస్త్వం తన్వ్యా వ్యంజయంతీ వయస్యా
స్మిత్వా పాణౌ ఖడ్గ లేఖాం లిలేఖ ౧౦౮

ఒక పడుచు ముఖమున స్వేదకణములచే కంఠము నందలి కుంకుమ చెదరి పోయినది. ఒక వయస్య యిది చూచి యా వనిత పుంస్త్వము స్పష్టము చేయునదై నవ్వు నవ్వి చేతిలో ఖడ్గలేఖ విలేఖించెను. దీనిలో స్వేద కృత మైన కుంకుమ భేదాకృతి పురుషాయితమును సులక్షము చేయగా దానిని హస్తమున పురుషోచిత ఖడ్గ లేఖనముచే స్పష్టము చేసినది. సూక్ష్మాదులు కొన్ని యలంకారములు గూఢార్థ ప్రతీతి పరములు.

### ౬౩. వ్యా జో క్తి

### ౭౬. ఉద్భిన్న వస్తు నిగూహనం వ్యాజోక్తిః

నిగూఢముగా నున్న వస్తు వేదేని నిమిత్తమున ప్రకటము కాగా వస్త్వాంతర నిరూపణమున నపలపించి నిగూహన మొనర్చినచో వ్యాజో క్తి యగును. వస్త్వాంతర ప్రక్షేపమను వ్యాజ వచన మున్నది కావున నిది వ్యాజో క్తి.

శైలేంద్ర ప్రతిపాద్యమాన గిరిజా హస్తోపగూహోల్లస
ద్రోమాంచాది విసంస్థులోఽఖిల విధి వ్యాసంగతో వ్యాకులః
హా! శైత్యం తుహినాచలస్య కరయో రిత్యూచివాన్ సస్మితమ్
శైలాంతఃపుర మాతృమండల గణై ర్దృష్టోఽవతా ద్వశ్శివః ౧౧౦

హిమవాను దండించు పార్వతీ కర గ్రహణముచే రోమాంచాదులు కల్గగా విసంస్థులుడై శివుడు సర్వ విధులలో వ్యాకులుడైనాడు. హిమవానుని చేతు లెంత చల్లన యని యాతడు పలుక శైలాంతః పురమున నున్న మాతృకలు చిరునవ్వుతో చూచిరి. అట్టి శివుడు రక్షించు గావుత — దీనిలో శివునకు రోమాంచాదులచే రతి భావ ముద్భిన్న మైనది. దానిని శైత్యముని యపలపించి నాడు. ఉద్భిన్న రతిభావము నిట్లు నిగూహించుటచే వ్యాజో క్తి యైనది.

### ౬౪. వ క్రో క్తి

### ౭౭. అన్యథోక్తస్య వాక్యస్యకాకు శ్లేషాభ్యా మన్యథా యోజనం వక్రోక్తిః

వ్యాజో క్తిలో నుక్తి యున్నది. ఉక్తి వ్యపదేశ సామ్యమున నిచట వక్రో క్తి కథన ముచితము. ఒక వాక్యము నొక డేక భావమున పలుకగా వేరొకడు కాకువుచే శ్లేషచే వేరు విధమున నర్థము చేసుకొని యోజన మొనర్చినచో వక్రో క్తి యగును.

త్వం హాలాహల భృత్కరోషి మనసో మూర్ఛాం మమాలింగితో
హాలాం నైవ బిభర్మి నైవ చ హలం ముగ్ధే కథం హాలికః
సత్యం హాలికతైవ తే సముచితా సక్తస్య గో వాహనే
వక్రోక్త్యేతి జితో హిమాద్రి సుతయా స్మేరో హరః పాతువః ౧౧౧

నీవు హాలాహలము పట్టితివి. నీ యాశ్లేషమున నా మనసు నకు మూర్ఛ కలుగ జేయు న్నావు. ఓసీ ముద్దరాలా! హాల భరింపను. హలము ధరింపను.

నే నెట్లు హాలికుడను? నీవు హాలికుడవె. గో వాహనమున కూడిన వాని కిదియె తగును. ఇట్లు హిమాద్రిసుత వక్రోక్తిచే శివుని జయించినది. అపుడు చిరునగవు కల శివుడు మిమ్ము రక్షించు గావుత. దానిలో నఖండమైన హాలాహల శబ్దమును దేవి కాల కూటార్థమున నుపయోగించినది. దేవుడు విడదీసి హాలా హాలములం ద్వంద్వ పరముగా యోజనము చేసినాడు. వక్రోక్తి శబ్దమలంకార సామాన్య వచనము. అయినను నలంకార విశేషమునకు సంజ్ఞగా నిట ప్రయుక్త మైనది.

### ౬౫. స్వ భా వో క్తి

**౭౮. సూక్ష్మ వస్తు స్వభావస్య యథా వ ద్వర్ణనం స్వభావోక్తిః**

వస్తు స్వభావ వర్ణనము మాత్ర మలంకారము కాదు. అట్లే యైన కావ్యము సర్వ మలంకారి యగును. వస్తు స్వభావ వర్ణనము లేని కావ్యమే యుండదు. కావుననే సూక్ష్మ వస్తు స్వభావమును యథా విధమున వర్ణించుట స్వభావోక్తి యగును. సూక్ష్మ వస్తువు కవయిత్రు మాత్ర గమ్యము. కావుననే తన్నిర్మిత వస్తు స్వభావ మన్యూనాన తిరిక్తముగా నుండి స్వభావోక్త్యలంకార మగును. ఇందలి గూఢోక్తి మయ స్వభావమును కవయితలే గుర్తింతురు గాని పద పదార్థ వ్యుత్పత్తి మాత్రము కలవారు గుర్తింప జాలరు.

క్రేంకారో (హుంకారో) నఖకోటి చంచుపుటక వ్యాఘట్టనోట్టంకితః
తన్వ్యాః కుంతల కౌతుక వ్యతికరే సీత్కార సీమంతితః
పృష్ఠ శ్లిష్యదవామన స్తన భరోత్సే ధాంక పాలీ సుధా
సేకా కేకర లోచనస్య కృతినః కర్ణావతంసీ భవేత్ ౧౧౨

ఒకానొక కృతి యగు వానికే సీత్కార శోభ గలిగిన తన్వి క్రేంకారము కర్ణావతంసము కా గలదు. నఖాంచలముల సంబంధమున నుదయించి కుంతల బంధన సమయము నందలి సీత్కార శోభ కల్గిన యది, వెనుకగా వచ్చి గాఢాలింగన మొనర్పగా నాకేకర లోచనుడైన వానికే కర్ణముల కానంద మిచ్చును. దీనిలో ప్రియుని నఖాలిఖనమున కలిగిన హుంకారము కేశాకర్షణములలో సీత్కారము కూడి యున్నదని పరావర్త నాలింగనమున గ్రీవాభంగ మొనర్చి యాసక్తుడై దృష్టివలన మొనరించి కృతియగు రసికు డాస్వాదించు నని భాసించును. సర్వ మిది సూక్ష్మ గూఢ వస్తు స్వభావ మగుట స్వభావోక్తి కా గలదు.

## ౬౬. భా వి క ము

### ౭౯. అతీతా నాగతయోః ప్రత్యక్షాయమాణత్వం భావికం

అతీతా నాగతములను ప్రత్యక్షము లగునట్లు నిరూపించుట భావికాలంకారము. అతీతము భూతార్థము. అనాగతము భావ్యర్థము. భూత భావ్యర్థము లలౌకికములు. అందుచే నత్యద్భుతములై ప్రత్యక్షాయ మాణములగుట భావిక మగును. కవి గత భావము శ్రోతలో ప్రతిబింబముగా నుండును గాన నిది భావిక మైనది. శబ్దములు ప్రసన్నము లగుటను, అర్థము లత్యద్భుతము లగుటను మరల మరల మనసులో వినివేశనము పొందును గాన నిది భావిక మగును. భూత భావ్యర్థముల భావన వస్తుగతా త్యద్భుతత్వము వలన కలుగును. అత్యద్భుత వస్తువులం దాదర ముండును గావున నవి హృదయ రూఢము లగును. దీనిలో భూత భావ్యర్థములు తాటస్థ్యమున గోచరించును. లోకోత్తర వస్తువు లిందు స్ఫుటముగా గోచరించును.

ముని ర్జయతి యోగీంద్రో మహాత్మా కుంభ సంభవః
యేనైక చులకే దృష్టౌ దివ్యౌ తౌ మత్స్య కచ్ఛపౌ ౧౧౩

దీనిలో వర్ణనీయము వర్ణనావశమున ప్రత్యక్ష కల్ప మైనది. సముద్ర పాన సమయమున హస్త భాగమునందు దివ్య మత్స్య కచ్ఛపములను ధరించిన యగస్త్యమహర్షి లోకోత్తరుడై యద్భుతావహుడై యనాకుల శబ్దములచే నిందు ప్రతిపాదితుడైనాడు. కుంభ సంభవ మహా యోగీంద్రుని హస్తాంశములో దివ్య మత్స్య కచ్ఛపములు గోచరించినవి. ఆ మహనీయ మహర్షి జయతి.

## ౬౭. ఉ దా త్త ము

### ౮౦. సమృద్ధిమ ద్వస్తు వర్ణన ముదాత్తం

ఈ యుదాత్తాలంకారము స్వభావోక్తి భావికములకు ప్రతిపక్ష రూపము. సమృద్ధి గల వస్తు వర్ణన ముండుట యుదాత్తము.

ముక్తాః కేలి విసూత్ర హార గలితాః సమ్మార్జనీభి ర్హృతాః
ప్రాతః ప్రాంగణ సీమ్ని మంథరచల ద్బాలాంఘ్రి లాక్షారుణాః
ఆరా ద్దాడిమ బీజ శంకిత ధియః కర్షంతి కేలీశుకాః
య ద్విద్వద్భ వనేషు భోజ నృపతే స్తత్త్యాగ లీలాయితం ౧౧౪

విద్వాంసుల భవనము లందు మంచి ముత్తెములు క్రీడా సమయమున దారము జారి హారమునుండి రాలినవి. వానిని చీపురుతో త్రోసి వేసిరి. గృహ ప్రాంగణ భాగములలో నవి చేరినవి. నెమ్మదిగా నచట సంచరించు బాలికా పాద లాక్షలచే నెఱ్ఱ నైనవి. అట్టి వానిని దూరము నుండి చూచి కేలీ శుకము దాడిమి బీజములేమో యని తలచి ముక్కుతో పట్టినది. ఇది యంతయు నిట్లుండుట భోజరాజు త్యాగలీల. ఉదాత్త శబ్దమున కౌదార్య మైశ్వర్య మని యర్థము. ఇం దైశ్వర్యము ముఖ్యము. ఐశ్వర్య మిందు స్వతస్సంభూతము కాదు. ఇది కవి ప్రతిభా జన్యము. ఇందలి విద్వ ద్భవన విభూతి యసంభావ్య మాన మగుట స్పష్టము.

## ౭౧. అంగభూత మహా పురుష చరిత వర్ణనం చ

ఉదార చరితుల చరిత నిబంధము నుదాత్తాలంకార మగును. మహా పురుష చరిత ముదారరూపము. ఔదార్య రూపమైన యుదాత్త మిందున్నది. ప్రధానముగా నున్న వస్త్వంతరమున కంగముగా మహా పురుష చరితము వర్ణించుట దీని రూపము.

## ౭౨. రస భావ త దాభాస తత్ప్రశమానాం నిబంధే రసవ త్ప్రేయ ఊర్జస్వి సమాహితాని

ఉదాత్తాలంకారము నందు మహా పురుష చరితము చిత్తవృత్తి రూపముగా నున్నది. రసాదులు చిత్తవృత్తి విశేష స్వభావములు కావుననే యిచట రసవ దలంకారముల ప్రస్తావము సముచిత మైనది. ఈ సూత్రము నందు నాల్గలంకారములు లక్షితము లైనవి. ఇందీ వివేక మపేక్షితము-విభావా నుభావ వ్యభిచారులచే ప్రకాశితమైన రత్యాది చిత్త వృత్తి విశేషము రస మగును. విభావా నుభావములచే సూచితమైన నిర్వేదాదికమునకు భావ మని సంజ్ఞ దేవతాది విషయకమైన రతియు భావమె. రసాభాసము భావాభాసమును నిం దుపలక్షింప దగినవి. రత్యాదు లవిషయ ప్రవృత్తము లైనచో ననుచితము లై యాభాస రూపము లగును. రసము పర విశ్రాంతి రూప మగుట ప్రశామ్య దవస్థ యుండదు. భావములకే ప్రశామ్య దవస్థ యుండును. ఇట్లు రస భావాదులను నిబంధింపగా రసవదాద్యలంకారములు కలుగును. రస నిబంధన మున్నచో రసవ దలంకారమని వ్యవహారము. భావ నిబంధన మున్న

ప్రేయోలంకారము. ఆభాస నిబంధన మున్నచో నూర్జస్వి అలంకారము. భావ ప్రశమ నిబంధ మున్నచో సమాహితా లంకార మగును.

౬౭. రసవదలంకారము

కిం హాస్యేన నమే ప్రయాస్యసి పునః ప్రాప్తః చిరాద్దర్శనం
కేయం నిష్కరుణ ప్రవాస రుచితా కేనాసి దూరీ కృతః
స్వప్నాంతే ష్వితితే వదన్ ప్రియతమ వ్యాసక్త కంఠగ్రహః
బుధ్వా రోదితి రిక్తబాహు వలయ స్తారం రిపు స్త్రీ జనః ౧౧౫

హాస్యమేల? చిరకాలమునకు నాకు కనుపడితివి నిష్కరుణా! ఈ ప్రవాసాభిలాష యేమి? నిన్నెవరు దూరీకరించినారు? నీ శత్రు వనితలు స్వప్నాంతములం దిట్లు పలుకుచు ప్రియుల కంఠా శ్లేషము పొంది మేల్కొని బాహు వలయము శూన్యము కాగా తార స్వరమున నేడ్చుచున్నారు. ఇందు కరుణ రసము వాక్యార్థము. విప్రలంభ శృంగార మంగము. కరుణము కూడ రాజ విషయ రతి భావమున నంగమై యున్నది.

౬౮. ప్రేయోలంకారము

త ద్వక్త్రామృత పాన దుర్లలితయా దృష్ట్యా క్వ విశ్రమ్యతాం
తద్వాక్య శ్రవణాభియోగ పరయోః శ్రావ్యం కుతః శ్రోత్రయోః
ఏభి స్త త్పరిరంభ నిర్భర భరై రంగైః కథం స్థీయతాం
కష్టం త ద్విరహేణ సంప్రతి వయం కృచ్ఛ్రా మవస్థాంగతాః ౧౧౬

ఆమె ముఖ దర్శనమున దుర్లలితమయిన నా దృష్టి యెచట విశ్రాంతి పొందును? త ద్వాక్య శ్రవణాసక్తములైన నా శ్రోత్రముల కిక శ్రావ్య మేమున్నది? త దాలింగ నిర్భరములైన నా యంగము లెట్లుండ గలవు? త ద్విరహమున యీ కష్టావస్థ వచ్చి పడినది. దీనిలో చింత యనెడు వ్యభిచార భావము కలదు. ఇదియె భావాలంకారము. భావ స్థితియు వర్ణితమై యలం కార మగును. భావ శాంతి భావోదయములను చెప్పెదము.

౭౦. ఊర్జస్వి

దూరాకర్షణ మోహ మంత్ర ఇవ మే తన్నామ్ని యాతే శ్రుతిం
చేతః కాల కలామపి ప్రకురుతే నావస్థితిం తాం వినా
ఏతై రాకులితస్య విక్షతరతే రంగై రనంగాకులైః
సంపద్యేత కథం తదాప్తి సుఖ మిత్యేత న్న వేద్మి స్ఫుటం ౧౧౭

దీనిలో రావణుని యభిలాష శృంగార మున్నది. అది యనుచిత విష యమైనందున నాభాసము. ఇందున్న యాతని యౌత్సుక్యముకూడ నట్టిదియే. ఆమె పేరు దూర మాకర్షించు మంత్రము వలె చెవి పడగానే ఆమె లేక నా మనస్సు తృటి కాలమేని స్థితి కలది యగుట లేదు. నా యంగము లనంగాకు లములై నా రతి చెదర గొట్టి నన్ను వ్యాకుల పెట్టినవి. త త్ప్రాప్తి సుఖ మెట్లు కలుగునో తెలియదు గదా !

౭౧. స మా హి త ము

ఏకస్మిన్ శయనే పరాఙ్ముఖతయా వీతోత్తరం తామ్యతోః
అన్యోన్యస్య హృది స్థితేఽ ప్యనునయే సంరక్షతో ర్గౌరవం
దంపత్యోః శనకై రపాంగ వలనా మిశ్రీభవ చ్చక్షుషోః
భగ్నో మానకలిః సహాస రభస వ్యాసక్త కంఠ గ్రహః ౧౧౫

దంపతు లొకే శయనమున పరాఙ్ముఖులుగా నున్నారు. మాటలు పలుకులు లేవు. లో లో వ్యథ పడుచున్నారు. ఒక రొకరి హృదయములో ననునయింప వలెనని యున్నది. కాని యాత్మగౌరవము పట్టుదలకై యట్లే యున్నది. కొన్ని క్షణములు కాగా వారి వలితా పాంగ మేళనములో కన్నులు కలుసు కొన్నవి. హాసములు వెలువడినవి. రభస రభసముగా కంఠగ్రహము కలుగగా మానకలి యెట్లో భగ్న మయినది. దీనిలో యీర్ష్యా క్రోధ రూప మగు ప్రణయ మానము ప్రశమించినది. ఇందలి దిది యుభయాశ్రయము.

౮౩. భావోదయ సంధి శబలతాశ్చ ఏతే పృథగలంకారాః

భావోదయము భావసంధి భావశబలత యనునవి వేరు వేరలంకార ములు. భావోదయ మనునది భావమున కుద్గమావస్థ. భావసంధి యనునది రెండు విరుద్ధ భావములకు స్పర్థీ భావమున కూర్పు. భావ శబలత నానా భావములు పూర్వ పూర్వోప మర్దనమున కూడియుండుట. ఈ మూడును రసవదాదుల కన్న భిన్నములైన యలంకారములని ప్రాక్తను లనిరి. కాని సంసృష్టి సంకరములకన్న నీ పునరుక్త వదాభాసాదులన్నియు పృథ గలం కారములని సర్వాలంకార శేష రూపముగ గుర్తింపవలెను. సంసృష్టి సంకరములు సంపృక్త స్వభావములు. సిద్ధములైన యలంకారముల స్థితియే వాని యందుండును. త ద్వైలక్షణ్యమునే యిచట చెప్పుట సముచితము.

౭౨. భావోదయము

ఏకస్మిన్ శయనే విపక్ష రమణీ నామగ్రహే ముగ్ధయా
సద్యః కోప పరాఙ్ముఖ గ్లపితయా చాటూని కుర్వన్నపి
సంవేగా దవధీరితః ప్రియతమ స్తూష్ణీం స్థిత స్తత్క్షణం
మాభూ త్సుప్తైవే త్యమంద వలిత గ్రీవం పున ర్వీక్షితః ౧౧౯

వారిద్ద రొకే శయనమున నున్నారు. వా డన్య రమణీ నామమును పలికి నాడు. ఆమె ముగ్ధ. వెంటనే కోపము తెచ్చుకొన్నది. అటు తిరిగినది. వ్యధ పడినది. వాడు ప్రణయ వచనములనె పలుకు చున్నాడు. కాని యావేగమున కాదని యామె త్రోసినది. ఆ క్షణమున వా డూరకనే యున్నాడు. ఇక నామె యీతడు నిద్రింప లేదు గదా యని మెడను త్రిప్పి చూచినది. దీనిలో నౌత్సుక్య భావోదయ మున్నది.

౭౩. భావసంధి

వామేన నారీ నయనాశ్రుధారాం కృపాణ ధారా మథ దక్షిణేన
ఉత్పుంసయ న్నేక తరం కరేణ కర్తవ్య మూఢ స్సుభటో బభూవ ౧౨౦

ఒక సుభటుడు వామ భాగమున నారీ నయన ధారయు దక్షు భాగ మున కృపాణ ధారయు నొరిపిడి చేయగా కర్తవ్య సమ్మూఢు డయినాడు. దీనిలో బాష్ప ధారా కృపాణ ధారల యున్మార్జన రూప మయిన అనుభావ మున నాయికాలంబన స్నేహము రణ విషయౌత్సుక్యము వ్యంజితము లగు చున్నవి. కర్తవ్య మూఢ పదమున వాని స్పర్ధి భావము స్పష్టము. అందువనే స్నేహమున కౌత్సుక్యమున కిందు సంధి యున్నది.

౭౪. భావశబలత

క్వాకార్యం శశలక్ష్మణః క్వ చ కులం భూయోఽపి దృశ్యేత సా
దోషాణాం ప్రశమాయ మే శ్రుత మహో కోపేఽపి కాంతం ముఖం
కిం వక్ష్యంత్యపకల్మషాః కృతధియః స్వప్నేఽపి సా దుర్లభా
చేతః! స్వాస్థ్య ముపైహి కః ఖలు యువా ధన్యోఽధరం ధాస్యతి ౧౨౧

ఈ యకార్య మెక్కడ! ఆ చంద్రవంశ మెక్కడ! ఆమె మరల కను పడునా! మేము చదివినది దోష నాశమునకు కదా! కోపము వచ్చినను ఆమె

ముఖమెంత బాగుండును ! దోష దూరులు పెద్ద లేమందురో ? స్వప్నములో కూడ ఆమె లభింపదేమో ! హృదయమా ! స్థైర్యము పొందుము. ఏ ధన్యుడామె యధర మాస్వాదించునో కదా ! దీనిలో వితర్కము ఔత్సుక్యము, మతి, స్మరణము శంక, దైన్యము, ధృతి, చింత, శబలత్వమున కూడియున్నది. ఇప్పటి కీ విధముగ చిత్తవృత్తివిషయములైన యలంకారములు లక్షితములైనవి. ఈ యలంకారము లన్నియు సంశ్లిష్టములు కాగా, రెం డలంకారములు వెలువడును. సంశ్లేషము రెండు విధముల నుండును. సంయోగము సమవాయ మని సంయోగమున భేదము స్పష్టముగా గోచరించును. సమవాయమున నది అనుత్కటమగును. ఉత్కటముగా నున్నచో అది తిలతండుల న్యాయము. కానిచో క్షీర నీర సదృశము.

## ౭౫. సంసృష్టి

### ౮౪. ఏషాం తిలతండుల న్యాయేన మిశ్రత్వే సంసృష్టిః

ఈ యలంకారములు యథాసంభవముగా తిలతండులన్యాయమున మిశ్రితములైనచో సంసృష్టి యలంకార మగును. అలంకారము లొకచో కలిసి యున్నప్పుడు అవి వేరు వేరుగనే యుండునా ? అలంకారాంతర మున్న సంకేతము కల్గునా ? అని విచారింపవలెను. లోకాలంకారములలో సువర్ణాలంకారములు, మణిమయాలంకారములు కలవు. అవి ప్రత్యేక ప్రత్యేకముగా సుందరములే. ఐనను వాని సంఘటనములో నొక చారుత్వాంతరము కలుగును. అట్లే ప్రకృతమునగూడ అలంకారముల సమ్మేళనములో చారుత్వాంతర మున్నది కావుననే అలంకారాంతర ప్రాదుర్భావము చెప్పవలెను. కాగా, సంయోగన్యాయమున భేదము స్ఫుటమేని సంసృష్టి యని సంకేతింపవచ్చును. తిలతండులన్యాయమున కలుగు సంసృష్టి శబ్దాలంకార గతముగా అర్థాలంకార గతముగా నుభయాలంకార గతముగా నుండును.

ఆనంద మంథర పురందర ముక్త మాల్యం
మౌళౌ హఠేన నిహితం మహిషాసురస్య
పాదాంబుజం భవతు వో విజయాయ మంజు
మంజీర శింజిత మనోహర మంబికాయాః ౧౨౨

దేవీపాదమున నింద్రు డానందముతో పూలమాల నుంచినాడు. దేవి మహిషాసురుని తలపై పాద ముంచినది. మనోహర మంజీర శింజానము గల దేవీపాదాంబుజము మీకు విజయము చేకూర్చుగాత. దీనిలో 'పాదాంబుజ' మని యుపమాలంకార మున్నది. అనుప్రాస స్పష్టము. రెండును సంసృష్టము లైనవి. పాదాంబుజ మను నుపమలో మంజీర శింజిత యోగము వ్యవస్థాపక మైన ప్రమాణము రూపక మైనచో శింజితసంబంధము ప్రతికూల మగును.

౭౬. సంకరము

## ౧౫. క్షీర నీర న్యాయేన తు సంకరః

క్షీరనీరన్యాయమున మిశ్రణ మున్నచో సంకరాలంకార మగును. మిశ్రణము మూడు విధముల నుండును. కావున మూడు పేర్లును కలుగును. అంగాంగిభావ సంకరము, సంశయ (సందేహ) సంకరము, ఏకవాచకాను ప్రవేశ సంకరము.

అంగాంగిభావసంకరము

అంగులీభి రివ కేశసంచయం సన్నిగృహ్య తిమిరం మరీచిభిః
కుట్మలీకృత సరోజలోచనం చుంబ తీవ రజనీముఖం శశీ ౧౭౩

చంద్రుడు అంగుళులవలె నున్న కిరణములతో కేశసంచయము వలె నున్న తిమిరమును నిగ్రహించి, ముకుళించిన లోచనము లనెడు పద్మములు గల రజనీముఖమును చుంబన మొనరించుచున్నా డన్న ట్లున్నది. దీనిలో అంగులీ సాదృశ్యము చెప్పుట యుపమ. ఆ యుపమయే 'సరోజలోచన' మను నుపమకు ప్రసాధకము. 'రజనీముఖ' మనుచోట శ్లేషమూలకాతిశయోక్తి యున్నది. రాత్రిప్రారంభ మని యొక యర్థము. రజని పేరుగల నాయికా ముఖ మని వేరొక యర్థము. ఈ రెండర్థముల కిం దభేదాధ్యవసాయమున్నది. ఆ శ్లేషాతిశయోక్తులలో నతిశయోక్తి యంగి. శ్లేష లేక యతిశయోక్తి రాదు. 'అంగులీభి రివ మరీచిభిః' అను వాక్యమున 'సరోజలోచన' మను సమాసమున నున్న రెం డుపమలు, శ్లేషానుగృహీత మైన యతిశయోక్తియు, 'చుంబ తీవ' యనుచో నున్న యుత్ప్రేక్షాలంకారమున కనుగ్రాహకము లైనవి. ఉపమాదుల బలము వలన కలిగిన యుత్ప్రేక్షసముత్థాపకము

లైన యుపమాదులకు చమత్కార నిబంధనమైనది. కాన, అంగాంగిభావము సంగతమైనది.

### సందేహసంకరము

యః కౌమారహర స్స ఏవ హి వరః తా ఏవ చైత్రక్షపాః
తే చోన్మీలిత మాలతీ సురభయః ప్రౌఢాః కదంబానిలాః
సా చైవాస్మి తథాపి తత్ర సురతవ్యాపారలీలా విధౌ
రేవా రోధసి వేతసీ తరుతలే చేతస్సముత్కంఠతే ౧౨౮

ఆనాడు నా కౌమారమును దోచుకొనిన వరుడే యీ వరుడు. ఆ వసంతరాత్రులె యివియు. వికసిత మాలతీ పరిమళము కలిగి ప్రౌఢము లయిన యీ కదంబానిలములె యిపుడు నున్నవి. నేను నానాటి యీ వనితనె. అయినను ఆ రేవాతీరమున, ఆ వేతసీ తరుతలమున ఆ సురతవ్యాపార లీలా విధానమున నా చేత ముత్కంఠముతో నున్నది. దీనిలో విభావనా విశేషోక్తులకు సంకర మున్నది. ఉత్కంఠా కారణము లేకపోయినను ఉత్కంఠ యుత్పన్న మగునట్లు చెప్పుట విభావ నాలంకారము. 'కౌమారహర' యను చోట ననుత్కంఠా కారణ మున్నను, అనుత్కంఠ కలుగక పోవుట వలన విశేషోక్తి యగుచున్నది. ఈ రెం డలంకారములు అస్ఫుటములు. ప్రత్యేకముగా వీనికి సాధక బాధక ప్రమాణములు లేనందున సందేహసంకరమైనది.

### ఏకవాచకానుప్రవేశము

సత్పుష్కర ద్యోతిత రంగ శోభి న్యమంద మారబ్ధ మృదంగ వాద్యే
ఉద్యాన వాపీ పయసీవ యస్యాం ఏణీదృశో నాట్యగృహే రమంతే ౧౨౯

నాట్యగృహమునందు స్త్రీలుద్యాన దీర్ఘికా జలమునందు వలె క్రీడించుచున్నారు. పూర్వార్ధార్థము రెం డర్థములతో నున్నది. ఉద్యాన వాపీ పరముగా నిట్లుండును. మంచి పద్మములు గల తరంగ శోభ యున్నది. అందునే యమందమైన మృదంగ వాద్య మున్నది. 'పుష్కర ద్యోతిత రంగ' పదగతమైన శ్లేష వశమున నాట్యగృహార్థ మిట్లు సంభావ్యము. యోగ్యములగు పుష్కరవాద్యములచే ప్రకాశించు రంగశోభ కలిగి నాట్యగృహము చక్కగా మృదంగ వాద్యారంభముతో నున్నది. ఇందు నాట్యగృహమునకు వాపీ పయస్సాదృశ్యము చెప్పుటచే నుపమ యున్నది. ఆ యుపమ 'సత్పు

ష్కర ద్యోతిత రంగ' యను శబ్దశ్లేషతో నొకే 'ఇవ' పదమున కూడి యున్నది. 'ఇవ' పద మొక్కటియే ప్రథమమున నుపమను భాసింపజేసి, ఉపమా సామర్థ్యమున శ్లేషనుగూడ భాసింపజేయును. ఇట్లేకవాచ కాను ప్రవేశ సంకరమును సమన్వయింపవలెను.

౮౬. ఏవ మేతే శబ్దార్థోభయాలంకారాః సంక్షేపత స్సూత్రితాః

ఇప్పటికీ విధముగా శబ్దాలంకారము లర్థాలంకారము లుభయాలంకారములు సూత్రితము లైనవి. అలంకారసూత్రములచే నిట్లు సూచితము లైనవి. యమకాదులు శబ్దాలంకారములు. ఉపమాదు లర్థాలంకారములు. లాటానుప్రాసాదు లుభయాలంకారములు. సంసృష్టి, సంకర ప్రకారములు రెండు నలంకారములు నిరూపితములు. ఆశ్రయాశ్రయి భావమున లోకములో నలంకారవ్యవహార మున్నది. అట్లే యిందును ఆశ్ర యాశ్రయిభావమున చిరంతన మతానుసరణ ముండుట భద్రము.

# రసగంగాధర మణి

## కావ్యమీమాంస

దర్శనాచార్య, లాక్షణికశిరోమణి, మహోపాధ్యాయ

**జమ్ములమడక మాధవరామశర్మ**

ఏ. సి. కాలేజి :: గుంటూరు

స్వాయత్తస్వామ్యము
౧౦౦౦ : : మన్మథ

"నిమగ్నేన క్లేశై ర్మనన జలధే రంత రుదరం
మయోన్నీతో లోకే లలిత రసగంగాధరమణిః
హరన్నంతర్ధ్వాంతం హృదయ మధిరూఢో గుణవతాం
అలంకారాన్సర్వానపి గలిత గర్వాన్ రచయతు"

వెల : ౧-౮-౦
1955

శ్రీ కైలాస ముద్రణాలయము
గుంటూరు

# సూ చి క

★

## స్వ భా వో క్తి

### భావోపహారము : కరుణశ్రీ


| | |
|---|---|
| కావ్యలక్షణము | ౧ |
| రసస్వరూపము | ౩ |
| రసవిరోధము | ౯ |
| గుణములు | ౧౦ |
| రచన | ౧౨ |
| భావధ్వని | ౧౩ |
| రసాభాస | ౨౩ |
| భావశాంత్యాదులు | ౨౫ |
| ధ్వని : అభిధామూలము | ౨౭ |
| శబ్దశక్తిమూలము | ౨౭ |
| అర్థశక్తిమూలము | ౨౯ |
| ఉభయశక్తిమూలము | ౩౨ |
| లక్షణామూలము | ౩౨ |
| అభిధానిరూపణము | ౩౩ |
| లక్షణానిరూపణము | ౩౪ |
| అర్థాలంకారములు | ౩౬ |


★

# పరిచితి

అభిజనము గుంటూరుమండలములో తెనాలిసమీపమున కోడితాడిపల్లిఅగ్రహారము. జనకులు శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిపండితులు (శ్రీ వైరాగ్యానందభారతీస్వామి) సోదరులు శ్రీ లక్ష్మీనరసింహులు. విజయనగరమహారాజసంస్కృతకళాశాలలో విద్యాధ్యయనము. శ్రీతాతా సుబ్బారాయశాస్త్రిలు గురువులు. జగద్గురు శ్రీకళ్యాణానందభారతీమాంతాచార్య మహాస్వామిపాదులు విద్యామహాదేశికులు. తెనాలిసంస్కృతకళాశాలలో చిరకాలము ప్రాధ్యక్షత అధ్యక్షత – నెల్లూరు వేదసంస్కృతకలాశాలలో అధ్యాపకత. గుంటూరులో ప్రకృతము ఏ. సి. కలాశాలాధ్యాపకత. శ్రీ, గీతాసూత్రనవతి, దేవీకథ, భక్తితంత్రము, నవరసగంగాధరము, ఆంధ్రప్రతాపరుద్రీయము, ధ్వనిసారము, కావ్యప్రకాశము, రసగంగాధరమణి ముద్రితగ్రంథములు. సంస్కృతాంధ్రములందనన్యవక్తృత్వము. సాహిత్య నాట్యదర్శన ధర్మాది వివిధ విషయములపై నుపన్యాసదక్షత. మదరాసుప్రభుత్వము తెలుగుభాషాసమితిపక్షమున నవరసగంగాధరము త్తమసాహిత్యవిమర్శగ్రంథమని బహుమానమిచ్చినది. సాహితీసమితి, నవ్యసాహిత్యపరిషత్తులలో సభ్యత్వము. నిరంతరము విద్యార్జనము మొదలగునవి రచయిత విశేషములు.

★

# స్వభావోక్తి

భారతావనిలో నితరు లితరశాస్త్ర కోవిదులు. ఆంధ్రులు సాహితీ వేదులని వారు వీరు నందురు. ఆంధ్రుడైన శ్రీజగన్నాథుడు పితరులతో కాశీపట్టణ మేగి యచటనె తండ్రిసమక్షమున సకలవిద్యాపారంగతు డయ్యెను. జయపురప్రభు సంభావితుడై జయపురాస్థానమున విద్యాధికారి యయ్యెను. ఢిల్లీధరావల్లభలాలితుడై పండితరాజయినాడు. రసగంగాధరము రచించినాడు. సాహిత్యప్రస్థానమున రసగంగాధర మసాధారణము. రసగంగాధరము దాక్షిణాత్యభావఖండనము చేసినది. కొంతకాలము సర్వకళాపరిషత్పరీక్షల పాఠ్యముగ నిర్ణీతము కాలేదు. అస్మద్గురువులు శ్రీరాయుడు శాస్త్రి రాసాడి పండి ప్రయత్నము చేసిరి. ఒకవిధమున తెలుగులోకములో వ్యాపించినది. ఆశిరోమణి కవిద్వ్యప్రభాటకు రసగంగాధరము తెలియుటకవకాశము కలుగలేదు. ఆధునికాంధ్ర శ్రీజగన్నాథుని యర్థమో తదర్థమో యధ్యయనించిరి. అధ్యాపకప్రసక్తి లభించని వారికి రసగంగాధరము లభింపలేదు. రసగంగాధరమును నవరసగంగాధరముగా ప్రథమాంధ్ర మనువదించి నవ్యసాహిత్యపరిషత్పక్షమున ప్రకటించితిని. అది యిప్పుడు సాహిత్యవిమర్శ గ్రంథమని మదరాసు ప్రభుత్వము తెలుగుభాషాసమితి ద్వారమున సమ్మానించినది. ఆంధ్రలోకము సంభావించినది. మూలసహితముగా ముద్రించుటను జనత కాంక్షించినది. ప్రథమద్వితీయాననముల నిట్లు ముద్రింప కౌతుకమున్నది.

ఇప్పుడీ రసగంగాధరమణి నిట్లు ప్రకటించుటకుంటి నేమి ? అని నేననుకొననే లేదు. నవకాలమున పండితరాజనిర్ణయపరిజ్ఞానావశ్యకత యున్నది. నవలోకమున లక్షణపరిజ్ఞానము పర్యాప్తముగ లేదు. అందు నాంధ్రీయ లక్షణము "అభిజ్ఞామూరమయినది." ఆ భారతిలక్షణసమన్వయమున కలుగవలసినది కలుగకపోగా కలుగరాని కాలుష్యమె కలిగినదని యనువారున్నారు. రసగంగాధరమణి నేడు కావలయుట స్పష్టము.

శ్రీజగన్నాథపండితరాయలు తన రసగంగాధరారంభములో "రసగంగాధరమణి" పదము నెప్పుడో నిర్ణయించినాడని సహృదయులు సంభావన చేసినారు. అతడే కుతుకమున కావ్యమీమాంసా పదమును నాకందించి

వాడు. ఇక నేనటునిటు రెండుపదములు పట్టితిని. రసగంగాధరమున పండిత రాయల ప్రౌఢి సర్వతోముఖముగ నున్నది. వాద వేదికి పరవాదఖండనము లేక స్వవాదస్థాపనము తృప్తినీయదు. మతాంతరముల గుర్తించిన గాని వాని ఖండనము సుగోచరము కాదు. పండితరాజు ఖండనపండితుడు. మండన మహాపండితుడు. తగినంత శ్రద్ధాసక్తులతో అవగాహించినప్పుడు చిత్రము సిద్ధాంతము వలెను భావింపదు. పండితరాజు నిష్కృష్టముగా నిర్వచనము చేసిన లక్షణము - లక్ష్యము - సమన్వయము సాహిత్యకులు తెలిసికొనుటకు మణి యుపకరింప గలదు. మణి యాభాగమున సాహిత్యసౌధమెంతేని నిర్మితమవు గావుత!

లక్షణవచనము తెనుగులో కూర్చితిని. లక్ష్యముల్లే యుంచితిని. తెనుగుపద్యమును నేను లక్ష్యము చేయలేదు. ఈకూర్పులో భాషాపద్యోదాహరణమున నొక ప్రత్యేకత యుండునని నేను సంభావించుట లేదు. సంస్కృతభాషాగతమయిన విశేషమిందువలె నెందును లేదు. ఇట్టి యీ శ్లోకముల నాంధ్రీకరించుటలో నెవరు శక్యప్రక్రియులో నాకు తెలియలేదు. లక్ష్యలక్షణపరిజ్ఞానముదయించుటకై వలయు యత్నమున నీశ్లోకముల నెన్నిక చేసితిని. చమత్కృతిచమత్కృతి విశేష మిందు సమాస్వాద్యమగు గావుత యని యాశించితిని. ఉత్తమశక్తి యుల్లసించు గావుత యని పండితరాయ పద్యముల నల్లైమాదితిని. చూపితిని * వ్యావహారికముగా రచనలు ప్రచురించిన కొందరు అపహాస్యాస్పదుని యని భావించి తాము తలచిన గ్రాంధికమున రచనలారంభించిరి. నేటికి నేనాటికి వ్యావహారికము పొరపాటని నేను భావింపను. అప్పుడప్పుడెప్పుడేని వ్యావహారికము గ్రాంధికము వ్రాయుట నాకభిలషితము. అందువలననె యిది యిట్టి దయినది.

గుణాలంకారధ్వనినిర్ణయమునందాంధ్రులిదియే ప్రమాణమని నిశ్చయింపవచ్చును. పద్యాల భావాల నాస్వాదించు మార్గమన్వేషించుటకై యిది యుపకారి. ఒక్కొక పద్యమున నొక్కొక విధమయిన యాస్వాదము ప్రదర్శితము. అయిన నన్నిటి ప్రతిభతో నొకటి సమీక్షించి తెలిసికొనుటకై మణి సహకరించును. ఆంధ్రాలంకారికులు ప్రజ్ఞామాత్రము ననుసరించి భావరత్నముల హృదయహారీకరించుటకు, రచనాపరిష్కారమునకు, పద్య పద్యా సంచరణమునకు, రమ్యభావపద్యములకు, సంక్షిప్తమయిన రసగంగాధరప్రజ్ఞ

కీ మణి యుపకరించునని నేనేల భావింపకుందును? ఆంధ్రలోకమున నేటి వఱకర్థాలంకారముల నిశ్చయసమన్వయములలో రసగంగాధరనిర్ణయములు ప్రచారము పొందలేదు. అప్రతిష్ఠానములయిన లక్షణములై యొకవిధముగ సంచరించినవి. ఇటుపై మణి యెంతేని యాశింపవచ్చును. సమగ్రరసగంగాధరము వెలికిరామి, అది యున్నంతవఱకీ మణి యున్నది.

ఈ మణిలో భక్తులకు భక్తిపద్యములు, నీతిసంవేదులకు సుందరవచనోపారూఢమయిననీతివాక్యసంపన్నములు, లలితమధురమైన దాంపత్యశృంగారచిత్రప్రక్రియారూపకములు, శ్రీసీతారామకథాశ్లోకములు, శ్రీకృష్ణమధురవిన్యాసములు, గంగాలహరీలీలావిలాసములు ఇంకనన్యాన్యములు కవితార్ధయుక్తశ్లోకములున్నవి. భిన్నరుచులయిన లోకులు భిన్నరుచితో కూడ మణి గుచి చూచి యభిరుచి కలవారు కాగలరు. పరిచితపదములలో వారికి వీరికి తెలియునట్లు వ్రాయవలయునని కొందఱలవోకగా ననుట కలవాటు పడిరి. పరిచితపదములు విషయవిశదిమకు కావ్యకావ్యభాషారమ్యతకు తగవు. తగినపదాశ్రయము వినా యేదియో వ్రాసిన నేదియో వ్రాయుట యగును. తన రచనను నియతలలితాలాపము పండితరాజునకె తెలిసినది. అతని భణితిసంగ్రహమె మణిలో నున్నది. శ్రీ మాధుర్య యోగి మా కరుణశ్రీ భావోపహార మది పరశ్శ్రుత పద శ్రీకము పండితరాయ మాధవరాయ రసగంగాధరమణి సంవిదాత్మశ్రీ లలిత భావోపహారము. సహృదయసంభావనము స్వహృదయసుందరసంవాదమున స్పందసుందరమగుట గుర్తించు భావుకులభావనమునకు ప్రకృతము రసగంగాధరమణి నందించుచున్నాను.

శ్రీ మాధవరామశర్మ

# భా వో ప హా ర ము

గుండెలు జాఱి పండితులు కూలబడన్, మది మెచ్చి పాదుషాల్
దండము పెట్ట, లాక్షణికతల్ వెలయించి, యఖండపాండితిన్
గండరగండఁడై తెలుఁగు గడ్డకు ఖ్యాతి గడించి పెట్టె మా
పండితరాజు సౌమనసభారతి నోచిన నోము లెట్టివో !

అసమాన ప్రతిభా ప్రదీప్తి "రమణీయార్థంబు నిండారు శ
బ్ద సముల్లాసమె కావ్య"మంచు ధ్వనివాదమ్ముం బ్రపంచించి,మా
నసమానందమయమ్ముగా రసజగన్నాథాఖ్య గైకొన్న మా
"రసగంగాధర"మాధురీ ప్రణయ సమ్రాట్టున్ బ్రశంసించెదన్.

ఆ వైదుష్య మపార; మా ప్రతిభ దివ్యం; బా మహోదాత్త భా
షా వైచిత్రి యమోఘు; మా రసధునీ సాహిత్య సామ్రాజ్య ల
క్ష్మీ వాల్లభ్య మనన్యలభ్య; మన భాసింగాంచి విన్నాణపుం
బ్రోవుల్ మాధవరామశర్మ గురుదేవుల్ పొల్తు రాంధ్రావనిన్.

పాతివ్రత్యము సల్పు వ్యంజన మహాభక్తిన్ తదాస్యమ్మునన్ ;
చేతుల్ మోడ్చి సమాశ్రయించును రసశ్రీ తద్వచో వైఖరిన్ ;
తాతా రాయఁడుశాస్త్రిపాదులటె శాబ్దప్రక్రియా సాహితీ
గీతాచార్యులు: మాధవీయమణి వెల్గించున్ దిగంతమ్ములన్.

మాధవ మాధవీ సుమ సమంచితముల్, విలసత్కళా జగ
న్నాథము, లక్షరామృత సనాథము, లున్నమితోత్తమాంగ గం
గాధర జాట జూట మణికాంతులు కావ్యకళాస్రవంతులై
యాధునికాంధ్రవాఙ్మయ దృగంతములన్ సరసీకరించుతన్.

**కరుణశ్రీ**

శ్రీ

# రసగంగాధరము

## శ్రీ పండితరాజ కావ్యమీమాంస

కావ్యమున కీర్తి పరమాహ్లాదము దేవతాప్రసాదము మొదలగు ననేక ప్రయోజనములున్నవి. కవి సహృదయులకు కావ్యవ్యుత్పత్తి యావశ్యకము. కావ్యలక్షణము నిరూపింతుము.

### ౧. కావ్యలక్షణము

*రమణీయార్థ ప్రతిపాదకశబ్దము కావ్యము.

లౌకికవాక్యమున లోకోత్తరాహ్లాదము కలుగదు. లోకోత్తరాహ్లాదము కలుగజేయునదియే రమణీయము. లోకోత్తరము చమత్కార మాపాదించును. చమత్కార ముత్పాదించునది కావ్యమని ఫలితార్థము. చమత్కారిత్వము కావ్యజీవితము. శబ్దవిశేషమే కావ్యము. కవియందలి ప్రతిభయే కావ్యకారణము. ఆ ప్రతిభ కావ్యరచనకు దగినశబ్దార్థముల నందించును. దేవతాప్రసాద జన్యమగు నదృష్టమొకచో ప్రతిభాహేతువు. వేరొకచో విలక్షణవ్యుత్పత్తి విలక్షణాభ్యాసమును హేతు వగును.

### ౨. కావ్యభేదములు.

కావ్య ముత్తమోత్తమము, ఉత్తమము, మధ్యమ, మధమ మని చతుర్విధము.

#### ఉత్తమోత్తమము

* శబ్దార్థము లముఖ్యములై చమత్కారి యర్థమభివ్యంజనము చేయుచో నది యుత్తమోత్తమము.

౧ శయితా సవిధేప్యనీశ్వరా
సఫలీకర్తుమహో ! మనోరథాన్

దయితా దయితాననాంబుజం
దరమీలన్నయనా నిరీక్షతే.

దయిత సవిధమున శయనించియు మనోరథముల సఫలీకరించుకొనలేనిదై ప్రియుని వదన మరగన్నుల నిరీక్షించుచున్నది.” ఇందు నాయకుడాలంబనము, ఏకాంత ముద్దీపనము, అరగన్నుల చూ పనుభావము. ఔత్సుక్యాదులు వ్యభిచారులు. వీని సంయోగమున రతి వ్యంగ్య మగుచున్నది.

## ఉత్తమము.

* వ్యంగ్య మప్రధాన మై యయి చమత్కారి యగుచో నుత్తమము.

౨ రాఘవ విరహ జ్వాలా సంతాపిత సహ్యశైల శిఖరేషు
శిశిరే సుఖం శయానాః కపయః కుప్యంతి పవనతనయాయ

సహ్యాద్రిశిఖరములు రాఘవ విరహజ్వాలా సంతప్తము లయినవి. శిశిరమున నచట సుఖము శయనించిన కపు లాంజనేయుపై కోపము పడిరి. ఆంజనేయుడు సీతాకుశలము నివేదించుటచే రాఘవుడు చల్లబడినా డనునది యిందు వ్యంగ్యము. అయినను కపికోప ముపపాదించునదై గుణీభూత మయినను కమనీయముగ నుండుటచే నిది యుత్తమము. ఈ రెండు భేదములందలి చమత్కారము విశదమై యయినను ఒకటి ప్రధాన మన్యమప్రధానమగుట నొక విశేషము సహృదయవేద్య మున్నది.

## మధ్యమము.

* వ్యంగ్య చమత్కారమునకు వేరుగా వాచ్యచమత్కార మున్నచో మధ్యమము.

“మైనాకుని గవేషించుటకై దీర్ఘమయిన జలధిగర్భము చేరిన హిమవానుని భుజమునా నయిన గంగానదికి యమున సఖి.”

ఇందు వాచ్యమయిన యుత్ప్రేక్షయే చమత్కారహేతువు. వ్యంగ్య చమత్కార ముత్ప్రేక్షాచమత్కార జఠర నిలీనమయినది. పామరవనిత మైపూతలో దాగిన దేహశోభ వలె ప్రతీత మగుటలేదు. ఈ ద్వితీయ

తృతీయ ప్రభేదములందె నిఖిల మలంకారప్రధాన కావ్యము ప్రవిష్ట మయినది.

## అధమము

* అర్థచమత్కృతి శోభిత మయిన శబ్దచమత్కృతి ప్రధాన మగుచో నది యధమము.

> 3. మిత్రాత్రి పుత్ర నేత్రాయ త్రయీ శాత్రవ శత్రవే
> గోత్రారి గోత్రజ త్రాయ గోత్రాత్రే తే నమోనమః

సూర్యాచంద్ర నేత్రుడు వేదనిందక శత్రువు దేవరక్షకుడు నయిన గో త్రాతకు నమస్కారము. ఇందర్థచమత్కృతి శబ్దచమత్కృతిలో లీన మయినది. ఏ మాత్ర మర్థచమత్కృతి లేని శబ్దచమత్కృతి యున్న అధ మాధమ మనుట యుచితము కాదు. అందు రమణీయార్థప్రతిపాదక శబ్ద ముండుట యను కావ్యలక్షణ ముండదు.

## 3. రసస్వరూపము

ఉత్తమోత్తమము ధ్వని. అది యసంఖ్యభేదము. కొన్ని చెప్పెదము. అభిధామూలము లక్షణామూల మని ధ్వని ద్వివిధము. రసవస్త్వలంకార ధ్వనిభేదమున నభిధామూలము త్రివిధము. అర్థాంతర సంక్రమితవాచ్య మని యత్యంతతిరస్కృతవాచ్య మని లక్షణామూలము ద్వివిధము. ఇట్లు ధ్వని పంచాత్మకము. అందు రసధ్వని పరమరమణీయము. రస మిక నిరూ పింతుము.

* సముచిత కావ్య సమర్పితములై సహృదయ హృదయము పొంది వారి భావనావిశేషమున విగలితవిశేషములైన విభా వానుభావ వ్యభిచారులు కలసి యలౌకికవ్యాపారము కలుగ జేయగా నా సమయమున నానందాంశా వరణము నశించును. ప్రమాత కపుడు నిజస్వరూపానందముతో బాటుగోచరించు వాసనాత్మకముగనున్న రత్యాదికమె రసము.

సహృదయునకు విభావాదిచర్వణా మహిమచే యోగికి సమాధిలో వలె తన్మయీభవనము కలుగును. రసానంద మిది తాత్కాలిక సుఖాంతర సాధార

ణము కాదు. మూతమూకుడు తీయగా దీపము సన్నిహితపదార్థములను ప్రకాశింపజేయునట్లు ఆత్మచైతన్యము విభావాది సంవలితము లయిన రత్యాదుల గోచరింప జేయును. తాను ప్రకాశించును. విభావాది చర్వణ యున్నంత వరకె యావరణభంగ ముండును. చర్వణ నివృత్త మయిన ప్రకాశ మావృత మగును. గాన నున్నను స్థాయి గోచరింపదు. కాగా భగ్నావరణ చిద్విశిష్టమగు రత్యాది స్థాయి భావము రస మని యభినవగుప్త గ్రంథస్వారస్యమున నిర్ణీతము.

"రసో వై సః" యను శ్రుతిస్వారస్యమున రత్యాది విశిష్ట మగు భగ్నావరణ చిదంశమె రసమనుట యుక్తము. అనేకు లనేకవిధముల రసము నిర్వచించిరి. పరమాహ్లాదకారిగా ప్రతీయమానమగు రస మీ ప్రపంచమున రమణీయత నాపాదించు ననుట నిర్వివాదము.

## ౪. స్థాయిభావములు

* శృంగార కరుణ శాంత రౌద్ర వీరాద్భుత హాస్య భయానక బీభత్సములు నవ రసములు. రతి శోక నిర్వేద క్రోధోత్సాహ విస్మయ భయ జుగుప్సలు నవ స్థాయిభావములు.

ప్రబంధపర్యంతము స్థిరముగా నుండునవి యగుట నివి స్థాయిభావము లగును. వాసనాత్మకము లగు నివి ముహుర్ముహు రభివ్యక్తము లగుటయే స్థిరత. రత్యాది స్థాయిభావములు బహువిభావజము లని వ్యభిచారు లల్పవిభావోత్పన్నము లని యందురు.

* అన్యోన్యాలంబన మయిన స్త్రీ పురుషుల ప్రేమ యనదగు చిత్తవృత్తి రతి స్థాయిభావము.

దేవతాలంబన మయిన ప్రేమ గురు పితృ మాతృ పుత్రాద్యాలంబన మగునది వ్యభిచారిభావము. స్థాయి కాదు.

* ఇష్టజనుల వియోగాదుల వలన గలుగు వైక్లబ్య మను చిత్తవృత్తిశోకము.

స్త్రీ పురుషుల వియోగమున జీవితత్వజ్ఞాన మున్నచో రతియె ముఖ్య మగును. గాన విప్రలంభ శృంగార మె. మృతత్వజ్ఞాన మున్నను

దేవతాప్రసాదమున జీవించు నన్న జ్ఞాన మున్నచో విప్రలంభశృంగారమె యగును. కొందరిట్టిదానినె కరుణవిప్రలంభ మందురు.

* నిత్యానిత్య వస్తువిచారమున గలుగు విషయవిరాగము నిర్వేదము

గృహకలహాదుల వలన గలుగునదయినచో నిర్వేదము స్థాయి కాదు. వ్యభిచారిభావమె.

* గురువధాది ప్రబలాపరాధమున గలుగు ప్రజ్వలనము క్రోధము.

క్షుద్రాపరాధజన్యము పరుషవచనముల గలుగజేయును. అసంభాషణ హేతు వగును.

* పరుల పరాక్రమ దానాదుల స్మరణమున గలుగు ఔన్నత్య ముత్సాహము.

* అలౌకిక వస్తుదర్శనమున గలుగు వికాసము విస్మయము

* వాగాది వికారదర్శనమున గలుగు వికాసము హాసము.

వ్యాఘ్రదర్శనాదుల గలుగు ననర్థవిషయ మయిన వైక్లవ్యము భయము.

కదర్యవస్తువుల జూడగా గలుగు విచికిత్స యను చిత్తవృత్తి జుగుప్స

ఇట్టి స్థాయిభావములు లోకమున నాయా నాయకులం దుండును. వాని కాలంబనములై యుద్దీపనములై కారణములుగా ప్రసిద్ధము లగునవి కావ్యనాట్యములం దభివ్యంగ్యములు కాగా విభావము లని వ్యపదేశము బొందును. లోకమున కార్యములుగా నుండునవి యిం దనుభావము లగును. ఏ చిత్తవృత్తి కెయ్యది విషయమో యది యాలంబనము. నిమిత్తము లుద్దీపకము లని తెలియునది.

## ౫. రసములు : శృంగారరసము

సంయోగము విప్రలంభ మని శృంగారము రెండు విధములు. "శయితాసవిథే ప్యనీశ్వరా (౧) సంయోగశృంగారమున కుదాహరణము.

విప్రలంభమునకు ఉదా:—

౪. నయనాంచలావమర్శం యా న కదాచిత్పురా సేహే
ఆలింగితాపి జోషం తస్థౌ సా గంతుకేన దయితేన

పూర్వము నయనాంచల స్పర్శము నైన సహింప నేరని యా ముగ్ధ గంతుకదయితు డాశ్లేషించినను జోషముండినది. ఇందు సహజ చాంచల్య నివృత్తి యనుభావము. జడత వ్యభిచారి.

## కరుణము

౫. అపహాయ సకల బాంధవ చింతాం
ఉద్వాస్య గురుకుల ప్రణయం
హా! తనయ వినయశాలిన్!
కథమివ పరలోకపథికోఽభూః?

సర్వ బంధుచింత వీడి గురుకులాసక్తిని త్యజించి వినయము గల తనయా! పరలోకమున కెట్లేగితివి[1]? ఇందు మృతపుత్రు డాలంబనము. బంధుదర్శనాదు లుద్దీపనములు. రోదన మనుభావము.

## శాంతము :

౬. మలయానిల కాలకూటయో
రమణీకుంతల భోగిభోగయోః
శ్వపచాత్మభువో ర్నిరంతరా
మమ జాతా పరమాత్మని స్థితిః

మలయానిలము హాలాహలము, కామినీకుంతలము పాము కుబుసము, శ్వపచుడు బ్రహ్మ, వీరి యందంతరమె చూడని స్థితి నాకు పరమాత్మ యందు గలిగినది. ఇందు విశ్వావిశ్వ మాలంబనము. అంతట సామ్య మను భావము.

## రౌద్రము

౭. నవోచ్ఛలిత యౌవన స్ఫురదఖర్వ గర్వ జ్వరే
మదీయ గురు కార్ముకం గలితసాధ్వసం వృశ్చతి

అయం పతతు నిర్దయం దలిత దృప్త భూభృద్గల
స్ఖలద్రుధిర ఘస్మరో మమ పరశ్వధో భైరవః.

నవయౌవనమున గర్వజ్వరము పట్టి నా గురుధనువును బెదురు లేక విరిచిన వానిపై, మదించిన రాజుల కంఠములు ఖండించి రక్తము త్రాగిన యీ నా భైరవపరశువు నిర్దయముగా పడుగావుత. ఇందు రాము డని తెలియని గురుధనుర్భంజకు డాలంబనము పరుషోక్తి యనుభావము. ఈ పద్యములోని యుద్ధత వృత్తియు రౌద్రమునకు పోషకము.

## వీరరసము

వీరము చతుర్విధము. దానవీరము.

౮. కియదిదమధికం మే యద్ద్విజాయార్థయిత్రే
కవచమరమణీయం కుండలే చార్పయామి
అకరుణమవకృత్య ద్రాక్కృపాణేన నిర్య
ద్బహలరుధిరధారం మౌలిమావేదయామి.

ఇంద్రునకు కవచకుండలములు దానము చేయు కర్ణుని జూచి విస్మితు లయిన సభ్యుల నుద్దేశించి కర్ణు డనుట. ఇందు యాచమాను డాలంబనము. స్తుతి యుద్దీపనము. కవచాదు లిచ్చుట యనుభావము.

## దయావీరము

౯. న కపోతక పోతకం లవ స్పృశతు శ్యేన! మనాగపి స్పృహా
ఇదమద్య మయా సమర్పితం భవతే చారుతరం కళేబరం.

శ్యేనము గురించి శిబి యనుట. శ్యేనా! నీకీ పావురపు పిట్టపై స్పృహవలదు. ఇదిగో! ఈ రమ్య శరీరము నీకై సమర్పించితిని. ఇందు కపోత మాలంబనము. తన కళేబరార్పణ మనుభావము.

## యుద్ధవీరము

౧౦. రణే దీనాన్ దేవాన్ దశవదన ! విద్రావ్య వహాని
ప్రభావప్రాగల్భ్యం త్వయి తు మమ కోయం పరికరః
లలాటోద్యజ్జ్వాలా కవలిత జగజ్జాల విభవో
భవో మే కోదండ చ్యుత విశిఖ వేగం కలయతు.

ఇది దశవదను గురించి రాము వాక్యము. సమరమున దీను లయిన దేవులను పాఱద్రోలి ప్రభావ ప్రాగల్భ్యము వహించు నీపై నా కీ పరికర మేల ? ఫాలాగ్నితో ప్రపంచము కబళించిన ఫాల నయనుడు నా బాణ వేగము గుర్తించును లే! ఇందు శివు డాలంబనము. రణదర్పన ముద్దీపనము. దశవదనావజ్ఞ యనుభావము. గర్వము సంచారి. వృత్తియు భవప్రస్తావమున ప్రకర్షకలిగి సముచితముగనున్నది.

## ధర్మవీరము

౧౧. సపది విలయమేతు రాజ్యలక్ష్మీః
ఉపరి పతంత్వథవా కృపాణధారాః
అపహరతు తరాం శిరః కృతాంతో
మమ తు మతిర్న మనాగపైతి ధర్మాత్.

అధర్మమున గూడ శత్రువును జయింప వచ్చు ననగా యుధిష్ఠిరు డనుమాట లివి. రాజ్యలక్ష్మి పోనీ! పైకత్తివేటులు పడనీ! నా శిరమును యముడు హరింపనీ! నా మతి ధర్మము విడువదు. ఇందు ధర్మవిషయ మాలంబనము. ధర్మవాక్యాలోచన ముద్దీపనము. శిరశ్ఛేదాద్యంగీకార మనుభావము.

## అద్భుతము

౧౨. చరాచర జగజ్జాల సదనం వదనం తవ
గలద్గగనగాంభీర్యం వీక్ష్యాస్మి హృతచేతనా.

కృష్ణవదనము చూచి యశోద పల్కుట. చరాచర ప్రపంచ మిమిడిన నీ వదనము చూడగా చైతన్యము మాయ మయినది. ఇందు వదన మాలంబనము. లోకజగములం చూచుట యుద్దీపనము. హృతచేతనత యనుభావము.

## హాస్యము

౧౩. శ్రీతాతపాదైర్విహితే నిబంధే
నిరూపితా నూతనయుక్తిరేషా
అంగం గవాం పూర్వమహో! పవిత్రం
న వా కథం ? రాసభధర్మపత్న్యాః

మా నాయన రచించిన గ్రంథమున నీ నవయుక్తి యున్నది. గోవుల పూర్వాంగమె పవిత్ర మగుట యేమి? రాసభధర్మపత్నికి నక్లై యపుగావుత. ఇందు తార్కికపుత్రు డాలంబనము. అతని నిశ్శంకోక్తి యుద్దీపనము. హాస మారు విధములు. ఉత్తములకు స్మితహసితములు, మధ్యములకు విహసితోపహసితములు, నీచుల కుపహసితాతిహసితములు కలుగును.

భయానకము.

౧౪. శ్యేనమంబరతలాదుపాగతం శుష్కదాననబిలో వ్యలోకయన్
కంపమానతనురాకులేక్షణః స్పందితుం న హి శశాక లావకః.

ఆకాశము నుండి వచ్చిన డేగను చూచుచు లావకము గొంతెండగా శరీరము కంపింపగా చూపు లాకులపడగా కదల లేక పోయినది. ఇందు శ్యేన మాలంబనము. వేగపతన ముద్దీపనము. ఆననాలోకాదు లనుభావములు.

బీభత్సము.

౧౫. నఖైర్విదారితాంత్రాణాం శవానాం పూయశోణితం
ఆననేష్వనులింపంతి హృష్టా వేతాళయోషితః.

పీనుగుల ప్రేగులను గోళ్ళతో పీకి దుర్గంధరక్తమును వేతాలవనితలు ముఖము లందు విలేపన మొనరించు కొను చున్నారు. ఇందు శవము లాలంబనము, ప్రేగులు లాగుట యుద్దీపనము. ఆవేగాదులు సంచారులు.

ఇట్లు సంక్షేపముగా రసములు నిరూపితము లయినవి. రసములు ప్రధానము లయినచో ధ్వని యని పేరు. అప్రధానము లగుచో రసాలంకారము లని పేరు కలుగును.

## ౬. రసవిరోధము.

వీరశృంగారములు, శృంగారహాస్యములు, వీరాద్భుతములు, వీరరౌద్రములు, శృంగారాద్భుతములలో పరస్పరము విరోధము లేదు. శృంగారబీభత్సములు, శృంగారకరుణములు, వీరభయానకములు, శాంతరౌద్రములు, శాంతశృంగారములకు విరోధ మున్నది. ప్రకృతరసమును పోషింప దలచిన కవి కావ్యమున విరుద్ధరసాంగముల నిబంధింప రాదు. విరుద్ధరసముల కూర్ప వలసి యున్నచో వాని విరోధము పరిహరించి కూర్ప వలెను.

## ౭. రసదోషములు.

రసమును రసశబ్దముచే గాని శృంగారాది శబ్దముచే గాని చెప్పరాదు. విభావాదులచే రస మభివ్యంగ్యము కావలయును. అది వాచ్యము కారాదు. రసస్థలమున వాచ్యవృత్తి కాపేయకల్పము. అట్లే స్థాయి వ్యభిచారులును శబ్దవాచ్యము లగుట దోషము, ప్రకృతరసము ప్రసంగాంతరమున విచ్ఛిన్నము కాగా పునర్దీపనము దోషము. ప్రకృతరసమున కుపకరింపని వస్తువు వర్ణించుటయు దోషము.

అనౌచిత్యము రసభంగహేతు వగుట పరిహరణీయము. ప్రసిద్ధౌచిత్య బంధము రసోపనిషత్తు. అనౌచిత్యమును ప్రకృతరసపుష్టి కగునేని యయుక్తము కాదు. రసప్రతికూలమగు ననౌచిత్యము నిషేధ్యము.

## ౮. గుణములు

మాధుర్యము, ఓజస్సు, ప్రసాదము అను మూడు గుణము లీ రసము లందుండును. గుణములు రసధర్మము లని మమ్మటాదు లందురు. ఆ యా గుణములు కల రసచర్వణ వలన ద్రుతి-దీప్తి-వికాసము అను మూడు చిత్తవృత్తులు కలుగును. గుణములు రసధర్మము లయినను "రచన మధురముగా నున్నది. బంధ మోజస్విగా నున్నది" యని యౌపచారికముగా పలుకుట కలదు. మాధుర్యాదికము ద్రుత్యాది చిత్తవృత్తి ప్రయోజక మని భావించుట సముచితము.

### మాధుర్యము

* సంయోగపరము లగు హ్రస్వములు లేక వేరు వేరు పదము లుండుట మాధుర్యము.

౧౬. నితరాం పరుషా సరోజమాలా న మృణాలాని విచారపేశలాని
యది కోమలతా తవాంగకానామథ కా నామ కథాపి పల్లవానాం?

నీ యంగకముల కోమలత భావించినచో సరోజముల మాల మిగుల పరుషము తామరతూండ్లును పేశలములా? ఇక పల్లవముల కత నేమి పలుకవలెను?

### ఓజస్సు

* సంయోగపర హ్రస్వము లధికముగా నుండి గాఢత్వ ముండుట ఓజోగుణము.

౧౬. సాహంకార సురాసురావలి కరాకృష్ట భ్రమన్మందర
క్షుభ్యత్క్షీరధి వల్గు వీచివలయ శ్రీ గర్వ సర్వంకషాః
తృష్ణా తామ్యదమంద తాపసకులైః సానందమాలోకితాః
భూమీభూషణ! భూషయంతి భువనాభోగం భవత్కీర్తయః.

భూమీభూషణ! నీ కీర్తులు భువనముల భూషించుచున్నవి. నీ కీర్తులు సురాసురులు పట్టుదలతో మందర మాకర్షింప క్షోభ మొందిన పాలకడలి లోని రమ్యతరంగశ్రీల గర్వము హరించినవి. తృష్ణా వ్యాకుల తాపసు లానందమున జూచుచున్నారు. ఇందు హ్రస్వపరక లఘువులు గాఢబంధ మున్నది.

ప్రసాదము

* అర్థములకు తగిన పదము లుండుట అర్థవైమల్య ముండుట ప్రసాదము.

౧౭. వాచా నిర్మలయా సుధామధురయా యాం నాథ శిక్షామదాః
తాం స్వప్నేపి న సంస్పృశామ్యహమహంభావావృతో నిస్త్రపః
ఇత్యాగః శతశాలినం పునరపి స్వీయేషు మాం బిభ్రతః
త్వత్తో నాస్తి దయానిధిర్యదుపతే మత్తో న మత్తః పరః.

ఓ! కృష్ణా! సుధామధురవాక్కుతో నాకు శిక్షణ మిచ్చితివి. నేను లజ్జాహీనుడనై యహంభావము పట్టి స్వప్నమున గూడ దాని స్పృశింప లేదు. ఎన్నియో యపరాధము లొనర్చితిని. అయినను నన్ను స్వీయజనమున భరించితివి. నీకన్న దయానిధి లేదు. నాకన్న మత్తుడు లేడు.

## ౭. గుణవ్యంజకత.

టవర్గ రహితము లయిన వర్గము లందలి ప్రథమ తృతీయములు అనుస్వార పరసవర్ణములు శుద్ధానునాసికములు మాధుర్య వ్యంజకములు. అసమాస మృదుసమాస రచన యుక్తము. ద్వితీయ చతుర్థ వర్ణములు అనుకూలములు కావు. దూరముగా కూర్పుపొందినచో ప్రతికూలములును గావు.

ద్వితీయ చతుర్థ వర్గవర్ణములు, టవర్గము, జిహ్వామూలీయోపధ్మానీయములు, రేఫఘటిత సంయోగపర హ్రస్వములు దీర్ఘసమాసరచన ఓజోవ్యంజకము. ప్రథమ తృతీయ వర్ణము లనుకూలములు కావు సంయోగ

ఘటకములు కాకపోయినచో ప్రతికూలములును గావు. శ్రుతమాత్రమున వాక్యార్థమును కరతలబదరముగా నివేదించు ఘటన ప్రసాదాభివ్యంజకము.

వర్ణములకు స్వానంతర్య మశ్రవ్యము. స్వసమాన వర్గ్యముల యానంతర్యమునట్టిది. త్ర్యాదివర్ణసంయోగము, దీర్ఘానంతరసంయోగము అశ్రవ్యము. ఈ యశ్రవ్యత్వము కావ్యమునకు పంగుత్వమువలె నుండును. సంధి చేయకుండుట యశ్రవ్యము. ఇట్టివన్నియు కావ్యసామాన్యమున వర్జనీయములు, మధుర రసానుకూల వర్ణము లోజస్వి ప్రతికూలములు. మధుర వర్జనీయము లోజస్వ్యనుకూలములు.

## ౧౦. రచన.

దీర్ఘసమాసములు, విసర్గ ప్రాచుర్యము, జిహ్వామూలీయోపధ్మానీయ ప్రాచుర్యము, రేఫఘటిత సంయోగము, శాబ్దిక ప్రియము లయిన యజంతములు మధుర రసము నందు తగవు. ఆపాత చమత్కారు లగు యమకాను ప్రాసములును యుక్తములు కావు. యమకాదులు రసచర్వణలో నంతర్భవింపవు. సహృదయహృదయమును స్వాభిముఖము చేసికొని రసపరాఙ్ముఖము చేయును. ధ్వన్యాత్మ శృంగారమున యమకాది నిబంధన ముచితము కాదు. రసచర్వణాభిముఖ్య మీయ గల యనుప్రాసాదుల త్యజింప నక్కఱ లేదు.

## ౧౧. భావధ్వని.

హర్షాది భావములకు విభావానుభావములు వ్యంజకములు. వేరొక వ్యభిచారిభావము నంగము కా వచ్చును.

* హర్ష - స్మృతి - వ్రీడా - మోహ - ధృతి - శంకా - గ్లాని - దైన్య - చింతా - మద - శ్రమ - గర్వ - నిద్రా - మతి - వ్యాధి - త్రాస - సుప్తి - విబోధాఽమర్ష - అవహిత్థా - ఉగ్రతా - ఉన్మాద - మరణ - వితర్క - విషాద - ఔత్సుక్య - ఆవేగ - జడతా - అలస్య - అసూయా - అపస్మార - చపలతా - నిర్వేదములు ముప్పది మూడు వ్యభిచారి భావములు. గురు దేవ పుత్రాది విషయ రతియు వ్యభిచారిభావము.

### ౧. హర్షము.

* ఇష్టప్రాప్త్యాదిజన్య సుఖవిశేషము హర్షము.

౧౯. అవధౌ దివసావసానకాలే భవనద్వారి విలోచనే దధానా
అవలోక్య సమాగతం తదా మా మథ రామా వికసన్ముఖీ బభూవ.

సాయం సమయావధిలో భవనద్వారమున నేత్రము లుంచి యపుడు వచ్చిన నన్ను చూచి రామ వికసన్ముఖి యయినది. ఇందవధి కాలమున ప్రియాగమనము విభావము. ముఖవికాస మనుభావము,

### ౨. స్మృతి

* సంస్కారజన్య జ్ఞానము స్మృతి.

౨౦. "తన్మంజు మందహసితం శ్వసితాని తాని
సా వై కలంకవిధురా మధురాననశ్రీః
అద్యాపి మే హృదయమున్మథయంతి హంత;
సాయంతనాంబుజ సహోదర లోచనాయాః;

ఆ సాయంకమలలోచన యొక్క ఆ మందహాసము ఆ నిట్టూర్పులు ఆ అకలంక ముఖ శోభ ఇప్పటికి నా హృదయము పెలివేయు చున్నవి. ఇందు చింతావిశేషము విభావము.

### ౩. వ్రీడ

* స్త్రీలకు పురుషావలోకనమున, పురుషులకు పరాభవాదుల వలన గలుగు చిత్తవృత్తి వ్రీడ.

౨౧. కుచకలశ యుగాంతర్మామకీనం నఖాంకం
సపులక తను మందం మందమాలోకమానా
వినిహితవదనం మాం వీక్ష్య బాలా గవాక్షే
చకిత నతనతాంగీ సద్మ సద్యో వివేశ.

కుచముల నా నఖాంకమును మేని పులకలతో మెల్లగా చూచుచు గవాక్షము నుండి చూచు నన్ను చూచి బెదురుగా నప్పుడే పిల్లది యిల్లు దూరినది. ఇందు ప్రియదర్శనము తన పులకలు ప్రియుడు చూచుట విభావము. సద్యః సదన ప్రవేశ మనుభావము.

### ౪. మోహము.

* భయ వియోగ జన్యము వస్తుతత్త్వము తెలియని చిత్తవృత్తి మోహము.

౨౨. విరహేణ వికలహృదయా విలపంతీ దయిత ! దయితేతి
ఆగతమపి తం సవిధే పరిచయహీనేవ వీక్షతే బాలా.

విరహముచే వికలహృదయయై "దయిత! దయిత!" యని విలపించుచు నా మగువ సవిధమున వచ్చి యున్నను ప్రియుని పరిచయము లేని దాని వలె చూచుచున్నది. ఇందు కాంతావియోగము విభావము. ఇంద్రియ వైకల్య మనుభావము.

### ౫. ధృతి.

* లోభ శోక భయాదుల వలన గలిగిన యుపప్లవమును నివారించు చిత్తవృత్తి విశేషము ధృతి.

౨౩. సంతాపయామి హృదయం ధావం ధావం ధరాతలే కిమహం?
అస్తి మమ శిరసి సతతం నందకుమారః ప్రభుః పరమః.

భూమి యందు తిరిగి తిరిగి నా హృదయమును సంతాపపెట్టుటేల? నా శిరమున పరమప్రభువు నందనందనుడు నిత్య మున్నాడు లె! ఇందు వివేకము శ్రుతసంపత్తి విభావము.

### ౬. శంక.

* ఏమనిష్టము కలుగునో ? యనెడు చిత్తవృత్తి శంక.

౨౪. విధివంచితయా మయా న యాతం
సఖి! సంకేతనికేతనం ప్రియస్య
అధునా బత! కిం విధాతుకామో
మయి కామో నృపతిః పునర్న జానే.

సఖీ! విధివంచితనై నేను ప్రియుని సంకేత నికేతనమునకు బోలేదు. ఇప్పుడు కాము డేమి చేయునో? నృపతి యేమో? తెలియను గదా! ఇందు రాజాపరాధము విభావము. ముఖ వైవర్ణ్యాదు లనుభావములు.

### ౭. గ్లాని.

* ఆధి వ్యాధుల వలని బలహాని వలన గలుగు నది వైవర్ణ్య దృక్ భ్రమణాది హేతువు నగు దుఃఖవిశేషము గ్లాని.

౨౫. "శయితా శైవలశయనే సుషమాశేషా నవేందులేఖేవ
ప్రియమాగతమపి సవిధే సత్కురుతే మధురవీక్షణైరేవ"

కాంతియే మిగిలిన యిందులేఖ వలె శైవలశయనమున శయనించినదై సన్నిధికి వచ్చినను ప్రియుని చూపులతోడనే సత్కరించుచున్నది. ఇందు ప్రియవిరహము విభావము. ఆశ్లేషాదులు లేకుండుట యనుభావము.

### ౮. దైన్యము.

* దుఃఖ దారిద్ర్యాపరాధాది జన్యము స్వనిందా హేతువగు చిత్తవృత్తి దైన్యము.

౨౬. "హతకేన మయా వనాంతరే వనజాక్షీ సహసా వివాసితా
అధునా మమ కుత్ర సా సతీ పతితస్యేవ పరా సరస్వతీ".

సీతను విడిచిన రాముని వచనము. హతకుడనగు నేను నావనజాక్షిని వనాంతరములో త్యజించితిని. పతితునకు పరాసరస్వతి వలెనిక నాకా సతి యేగి? దుఃఖము విభావము. తన నింద యనుభావము.

### ౯. చింత.

* ఇష్టశాప్త్యనిష్టప్రాప్తి జన్యము వైవర్ణ్యాది హేతువు ధ్యానాపరపర్యాయము చింత

౨౭. "అధరద్యుతిరస్తపల్లవా ముఖశోభా శశికాంతిలంఘినీ
అకృతప్రతిమా తనుః కృతా విధినా కస్యకృతే మృగీదృశః?"

ఈ కన్య అధర కాంతి పల్లవముల కాదనినది. ముఖశోభ చంద్రునతిశయించినది. తను వప్రతిమానము. విధి యెవనికై విధించెనో? ఇందు తదప్రాప్తి విభావము.

### ౧౦. మదము.

* మధ్యసేవన జన్యము శయన హసితాది హేతువు ఉల్లాసము మదము.

ఉత్తమునకు స్వాపము మధ్యమునకు హసితగానములు నీచునకు రోదన పరుషోక్తు లనుభావములు.

౨౮. "మధురతరం స్మయమానః స్వస్మిన్నేవాలపన్ శనైః కిమపి
కోకనదయంస్త్రిలోకీం ఆలంబనశూన్యమీక్షతే క్షీబః".

మధురముగా నవ్వుచు, తనలో తానె మెల్లగా పలుకుచు లోక మెల్లగా జేసికొని మత్తు డనాలంబముగ జూచుచున్నాడు. ఇందు మాదక ద్రవ్యసేవనము విభావము. అవ్యక్తాలాప మనుభావము.

౨౯. "మధురసాన్మధురం హి తవాధరం
తరుణి ! మద్వదనే వినివేశయ !
మమ గృహాణ! కరేణ కరాంబుజం
ప-ప-ప-తామి హా-హా భ-భ-భూతలే.

తరుణీ! మధువుకన్న మధుర మయిన నీ యధరమును నా వదనమున నుంచుము. నా కరపద్మమును నీ చేతితో పట్టుకొనుము! భు. భు. భూమిపై ప- ప పడుచున్నాను. ఇం దధికవర్ణోచ్చారణ మనుభావము. పూర్వార్థమున గ్రామ్యోక్తి, యుత్తరార్థమున స్వకరమునె యంబుజసమముగా జెప్పుట మదపోషకము.

౧౧. శ్ర మ ము.

* శరీర వ్యాపార జన్యము నిద్రా నిశ్వాస జనకము ఖేదవిశేషము శ్రమము.

౩౦. "విధాయ సా మద్వదనానుకూలం
కపోలమూలం హృదయే శయానా
చిరాయ చిత్రే లిఖితేవ తన్వీ
న స్పందితుం మందమపి క్షమాసీత్"

నా వదనమునకు కపోలముంచి హృదయాన శయనించినదై చిత్ర లిఖిత వలె తన్వి మందముగా స్పందించుటకును శక్తి కలది కాలేదు. ఇందు విపరీతవ్యాపారము విభావము. అస్పంద శయన మనుభావము.

౧౨. గ ర్వ ము.

* రూపధనాదుల వలని యాత్మోత్కర్ష తదధీన పరావహేలనము గర్వము.

౩౧. "ఆమూలాద్రత్నసానోర్మలయ వలయితాదాచ కూలాత్పయోధేః
యావంతః సంతి కావ్యప్రణయన పటవస్తే విశంకం వదంతు
మృద్వీకామధ్య నిర్యన్మసృణరసఝరీ మాధురీభాగ్య భాజాం
వాచామాచార్యతాయాః పదమనుభవితుం కోస్తి ధన్యో మదన్యః"

మృద్వీకా రసధునీ మాధుర్యము కల వాక్కుల యాచార్యతా పద మనుభవించుటకు నాకన్న ధన్యుడన్య డెవడు ? రత్నసానువు మూలము మొదలు సముద్రకూలము వఱకు గల కావ్యరచనా దక్షు లంద రశంకముగా జెప్పుడు ! కోఽస్తి ధన్యో మదన్యః ?" ఇందు స్వకీయకవిత యనన్యసాధారణ మనుట విభావము. పరాధిక్షేపమున కిట్టి వాచాప్రయోగ మనుభావము.

౧౩. నిద్ర

* శ్రమాదిజన్యము చేతస్సమ్మీలనము నిద్ర.

౩౨ "సా మదాగమన బృంహిత తోషా జాగరేణ గమితాఖిల దోషా
బోధితాపి బుబుధే మధుపైర్న ప్రాతరాననజ సౌరభ లుబ్ధైః"

నా రాకచే సంతుష్టయై రాత్రి జాగరమున గడపి వేకువ శయనించిన కాంత ముఖపరిమళాసక్తము లయిన మధుపములు ప్రబోధించినను మేలుకొన లేదు. ఇందు రాత్రిజాగరణశ్రమము విభావము. అబోధ మనుభావము.

౧౪. మతి

* శాస్త్రానుశీలన జన్యము తత్త్వనిశ్చయము మతి.

౩౩. "నిఖిలం జగదేవ నశ్వరం పునరస్మిన్ నితరాం కళేబరం
అథ తస్య కృతే కియానయం క్రియతే హంత! మయా పరిశ్రమః."

ఈ జగమంతయు నశ్వరము. ఇందు శరీరము వినశ్వరము. హంత ! దానికై నే నెంత పరిశ్రమ చేయు చుంటిని! ఇందు శరీరము జలబుద్బుదోపమ మను శాస్త్రపర్యాలోచనము విభావము. వితృష్ణత యనుభావము.

౧౫. వ్యాధి.

* రోగము విరహము మొదలగు వాని వలన గలుగు మనస్తాపము వ్యాధి.

౩౪. "హృదయే కృత శైవలానుషంగా
ముహురంగాని యత స్తతః క్షిపంతీ
తదుదంతపరే ముఖే సఖీనాం
అతిదీనామియమాదధాతి దృష్టిం"

ఈ యమ్మ హృదయమున శైవాల ముంచినది. అటు నిటు నంగముల విదల్చు చున్నది. అతని యుదంతము చెప్పు సఖుల ముఖమున నీమె యతిదీన దృష్టి నిలిపినది. ఇందు విరహము విభావము. అంగక్షేపాదు లనుభావములు.

## ౧౬. త్రాసము.

* క్రూరదర్శనాదుల గలుగు భీరువు చిత్తవృత్తివిశేషము త్రాసము.

౩౫. ఆలీషు కేలీరభసేన బాలా ముహుర్మమాలాపముపాలపంతీ
ఆరాదుపాకర్ణ్య గిరం మదీయాం సౌదామినీయాం సుషమామయాసీత్

అటుల యాసక్తి చెలియలలో నా యాలాప మాలపించుచు నా బాల యటుగా నా మాట విని మెఱుపు మెఱసినది. ఇందు పతి తనమాట వినుట విభావము. పలాయన మనుభావము.

## ౧౭. సుప్తము. స్వప్నము.

* నిద్రావిభావమున గలుగు జ్ఞానము సుప్తము.

౩౬. "అకరుణ! మృషాభాషాసింధో! విముంచ మమాంచలం
తవ పరిచితః స్నేహః సమ్యఙ్మయేత్యనుభాషిణీం
అవిరల గలద్బాష్పాం తన్వీం నిరస్తవిభూషణాం
క ఇహ భవతీం భద్రే! నిద్రే! వినా వినివేదయేత్

ప్రవాసగతు డొకడు ప్రియురా లిట్లనుచున్నదని స్వప్నమున గాంచి నిద్ర నుద్దేశించిపలుకుట. "నిర్దయ! అసత్యభాషీ! నా కొంగు విడువుము! నీ స్నేహము పరిచితమే. బాగుగా తెలిసినదిలే!" అని పలుకుచు కన్నీరు పెట్టి విభూషణాలు విడిచిన ప్రేయసిని నీవు కాక నిద్రా! నివేదించు వా రెవరు?

## ౧౮. విబోధము.

* నిద్రానంతరము కలుగు బోధము విబోధము.

౩౭. "నితరాం హితయాద్య నిద్రయా మే
బత! యామే చరమే నివేదితాయాః
సుదృశో వచనం శ్రుణోమి యావత్
మయి తావత్ప్రచకోప వారివాహః"

హితమగు నిద్ర చివరి జాములో సూచించిన సుదృశ వచనము విను నంతలో నాపై మేఘుడు కోపించినాడు. ఇందుఱుము వినుట విభావము.

## ౧౯. అమర్షము.

* నానాపరాధ జన్యము మౌన పరుషవాక్యాదికారణ మగు చిత్తవృత్తి యమర్షము.

౩౮. "వక్షోజాగ్రం పాణినాఽఽమృశ్య దూరే
యాతస్య ద్రాగాననాబ్జం ప్రియస్య
శోణాగ్రాభ్యాం భామినీ లోచనాభ్యాం
జోషం జోషం జోషమేవావతస్థే"

కుచాగ్రము కరముతో ఫుణికి దూరము పోయిన ప్రియుని ముఖమును భామిని కెంపు కనుల తుదలతో నట్టుకొఱకొఱ యుండినది. ఇందాకస్మిక స్పర్శ విభావము. నయనారుణ్యము నిర్నిమేష నిరీక్షణ మనుభావములు.

౨౦. అవహిత్థము.

* వ్రీడాదుల గలిగిన హర్షాదుల గోపనమున కగు భావవిశేష మవహిత్థము.

౩౯. "ప్రసంగే గోపానాం గురుషు మహిమానం యదుపతేః
ఉపాకర్ణ్య స్విద్యత్పులకిత కపోలా కులవధూః
విషజ్వాలాజాలం ఝడితి వమతః పన్నగపతేః
ఫణాయాం సాశ్చర్యం కథయతితరాం తాండవవిధిం."

పెద్దలలో గోపప్రసంగమున కృష్ణుని మహిమ విని కులవధువు కపోలము పులకింప, విషముగ్రక్కు కాళియుని పడగలపై తాండవమును సాశ్చర్యముగా పలుకుచున్నది. ఇందు వ్రీడ విభావము. కాలియ కథా ప్రసంగ మనుభావము.

౨౧. ఉగ్రత.

* అధిక్షేపాపమానాది జన్యము "దీనికై నే నేమి చేయుదు" ననెడు చిత్తవృత్తి యుగ్రత.

౪౦. "అవాప్య భంగం ఖలు సంగరాంగణే
నితాంత మంగాధిపతే రమంగళం
పరప్రభావం మమ గాండివం ధను
ర్వినిందతస్తే హృదయం న కంపతే."

కర్ణునితో నోడి గాండివము నిందించు ధర్మజు నర్జును డనుట. కర్ణుని వలన యుద్ధమున నోడి యమంగళముగా నా గాండివమును ప్రభావయుతమును నిందించు నీ హృదయము కంపింపదో? ఇందు గాండివనింద విభావము. వధేచ్ఛ యనుభావము.

## ౨౨. ఉన్మాదము.

* విప్రలంభ మాపద పరమానందముల గలుగు
"ఒకటి వే రొకటిగా తలచుట" యున్మాదము.

౪౧. "అకరుణహృదయ! ప్రియతమ! ముంచామి త్వామితః పరం నాహం
ఇత్యాలపతి కరాంబుజ మాదాయాలీజనస్య వికలా సా."

దయారహిత! ప్రియ! నిన్నిక విడువ నని సఖీకరము పట్టి యా చెకిలిది యాలపించు చున్నది. ఇందు ప్రియవిరహము విభావము. అసంబద్ధోక్తి యనుభావము.

## ౨౩. మరణము

* రోగాదిజన్యము మూర్ఛారూప మగు మరణ
ప్రాగవస్థ మరణము.
ప్రాణవియోగాత్మక మయిన ముఖ్యమరణ మిచట గ్రహింపరాదు.

౪౨. "దయితస్య గుణాననుస్మరంతీ శయనే సంప్రతి యా విలోకితాసీత్
అధునా ఖలు! హంత! సా కృశాంగీ గిరమంగీకురుతే న భాషితాపి."

ప్రియగుణముల స్మరించుచు శయనించిన యామె పలుకరించినను గుర్తింప కున్నది కదా! ఇందు ప్రియవిరహము విభావము. వచనవిరామ మనుభావము. అమంగళప్రాయ మగుట కవులు దీని ప్రధానముగా వర్ణింపరు.

## ౨౪ వితర్కము

* సందేహానంతరము కలుగు ఊహ వితర్కము.

౪౩. "యది సా మిథిలేంద్రనందినీ నితరామేవ న విద్యతే భువి
అథ మే కథమస్తి జీవితం న వినాలంబనమాశ్రిత స్థితిః"

ఇది రాముని స్వాత్మవచనము. ఆ మిథిలేంద్రనందిని భువిలో లేక నే పోయినచో నా కిక జీవిత మెట్లుండును? ఆలంబనము లేక యాశ్రిత ముండదు కదా!. ఇందు, "భువిలో సీత యున్నదా? లేదా?" అను సందేహము విభావము.

## ౨౫. విషాదము

* ఇష్టాసిద్ధ్యాదుల వలని యనుతాపము విషాదము.

౪౪. "భాస్కరసూనావస్తం యాతే జాతే చ పాండవోత్కర్షే
దుర్యోధనస్య జీవిత! కథమివ నాద్యాపి నిర్యాసి?"

కర్ణుడు గతించెను. పాండవుల కుత్కర్ష కలిగెను. ఓ! దుర్యోధను జీవితమా! ఇంకను నీవు పోవేమి? ఇందు తన హాని పరుల యుత్కర్ష కనుట విభావము. జీవితము పోవలె ననుకొనుట యనుభావము.

౨౬. ఔత్సుక్యము

* ఇపుడే దీని లాభము కలుగ వలె ననెడి యిచ్ఛ యౌత్సుక్యము.

౮౫. నిపతద్బాష్పసంరోధ ముక్తా చాంచల్య తారకం
కదా నయన నీలాబ్జ మాలోకేయ? మృగీదృశః

ముత్యాలబోలు రాలు బాష్పములు కూడి తరళ తారకలు కలుగు నా వనిత నయనము లెన్నడు చూతునో?

౨౭. ఆవేగము.

* అనర్థాతిశయ జన్యము చిత్తమునకు సంభ్రమ వృత్తి యావేగము.

౮౬. "లీలయా విహిత సింధు బంధనః సోయమేతి రఘువంశ నందనః
దర్ప దుర్విలసితో దశాననః కుత్ర యామి? నికటే కులక్షయః."

మండోదరి యాత్మవచనము. లీలగా సాగరము బంధించి రాఘవుడు వచ్చెడి. దశాననుడు గర్వచేష్టుడు. కులక్షయము దాపురించినది. ఎట కేగుదును? ఇందు రాఘవాగమనము విభావము. స్థైర్యము లేమి యనుభావము.

౨౮. జడత.

* చింతా భయ విరహేష్టానిష్ట దర్శనాది జన్య మవశ్య కర్తవ్యము లొనరింపనీని చిత్తవృత్తి జడత.

౮౭. "యదవధి దయితో విలోచనాభ్యాం
సహచరి! దైవవశేన దూరతోఽభూత్
తదవధి శిథిలీకృతో మదీయై
రథ కరణైః ప్రణయో నిజక్రియాసు."

సఖి! దైవవశాన దయితుడు దూరము కాగా నా యింద్రియములు తమ పనుల నాసక్తి విడనాడినవి. ఇందు ప్రియవిరహము విభావము. పనులు మానుట యనుభావము.

### ౨౯. ఆలస్యము.

* అతితృప్తి శ్రమాది జన్యము మనము క్రియోన్ముఖము
కాకుండుట యాలస్యము.

౪౮. “నిఖిలాం రజనీం ప్రియేణ దూరా
దుపయాతేన విబోధితా కథాభిః
అధికం న హి పారయామి వక్తుం
సఖి! మా జల్ప! తవాయసీ రసజ్ఞా.

దూరము నుండి వచ్చిన ప్రియుడు రాత్రి యంతయు కథలతో మేల్కొన పెట్టినాడు సఖి! నే నధికము పలుక లేనే? మాటలాడకే! నీ రసన యినుముతో జేసిన దేమే!. ప్రియుడు వచ్చిన మరుదినమున గత నిశా వృత్తాంత మడుగ చెలికి జాగరణ జనితాలస్య యిట్లనినది. ఇందు రజని జాగరణము విభావము అధికసంభాషణము లేమి యనుభావము.

### ౩౦. అసూయ.

* పరుల యుత్కర్ష దర్శనాది జన్యము పరనిందాది కారణ
మగు చిత్తవృత్తి యసూయ.

౪౯. “కుత్ర శైవం ధనురిదం క్వచాయం ప్రాకృతః శిశుః
భంగస్తు సర్వసంహర్త్రా కాలే నైవ వినిర్మితః.

శివధనువు భంజించిన రాముని సహింప జాలని రాజుల వచన మిది, ఈ శైవధను వెక్కడ? ఈ ప్రాకృతు డగు పిల్ల డెక్కడ? సర్వసంహారకు డగు కాలుడే భంగ మొనరించినాడు. ఇందు సర్వాధిక రామ బలదర్శనము విభావము. నింద యనుభావము.

### ౩౧. అపస్మారము

* వియోగ భయాదుల యతిశయమున గ్రహావేశాదుల వలన
గలిగిన వ్యాధివిశేష మపస్మారము.

౫౦. “హరిమాగతమాకర్ణ్య మధురామంత కాంతకం
కంపమానః శ్వసన్ కంసో నిపపాత మహీతలే”

అంత కాంతకుడు శ్రీకృష్ణుడు మధుర వచ్చె నని విని కంసుడు కంపించి శ్వసించి భూమిపై పడెను. ఇందు భయము విభావము. కంపాదు లనుభావములు.

### ౩౨. చపలత.

* అమర్షాదిజన్యము వాక్పారుష్యాది కారణము అగు చిత్తవృత్తి చపలత

౫౧. "అహితవ్రత! పాపాత్మన్ మైవం మే దర్శయాననం
ఆత్మానం హంతుమిచ్ఛామి యేన త్వమసి భావితః."

భగవద్భక్తి విఘటించుట కుపాయము తోచక ప్రహ్లాదుని హిరణ్యకశిపు డనుట. దుష్టవ్రత! పాపాత్మ! నీ ముఖము నాకు చూపకుము. నీ విట్లయినందున చచ్చి పోవలె ననుకొనుచున్నాను. ఇందు పుత్రద్వేషము విభావము. ఆత్మవధేచ్ఛ యనుభావము.

### ౩౩. నిర్వేదము.

* విషయ ద్వేష మను చిత్తవృత్తి నిర్వేదము.

ఉత్తములందవజ్ఞాదులచే గలుగును. నీచులందధిక్షేపాదుల గలుగును.

౫౨. "యది లక్ష్మణ! సా మృగేక్షణా న మదీక్షాసరణిం సమేష్యతి
అమునా జడజీవితేన మే జగతా వా విఫలేన కిం ఫలం?"

లక్ష్మణా! ఇక నా కామె కంటికి కన్పడదు. ఈ జీవిత మీ జగము విఫల మేమి ఫలము?

దేవాదివిషయ రతి భావ మగుట కుదా!—

౫౩. "న ధనం న చ రాజ్యసంపదం న హి విద్యామిద మేకమర్థయే
మయి ధేహి! మనాగపి ప్రభో! కరుణాభంగి తరంగితాం దృశం."

ప్రభూ! దయాదృష్టి నా యందుంచుము. ధనము రాజ్యసంపద విద్య ఇతర మేమియు నాకు వలదు. నీ కరుణనే యర్థింతును. ఇందు భక్తుడు ధనాద్యపేక్షా శూన్యుడు, భగవద్దృగంతపాతాభిలాషి, భగవాను నందత్యంతానురక్తి నిది వ్యక్తము చేయును, ఇట్లు సంక్షేపముగా భావములు నిరూపితము లయినవి

## ౧౨. ఆభాస.

### రసాభాసము.

* అనుచిత విభావాలంబన ముండుట రసాభాసము.

విభావాదుల యనౌచిత్యము లోకవ్యవహారమున దెలియ దగును. విభావాదిక మనుచిత మగుటయె కాదు. రత్యాదిక మనుచిత మయినను రసాభాసమె యగును.

౫౪. "శతేనోపాయానాం కథమపి గతః సౌధశిఖరం
సుధాఫేనస్వచ్ఛే రహసి శయితాం పుష్పశయనే
విబోధ్య క్షామాంగీం చకితనయనాం స్మేరవదనాం
సనిశ్వాసం శ్లిష్యత్యహహ! సుకృతీ రాజరమణీం."

శతోపాయములతో సౌధశిఖరము చేరి యమృత ధవళ మయిన పుష్పశయనమున శయనించిన చకితనయన స్మేరవదన యయిన రాజరమణిని మేల్కొలిపి సుకృతి యగువాడె సనిశ్వాస మాశ్లేషించును. ఇం దనుచిత ప్రణయ రాజరమణి యాలంబనము. రహోరజన్యాదిక ముద్దీపనము. అంతఃపురగమన మాశ్లేష మనుభావములు. ఇందలి రతి నిషిద్ధాలంబనక మగుట రసాభాసము.

౫౫. భవనం కరుణావతీ విశంతీ గమనాజ్ఞా లవ లాభ లాలసేషు
తరుణేషు విలోచనాబ్జమాలా మథ బాలా పథి పాతయాంబభూవ.

ఒక కామిని యెచటి నుండియో మార్గమున వచ్చుచున్నది. తద్రూప యౌవనాసక్తులు యువకు లనుగమించు చున్నారు. ఆమె భవనప్రవేశ సమయమున తమ సేవాసార్థక్యము తెలియుటకై యనుజ్ఞాపేక్షు లయిన వారి నా కామిని చూపులు చిమ్మి చూచిన దను ప్రసంగ మభ్యూహ్యము. కరుణావతి కన్య భవనము ప్రవేశించుచు గమనమునకై యాజ్ఞా లవ మభిలషించిన తరుణులందు మార్గమున లోచనాబ్జమాల ప్రసరింప జేసిన దని భావము. ఇందు గోచరించు బాలారతి బహువిషయ మగుట రసాభాసము. పాంచాలీరతి పరిణేతృ బహునాయక విషయ మగుట రసాభాసము కా దని ప్రాచీను లందురు.

విప్రలంభాభాసము.

శృంగార రసము వలె శృంగారాభాసమును సంయోగ విప్రలంభ భేదమున ద్వివిధము. సంయోగాభాస ముదాహృతము. ఇక విప్రలంభాభాసము.

౫౬. "వ్యత్యస్తం లపతి క్షణం క్షణమథో మౌనం సమాలంబతే
సర్వస్మి న్విదధాతి కిం చ విషయే దృష్టిం నిరాలంబనాం
శ్వాసం దీర్ఘమురీకరోతి న మనాగంగేషు ధత్తే ధృతిం
వైదేహీ కమనీయతా కవలితో హా! హంత! లంకేశ్వరః."

సీతా ప్రేమవివశు డయిన రావణుడు క్షణము వ్యత్యస్తము పలుకును. క్షణము మౌనము దాల్చును. అంతట నిరాలంబన దృష్టి నుంచును. దీర్ఘము శ్వసించును. ఏమియు ధైర్య మూనడు. ఇందు సీతాలంబన మయిన లంకేశ గత మగు విప్రలంభరతి యుభయనిష్ఠము కా నందున రసాభాసము. రతి యనుభయనిష్ఠ మయినను రసాభాసమె.

భా వా భా స.

ఇట్లె యనుచితవిషయ మగు భావము భావాభాసము.

౫౭. "సర్వోపి విస్మృతిపథం విషయాః ప్రయాతాః
విద్యాపి ఖేదకలితా విముఖీ బభూవ
సా కేవలం హరిణశావకలోచనా మే
నైవాపయాతి హృదయాదధిదేవతేవ."

గురుకులమున విద్యాభ్యాస మొనర్చు నపుడు తదీయ కన్యా లావణ్యా గృహీత మానసుడు భావించిన రీతి యిది. సర్వవిషయములు మఱపు పట్టినవి. కష్టపడి పొందిన విద్యయు విముఖ యయినది. ఆ హరిణలోచన యధిదేవత వలె హృదయము వీడ కున్నది. ఇందు భావ మనుచితవిషయక మగుట అనుభయనిష్ఠ మగుట యాభాస మయినది.

భా వ శాం తి.

* భావము శమించుట భావశాంతి.

౫౮. "ముంచసి నాద్యాపి రుషం భామిని! ముదిరాలిరుదియాయ
ఇతి తన్వ్యాః ప్రతివచనైః అపాయి నయనాబ్జ కోణశోణ రుచిః"

భామిని! ఇప్పటికి కోపము విడనాడవు. మేఘములు పట్టినవి. అని పతి యనగనె యా తన్వి నయనాంత శోణ కాంతి పోయినది. ఇందు ప్రియ వచన శ్రవణము విభావము, శోణకాంతి పోవుట తదభివ్యక్త ప్రసాద మనుభావము. పూర్వ ముదయించిన రోషము నశించిన దని వ్యంగ్యము.

భా వో ద య ము.

* భావ ముత్పన్న మగుట భావోదయము.

౫౯. "వీక్ష్య వక్షసి విపక్ష కామినీ హారలక్ష్మ దయితస్య భామినీ
అసందేశవలయీకృతాం క్షణా దాచకర్ష నిజ బాహు వల్లరీం."

ఒక భామిని దయితుని యురమున వేరొక కామినీ హారచిహ్నము చూచి భుజము లందు వలయ మయిన తన బాహువల్లరిని క్షణములో లాగి కొనినది. ఇం దన్యవనితా హారలక్ష్మ దర్శనము విభావము. ప్రియాంసదేశ వలయీకృత నిజ బాహులతాకర్షణ మనుభావము, రోషోదయము వ్యంగ్యము.

భావసంధి.

* అన్యోన్య మనభిభూతములు అభిభవన యోగ్యము లయిన భావముల కలయిక భావసంధి.

౬౦. "యౌవనోద్గమ నితాంత శంకితాః
శీల శౌర్య బల కాంతి లోభితాః
సంకుచంతి వికసంతి రాఘవే
జానకీ నయన నీరజ శ్రియః."

సీతా నయన కాంతులు రాఘవు నందు యౌవనోదయమున శంకాకులములై సంకోచమును శీలశౌర్యబల కాంతులచే లోభము పొందినవై వికాసమును పొందినవి. ఇందు యౌవన శీల శౌర్యాది దర్శనము విభావము, నయన సంకోచ వికాసము లనుభావములు. వ్రీడౌత్సుక్యముల సంధి వ్యంగ్యము.

భావశబలత.

* విరుద్ధములు కాని, యుదాసీనములు కాని భావము లనేకములు వ్యామిశ్రణము పొందుట భావశబలత.

౬౧. "పాపం హంత! మయా హతేన విహితం సీతాపి యద్వాపితా
సా మామిందుముఖీ వినా బత! వనే కిం జీవితం ధాస్యతి?
ఆలోకేయ కథం ముఖాని కృతినాం? కిం తే వదిష్యంతి మాం
రాజ్యం యాతు రసాతలం పునరిదం న ప్రాణితుం కాంక్షయే."

దుష్టుడ నయిన నేను పాపమె చేసితిని. సీతను కూడ విడిచితిని గదా! ఆ యిందుముఖి సీత నేను వినా వనమున జీవితము ధరించునా? పెద్దల ముఖములు నే నెట్లు చూతును? వారు న న్నేమని యందురో? ఈ రాజ్యము రసాతలమునకు పోనీ! జీవించుట నా కిష్టము కాదు. ఇందు పాదక్రమమున మత్యసూయావిషాదములు స్మృతివితర్కములు వ్రీడాశంకలు నిర్వేదము అనునవి గోచరించును. వాని శబలతను భావించునది.

స్థాయి మూలక మగుట రసమునకు ప్రశమాదులు సంభవింపవు. సంభవించినను చమత్కారము లేదు. అందుచే తద్విచారము లేదు. ఈ చెప్పిన సర్వ రత్యాది వ్యంగ్య ప్రపంచమును సహృదయుడు సూక్ష్మ సమయముననే గోచరింప జేసికొనును. కావున అసంలక్ష్య క్రమ మని వ్యపదేశించి నారు. వాచ్య వ్యంగ్యముల క్రమము స్పష్ట గోచర మగునేని యిది సంలక్ష్యక్రమమును గావచ్చును. ఇంక నీ రసాది ధ్వని ప్రపంచము పద-వర్ణ-రచనా-వాక్య-ప్రబంధ-పదైక దేశ-రాగములచే నభివ్యక్త మగును. రాగాదులచే రసము వ్యంగ్యమగు ననుటలో సహృదయ హృదయమె ప్రమాణము.

## ౧౩. ధ్వని.

ఇక సంలక్ష్యక్రమ ధ్వని నిరూపింతుము, శబ్ద శక్తిమూల మని యర్థ శక్తి మూల మని యిది ద్వివిధము. అర్థశక్తిమూలక మష్టమూర్తి.

౧ లోకసిద్ధ వస్తు మూలక వస్తుధ్వని
౨ ,, ,, ,, అలంకారధ్వని
౩ ,, అలంకారమూలక వస్తుధ్వని
౪ ,, ,, అలంకారధ్వని
౫ ప్రతిభాసిద్ధ వస్తుమూలక వస్తుధ్వని
౬ ,, ,, అలంకారధ్వని
౭ ,, అలంకారమూలక వస్తుధ్వని
౮ ,, ,, అలంకారధ్వని

ఇక శబ్దశక్తి మూలకము ద్వివిధము.

౯ శబ్దశక్తిమూలక వస్తుధ్వని
౧౦ ,, అలంకారధ్వని

ఇట్లు సాకల్యమున ధ్వని దశభేదము.

### అభిధామూలము, శబ్దశక్తిమూలధ్వని.

నానార్థ శబ్దమునకు సర్వార్థము లందును సంకేతగ్రహము సమానమె యగుట అట్టి శబ్దమును వినగనె సకలార్థము లుపస్థితము లగును. అపు డా శబ్దమున కే యర్థమున తాత్పర్య మున్నదో సందేహ ముదయింపగా ప్రకరణాదులు విశేషార్థస్మృతి కలుగ జేయును. కాగా నానార్థశబ్ద స్థలము లందు

రెండవ యర్థప్రతీతికై వ్యంజనవ్యాపార మంగీకరింప వలయును. నానార్థ స్థలము నందు శబ్దము పరివృత్తిసహము కానందున అనురణనీయ వ్యంజనము శబ్దశక్తిమూల మని ధ్వనికారానుయాయులు వర్ణింతురు. నానార్థస్థలము నందు ప్రాకరణికాప్రాకరణికార్థ గతముగా నుపమ యున్నది. దాని ప్రతీతికై వ్యంజన యావశ్యకము ఈ వ్యంజనయె యప్రాకరణికార్థమును గూడ గోచరింప జేయునని ప్రాచీను లనిరి.

శబ్దశక్తి మూలాంకార ధ్వని.

౬౨. "కరతల నిర్గలదవిరల దానజలోల్లాసితావనీ వలయః
ధనదాగ్ర మహిత మూర్తిః జయతితరాం సార్వభౌమోఽయం."

ఈ సార్వభౌముడు చేతిలోని దానజలమున భూవలయ ముల్లసితము చేసినాడు. ధన మిచ్చువారిలో నితడు మహితమూర్తి. జయతి – ఈ సార్వభౌమగజము తొండము నుండి వెడలు దానధారలచే నవనీతల ముల్లసితము చేసినది. ఇది ధనదు నెదుట మహితము. జయతి. ఇందు రాజప్రకరణమున కర – దాన – ధనద – సార్వభౌమ పదముల శక్తి సంకుచితము కాగా తన్మూలధ్వననమున అప్రస్తుతార్థాంతరము ప్రతీయమాన మగును. ఈ ప్రతీయమానార్థ మసంబద్ధము కారాదు. కావున ప్రకృతాప్రకృతముల కుపమానోపమేయ భావమును ప్రధానవాక్యార్థముగా నిర్ణయింప వలెను. కాన ఉపమాలంకారధ్వని. ఇట్టి యలంకారాంతరమును శబ్దశక్తిమూలానురణనమునకు విషయముగా నున్నది.

శబ్దశక్తి మూలవస్తు ధ్వని.

౬౩. "రాజ్ఞో మత్ప్రతికూలాన్మే మహద్భయముపస్థితం
బాలే! వారయ! పాంథస్య వాస దాన విధానతః."

బాలా! నాకు రాజు ప్రతికూలుడు. పాంథుడ నయిన నాకు వచ్చి పడిన భయమును వాస దాన విధానమున వారింపుము,! పాంథుడను. రాజభయమున నుంటిని. నా కాశ్రయ మిమ్ము. నా భయము తొలగు ననునది ప్రకృత పర్యవసాయి భావము. నేను పాంథుడను ప్రియా సంబంధ దూరుడను. విరహిని. చంద్రుడు ప్రతికూలుడు. మిక్కిలి కామభయము పడుచున్నాను. బాలా! యోగ్యసంగమా! నాకు నీ వుపభోగ మీయవే! యనునది యప్రకృత పర్యవసాయి భావము. ఇం దుపభోగ మిమ్మను వస్తువు

రాజపద శక్తిమూలానురణన విషయము. రాజపదమున చంద్రార్థము గోచరించిననే యుపభోగము చంద్రభయ నివారణ కారణ మని యభివ్యక్త మగును.

అర్థశక్తి మూలానురణనము - వస్తుమూల వస్తుధ్వని.

౬౪. "గుంజంతి మంజు పరితో గత్వా ధావంతి సమ్ముఖం
ఆవర్తంతే వివర్తంతే సరసీషు మధు వ్రతాః"

సరసులలో తుమ్మెదలు పరిసర మంత తిరిగి ఝుమ్మను చున్నవి. సమ్ముఖము పరుగిడు చున్నవి. ఆవర్తించు చున్నవి. వివర్తించు చున్నవి. ఇందు తుమ్మెద లొనరించు మంజుగుంజానములు స్వతఃసిద్ధములు. కవి కల్పితములు కావు. వీనిచే సరసిజోత్పత్తి ధ్వనన ద్వారమున శరత్సమయ మేతెంచుట యను వస్తువు వ్యంజిత మగును.

వస్తుమూలాలంకార ధ్వని.

౬౫. "మృద్వీకా రసితా సితా సమశితా స్ఫీతం నిపీతం పయః
స్వర్యాతేన సుధాప్యధాయి కతిధా రంభాధరః ఖండితః
తత్త్వం బ్రూహి! మదీయ జీవ! భవతా భూయో భవే భ్రామ్యతా
కృష్ణేత్యక్షరయోరయం మధురిమోద్గారః క్వచిల్లక్షితః."

నా జీవమా! నీ విది చెపుము! ద్రాక్ష నాస్వాదించితివి. చక్కెర తింటివి. బాగుగ పాలు త్రావితివి. స్వర్గ మేగి యమృత మందికొంటివి. ఎంతగనో రంభాధరము కొఱికితివి. మఱల నీ సంసారమున భ్రమించు చుంటివి కదా! "కృష్ణ" అను రెండక్షరముల లోని మధురిమోద్గార మెచటనేని గోచరించెనా? ఇందు ప్రశ్నవిషయార్థము వాచ్యవస్తువు. దానిచే నతిశయోక్తి వ్యజ్యమాన మగుచున్నది. భగవన్నామ మునకును నానాజన్మ వృత్తాంతముల గోచరింప జేయు యోగసిద్ధి విశేష మునకును తాదాత్మ్యము భాసించుట యతిశయోక్తి స్వరూపము.

అలంకారమూల వస్తుధ్వని.

౬౬. "నదంతి మదదంతినః పరిలసంతి వాజివ్రజాః
పఠంతి బిరుదావలీమహితమందిరే వందినః
ఇదం తదవధి ప్రభో, యదవధి ప్రవృద్ధా న తే
యుగాంత దహనోపమా నయనకోణ శోణ ద్యుతిః.

ప్రభూ! ప్రళయాగ్ని సదృశ మగు నీ నయనకోణముల శోణకాంతి వృద్ధి పొందనంతవఱకె శత్రుమందిరము లందు దంతులు నదించును. అశ్వ ములు శోభించును, వందులు బిరుదములు పఠింతురు. ఇందు నీకు కోప ముద యింపగనే రిపుసంపదలు భస్మము లగునసెడి వస్తువు యుగాంత దహనో పమచే వ్యంగ్య మగుచున్నది.

౯౭. ఉదితం మండలమిందో రుదితం సద్యో వియోగి వర్గేణ
ముదితం చ సకలలలనా చూడామణి శాసనేన మదనేన.

ఇందుమండల ముదయించినది. అపుడె వియోగివర్గము రోదించినది. సకలలలనా శాసకుడు మదనుడు సంతసించినాడు. ఇందు సముచ్చయాలం కారమున అతిశయోక్తి వ్యజ్యమాన మగును, నానాక్రియల యౌగపద్యము సముచ్చయము. కార్యకారణముల పౌర్వాపర్యము మారుట యతిశయోక్తి. ఈ పై యుదాహరణము లందు లోకసిద్ధము (స్వతః సంభవి) వ్యంజక మయినది.

కవిసిద్ధ వస్తువుచే వస్తుధ్వని.

౯౮. "తదవధి కుశలీ పురాణశాస్త్ర
స్మృతిశత చారువిచారజో వివేకః
యదవధి న పదం దధాతి చిత్తే
హరిణకిశోర దృశో దృశోర్విలాసః.

కామినీ దృగ్విలాసము మనసులో నడుగు పెట్టక పూర్వమె పురాణ శాస్త్ర స్మృతుల విచారవివేకము కుశలముగా నుండును. ఇందు కామినీ దృగ్విలాసము చేతమున పద ముంచగా వివేకమునకు కుశలము లే దన్నది వాచ్యవస్తువు, దృగ్విలాస పదార్పణ మనునది లోకసిద్ధము కాదు. కవిప్రౌ ఢోక్తి నిష్పన్నము, దృగ్విలాసము "తిష్ఠ" వేయగా వివేకమున కిక కుశల వార్త యెక్కడిది? అనెడి వస్తువు వ్యంగ్య మగును.

వస్తుమూలాలంకారధ్వని.

౯౯. "కస్మై హంత! ఫలాయ సజ్జన! గుణగ్రామార్జనే సజ్జసి
స్వాత్మోపస్కరణాయ చేన్మమ వచః పథ్యం సమాకర్ణయ!
యే భావా హృదయం హరంతి నితరాం శోభాభరైస్సంభృతాః
తైరేవాస్య కలేః కలేవరపుషో దైనందినం వర్తనం."

సజ్జన ! నీ వే ఫలమునకై గుణము లార్జింతువు ? అత్మశోభ కందువా ? నా మాట పథ్యము, నీవు వినుము ! బాగా శోభాభర పూర్ణములై హృదయ హారులగు భావముల (పదార్థములు) తోడనే పొట్ట నింపికొను ఈ కలి దిన దినప్రవృత్తి సాగుచున్న దయ్యా ! ఇందు రమణీయవస్తువులు కలికి నిత్య మాహార మనునది వాచ్యవస్తువు. చావ దలచినచో గుణప్రాప్తికి యతింపు మను వస్తువు వ్యంగ్య మగును.

అ లం కా ర మూ ల వ స్తు ధ్వ ని.

20. "దేవాః కే పూర్వదేవాః సమితి మమ నరః సంతి కే వా పురస్తా
దేవం జల్పంతి తావత్ప్రతిభట పృతనా వర్తినః క్షత్రవీరాః
యావన్నాయాతి రాజన్! నయన విషయతామంతక భ్రాంసి మూర్తే
ముగ్ధారి ప్రాణదుగ్ధాశన మసృణరుచి స్త్వత్కృపాణో భుజంగః"

శత్రు భీకర మూర్తీ ! రాజా ! శత్రుప్రాణ దుగ్ధముల గ్రోలి నును పెక్కిన నీ కృపాణ మనెడు భుజంగము కన్నులకు కన్పడ నంత వరకే శత్రుసేనా సంచారు లయిన క్షత్రవీరులు "నాకు యుద్ధమున దేవత లెవరు? రాక్షసు లెవరు ? నరు లెవరు ? ఎదు రుండు వా రెవరు ?" అని పలుకుదురు. ఇందు కవిప్రౌఢోక్తి సిద్ధమయిన రూపకాలంకారమున "నీవు ఖడ్గ మెత్తగా పరులకు జీవనాశ మెక్కుడిది?" అను వస్తువు గోచరించును.

అలంకారమూల వస్తుధ్వని.

21. "దయితే ! రదనత్విషాం మిషాత్
అయి ! తేఽమీ విలసంతి కేసరాః
అపి చాలక వేష ధారిణో
మకరంద స్పృహయాళవోఽలయః"

అయి ! దయితా ! నీ దంత కాంతుల మిష కేసరములు విలసించు చున్నవి. తుమ్మెద లలక వేషము ధరించి మకరంద మభిలషించు చున్నవి. ఇందు పూర్వార్థమున నుత్తరార్థమున రెండపహ్నుత్యలంకారము లున్నవి. వీనిచే "నీవు నారివి కావు నలినివి" యని తృతీయాపహ్నుతి గోచరించును. వీనిలో కవి ప్రౌఢోక్తి సిద్ధము వ్యంజక మగుచున్నది.

## ఉభయశక్తిమూలము.

శబ్దశక్తి మూలకత్వ మర్థశక్తి మూలకత్వ మను నీ రెండును వ్యంగ్యము లన్నిట నుండును. శబ్దార్థముల యనుసంధానము లేక వ్యంగ్యార్థమె సముల్ల సింపదు గదా! అయినను పరివృత్తి సహింపని శబ్దము లధిక మున్నచో నర్థ శక్తి యున్న నప్రధాన మగుట శబ్దశక్తిమూల మనియే వ్యవహార ముండును. పరివృత్తి సహించు పదములు ప్రచురముగా నున్నచో నర్థశక్తిమూల మనియే వ్యపదేశము కల్గును. రెండు సమానముగ నున్నచో నుభయశక్తిమూల మగును.

౭౨. "రమ్యహాసా రసోల్లాసా రసికాలినిషేవితా
సర్వాంగశోభాసంభారా పద్మినీ కస్య న ప్రియా."

రమ్యహాస రసోల్లాస రసికాలి నిషేవిత సర్వాంగ శోభాతిశయ పద్మిని ఏరికి ప్రియ కాదు. ఇందు హాసరసాలిపద్మినీ పదములు పరివృత్త్య సహిష్ణువులు. (హాసము-వికాసము, నవ్వు, రసము-మధువు-రాగము అలి-తుమ్మెద - సమూహము, పద్మిని - తామర - పద్మినీజాతి వనిత.) ఇతరములు పరివృత్త్యసహములు. ఇట్టి యుభయ శక్తిమూలము వాక్యమునందే యుండును.

## లక్షణామూలము.

ప్రయోజనవతి లక్షణ యారు విధములు. అందు నాలు గలంకార ములుగా పరిణమించినవి. మిగులు రెండు ధ్వన్యాశ్రయము లైనవి. జహత్స్వార్థ, యజహత్స్వార్థ యని యా రెండిటి పేరులు. తన్మూలముగా ధ్వని ప్రభేదములు రెండు కలిగినవి.

## జహత్స్వార్థామూలము

౭౩. "కృతం త్వయోన్నతం కృత్యం ఊర్జితం చామలం యశః
యావజ్జీవం సఖే! తుభ్యం దాస్యామో విపులాశిషః"

సఖుడా! నీ వున్నత కృత్య మాచరించితివి. విమలయశ మార్జించితివి. నీకు యావజ్జీవము మంచి యాశీస్సు లిత్తుము. ఇది యపకారి నుద్దేశించి యొకడు పల్కినది. నీవు పరమ ఖేద మిచ్చు నపకార మొనర్చినను నేను మధురమే భాషింతునె! పరుషము పలుకనె! అట్టి నా విషయమున పాప మాచరించిన నీ పాపిష్ఠత్వ మెట్లు చెప్ప శక్య మని వ్యంగ్యము.

అజహత్స్వార్థా మూలము.

౨౮. "బధాన ద్రాగేవ ద్రఢిమ రమణీయం పరికరం
కిరీటే బాలేందుం నియమయ పునః పన్నగ గణైః
న కుర్యాస్త్వం హేలామితరజన సాధారణ ధియా
జగన్నాథస్యాయం సురధుని! సముద్ధార సమయః"

సురధునీ! గంగా! వెంటనే గట్టిగా పరికరము బంధింపుము! కిరీటమున బాలచంద్రుని పాములతో చిక్కు బట్టుము. ఎవరోలే! యను సాధారణ బుద్ధితో హేల యొనర్పకుము! సురధునీ! ఇది జగన్నాథుని సముద్ధార సమయము. ఇందు "జగన్నాథుని" యనుటచే వాచ్యార్థమె యనేక పాప విశిష్టమై లక్ష్యమాణమగును. పాపులు పదాంతరమున జెప్పనగ రని వ్యంగ్యము. ఈ చెప్పిన ధ్వనులన్నియు నేకపదగతము లయినచో పదధ్వను లని నానా పదగతము లయినచో వాక్యధ్వను లని వ్యపదిష్టము లగును.

## ౧౮. అభిధా నిరూపణము.

అభిధామూల ధ్వని ప్రపంచము నిరూపిత మయినది కదా! అభిధ యన నేమి? ఈ విషయ మిక నిరూపింతుము.

* అర్థమునకు శబ్దగతము శబ్దమున కర్థగత మయిన సంబంధవిశేష
మభిధ ఇదియే శక్తి.

శబ్దముచే నర్థము నర్థముచే శబ్దమును సంబంధించి యుండు సంబంధ మభిధ యని భావము. ఈ యభిధ త్రివిధము. కేవలసముదాయశక్తి, కేవలావయవశక్తి, సముదాయావయవ శక్తి సంకరము నని. "డిత్థ" మొదలగు నవి యాద్యోదాహరణములు. అందవయవశక్తి లేదు. పాచక-పాఠకాదులు ద్వితీయోదాహరణములు. అందు ధాతు ప్రత్యయములచే గోచరించు నర్థముల యన్వయమున "పాకకర్తి-పాఠకర్తి" యను నర్థము లుల్లసించును. అంతకన్న నితర మవభాసింపదు. అందు సముదాయశక్తి లేదు. తృతీయమునకు పంకజాదు లుదాహరణము. పంకజ పదము నందు జన్ ధాతువు. పంకమను నుప పదము, డ ప్రత్యయ మవయవములు. వాని యర్థముల కన్వయము కలుగగా "పంకమున జనించిన" యను నర్థము ప్రకాశించును. దీని కతిరిక్తముగా 'పద్మ' మను నర్థము భాసించును. అందుకై సముదాయశక్తియు కల్ప

నీయము. కావున రెండిటి కిచట సాంకర్య మున్నది. ఈభేదములనే వరుసగా రూఢి-యోగ-యోగరూఢి శబ్దములచే వ్యపదేశింతురు.

ఈ యభిధచే నే శబ్దమే యర్థమును బోధించునో యా శబ్ద మా యర్థమునకు వాచకము. ఈ శక్తి యే శబ్దమున కే యర్థమున నుండునో యా శబ్దమున కా యర్థ మభిధేయము. ఈ యభిధేయార్థము జాతిరూపము, గుణ రూపము, క్రియారూపము, యాదృచ్ఛికాత్మక మని నాల్గువిధములు. గోత్వాదిజాతి గవాదిశబ్దముల కభిధేయము. ఈ జాతిరూప శబ్దార్థము ప్రాణద మందురు. ప్రాణము వ్యవహారయోగ్యత. దాని సంపాదించునది. శుక్లాదిగుణము శుక్లాది పదముల కభిధేయము. చలనాదిక్రియ చలనాది శబ్దముల కభిధేయము. ఇట్లు శబ్దప్రవృత్తి నాల్గువిధము లని మహాభాష్యకారు డనెను.

## ౧౫. లక్షణా నిరూపణము.

చరమధ్వని లక్షణా మూలము కదా! లక్షణ యన నేమి? ఇక దాని నిరూపింతుము.

* శక్య సంబంధము లక్షణ.

శక్యార్థమునకు లక్ష్యార్థముతో సంబంధ ముండుట శక్యార్థసంబం ధము కల యన్యార్థ మవభాసించుట లక్షణయని భావము. "గంగలో ఘోష" మన్నపుడు గంగా శబ్దమునకు ప్రవాహరూపార్థము శక్యము. ప్రవాహసంబంధము కల తటరూపార్థము లక్ష్యము. ఇట్టి యర్థావభాసము లక్షణ. ఈ లక్షణ నిరూఢ ప్రయోజనవతి యని ద్వివిధ యగును. రెండవ దియు గౌణి శుద్ధ యని రెండు విధములు. అందు మొదటి దయిన గౌణీ లక్షణ సారోప సాధ్యవసాన యని ద్వివిధ మగును. చివరి దగు శుద్ధాలక్షణ చతుర్విధ యగను. జహత్స్వార్థ, అజహత్స్వార్థ, సారోప, సాధ్యవసాన యని ఇట్లు ప్రయోజనవతి లక్షణ షడ్విధ యగు చున్నది.

### నిరూఢ లక్షణ.

అనుకూల-ప్రతికూల, అనులోమ-ప్రతిలోమ-లావణ్యాదులును నీలా దులును నిరూఢలక్షణ కుదాహరణములు. "ధర్మమున కీత డనుకూలుడు" అనుచో నిట్లు గుర్తింపవలెను. అనుకూల పదమునకు కూలము ననుసరించి

యుండువాడని ముఖ్యార్థము. అది బాధితము. అయిన ననాదిగా ప్రయోగప్రవాహ మున్నది. తద్వశమున 'నొకే విషయమున కూడియుండుట' యను సాదృశ్యసంబంధముచే ననుగుణ మని లక్ష్యమాణ మగును. ఇట్లే ప్రతికూలాదులు. నీలాదిపదములకు నీలత్వాదిజాతియె శక్యార్థము. కాగా "నీలము ఘటము" అనుచోట్ల గుణద్రవ్యములకు సామానాధికరణ్యమున నన్వయము కుదురదు. కాన సమవాయ సంబంధమున నీలాదిశబ్దములచే నీలాది గుణములు కలవి లక్ష్యమాణము లగును. అనుకూల ప్రతికూలాదివర్గమున సాదృశ్యసంబంధము నీలాదివర్గమున తదితర (సాదృశ్యేతర) సంబంధము బట్టి లక్షణ ప్రవర్తించుటచే నిరూఢలక్షణలో గూడ గౌణీ శుద్ధా భేదము లంగీకరింతురు.

## ప్రయోజనలక్షణ. సారోప.

వేరు వేరుగా నుపాత్తము లయిన విషయము విషయి యను రెండిటి కభేద మారోప మగును. పృథఙ్నిర్దిష్టము కాని విషయమున విషయ్యభేద మధ్యవసాన మగును. ఆరోపము కూడినది సారోప. అధ్యవసానము కలది సాధ్యవసాన. "ముఖము చంద్రుడు" అనునది గౌణి సారోప కుదాహరణము. "ఈ పుర సౌధ శిఖరమున చంద్రరాజి విరాజిల్లు చున్న" దనునది గౌణి సాధ్యవసాన కుదాహరణము. సారోపలో నిట్లు తెలియ దగును. చంద్రాదిశబ్దములు విషయిప్రతిపాదకములు. చంద్రాదులను జెప్పును. చంద్రాదిసదృశములు లక్షణచే నవభాసించును. ముఖపదముచే ముఖ మవభాసింపగా ముఖముతో చంద్రసదృశమున కభేద సంబంధమున నన్వయము కలుగును. కాగా "చంద్రసదృశాభిన్నము ముఖము" అని శాబ్దబోధ సారము. సాదృశ్యరూపధర్మమె చంద్రపదమున లక్ష్యమాణ మయి నచో సాదృశ్యముతో ముఖాదుల కన్వయము కుదురదు. నామార్థముల కభేదముననె యన్వయ ముండుట సంప్రదాయము.

## సాధ్యవసాన.

చంద్రరాజి విరాజిల్లు చున్న దను సాధ్యవసానలో నిట్లు తెలియవలెను. చంద్రశబ్దమున లక్షణచే ముఖ ముపస్థిత మగును. ముఖత్వ విశిష్ట మయిన ముఖమె సముపస్థిత మయినను "చంద్రత్వ విశిష్టము ముఖము" అను రీతి శాబ్దబోధ కలుగును. ఇది యంతయు లక్షణా జ్ఞాన మాహాత్మ్యము. చంద్రత్వమును గోచరింప జేయు సామగ్రి ముఖమున స్వధర్మభానము

నివారింపదు. కాగా నొక్కే ధర్మియందు చంద్రత్వము ముఖత్వము సాక్షాత్తుగా నవభాసించును. ఇదియే సారోప కన్న భేదము. ఇందిదియు గుర్తింప నగును. విరుద్ధధర్మభానముచే స్వధర్మభానము నివారిత మగునని కొందరందురు. కాని సాధ్యవసానలో ముఖత్వ రూప మయిన ధర్మభానము సహృదయ హృదయ ప్రమాణక మయినచో తన్నివారణమునకు కారణ కల్పన ముచితము కాదు. అట్టి ధర్మభానము ప్రామాణికమె యయినచో వారణ కారణ కల్పన ముచితమె యగును.

## ౧౬. అర్థాలంకారములు.

### ౧. ఉపమ.

కావ్యాత్మ వ్యంగ్యము. అలంకారములు రమణీయతా ప్రయోజకములు. వాని నిరూపింతుము. అలంకారములందు ఉపమాలంకారము నానాలంకారాంతర్వర్తిని యగుట ముందుగా దాని విచారింతుము.

* వాక్యార్థోపస్కారము సుందరము నగు సాదృశ్య
ముపమాలంకారము.

సుందరము చమత్కారి. చమత్కారము సహృదయ హృదయ ప్రమాణక మగు నానంద విశేషము. అనన్వయ వ్యతిరేక రూపకాదులందు సాదృశ్యము చమత్కారి కాదు.

౨౫. గురుజన భయ మద్విలోకనాన్తః
సముదయ దాకులభావ మావహంత్యాః
దర దలదరవింద సుందరం హా!
హరిణదృశో నయనం న విస్మరామి.

పెద్దలవలని భయమున, నేను చూచుటను లోలోన వ్యాకులపాటు పొందిన యా మృగనయన యొక్క దరవికసితారవింద సుందర మగు నయనమును విస్మరింపను. ఇందు దర దలదరవింద సుందర పదమున గోచరించు ఉపమ సకల వాక్యార్థ మయిన విప్రలంభ శృంగార మున కుపస్కారక మగుటచే నలంకార మయినది.

ప్రాచీనుల మతానుసారమున కొన్ని యుపమాభేదము లిట గుర్తింప నగును. పూర్ణోపమ, లుప్తోపమ యని యుపమ రెండు విధములు. పూర్ణ శ్రౌతి ఆర్థి యని ద్వివిధయగును. లుప్తలో బహుభేదము లున్నవి.

పూర్ణశ్రౌతి.

౪౩. గ్రీష్మచండకర మండల భీష్మ జ్వాలసంసరణ తాపిత మూర్తేః
ప్రావృషేణ్య ఇవ వారిధరో మే వేదనాం హరతు వృష్ణివరేణ్యః.

వేసవి లోని ప్రచండభానుని జ్వాలలు కల ప్రదేశమున సంసరించి తాపము పొందిన నా వేదనను వర్షామేఘము వలె కృష్ణుడు హరించుగావుత. ఇందు మేఘ ముపమానము. కృష్ణుడుపమేయము. వేదనాహరణము సమానధర్మము. "ఇవ" శబ్దము సాదృశ్య బోధకము. సాదృశ్యము శ్రుతి బోధిత మయినందున శ్రౌతి.

పూర్ణ ఆర్థి.

౪౪. ప్రాణాపహరణేనాసి తుల్యో హాలాహలేన మే
శశాంక! కేన ముగ్ధేన సుధాంశురితి భాషితః.

శశాంకుడా! నీవు ప్రాణాపహరణముచే హాలాహలముతో తుల్యుడవు. ముగ్ధు డెవడు నిన్ను సుధాంశు వనినాడోయి! ఇందు తుల్యపదము ధర్మిని చెప్పును. తద్ద్వారమున ధర్మము గోచరించును. హాలాహల ముపమానము, శశాంకు డుపమేయము. ప్రాణాపహరణము ధర్మము, తుల్యపదము వాచకము. ఇది యార్థి. సాదృశ్య మర్థబోధిత మయినది కదా!.

ఉపమాన లుప్త.

౪౫. "యస్య తులామధిరోహసి లోకోత్తర వర్ణ పరిమళోద్గారైః
కుసుమ కుల తిలక! చంపక! న వయం తం తు జానీమః."

చంపకమా! నీవు కుసుమ కులమున శ్రేష్ఠమవు. నీవర్ణము పరిమళము లోకోత్తరము. నీవు దేని సామ్యము పొందుదువో దాని మేము గుర్తింప లేకున్నారము. ఇందు "మేము సర్వజ్ఞులము కాము. మాకు గోచరము కానిదేదేని యొకటి నీకుపమాన ముండవచ్చును". అను విధమున సాదృశ్య పర్యవసానమున్నది. ఉపమానము నిరూపితము కానందున ఉపమాన లుప్త యయినది.

ధర్మ లుప్త.

౪౬. కలాధరస్యేవ కలావశిష్టా విలూన మూలా లవలీలతేవ
అశోకమూలం పరిపూర్ణశోకా సా రామయోషా చిరమధ్యువాస.

కలాధరుని మిగిలిన కళవలె, మూలము పోయిన లవలీ లత వలె, రామభార్య శోకపడి యశోకము దిగువ నున్నది. ఇందు సమానధర్మము లేదు.

### ధర్మోమానలుప్త.

౭౦. గాహితమఖిలం విపినం పరితో దృష్టాశ్చ విటపినః సర్వే
సహకార! న ప్రపేదే మధుపేన తథాపి తే సమం జగతి.

మామిడీ! మధుప మరణ్య మంతయు తిరిగినది. చెట్లన్నిటి చూచినది. అయినా నీ సమమును జగమున పొందనే లేదు. ఇందు సమానధర్మ ముప మానమును లేవు.

### వ్యంగ్యవస్తూపస్కారకము.

౭౧. అవిరత పరోపకరణ వ్యగ్రీభవదమలచేతసాం మహతాం
ఆపాత కాటవాని స్ఫురంతి వచనాని భేషజానీవ.

నిత్యము పరుల నుపకరింప వలె నని విమలమనసు కల మహాభావుల మాటలు మందుల వలె మొదట కటువుగా నుండును. ఇందు - ఆ కటు వచనములు భావించి వ్యథపడక సేవించు వానికి పరిణామమున పరమ సుఖ ముండు నను వ్యంగ్యవస్తువును భేషజోసమ శోభింప చేయు చున్నది.

### వ్యంగ్యాలంకారోపస్కారిక.

౭౨. "అంకాయమానమలికే మృగానాభిపంకం
పంకేరుహాక్షి! వదనం తవ వీక్ష్య బిభ్రత్
ఉల్లాస పల్లవిత కోమల పక్ష మూలాః
చంచూపుటం చపలయంతి చిరం చకోరాః.

పంకేరుహాక్షి! నొసట నంకముగా నయిన మృగనాభి పంకమును ధరించిన నీ వదనము చూచి యీ యువ చకోరములు కోమలము లయిన దవడ లప్పళించుచు చంచూపుటములను చపల చపలముల చేయు చున్నవి. ఇందు చకోరములకు చంద్రభ్రాంతి కలిగిన దని వ్యంగ్యము. చకోర పోతములు భ్రాంతి వశమున ముఖమును చంద్రు డనుకొనినవి. లలాటమున నున్న కస్తూరి కలంక మని తలచుటలో సాదృశ్యభానము హేతువు. ఈ సాదృశ్య ముపమ. ఇట్టి యుపమ వ్యంగ్య మగు భ్రాంతిమదలంకారమున కుపస్కారక మయినది.

వస్తు ప్రతివస్తుభావ సహితము.

౮3. "ఆలింగితో జలధి కన్యకయా సలీలం
లగ్నః ప్రియంగు లతయేవ తరు స్తమాలః
దేహావసాన సమయే హృదయే మదీయే
దేవశ్చకాస్తు భగవానరవిందనాథః".

లక్ష్మిచే సమాలింగితుడై ప్రియంగు లతా లగనము కల తమాల తరువు వలె నున్న శ్రీమన్నారాయణ దేవుడు దేహావసాన సమయమున నాహృదయమున ప్రకాశించు గావుత. ఇం దాలింగితత్వ లగ్నత్వములకు వస్తు ప్రతి వస్తుభావ మున్నది. తద్విశేషణము లయిన జలధికన్యా ప్రియంగులతలకు బింబ ప్రతిబింబభావ మున్నది. ఇట్లుపమా విశేషము లనేకము లున్నవి. అనేకములు వ్యామిశ్రణము పొందుటయు నున్నది.

౮౪. "యథా లతాయా స్తబకానతాయాః
స్తనావనమ్రే! నితరాం సమాసి
తథా లతా పల్లవినీ సగర్వే!
శోణాధరాయాస్సదృశీ తవాపి".

స్తనావనమ్రా! నీవు స్తబకానత లతకు సదృశ వయినట్లు ఈ చిగురు కల లతయు శోణాధర వగు నీకు సదృశి కదే! సగర్వా! ఇదు "స్తనావనమ్రము నయిన నేను స్తబకానత లత కుపమాన మయితి నని గర్వపడకుము; శోణాధరవై యుపమేయ మయిన నీకును పల్లవిని లత యుపమాన మున్నది" అనునది వాక్యార్థము. దీని నొక యుపను యుపస్కరించు చున్నది. ఈ పద్యమునందు మూడుపమ లున్నవి. "నీవు లతాసదృశ వయినట్లు లత త్వత్సదృశి" యను నుపమ వాక్యార్థభూతము ప్రధానము. ప్రధాన మయిన యీ యుపమకు - "నీవు లతాసదృశి" లత త్వత్సదృశి" యను రెండుపమలు సాధారణ ధర్మముగా నున్నవి. అంగము లయిన యీ రెండుపమలు పరస్పరము బింబ ప్రతిబింబ భావము పొందినవి. వీనిలో "స్తనావనమ్రము వయిన నీవు స్తబకానత లతకు సదృశి" యను ప్రతిబింబరూప ప్రథమోపమకు వస్తు ప్రతివస్తుభావము పొందిన నమ్రీభవన - నమనములలో విశేషణములగు స్తన - స్తబకములు సాధారణధర్మము లయినవి. అవియే పరస్పరము బింబ ప్రతిబింబభావము పొంది యున్నవి. అట్లే "పల్లవిని లత

శోణాధర వగు నీకు సదృశి" యను బింబరూప ద్వితీయోపమలో నధర పల్లవములు సాధారణ ధర్మములు. అవియే పరస్పరము బింబ ప్రతిబింబ భావము పొందినవి. పూర్వ ముదాహరించిన యుపమలలో నన్యాన్యములు నానావిధ సాధారణ ధర్మము లున్నవి. దీనిలో నుపమకు రెండుపమలె సాధారణధర్మములై సముపాత్తము లయిన వని విశేషము గుర్తింప వలెను. ఇట్లె యన్యప్రకారముల గ్రహింప వచ్చును.

### ఉపమా దోషములు.

ఈ యుపమలో చమత్కారాపకర్షకము లన్నియు దోషములె. కవిసమయ ప్రసిద్ధి లేకుండుట, ఉపమానోపమేయములకు జాతి ప్రమాణ లింగ సంఖ్యల యానురూప్యము లేకుండుట, ఉపమానోపమేయ ధర్మముల న్యూనత్వాధికత్వము లుండుట మొదలగు నవి యుపమా దోషములు. "నీ ముఖము కహ్లారనిభము, నీ యధరము కుంకుమరమ్యము, నీ వాక్కు కర్పూర సదృశము" ఇట్టివి ప్రసిద్ధి హతములు. "ముని శునకము వలె నున్నాడు. శునకము శుకర్షి వలె నున్నది." "పండిన నేరేడు బ్రహ్మాండము వలె నున్నది." ఇత్యాదులందు జాత్యాద్యానురూప్యము లేమి దోష మూహించు నది. జాత్యాద్యనానురూప్యమును కవి సమయ ప్రసిద్ధ మయినచో చమత్కారాపకర్షకము కాజాల నందున దోషము కాదు. ఎట్టి దోషము కాని చమత్కార భంజకము కాకున్నచో దోషము కాదు. ఇందు సహృదయ హృదయమె ప్రమాణము.

### ౨. ఉపమేయోపమ.

* ఉపమానోపమేయార్థములకు పరస్పరము ఘుందర సాదృశ్య ముపమేయోపమ.

తృతీయ సదృశ వస్తు నిరాస మిందు ఫలము. ఉపమేయోపమయు నుపమా భేదము. ఒక ధర్మమున దానితో దీనికి సాదృశ్యము నిరూపింపగా నా ధర్మమున దీనితో దానికి సాదృశ్య మర్థసిద్ధమె యగును, అయినను మరల చెప్పుట వ్యర్థము. కవ్యుక్తిలో వ్యర్థముండరాదు. తన్నైరర్థక్య పరిహారమునకై తృతీయ సదృశ వ్యవచ్ఛేదము ఫలము కావలయును.

౮౫. కౌముదీవ భవతీ విభాతి మే కాతరాక్షి! భవతీవ కౌముదీ
అంబుజేన తులితం విలోచనం లోచనేన చతవాంబుజం సమం"

కాతరాక్షీ ! నీవు నాకు కౌముది వలె భాసింతువు. నీ వలె కౌముది భాసించును. నీ లోచన మంబుజ సమానము, అంబుజము నీ లోచన సమము. భానధర్మమున కాతరాక్షి కౌముదీ సమాన యని చెప్పగా భానధర్మమున కౌముది కాతరాక్షీ సదృశ మని యర్థసిద్ధ మగును. అయి నను మఱల చెప్పుటచే కౌముదీ కాతరాక్షులు తప్ప మూడవ వ్యక్తి లేక పోవుట గోచరించును. ఇట్లే యంతట నూహింప వలెను.

౨౬. నిఖిలే నిగమ కదంబే లోకేష్వప్యేష నిర్వివాదోఽర్థః
శివ ఇవ గురుర్గరీయాన్ గురురివ సోఽయం సదాశివోఽపి తథా.

సర్వవేదము లందు లోకము లందు నిది నిర్వివాదార్థము. శివుని వలె గురువు గొప్ప గురువు వలె శివు డట్లే. ఇందు సమానధర్మ ముపమానోపమే యముల ననుగామి.

౨౭. రమణీయ స్తబక యుతా విలసిత వక్షోజ యుగల శాలిన్యః
లతికా ఇవ తా వనితా వనితా ఇవ రేజిరే లతికాః.

విలసిత వక్షోజములు కల వనితలు రమణీయ స్తబకములు కల లతికల వలె, లతికలు వనితల వలె రాజిల్లిరి. ఇందు విశేషణము లయిన రమణీయత్వ విలసితత్వములు విశేష్యము లయిన యుతత్వ శాలిత్వములు పరస్పరము వస్తు ప్రతివస్తు భావము పొంది యున్నవి. వానితో సంపుటిత మయిన స్తబక స్తన రూప ధర్మము పరస్పరము బింబప్రతిబింబ భావము పొందినది. ఉపమేయోపమ స్పష్టము.

### 3. అ న న్వ య ము.

* ఉపమాన ముపమేయ మయిన యేకవస్తుక సాదృశ్యము
ద్వితీయ సదృశ వ్యవచ్ఛేద ఫలక మనన్వయము.

౨౮. కృత క్షుద్రాఘౌఘానథ సపది సంతప్త మనసః
సముద్ధర్తుం సంతి త్రిభువనతలే తీర్థ నివహాః
అపి ప్రాయశ్చిత్త ప్రసరణ పథాతీత చరితాన్
నరానూరీకర్తుం త్వమివ జనని ! త్వం విజయసే.

అమ్మా ! గంగే ! క్షుద్రపాపము లాచరించి సంతప్తమనస్కు లయిన వారల నుద్ధరించుటకు లోకముల తీర్థము లెన్నియో కలవు. కాని ప్రాయశ్చిత్తపథము దాటిన పాపచరితుల నరుల నూరీకరించుటకు నీవు

నీవలె విజయశ్రీవి. ఇందు "విజయసే" యనుగామి ధర్మము. గంగ యొక్క ఱాటిరెయు యుపమాన ముపమేయమును. ఇట్టి ధర్మము కలది రెండవది లేదని గోచరించును.

## ౪. అసమము.

* సర్వవిధముల నుపమానిషేధ మసమము.

అనన్వయమున నిది వ్యంగ్య మయినను వాచ్యముగా నున్నప్పుడు చమత్కారి యగుట వేరుగా పరిగణనార్హము.

౮౯. "భువన త్రితయేపి మానవైః పరిపూర్ణేవిబుధైశ్చ దానవైః
న భవిష్యతి నాస్తి నాభవత్ నృప! యస్తే భజతే తులా పదం."

మానవులు దేవులు దానవులు నిండి యున్న మూడు లోకములలో నీ సామ్యము పొందువాడు పుట్టడు: లేడు. ఉండ లేదు: రాజా!. ఉపమానలుప్తలో క్వాచిత్క మయిన యుపమాన నిషేధ ముండును. ఇం దాత్యంతిక మయిన యుపమాన నిషేధ ముండును. ఇందు సర్వదా ఉపమాన నిషేధ ముండుటచే సాదృశ్యము ప్రతిష్ఠితము కా నందున నుపమా గంధ మేనియు నుండదు.

## ౫. ఉదాహరణము.

* సామాన్యముగా నిరూపిత మయిన యర్థమును స్పష్టము చేయుటకై దాని యేకదేశము నిరూపించి వాని కవయవావయ విభావము చెప్పుట యుదాహరణము.

౯౦. "అమితగుణోపి పదార్థో దోషేణైకేన నిందితో భవతి
నిఖిల రసాయనరాజో గంధేనోగ్రేణ లశున ఇవ."

గుణము లధిక మున్నను వస్తు వొక దోషమున ఉగ్రగంధమున రసాయనరాజము లశునము వలె నిందిత మగును. ఇందు మొదట నిరూపితము సామాన్యార్థము. ఉత్తరార్ధ మందలి లశున విశేషము తదేకదేశము పదార్థలశునముల కుపమ చెప్ప శక్యము కాదు. పదార్థలశునములు సామాన్య విశేష రూపము లగుటచే సాదృశ్య ముల్లసింపదు. సామాన్యము కన్న విశేషమునకు భేదము లేదు. భేద మున్న గాని సాదృశ్యకథ రాదు.

౯౧. "ఉపకారమేవ కురుతే విపద్గతః సద్గుణో నితరాం
మూర్ఛాం గతో మృతో వా నిదర్శనం పారదోఽత్ర రసః."

సద్గుణు డాపద పొందిన నుపకారమే చేయును. మూర్ఛ పొంధనీ! మృతము కానీ! యిందు పారదరసమె నిదర్శనము. పూర్వోక్తార్థము లందలి సామాన్య విశేషార్థములకు సంబంధము స్పష్టము.

### ౬. స్మరణము.

* సాదృశ్య జ్ఞానమున నుద్బుద్ధ మయిన సంస్కారమున గలుగు స్మరణము స్మరణ మగును.

౯౨. "భుజభ్రమిత పట్టిశోద్దలిత దృప్త దంతావలం
భవంతమరి మండల క్రథన! పశ్యతః సంగరే
అమంద కులిశాహతి స్ఫుట విభిన్న వింధ్యాచలో
న కస్య హృదయం ఝగిత్యధిరురోహ దేవేశ్వరః."

శత్రునాశనా! పట్టిశమును భుజములచే త్రిప్పి దృప్తదంతిని దలితము చేసిన నిన్ను సంగరమున చూచు వాని హృదయమున, వజ్రపు దెబ్బచే వింధ్యమును భేదించిన దేవేంద్రుడు వెంటనే యవభాసింప కుండునా? ఇందు రాజవిషయకము కవినిష్ఠ మయిన రతిని స్మరణాలంకార ముపస్కరించినది.

### ౭. రూపకము.

ఇక నభేదప్రధానాలంకారములలో రూపకము నిరూపింతుము.

* ఉపమేయము నందు శబ్దమున నిశ్చీయమాన మగు నుపమాన తాదాత్మ్యము రూపకము.

సాదృశ్య మూలక మగు తాదాత్మ్యమును రూపక మని యందురు. ఈ రూపకము సావయవము నిరవయవము పరంపరిత మని మూడు విధములు. అందు సావయవము సమస్తవస్తు విషయ మని యేకదేశవివర్తి యని ద్వివిధము. రెండవది యియిన నిరవయవమును కేవలము మాలారూప మని రెండు విధములు. తృతీయము శ్లిష్టపరంపరితము శుద్ధపరంపరిత మని ద్వివిధమై ప్రత్యేకము కేవలము మాలారూప మన్న భేదమున చతుర్విధ మగును. ఇట్లు రూపక మష్టవిధ మని యనిరి.

### సావయవము.

* పరస్పర సాపేక్షము లయిన రూపకముల సమూహము సావయవము. ఆరోప్యమాణము లన్నియు శబ్దోపాత్తము లగుచో

సమస్త వస్తువిషయము. ఏకదేశమున విశేషించి యుండునది యేకదేశవివర్తి.

అవయవ రూపకముల సిద్ధి లేకున్న ప్రధాన రూపకసిద్ధి యుండదు. కావున సావయవ రూపకము నందు రూపకముల నిష్పత్తి పరస్పర సాపేక్షమై యుండును.

సమస్తవస్తువిషయము.

౯౩. "సువిమల మౌక్తిక తారే ధవలాంశుక చంద్రికా చమత్కారే
వదన పరిపూర్ణ చంద్రే సుందరి! రాకాసి నాత్ర సందేహః.

విమల ముక్తాతారా! ధవలాంశుక చంద్రికా! వదన పూర్ణచంద్రా! సుందరీ! నీవు పూర్ణిమవు. ఇందు సందేహము లేదు. ఇందు రూపక సముదాయాత్మక మయిన సావయవ రూపక మున్నది. అవయవ రూపకముల కన్నిటికి సమర్థ్య సమర్థక భావము పరస్పరము సమానమె యయినను రాకారూపకమె సమర్థ్య మని కవిసంకల్పము. ఇతరరూపకములు సమర్థకములు ముక్తానక్షత్రములు, వస్త్రజ్యోత్స్నలు, ముఖచంద్రులు, నాయికా పూర్ణిమ లిందు రూపకస్థానములు. నాయికా పూర్ణిమా రూపకము ముఖ్యము.

ఏకదేశవివర్తి.

౯౪, "రూపజలా చలనయనా నాభ్యావర్తా కచావలీ భుజగా
మజ్జంతి యత్ర సంతః సేయం తరుణీతరంగిణీ విషమా,"

ఈ తరుణి యొక విషమ తరంగిణి. ఇందు సజ్జనులు మజ్జనము పొందుదురు. ఇందు రూపము జలము చంచలము నేత్రము. నాభి సుడి. కేశాలి సర్పము. ఈ పద్యమున రూపకము నయనము లందు లేదు. ఇతరము లందే యున్నది. సమర్థకముగా నభిమత మయిన నయనము లందు మీన రూపకము నాక్షిప్తము చేసికొన వలెను.

కేవలనిరవయవము.

౯౫. బుద్ధిర్దీపకలా లోకే యయా సర్వం ప్రకాశతే
అబుద్ధిస్తామసీ రాత్రిః యయా కించిన్న భాసతే.

లోకమున బుద్ధి దీపకల. దానిచే సర్వము ప్రకాశించును. అబుద్ధి తామసీ రాత్రి. దానిచే నేమియు భాసింపదు. ఇందు రెండు రూపకము

లున్నవి. వేని కవి వేరు. సాపేక్షములు కావు. కాన నిది నిరవయవ రూపకము. మాలాత్మకత లేనందున కేవలము,

మాలా నిరవయవము.

౯౩. ధర్మస్యాత్మా భాగధేయం క్షమాయాః
సారః సృష్టేః జీవితం శారదాయాః
అజ్ఞా సాక్షాద్బ్రహ్మణో వేదమూర్తేః
ఆకల్పాంతం రాజతామేష రాజా.

ఈ రాజు ధర్మమున కాత్మ. భూమి భాగధేయము, సృష్టి సారము. శారద జీవితము. వేదమూర్తి బ్రహ్మదేవు నాజ్ఞ. ఈత డాకల్పాంతము రాజిల్లు గావుత. ఇం దయిదు రూపకము లున్నవి. అన్నియు నేకవిషయములు. కావున మాల. పరస్పర సాపేక్షములు కానందున నిరవయవము.

పరంపరితము – శ్లిష్టము.

ఒక యారోప మారోపాంతరమున నిమిత్త మయినచో పరంపరితము. అందును సమర్థకారోపము శ్లేషమూలక మయినచో శ్లిష్టపరంపరితము.

౯౪. అహితాపకరణ భేషజ! నరనాథ! భవాన్ కరస్థితో యస్య
తస్య కుతో హి భయం స్యా దఖిలామపి మేదినీం చరతః.

నరనాథ! నీ వహితాపకరణ భేషజుడవు. (అహితుల కపకార మొనరించు, అహులకు, సర్పములకు తాప మొనరించు) నీ వెవని కరస్థితుడ వగుదువో (పక్షముండుట) వా డఖిలవిశ్వము సంచరించినను "కుతోహి భయం" భయ మెట్లుండును? (అహిభయము) ఇందు రెండారోపములు కలవు, అహితాపకరణమున అహి–తాపకరణము, నరనాథు నందు భేషజత్వము" నను రెండారోపములలో సమర్థ్య సమర్థకభావము సమానమె యయినను – అహితుల యపకరణమె యహుల తాపకరణ మను శ్లేషమూలకారోపమున రాజునందు భేషజ తాదాత్మ్యారోపము సమర్థనీయ మని కవి యభిప్రాయము.

శ్లిష్టమాలా పరంపరితము.

౯౫. కమలావాస కాసారః క్ష్మాధృతి ఫణీశ్వరః
అయం కువలయస్యేందు రానందయతి మానవాన్.

కమలముల కావాసము, కమలకు వాసము – పృథ్వీ ధృతి, క్ష్మా ధృతి – పృథ్వీ మండలము, కుముదము. ఈ రాజు కమలావాస కాసారుడు క్ష్మాధృతిఫణీశ్వరుడు కువలయచంద్రుడు మానవుల నానంద పెట్టుచున్నాడు. ఇందు రాజొక్కడే విషయము, కాసార ఫణీశ్వర చంద్రులారోప్యమాణము లనేకము లగుట మాలాపరంపరితము.

### కేవలశుద్ధపరంపరితము.

౧౦౦. దేవాః కే పూర్వదేవాః.........కృపాణో భుజంగః
(పుట–౩౧)

ఇందు కృపాణమునందు భుజంగారోపము ప్రాణములందు దుగ్ధారోపముచే సమర్థింపదగినదని కవిభావము.

### మాలారూపశుద్ధపరంపరితము.

౧౦౧. ప్రాచీ సంధ్యా సముద్యన్మహిమ దినమణేర్మాన మాణిక్యకాంతి
జ్వాలా మాలా కరాలా కవలిత జగతః క్రోధకాలానలస్య
ఆజ్ఞా కాంతా పదాంభోరుహతల విగలన్మంజు లాక్షా రసానాం
క్షోణీంద్రో సంగరే తే లసతి నయనయోరుద్భటా శోణిమశ్రీః.

భూమీంద్రా! యుద్ధమున నీ నయనము లందలి యుద్భట మయిన శోణ శోభ, ఉద్యన్మహిమ కల దినమణికి ప్రాచీసంధ్య. జగములు కవలించిన క్రోధకాలానలమునకు మాణిక్యకాంతి కల కరాల జ్వాలామాల. కాంతల పాదతలముల నుండి జారెడి లాక్షారసముల కాజ్ఞ. ఇందీ విశేషమును గుర్తింపవలెను. సావయవ రూపకము నందును ఆరోపాంతర ముపాయముగనే యుండును. అయిన నచట తదారోపాతిరిక్త మగు కవిసమయసిద్ధ సాదృశ్యమున గూడ ఆరోపాంతరము సిద్ధింప వచ్చును. ఇచట నయన శోణిమ యందు జ్వాలాద్యారోపము నియమమున ననలాద్యారోప మపేక్షించును. కావున నిది పరంపరితము. శ్లేష లేనందున మాలారూపముగా నున్నందున మాలాశుద్ధ పరంపరిత మయినది.

### ౭ పరిణామము.

* విషయి విషయరూపముననే ప్రకృతోపయోగి యగుచో పరిణామ మగును.

౧౦౨. అపారే సంసారే విషమ విషయారణ్య సరణౌ
మమ భ్రామం భ్రామం విగలిత విరామం జడమతేః
పరిశ్రాంతస్యాయం తరణితనయా తీర నిలయః
సమంతాత్సంతాపం హరి నవతమాల స్తిరయతు.

విషమ విషయములచే నరణ్యమార్గ మయిన యపారసంసారమున జడమతినై విరామములేక తిరిగి పరిశ్రాంతుడ నయిన నాదు సంతాపమును యమునా తీరనిలయ మగు హరి నవతమాలము పోగొట్టు గావుత. ఇందు నవతమాలము విషయి. తమాలము భగవద్రూపముననె సంసారతాప నివర్తన సమర్థ మగును. ఇది సమానాధికరణ పరిణామము.

వ్య ధి క ర ణ ప రి ణా మ ము.

౧౦౩, అహీనచంద్రా లసతాననేన జ్యోత్స్నవతీ చాపి శుచిస్మితేన
ఏషా హి యోషా సితపక్షదోషా తోషాయ కేషాం న మహీతలే స్యాత్

ఈ వనిత లసదాననమున నహీనచంద్ర శుచిస్మితమున జ్యోత్స్నవతి శుక్లరజని భూతలమున నేరికి తోష మీయదు? ఇం దందరకు సంతోష మిచ్చు ననుట విరహిజనుల తోషపెట్టుటయు లభించును. శుక్లపక్ష రజనికి స్వస్వరూపమున గుదురదు. యోషారూపముననె సంగతమగును గాన పరిణామ ముపపన్నము. పూర్వార్థమున నంశద్వయము విభిన్నవిభక్తికముగా నుండుట వ్యధికరణ పరిణామము. "అననేన అహీనచంద్రా, స్మితేన జ్యోత్స్నవతీ" అను తృతీయా ప్రథమా విభక్తుల గుర్తింప వచ్చును.

౯. స సం దే హ ము.

* సాదృశ్యమూలక మయిన నానావగాహిని రమణీయబుద్ధి ససందేహము.

ఇది శుద్ధ మని నిశ్చయ గర్భ మని నిశ్చయాంత మని వివిధము.

౧౦౪. మరకతమణి మేదినీధరో వా తరుణతర తరురేష వా తమాలః
రఘుపతిమవలోక్య తత్ర దూరాత్ ఋషినికరైరితి సంశయః ప్రపేదే.

ఋషు లచట దూరమున రాముని జూచి మరకత మాణిక్య పర్వతమా? తరుణతర మయిన తమాల తరువా? యని సంశయము పొందిరి, ఇందు శుద్ధసందేహ మైయున్నది.

౧౦౫. తరణితనయా కిం స్యాదేషా న తోయమయీ హి సా
మరకతమణిజ్యోత్స్నా వా స్యాన్న సా మధురా కుతః?
ఇతి రఘుపతేః కాయచ్ఛాయా విలోకన కౌతుకైః
వనవసతిభిః కైః కైరాదౌ న సందిదిహే జనైః.

ఇది యమున యగునా? అది జలమయి కదా? మరకతమణి కాంతి యగునా? అది మధురము కాదు కదా! యని రాముని శరీరకాంతి విలోకనకుతుకము కల వనవాసిజనులు మొగట ఎవరెవరు సందేహ పడ లేదు? ఇందు సంశయము విడదీయు నిశ్చయ మున్నది.

౧౦౬. చపలా జలదాచ్చ్యుతా లతా వా తరుముఖ్యాదితి సంశయే నిమగ్నః
గురునిశ్వసితైః కపిర్మనీషీ నిరణైషీదథ తాం వియోగినీతి.

మేఘమునుండి జారిన మెఱుపగునా? తరువు నుండి విడిపడిన లత యగునా? యని సంశయపడి పెద్దనిట్టూర్చి బుద్ధిమంతుడయిన యాంజనేయు డామె వియోగిని యని నిర్ణయించు కొనెను. ఇది నిశ్చయాంత సంశయము. ఇది యితర మలంకరించిన యలంకార మగును. ఈ సందేహ మొకచో ననాహార్యము. ఒకచో నాహార్యము. కవి పరునిసంశయము నిబంధించినచో నది యనాహార్యము, స్వగతసంశయమె నిబద్ధ మయినచో నాహార్యము.

### ఆహార్య సందేహము.

౧౦౭. అలిర్మృగో వా నేత్రం వా యత్ర కించిద్విభాసతే
అరవిందం మృగాంకో వా ముఖం వేదం మృగీదృశః.

అందేదో భాసించునది భ్రమరమా? లేడియా? నేత్రమా? మరి యిది యరవిందమా? చంద్రుడా? మృగీదృశముఖమా? నేత్రమును భ్రమరమని లేడి యని సంశయించుట, ముఖము నరవిందమని చంద్రుడని సంశయించుట యభ్యూహ్యము. ఇందు వక్త కవి తత్త్వజ్ఞుడు. అతని సంశయము లాహార్యములు.

## ౧౦. భ్రాంతిమంతము.

* సదృశధర్మియందు తాదాత్మ్యమున, అనాహార్యము సాదృశ్య ప్రయోజ్యము చమత్కారి యగు ధర్మ్యంతరనిశ్చయము భ్రాంతి. అది పశుపక్ష్యాదిగతమై నిరూపిత మగుచో భ్రాంతిమంతము.

౧౦౮. కనకద్రవ కాంతి కాంతయా మిలితం రామముదీక్ష్య కాంతయా
చపలాయుత వారిద భ్రమాత్ ననృతే చాతక పోతకైర్వనే.

స్వర్ణకాంతి కాంత కాంత సీతతో గూడిన రాముని జూచి విద్యు
ద్వలిత వారిద మను భ్రమచే వనమున చాతకములు నర్తనము చేసినవి. ఇందు
భ్రాంతి చాతకహర్ష ముపస్కరించినది.

## ౧౧. ఉల్లేఖము.

* ఒకవస్తువు ననేకు లనేక విధముల గ్రహించుట యుల్లేఖము.

౧౦౯. నరైర్వర గతి ప్రదేత్యథ సురైః స్వకీయాపగే
త్యుదారతర సిద్ధిదేత్యఖిల సిద్ధ సంఘైరపి
హరేస్తనురితి శ్రితా మునిభిర స్తసంగైరియం
తనోతు మమ శం, తనోః సపది శంతనోరంగనా.

నరులు వరగతి ప్రద యని, సురులు తమనది యని సిద్ధు లంద రుదార
సిద్ధిప్రద యని, వీతరాగులు మునులు హరితను వని యాశ్రయించిన గంగ నా
తనువున కిప్పుడు సుఖ మిచ్చుగావుత. ఇం దనేకు లనేక విధముల గ్రహించు
టలో లిప్స రుచి నిమిత్తములు. ఈ యుల్లేఖము గంగా భక్తిభావము
నుపస్కరించు చున్నది. రూపకాది విమిశ్రితము కానందున నిది శుద్ధోల్లేఖము.
సంకీర్ణముగ గూడ నుల్లేఖ ముండును.

౧౧౦. ఆలోక్య సుందరి ముఖం తవ మందహాసం
నందంత్యమంద మరవిందధియా మిళిందాః
కించాలి! పూర్ణ మృగలాంఛన సంభ్రమేణ
చంచూపుటం చటులయంతి చిరం చకోరాః.

సుందరి! మందహాసము కల నీ ముఖము చూచి మిళిందము లరవింద
మని యమంద మానందించు చున్నవి. సఖి! ఇంక పూర్ణచంద్రు డను
సంభ్రమ మున చకోరములు చంచూపుటములను చటుల మొనర్చుచున్నవి.
ఇం దేకైక గ్రహణ రూప మగు భ్రాంతి యున్నది. దానిచే నుల్లేఖము
సంకీర్ణము.

వేరువిధమున గూడ నుల్లేఖ మున్నది. గ్రహీత లనేకులు లేకున్నను
ఒక వస్తువు ననేక విధముల గ్రహించుటయు నుల్లేఖము. ఇదియు శుద్ధ మని
సంకీర్ణ మని ద్వివిధము.

౧౧౧. దీనవ్రాతే దయార్ద్రా నిఖిలరిపుకులే నిర్దయా కించ మృద్వీ
కావ్యాలాపేషు తర్కప్రతివచనవిధౌ కర్కశత్వం దధానా
లుబ్ధా ధర్మేష్వలుబ్ధా వసుని పరవిపద్దర్శనే కాందిశీకా
రాజన్నాజన్మరమ్యా స్ఫురతి బహువిధా తావకీ చిత్తవృత్తిః.

రాజా! అజన్మరమ్య మయిన నీ చిత్తవృత్తి బహువిధముగా స్ఫురించు చున్నది. దీనులందు దయార్ద్రము. శత్రువు లందు నిర్దయము. కావ్యాలాపము లందు మృదువు. తర్క ప్రతివచన విధానమున కర్కశము. ధర్మములందు లుబ్ధము. ద్రవ్యమునం దలుబ్ధము. పరుల యాపద్దర్శనమున కాందిశీకము. ఇట్లది బహువిధము. ఇందు దీనవ్రాతాది విషయము లనేకము లగుట చిత్తవృత్తి యనేకవిధము. అది రాజవిషయ రతిభావమున నంగముగా నున్నది. చిత్తవృత్తి స్వరూపము లనేకము లయినను తదీయ చిత్తవృత్తిత్వ సామాన్యమున వివక్షితైకత్వము గుర్తింప వచ్చును.

౧౧౨. కాతరాః పరదుఃఖేషు నిజదుఃఖేష్వకాతరాః
అర్థేష్వలోభా యశసి సలోభాః సంతి సాధవః.

పరదుఃఖము లందు కాతరులు స్వదుఃఖము లందకాతరులు అర్థములం దలోభులు యశము నందు సలోభులై సాధువు లున్నారు. ఇందు సాధువు లున్నా రనుట "వారు మృతు లయినను మృతు లయినట్లు కాదు. ఇతరు లమృతు లయినను మృతులె" అను నర్థ మభివ్యక్త మగును. తద్ద్వారమున సాధువుల యుత్కర్ష వ్యంగ్య మగును. ఆ వ్యంగ్యము నీ యుల్లేఖ ముపస్కరించును.

## సంకీర్ణము.

౧౧౩. యమః ప్రతిమహీభృతాం హుతవహోసి తన్నీవృతాం
సతాం ఖలో యుధిష్ఠిరో ధనపతిర్ధనాకాంక్షిణాం
గృహం శరణమిచ్ఛతాం కులిశకోటిభిర్నిర్మితం
త్వమేక ఇహ భూతలే బహువిధో విధాత్రా కృతః.

నీవు శత్రువులకు యముడవు. వారి సైన్యముల కగ్నివి. సజ్జనులకు యుధిష్ఠిరుడవు. ధనార్థులకు ధనపతివి. భవనము కావలయు వారలకు కులిశ కోటి నిర్మిత మయిన భవనమవు. భూతలమున నిన్నొక్కనినే విధాత బహువిధముగ నిర్మించినాడు. ఇందు కవి రాజునకు యమత్వాది రూపమున

రూప మాపాదించుటచే రూపక మున్నది. ప్రతిభూపాలాదులకు యము డన్న భ్రాంతి కలుగుట భ్రాంతిమత్తున్నది. విపక్ష భూపాలాద్యనేకులు యమత్వాద్యనేక ప్రకారముల నుల్లేఖించుటచే సిద్ధమయిన యుల్లేఖము పై వానిచే సంకీర్ణము.

## ౧౨. అపహ్నుతి.

* ఉపమేయ ధర్మ నిషేధముతో నుపమాన తాదాత్మ్య మారోపించుట యపహ్నుతి.

౧౧౪. స్మితం నైతత్ కిం తు ప్రకృతిరమణీయం వికసితం
ముఖం బ్రూతే మూఢః కుముదమిదముద్యత్పరిమళం
స్తనద్వంద్వం మిథ్యా కనకనిభమేతత్ఫలయుగం
లతా రమ్యా సేయం భ్రమరకులనమ్యా న రమణీ.

ఇది స్మితము కాదు. ప్రకృతిరమణీయ మగు వికాసము. మూఢు డిది ముఖ మనును. ఇది పరిమళ మతిశయించు కుముదము, స్తనద్వంద్వ మనుట మిథ్య. ఇది కనకనిభ మయిన ఫలయుగము. ఇది తుమ్మెదలు వంచ దగిన రమ్యలత కాని రమణి కాదు. ఇందు స్మితాదులు నిషిద్ధము లగుట వికాసాదు లారోపితము లగుట విశదము. అనుగ్రాహ్యానుగ్రాహక భావము పొందిన యవయవము లిందు కూడి యుండుటచే నిది సావయవ.

## నిరవయవాపహ్నుతి.

౧౧౫. శ్యామం సితం చ సుదృశో న దృశోః స్వరూపం
కిం తు స్ఫుటం గరళమేతదథామృతం చ
నో చేత్కథం నిపతనాదనయోస్తదైవ
మోహం ముదం చ నితరాం దధతే యువానః.

ఈ సుదృశ దృక్స్వరూపము శ్యామము సిత మనుటయే కాదు. గరల మని యమృత మని స్ఫుటము కదా! కాకున్న వీని ప్రసారము కలుగగనే యువకులు మోహము ముదము పొందు టెట్లు? ఇందు గరలామృత సాధనమునకై మోహ మోద హేతువు లుపన్యసించి నందున హేత్వపహ్నుతి యున్నది.

ఆరోప మాత్రమున నుపాయ మగుటచే నిది పరంపరితముగా గూడ నుండును.

౧౧౬. మనుష్య ఇతి మూర్ఖేన ఖలః కేన నిగద్యతే
అయం తు సజ్జనాంభోజ వన మత్తమతంగజః.

ఖలుడు మానవు డని యే మూర్ఖు డనినాడు. ఈతడు సజ్జనాంభోజ వనమునకు మత్త మతంగజము. ఇందు సజ్జను లందంభోజ వనారోపము ఖలునందు మతంగజారోపము పరస్పరాపేక్షములు.

## ౧౩. ఉత్ప్రేక్ష

* తద్భిన్నమును తద్ధర్మసంబంధమున తదభిన్నముగ సంభావనము చేయుట ధర్మ్యుత్ప్రేక్ష. తద్రహితమును తత్సంబంధమున తత్సహితముగ సంభావనము చేయుట ధర్మోత్ప్రేక్ష.

సంభావనము తద్యోగ్యతానుసంధానము. ముఖమునందు చంద్రత్వ యోగ్యత యున్నదను ననుసంధానమును సంభావన మందురు. చంద్ర భిన్నమని పరిజ్ఞాత మయిన ముఖమును రమణీయమగు చంద్రు నందుం డాహ్లాదాది ధర్మము ముఖము నందుండుటచే చంద్రాభిన్నముగ సంభావనము చేయుట ధర్మ్యుత్ప్రేక్ష. ఇందలి సంభావనము తాదాత్మ్య సంబంధమున నుండును. బ్రహ్మ మోహ రహితము. అయినను మోహసహితముగ సంభావించుట ధర్మోత్ప్రేక్ష. ఇందలి సంభావనము సమవాయాది సంబంధ మున నుండును.

వాచ్య ప్రతీయమాన యని యుత్ప్రేక్ష రెండువిధములు. ఉత్ప్రేక్షా సామగ్రి ప్రతిపాదక శబ్దములతో నున్నచో వాచ్యోత్ప్రేక్ష యగును. ప్రతి పాదక శబ్దరహితముగ సామగ్రిమాత్రమే యున్నచో ప్రతీయమానోత్ప్రేక్ష యగును. ఇదియు స్వరూపోత్ప్రేక్ష హేతూత్ప్రేక్ష ఫలోత్ప్రేక్ష యని త్రివిధము. జాతి గుణ ద్రవ్య క్రియా భేదమున మఱల చతుర్విధము. ఇట్లుత్ప్రే క్షలో ననేక భేదములు కలవు. కొన్నిటిని దిఙ్మాత్ర ముదాహరింతుము.

### గుణ స్వరూపోత్ప్రేక్ష.

౧౧౭. అంభోజినీ బాంధవ నందనాయాం
కూజన్నృకానాం సమజో విరేజే
రూపాంతరాక్రాంతగృహః సమంతాత్
పుంజీభవన్ శుక్ల ఇవాశ్రయార్థీ.

ఇతర రూపముచే తన గృహ మాక్రాంతము కాగా నంతట పుంజీభవించి యాశ్రయ మర్థించు శుక్లమో యనునట్లు యమునానదిలో బకముల కులము కూజించు చుండెను. ఇందు కూజనము కల బకసమూహము పుంజీభవనము పొందిన శుక్లగుణము తాదాత్మ్యమున నుత్ప్రేక్షిత మయినది.

క్రి యా స్వ రూ పో త్ప్రే క్ష.

౧౧౮. కలిందజా నీరభరేఽర్ధ మగ్నాః
బకాః ప్రకామం కృత భూరి శబ్దాః
ధ్వాంతేన వైరాద్వినిగీర్యమాణాః
క్రోశంతి మన్యే శశినః కిశోరాః.

యమునా నీరమున సగము మునిగి శబ్దము చేయు కొంగలు చూచి వైరమున చీకటి ముంచెత్తు శశికిశోరములు క్రోశించు చున్నవని తలంతును. ఇందు శబ్ద మొనరించు బకములందు క్రోశనక్రియ యుత్ప్రేక్షితము. కాన క్రియోత్ప్రేక్ష.

ద్ర వ్య స్వ రూ పో త్ప్రే క్ష.

౧౧౯. కలింద శైలాదియమాప్రయాగం కేనాపి దీర్ఘా పరిఖా నిఖాతా
మన్యే తలస్పర్శ విహీనమస్యా మాకాశ మానీల మిదం విభాతి.

కలింద శైలము నుండి ప్రయాగవరకు నెవరో యొక దీర్ఘపరిఖ త్రవ్వినారు. ఇందు తల స్పర్శ లేని వినీలాకాశము భాసించుచున్నదని భావింతును. ఈ పద్యమున యమున నీలత్వ దీర్ఘత్వములో నిమిత్తముగా నాకాశ తాదాత్మ్య ముత్ప్రేక్షిత మయినది. ఆకాశము ద్రవ్య మగుట ద్రవ్యోత్ప్రేక్ష. ద్రవ్యస్వరూపోత్ప్రేక్ష మాలారూపముగా గూడ నుండును.

౧౨౦. ద్వినేత్ర ఇవ వాసవః కరయుగో వివస్వానివ
ద్వితీయ ఇవ చంద్రమాః శ్రితవపుర్మనోభూరివ
నరాకృతి రివాంబుధి ర్గురురివ క్ష మామాగతో
నుతో నిఖిల భూసురై ర్జయతి కోఽపి భూమీపతిః.

ద్వినేత్రు డయిన వాసవుడో, కరయుగమున్న సూర్యుడో రెండవ చంద్రుడో, రూపము కల మన్మథుడో, మానవాకృతి కల సముద్రుడో, భూమి దిగిన బృహస్పతియో యని సంభావించుచు నిఖిల భూసురులు నుతించిన యీ భూమీపతి 'జయతి.' ఇందు భూమీపతి యొక్కడె విష

యము. వాసవాదులు విషయి పదార్థము లనేకములు, వాని సంభావనము "ఇవ" పదమున స్పష్టము. వాసవాదుల కిందు నిరూపితము లయిన విశేషణ ములు సంభావనార్థము నందే సప్రయోజనము లగును. ఇట్టి స్థలములం దుపమ యనుట యసుందరము. కవి కనభిప్రేతమును. ద్వినేత్రత్వాది ధర్మములతో వాసవాది సాదృశ్యమును రాజునకు నిరూపించుట కవి భావము కానే కాదు.

హేతూత్ప్రేక్ష.

౧౨౧. త్వత్ప్రతాప మహాదీప శిఖా విపుల కజ్జలైః
నూనం నభస్తలే నిత్యం నీలిమా నూతనాయతే.

నీ ప్రతాపదీపశిఖా కజ్జలములచే నాకసమున నిత్యము నీలిమ నూతన మగుచున్నదే "నూనం" నభో నీలిమలో కజ్జలము కారణము కాదు. హేతువు కాని దాని హేతు వని నిరూపించుట హేతూత్ప్రేక్ష. ఇందే "దీపశిఖా కజ్జల లేపనైః" అను పాఠ మాశ్రయించిన లేపనము క్రియ యగుట అదియే నీలిమ నూతనీభవన హేతు వగును కాన క్రియా హేతూత్ప్రేక్షయు భావ్యము.

గుణ హేతూత్ప్రేక్ష.

౧౨౨. పరస్పరాసంగ సుఖాన్నత భ్రువః
పయోధరౌ పీనతరౌ బభూవతుః
తయోరమృష్యన్నయమున్నతిం పరా
మపైమి మధ్యస్తనిమాన మంచతి.

ఆ వనిత పయోధరములు పరస్పర సంబంధ సుఖమున పీనము లయినవి. వాని మంచి యున్నతి సహింపక నడుము చిక్కి పోవుచున్న దని నే తలంతును. ఇందు పూర్వార్థమున సుఖగుణము హేతువు. అపరార్థ మున "అమృష్యన్" సహింపక యను గుణాభావ మర్థవశమున హేతువుగ గోచరించును.

ద్రవ్య హేతూత్ప్రేక్ష.

౧౨౩. వరాకా యం రాకారమణ ఇతి వల్గంతి సహసా
సరః స్వచ్ఛం మన్యే మిలదమృత మేతన్మఖభుజాం
అముష్మిన్నాక్యాపి ద్యుతిరతిఘనా భాతి మిషతా
మియం నీలచ్ఛాయా దుపరి నిరపాయా ద్గగనతః.

వరాకులు త్వరపడి రాకారమును దనుచున్నారు. "ఇది దేవతల యసదమృతము స్వచ్ఛసరము." అని నే భావింతును. ఇందు చూచు వారలకు చిక్కని యొక కాంతి కన్పడు చున్నదే! యది పై నున్న నల్లని యాకసము నుండి ప్రతిబింబముగ సంక్రమించినదే యగును. ఇందు చంద్రు డమృత సరసుగా నుత్ప్రేక్షితుడు. అందలి నీల కలంకమున పైనుండు గగనము హేతువుగా నుత్ప్రేక్షితము. గగనము ద్రవ్యము హేతూకృత మయినది.

## ఫలోత్ప్రేక్ష.

౧-౨౪. "దివానిశం వారిణి కంఠదఘ్నే దివాకరారాధన మాచరంతీ
వక్షోజితాయై కిము? పక్ష్మలాక్ష్యాః తపశ్చరత్యంబుజపంక్తి రేషా"

గొంతుబంటి నీటిలో దివానిశము దివాకరు నారాధించు నీ పద్మ పంక్తి పక్ష్మలాక్షి వక్షోజత్వ మునకై తప మొనరించు చున్నదేమొ? ఇం దంబుజమునకు జలావస్థానము ప్రకృతి సిద్ధమె. అది తపశ్చరణక్రియ. వక్షో జత్వ సిద్ధి ఫలముగా నుత్ప్రేక్షితము.

## గుణఫలోత్ప్రేక్ష.

౧-౨౫. వియోగ వహ్ని కుండేఽస్మిన్ హృదయే తే వియోగిని!
ప్రియసంగ సుఖాయేవ ముక్తాహార స్తపస్యతి.

వియోగిని! వియోగ వహ్ని కుండ మయిన నీ హృదయమున ప్రియుని సంగసుఖము కొఱకై కాబోలు ముక్తాహారము తప మొనరించు చున్నది. ఇందు సంగసుఖము గుణము, ఫలముగా నుత్ప్రేక్షితము.

## క్రియాఫలోత్ప్రేక్ష.

౧-౨౬. హాలాహల కాలానల కాకోదర సంగతిం కరోతి విధుః
అభ్యసితుమివ తదీయాం విద్యామద్యాపి హరశిరసి గతః.

హరశిరమున నుండియు చంద్రుడు హాలాహల-కాలానల-కాకోదర ముల విద్య నీ నాటికి నభ్యసించుటకు గాబోలు వాని సంగతి నాచరించు చున్నాడు. ఇందలి విరహివాక్యమున నభ్యసనక్రియ ఫలముగా నుత్ప్రేక్షిత మయినందున క్రియాఫలోత్ప్రేక్ష.

ఈ జాత్యాది భేదములను ప్రాచీను లంగీకరించిరి. హేతు ఫల స్వరూపము లందు వలె వీనిలో చమత్కార వైలక్షణ్యము గోచరింపదు.

ఉత్ప్రేక్షలో సంభావనా వాచక పదములు లేక పోయినచో ప్రతీయమాన యగును. అచటి సంభావన మర్థసామర్థ్యమున నిశ్చేయ మగును. దాని నచట వ్యంగ్య మన నక్కర లేదు.

౧౪. అతిశయోక్తి.

* విషయిచే విషయ నిగరణ మతిశయము. తదుక్తి యతిశయోక్తి.

౧౭౭. కళిందగిరి నందినీ తట వనాంతరం భాసయన్
సదా పథి గతాగత క్లమభరం హరన్ ప్రాణినాం
స్ఫురత్కనక కాంతిభి ర్నవలతాభి రావేల్లితో
మమాశు హరతు శ్రమానతితమాం తమాల ద్రుమః.

యమునా తట వనాంతరము భాసింప జేయునది, నిత్యము మార్గమున ప్రాణులకు గతాగత శ్రమభరము హరించునది, కనక కాంతి కల నవలతలతో నావేల్లితము నయిన తమాలద్రుమము నా శ్రమముల హరించు గావుత. ఇందు తమాలమున కృష్ణభగవానుని నిగరణ మున్నది. పై మూడు చరణము లందున్న విశేషములు విషయి విషయ సాధారణ ధర్మములుగా నుపాత్తము లయినవి.

౧౭౮. జగజ్జాలం జ్యోత్స్నామయ నవసుధాభి ర్జటిలయన్
జనానాం సంతాపం త్రివిధమపి సద్యః ప్రశమయన్
శ్రితో బృందారణ్యం నతనిఖిల బృందారక నుతో
మమ స్వాంతధ్వాంతం తిరయతు నవీనో జలధరః.

బృందారణ్య మాశ్రయించిన నిఖిల బృందారక సంస్తుత మయిన నవీన జలధరము నా స్వాంతధ్వాంతము హరించు గావుత. ఆ జలధరము జ్యోత్స్నామయ నవ సుధచే జగముల నాప్లుతము చేయునది. జనుల త్రివిధ సంతాపము నపుడె హరించునది. ఇందు నవసుధా వ్యాప్తి రూప మగు ధర్మము విషయ మయిన కృష్ణునందె సంభవించును. జలధరమున సంభవింపదు. కాన విషయిధర్మము విషయధర్మ విశిష్టముగనె యుండుట కవికల్పనము. అందుననె నవీనజలధర మనుటయు నుపపన్నము. ఇట్లే విశేషణముల యానుకూల్యము భావింప నగును.

లోకోత్తరత్వము నిరూపించుటకై యభేద మున్నను భేదము చెప్పుట యతిశయోక్తి.

౧౨౯. అన్యా జగద్ధితమయీ మనసః ప్రవృత్తిః
అన్యైవ కాపి రచనా వచనావలీనాం
లోకోత్తరా చ కృతి రాకృతిరార్యహృద్యా
విద్యావతాం సకలమేవ చరిత్రమన్యత్.

విద్య గలవారి విశ్వహిత మొనరించు మనఃప్రవృత్తి యన్యాదృశము. వచనావలీ రచనయు నన్యము. వారి కృతి లోకోత్తరము. ఆకృతి యార్య మనోహరము. వారి చరిత మంతయు నన్యమె. ఇందు వైలక్షణ్యము విశదము.

౧౩౦. గిరం సమాకర్ణయితుం యదీయాం సదా రసజ్ఞైరనుభావనీయాం
సమీహతే నిత్యమనన్యచేతా నభస్వదాత్మంభరి వంశ నేతా.

నిత్యము రసజ్ఞు లనుభవింప దగిన యీ వాక్కు వినుటకు (నభస్వత్ - వాయువు ఆత్మంభరి - పొట్టనింపుకొను సర్పములవంశ - వంశమున నేతా - నాయకుడు) శేషుడు నిత్య మనన్యచేతస్కుడై యభిలషించుచున్నాడు. ఇందు శేషుడాకర్ణన సమీహా సంబంధము లేనివాడయిన నట్లు చెప్పుట యతిశయము.

౧౩౧. పీయూష యూష కల్పా మల్పామపి తే గిరం నిపీతవతాం
తోషాయ కల్పతే నో యోషాధరబింబ మధురిమోద్రేకః.

అల్పమయినను సుధాకల్ప మయిన నీ వాణి త్రావిన వారలకు యోషాధర మాధుర్యాతిశయమును తోష మీయజేరదు. ఇందధరమధురిమ తోషసంబంధ మున్నను సంబంధము లేమి వర్ణించుటయు నతిశయోక్తి యగును. ఇట్లనేక భేదము లున్నవి.

౧౫. తు ల్య యో గి త.

* ప్రకృతములకేని యప్రకృతములకేని గుణక్రియాదిరూప మగు నేకధర్మాన్వయము తుల్యయోగిత.

ఈ యలంకారమున నుపమావాచక ముండదు. సమానధర్మముండుటను గాన నౌపమ్యము గమ్య మగును.

౧౩౨. ప్రియే! విషాదం జహిహీతి వాచం ప్రియే సరాగం వదతి ప్రియాయాః
వారాముదారా విజగాల ధారా విలోచనాభ్యాం మనసశ్చ మానః.

ప్రియా! విషాదము విడువుము! అని ప్రియుడు సరాగము పలుకగా ప్రియురాలి లోచనముల నుండి వారిధార మనము నుండి మానము జారెను. ఇందు మానిని వర్ణనీయ. తదీయ బాష్ప మానములు ప్రకృతములు. విగలనము (జారుట) వాని సమానధర్మము. లోచన మనములు నపాదానములుగా విగలన విశిష్టములు. ఈ నాల్గింటికి విగలనక్రియా రూపధర్మైక్య మున్నది. అయినను పరస్పరము రెంటి రెండిటి కౌపమ్యము గోచరించును. నాల్గింటి కది భాసింపదు.

అప్రకృత తుల్యయోగిత.

౧౩౩. వ్యంచతి బాల్యే కుచ్ఛృళః సముదంచతి గండసీమ్ని పాండిమని
మాలిన్యమావిరాసీత్ రాకాధిప లవలి కనకానాం.

ఆ బాల బాల్యము శోభింప, కపోలమున పాండిమ ప్రకాశింప, చంద్ర–లవలి–సువర్ణముల మాలిన్య మావిర్భవించినది. ఇందు బాల వర్ణనీయ. రాకాధిపాదు లప్రకృతములు. మాలిన్యరూపమగు గుణము ధర్మము.

కారక తుల్యయోగిత.

ప్రకృతక్రియలు కాని యప్రకృతక్రియలు కాని యేక కారకాన్వయము పొందిన కారకతుల్యయోగిత యగును.

౧౩౪. దూరీకరోతి కుమతిం విమలీకరోతి
చేతశ్చిరంతనమఘం చులుకీకరోతి
భూతేషు కిం చ కరుణాం బహులీకరోతి
సంగః సతాం కిము న మంగలమాతనోతి.

సత్సంగము కుమతి దూరీకరించును. చేతము విమలీకరించును. పూర్వపాప మాపోశించును. ప్రాణులందు కరుణ బహులీకరించును. ఏ మంగల మాచరింపదు? ఇందు కుమతి దూరీకరణాదులు ప్రకృతక్రియలు. సంగ మను నొకదానితో నన్వయము పొందినవి. ఈ కారకతుల్యయోగిత యర్థాంతర న్యాసాన్విత మయినది.

౧౬. దీపకము.

* ప్రకృతముల కప్రకృతములకు నేకసాధారణ ధర్మాన్వయము దీపకము.

పూర్వమునందు వలె నిందు నౌపమ్యము గమ్య మగును. ప్రకృతార్థముపాత్త మయిన ధర్మము ప్రసంగవశమున నప్రకృతమును గూడ దీపింప జేయును. ప్రకాశింప జేయును. సుందరము చేయును గావున దీపకము. ప్రకృతాప్రకృతముల ప్రకాశింప జేయునది యగుట దీపసదృశమై దీపకమయినది.

౧౩౫. "అమృతస్య చంద్రికాయా లలితాయాశ్చాపి కవితాయాః
సుజనస్య చ నిర్మాణం జనయతి న హి కస్య సంతోషం."

అమృతము వెన్నెల లలితకవిత సుజనుడు వీరి నిర్మాణ మెవనికి సంతోష మీయదు? ఇందు సంతోషజననము ప్రకృతాప్రకృత సమాన ధర్మము.

౧౩౬. "మృతస్య లిప్సా కృపణస్య దిత్సా
విమార్గగాయాశ్చ రుచిః స్వకాంతే
సర్పస్య శాంతిః కుటిలస్య మైత్రీ
విధాతృసృష్టౌ న హి దృష్టపూర్వా."

మృతునకు లిప్స (పొందుకోరిక) లుబ్ధునకు దిత్స (దానేచ్ఛ) దుశ్చారిణికి తన ప్రియునందు రాగము, సర్పమునకు శాంతి, కుటిలునకు మైత్రి, ధాత సృష్టిలో నెన్నడు కన్పడ లేదు. ఇందభావము సాధారణధర్మము.

మాలాదీపకము.

ఉత్తరోత్తరమున పూర్వపూర్వ ముపకారక మయినచో మాలాదీపకము.

౧౩౭. ఆస్వాదేన రసో రసేన కవితా కావ్యేన వాణీ తయా
లోకాంతఃకరణానురాగరసికః సభ్యః సభా చామునా
దారిద్ర్యానల దహ్యమాన జగతీ పీయూష ధారాధర!
క్షోణీనాథ! తయా భవాంశ్చ భవతా భూమండలంభాసతే.

ఆస్వాదమున రసము, రసమున కవిత, కావ్యమున వాణి, వాణిచే జనరంజకుడగు సభ్యుడు, సభ్యునిచే సభ, సభచే నీవును, నీ చే భూమండలమును భాసించుచున్నది. ఇందాస్వాదాదులు రసాదులం దుపకారకము లయినవి. ఇది ప్రాచీనుల యనురోధమున నుదాహృతము. సాదృశ్య సంపర్కము లేనందున నిది దీపకమె కాదు. ఇది యేకావళీ ప్రభేదము.

౧౭. ప్రతివస్తూపమ.

* వస్తు ప్రతివస్తు భావము కల సాధారణధర్మ మున్న వాక్యార్థ ములకార్థ మౌపమ్యము ప్రతివస్తూపమ.

౧౩౭. ఆపద్గతః ఖలు మహాశయచక్రవర్తీ
విస్తారయత్యకృతపూర్వ ముదారభావం
కాలాగురు ర్దహనమధ్యగత స్సమంతా
ల్లోకోత్తరం పరిమళం ప్రకటీకరోతి.

మహాభావు డాపద పొందినను నవ్య మౌదార్యమె విస్తరింప జేయును. అగరు ద్రవ్య మగ్నిలో పడిన నంతట లోకోత్తర పరిమళమె ప్రకటించును. ఇందుపమేయోపమానము లందున్న విస్తారణము ప్రకటన మను క్రియారూప ధర్మము లేకరూపములె యయినను వస్తు ప్రతివస్తు భావము పొందినవి. ఈ ధర్మము కల యుపమేయ ముపమానము గమ్యౌపమ్యమున నుండుట ప్రతి వస్తూపమ స్పష్టము.

౧౩౮. విశ్వాభిరామ గుణగౌరవ గుంభితానాం
రోషోపి నిర్మలధియాం రమణీయ ఏవ
లోకంపృణైః పరిమళైః పరిపూరితస్య
కాలాగురోః కఠినతాపి నితాంతరమ్యా.

విశ్వమనోహర గుణగౌరవము కల నిర్మలమనస్కుల రోషమును రమణీయమె. లోకము పూరించు పరిమళములు కల కాలాగురు కఠినత్వమును రమ్యముగనె యుండును. ఇందును రమణీయము రమ్య మేకరూపములు భిన్నశబ్దోపాత్తములు వస్తు ప్రతివస్తు భావాపన్నములు. ప్రతివస్తూపమ వైధర్మ్యమున గూడ నుండును.

౧౪౦. వంశభవో గుణవానపి సంగవిశేషేణ పూజ్యతే పురుషః
న హి తుంబీఫలవికలో వీణాదండః ప్రయాతి మహిమానం.

మంచి వంశమున జన్మించిన గుణవంతు డయిన పురుషుడు సంగ విశేషమునన పూజితు డగును. తుంబీఫలము లేకున్న వీణాదండము మహిమ పొంద లేదు. ఇందు పూర్వవాక్యార్థము పూజితు డగునని విధిఘటితము. ఉత్తరవాక్యార్థము మహిమపొంద దని నిషేధఘటితము. ఇట్టి వాక్యార్థములు

సామ్యము లే నట్లున్నను "తుంబీ ఫల సహిత వీణాదండము మహిమ పొందును." అను అప్రకృతవాక్యార్థాక్షిప్త వతౌపమ్యాశ్రయ మగును.

### ౧౮. దృ ష్టాం త ము.

* ప్రకృతవాక్యార్థ ఘటకము లయిన యుపమానాదులకు సమానధర్మమునకును బింబప్రతిబింబభావ మున్నచో దృష్టాంత మగును.

౧౪౧. సత్పూరుషః ఖలు హితాచరణై రమంద
మానందయ త్యఖిల లోక మను క్త ఏవ
ఆరాధితః కథయ! కేన కరై రుదారై
రిందుర్వికాసయతి కైరవిణీ కులాని.

ఎవ్వరు చెప్పక పోయినను సత్పూరుషుడు హితాచరణములచే నఖిలలోకము నానందింప జేయును. చంద్రుడు తన యుదార కిరణములచే కైరవిణీ కులముల వికసింప జేయుచున్నాడు కదా! అతని నెవ రారాధించిరి.? ఇందు చంద్రసత్పురుషులకు కైరవిణీ కుల లోకములకు నుదార కర హితాచరణములకు నానందన వికాసములకు బింబ ప్రతిబింబ భావ మున్నది. వైధర్మ్యమున గూడ దృష్టాంత ముండును.

౧౪౨. తాపత్రయం ఖలు నృణాం హృది తావదేవ
యావన్న తే వలతి దేవ! కృపాకటాక్షః
ప్రాచీ లలాట పరిచుంబిని భానుబింబే
పంకేరుహోదరగతాని కుత స్తమాంసి?

దేవా! నీ కృపాకటాక్షము ప్రసరింప నంతవరకే మానవుల హృదయమున తాపత్రయ ముండును. భానుబింబ ముదయింప పద్మాంతరమున నంధకార మెట్లుండును? ఇందు తాపత్రయావసాన - తమోదూరీకరణములకు వైధర్మ్యమున బింబ ప్రతిబింబ భావ మున్నది.

### ౧౯. ని ద ర్శ న.

* ఉపాత్తార్థముల కౌపమ్యమున పర్యవసానము పొందెడి యార్థాభేద మున్నచో నిదర్శన యగును.

ఆర్థాభేద మన గా మొదటి యన్వయబోధలో విషయము కాకుండుట.

౨౪౩. త్వామంతరాత్మని లసంత మనాథ మజ్ఞాః
తీర్థేషు హంత! మదనాంతక! శోధయంతః
విస్మృత్య కంఠతట మధ్య పరిస్ఫురంతం
చింతామణిం క్షితిరజస్సు గవేషయంతి.

మదనాంతక! అజ్ఞులు కొందరు అంతరాత్మలో శోభించు ననంతుడవైన నిన్ను తీర్థములందు పరిశోధించుచు, కంఠమధ్యమున స్ఫురించుటను మఱచి చింతామణిని భూ పరాగములం దన్వేషించు చున్నారు. ఇందు నిన్నన్యత్ర పరిశోధించుట కంఠగత చింతామణిని భూపరాగము లందు గవేషించుటయు నభిన్న మని సాదృశ్యమూలక బోధ కలుగును. "శోధయంతో గవేషయంతి" పరిశోధించుచు నన్వేషించు చున్నా రనునది యేకవాక్యమగుట ఈ నిదర్శన యేకవాక్యగతము. శోధన - గవేషణముల శాపమ్యమూలాభేద మున్నది. దీని వాక్యార్థనిదర్శన యందురు. ఇట్టి నిదర్శనలో ఘటకపదార్థములగు అంతరాత్మ, కంఠతటాదులకు బింబ ప్రతిబింబ భావమావశ్యకము.

పదార్థ నిదర్శన.

౨౪౪. అగణ్యైరింద్రాద్యైరిహ పరమపుణ్యైః పరిచితో
జగజ్జన్మ స్థాన ప్రలయ రచనా శిల్ప నిపుణః
ప్రసర్పత్పీయూషామ్బుధి లహరి లీలా విలసితో
దృగంతస్తే మందం మమ కలుషబృందం దలయతు.

అసంఖ్యాకులగు నింద్రాది పరమ పుణ్యదేవులకు పరిచితము, జగదుత్పత్తి స్థితి లయ నిపుణము, ప్రసరించు సుధాప్రవాహ లీలా విలాసము కల నీ దృగంతము మందముగా నా పాపబృందము నశింప చేయుగావుత. ఇందు దృగంతలీలాంబుధి లహరి లీల లాశ్రయ భేదమున భిన్నములు. దృగంతలీల దృగంతాశ్రితము. అంబుధి లహరి లీల యంబుధిలహర్యాశ్రితము. భిన్నము లయిన నుజ్జృంభణకృత సాదృశ్యమున సాధ్యాభేదము గోచరించును. ఉపమేయోపమానము లగు దృగంతాంబుధిలహరులకు భాసించు శాబ్దాభేదము అర్థభావనమున నుపమేయోపమానధర్మము లగు లీలల యభేదమున పర్యవసించును. దృగంతమున లహరి లీలా సమారోపము గాని భావింప వచ్చును.

## ౨౦. వ్యతిరేకము.

* గుణవిశేష ముండుట నుపమానము కన్న నుపమేయమున
నుత్కర్ష వ్యతిరేకము.

౧౮౫. అనిశం నయనాభిరామయా రమయా సంమదినో ముఖస్య తే
నిశి నిస్సరదిందిరం కథం తులయామః కలయాపి పంకజం.

అనిశము నయనాభిరామ మగు రమాసంయుక్త మయిన నీ ముఖము నకు, నిశి రమాదూర మయిన పంకజమునకు లేశముగ నయిన పోలికయెట్లు చెప్పగలము. ఉపమలో వలె నిందును భేదములు కలవు.

౧౮౬. కటు జల్పతి కశ్చిదల్పవేదీ యది చేదీదృశమత్ర కిం విదధ్మః?
కథ మిందు రివాననం త్వదీయం సకలంకః స కలంకహీన మేతత్.

అల్పవేది యొకడిట్లు కటువు జల్పించు నేని యిందేమి చేయగలము? నీ ముఖము చంద్రుని వలె నుండు టెట్లు? అతడు సకలంకుడు. ఇది కలంక హీనము. ఇం దుపమేయోత్కర్షమును జెప్పు వైధర్మ్య మున్నది. ఉప మానాపకర్ష చెప్పు వైధర్మ్యము నున్నది.

౧౮౭. కతిపయ దివస విలాసం నిత్యసుఖాసంగ మంగల పవిత్రీ
ఖర్వయతి స్వర్వాసం గీర్వాణ ధునీ తట స్థితిర్నితరాం.

నిత్యసుఖ మంగల మిచ్చు గంగాతీర నివాసము స్వర్వాసమును ఖర్వీకరించును. ఇందు సాదృశ్యవాచకము లేదు. సదృశవాచకమును లేదు. శ్రౌతార్థ మార్గము లుల్లంఘించిన యుపమ యాక్షిప్త మగును.

౧౮౮. "నిశాకరాదాలి! కలంక పంకిలాత్ గుణాధికం నిర్మలమాననం తే
అనల్ప మాధుర్య కిరోఽధరాదిమా గిరోఽధరా సూక్తరసాః కవీనాం.

సఖి! నీ నిర్మలవదనము కలంక పంకిల మయిన నిశాకరుని కన్న గుణాధికము. సూక్తరసము లయిన కవుల యీ వాక్కులును అనల్ప మాధుర్య మిచ్చు నీ యధరము కన్న నధరములు. ఇందు పూర్వార్థమున నుపమేయో త్కర్ష శాబ్దముగా నున్నది. ఉపమానాపకర్షము సాదృశ్యాభావము నాక్షిప్తములు. ద్వితీయార్థమున నుపమానాపకర్ష శాబ్దము. ఉపమేయో త్కర్షము సాదృశ్యాభావము నాక్షిప్తములు.

## ౩౧. సహోక్తి.

* ప్రధానాప్రధానభావము కూడిన సహార్థసంబంధము సహోక్తి.

౧౪౯. మాంధర్యమాప గమనం సహ శైశవేన
రక్తం సహైవ మనసాధరబింబ మాసీత్
కించాభవన్మృగకిశోర దృశో నితంబః
సర్వాధికో గురురయం సహ మన్మథేన.

ఆ మృగనయన గమనము శైశవముతో సహ మాంధర్యము పొందెను. అధరము మనసుతో సహ రక్తమయ్యెను. ఇంక నితంబము మన్మథునితో సహ సర్వాధికమై గురువయ్యెను. ఇందు రక్త గురు పదముల కర్థద్వయ మున్నది. ఎఱ్ఱగా నుండుట ఆసక్తమగుట, అధికభారమగుట ఉపదేశమిచ్చుట, ఇట్లుపమేయోపమానముల గుణములు భిన్నములయినను శ్లేషచే పిండీకృతము లగుటచే సహాభావ ముపపన్నమగును.

౧౫౦. ఉన్మూలితః సహ మదేన బలాద్బలారేః
ఉత్థాపితో బలభృతాం సహ విస్మయేన
నీలాతపత్ర మణిదండ రుచా సహైవ
పాణౌ ధృతో గిరిధరేణ గిరిః పునాతు.

బలారి మదముతో గూడ బలమున నున్మూలితము, బలవంతుల విస్మయముతోడుత నుత్థాపితము, నల్లని గొడుగు మణిదండ కాంతితో గూడ గిరిధారిచే హస్తధృతమయిన గోవర్ధనగిరి పవిత్ర మొనరించుగావుత. ఇందు పూర్వార్థమున పౌర్వాపర్య విపర్యయమూలమయిన సహోక్తి అధ్యవసానాత్మకమయిన సహోక్తి యున్నవి మొదట పర్వతము పెకలించెను. పిమ్మట పురందరుని దర్పము పరిహరించెను. ఈ ప్రసిద్ధక్రమ మిందు లేదు. లంఘితమయినది. అట్లే కొండను మొదట నిలబెట్టెను. పిమ్మట విస్మయమాపాదించెను. ఈ క్రమమును పర్యస్తమయినది. కావున నిచటి సహోక్తి పౌర్వాపర్య విపర్యయానుప్రాణితము. మద మున్మూలించుట పర్వతమున్మూలించుట భిన్నములె యయినను "స్వస్థానము త్యజించుట"చే నభిన్నీకృతము లయినందువ నధ్యవసానమూల సహోక్తి.

## ౨౨. వినోక్తి.

* వినార్థసంబంధమున వినోక్తి యగును.

వినాకృత మయిన వస్తు వరమణీయము రమణీయ మగుటను వినోక్తి రెండు విధములు.

### అరమణీయ వినోక్తి.

౧౫౧. సంపదా సంపరిష్వక్తో విద్యయా చానవద్యయా
నరో న శోభతే లోకే హరిభక్తిరసం వినా.

సంపద యున్నను అనవద్య విద్య యున్నను లోకమున నరుడు హరిభక్తిరసము వినా శోభింపడు. ఇందు వినార్థమున అరమణీయత నిరుక్తము.

౧౫౨. వదనం వినా సుకవితాం సదనం సాధ్వీం వినా వనితాం
రాజ్యం చ వినా ధనితాం న నితాంతం భవతి కమనీయం.

కవిత వినా వదనము కమనీయము కాదు. సాధ్వి వనిత వినా సదనము కమనీయము కాదు ధనము వినా రాజ్యమును కమనీయము కాదు.

### రమణీయ వినోక్తి.

౧౫౩. పంకైర్వినా సరో భాతి సదః ఖలజనైర్వినా
కటువర్ణైర్వినా కావ్యం మానసం విషయైర్వినా.

పంకములు లేక సరస్సు, ఖలజనములు లేక సదస్సు, కటువర్ణములు లేక కావ్యము, విషయములు లేక మానసము భాసించును. ఇందు వినాకృతము రమణీయ మగుట విశదము.

## ౨౩. సమాసోక్తి.

* ప్రస్తుత వ్యవహార మప్రస్తుత వ్యవహారాభేదమున భాసించుట సమాసోక్తి.

సమాసోక్తిలో ప్రస్తుతాప్రస్తుత సాధారణములయిన విశేషణము లుండును. విశేషణ సామ్యము శ్లేషచే గలుగును. శుద్ధసాధారణ్యమునను గలుగును.

### శ్లిష్ట విశేషణ సామ్యము.

౧౫౪. ఉత్సంగే తవ గంగే! పాయం పాయం పయోఽతిమధురతరం
శమితాఖిల శ్రమభరః కథయ! కదాఽహం చిరాయ శయితాహే!

హే! గంగే! నీ మధురతర మయిన పయము త్రావి త్రావి శ్రమ మంతయు పోగా నీ సమీపమున నెప్పుడు చిరము శయనింతునో? చెప్పుము! ఇం దొక శిశువు తల్లిపాలు త్రావి సుఖముగా నామె యొడిలో శయనించుట యను శిశు జననీ వృత్తాంత మప్రకృతము. ప్రకృత వృత్తాంతము తదభిన్నమున నున్నది. ఉత్సంగ పయః పదములు శ్లిష్టములు.

సాధారణ విశేషణము.

౧౫౫. అలంకర్తుం కర్ణౌ భృశమనుభవంత్యా నవరుజాం
సశీత్కారం తిర్యగ్వలిత వదనాయా మృగదృశః
కరాబ్జవ్యాపారా నతిసుకృతసారాం స్రసయతో
జనుః సర్వశ్లాఘ్యం జయతి లలితోత్తంస! భవతః.

రెండర్థముల కనుకూలించు విశేషణముల బలమున రెండు వృత్తాంతము లిందు స్ఫురించును. ఒక నవకాంత క్లేశమున కర్ణావతంసముల నేర్పఱచి కొనినది. అది ప్రకృతార్థము.

ఓ రమణీ కర్ణ భూషణమా! (లలితోత్తంసమా!) నీ జన్మ సర్వశ్లాఘ్యమై యొప్పారు చున్నది. ఆ వనిత కర్ణముల నలంకరించుటకు నవబాధ నధిక మనుభవించినది. సశీత్కారము వదనము త్రిప్పినది. అతి సుకృత సారము లయిన కరవ్యాపారము లొనర్చినది. వాని నన్నిటి నీ వాస్వాదింతువు.

అప్పుడే నవనవముగా నధరము దశించిన కాముకుని వృత్తాంత మప్రకృతము. ఒక నవోఢ కర్ణము లలంకరించు కొను నప్పుడు కాంతుడు వచ్చి మధుర మధురము దశింప ఆమె సీత్కరించుచు వలిత వదనయై కరము లడ్డము వ్యాపారించిన ననుభూతి నందికొను ధన్యుని జన్మ శ్లాఘ్యము. ఈ కాముక వృత్తాంతాభేదమున ప్రకృతము భాసించుట సమాసోక్తి.

వేరొక విధమున సమాసోక్తి చతుర్విధము. లౌకిక వ్యవహారమున లౌకిక వ్యవహారారోపరూపము పూర్వము నిరూపితము.

శాస్త్రీయమున శాస్త్రీయము.

౧౫౬. గుణవృద్ధీ పరేయస్మిన్ నైవస్తః ప్రత్యయాత్మకే
బుధేషు సదితి ఖ్యాతం తద్బ్రహ్మ సముపాస్మహే.

ఆనందాత్మకము చిద్రూప మయిన యే బ్రహ్మము నందు గుణము వృద్ధి యుండవో పండితు లం దేది సత్-బ్రహ్మ యని ప్రఖ్యాతమో యా

బ్రహ్మానుపాసింతుము. ఇది వేదాంత శాస్త్ర సిద్ధమయిన వ్యవహారము. వ్యాకరణ శాస్త్ర సిద్ధమయిన వ్యవహారమిందు సమారోపితము. శతృ-శానచ్ రూపమయిన ప్రత్యయము పరముండగా గుణవృద్ధులు రావు. "తౌ సత్" అను పాణిని వ్యాకరణ సూత్రమున శతృ శానచులు "సత్" సంజ్ఞ కలవని నిశ్చితము. దాని బ్రహ్మగా నుపాసింతుమని వ్యాకరణ సిద్ధార్థము. ఇట్లిందు శతృ శానజ్వ్యవహారము సమారోపితము.

లౌకికమున శాస్త్రీయము.

౧౫౪. పరార్థ వ్యాసంగా దుపజహ దథ స్వార్థపరతా
మభేదైకత్వంయో వహతి గుణభూతేషు సతతం
స్వభావా ద్యస్యాన్తః స్ఫురతి లలితోదాత్త మహిమా
సమర్థో యో నిత్యం స జయతితరాం కోపి పురుషః.

పరార్థ వ్యాసంగమున స్వార్థము విడుచువాడును, గుణభూతులందు నిత్య మభేదైకత్వము వహించువాడును, స్వభావమున లలితోదాత్త మహిమ లోన గలవాడు నగు సమర్థ పురుషుడొకడు "జయతి," ఇట్టి యీ లౌకికార్థమున వ్యాకరణ శాస్త్రీయార్థ మారోపితము. అది యిది. "సమర్థః పదవిధిః" యను పాణిని సూత్ర విషయమున పతంజలి భాష్యార్థ మిందున్నది. అచటి భాష్యమున జహత్స్వార్థవృత్తి, యుపసర్జనార్థమున నభేదైకత్వ సంఖ్యయు నిరూపితము. పరార్థమునకై స్వార్థము విడుచుట జహత్స్వార్థ. ఓషధి రసము లన్నియు మధుబిందువు నందు కూడి యుండు నట్లు ఏకత్వ ద్విత్వ బహుత్వము లన్నియు నవిభాగమున నున్న సంఖ్య అభేదైకత్వసంఖ్య యగును. సమర్థసూత్ర భాష్యము పరార్థ వ్యాసంగమున స్వార్థము విడుచుట చెప్పినది. గుణభూతముల ప్రధానము లగు నేకత్వాదులం దభేదైకత్వమును సూచించినది. లలిత ముదాత్త మయిన మహిమ కల యా భాష్యార్థము సర్వాతిశాయి "జయతి".

శాస్త్రీయమున లౌకికము.

౧౫౫. కృత్వా సూత్రైః సుగూఢార్థైః ప్రకృతేః ప్రత్యయం పరం
ఆగమాన్ భావయన్ భాతి వైయాకరణ పుంగవః.

వైయాకరణ శ్రేష్ఠుడు గూఢార్థములు కల సూత్రములచే ప్రత్యయమును ప్రకృతికి పరముగా కూర్చి వచ్చెడి యాగమ కార్యములను భావించు

చున్నాడు. ఇది వ్యాకరణశాస్త్రీయ మయిన ప్రకృతార్థము. రాజవ్యవహార మప్రకృతము. గహన ప్రయోజనములు కల కార్యబీజములచే ప్రజకు విశ్వాస మాపాదించి ధనాగమములను భావించుచు రాజు భాసించు చున్నాడు. ఇందు ప్రథమవ్యవహారము ద్వితీయవ్యవహారాభిన్నముగా గోచరించుటచే సమాసోక్తి. సమాసోక్తి యనేకాలంకారము లందనుగుణముగ గూడి యుండును.

## ౨౮. పరికరము.

* విశేషణముల సాభిప్రాయత్వము పరికరము.

దీనిలో వ్యంగ్య చమత్కార ముండును గాని యది ప్రకృతార్థోప పాదక మగును.

౧౪౯. మంత్రైర్మీలిత మౌషధైర్ముకులితం త్రస్తం సురాణాం గణైః
స్రస్తం సాంద్ర సుధా రసైర్విదలితం గారుత్మత గ్రావభిః
వీచి క్షాళిత కాలియాహిత పదే! స్వర్లోక కల్లోలిని!
త్వం తాపం తిరయాధునా భవ భయ వ్యాలావలీఢాత్మనః.

స్వర్లోక కల్లోలిని! గంగే! వీచి క్షాళిత కాళియదమన కృష్ణ పదా! భవభయ మనెడు సర్పపు కాటు పొందిన నా పాప మిప్పు డీవు పోగొట్టుము. మంత్రములు మాసినవి. ఔషధములు ముడుచుకొనినవి. దేవగణము భయ పడినది. అమృతరసములు జారినవి. గారుడ మణి శిలలు బ్రద్దలైనవి. ఇందు గంగ యొనరింప వలసిన తాప దూరీకరణ కాంక్ష వాక్యార్థము. దీని సౌందర్యాధానమునకై "వీచిక్షాళిత కాలియాహిత పదే" యను విశేషణము సాకూతముగా నుపాత్త మయినది. నామాంతరము లున్నను 'కాలియాహిత' పద స్వీకార సామర్థ్యమున కృష్ణపాదమున లోకోత్తర విషహరణ శక్తి యుత్పత్తిసిద్ధ మని భాసించును. కృష్ణుడు ఫణాగణ నృత్యముచే కాలియుని నిస్సార మొనరించెను గదా! ఆ విషహరణ శక్తిని గంగానది తరంగ జలముల క్షాలన మొనర్చినది. దానిచే నా శక్తి స్వాశ్రయ రేణుద్వారమున గంగలో సంక్రమించిన దని గోచరించును. గంగ మొదటనే కృష్ణపాదముల విష హరణశక్తి గడిగినది కదా! పిమ్మట కాలియ విషహరణ మెట్లనియు సంశ యింప జనదు. గంగ క్షాలనము చేయగా లేశముగా నా శక్తి పాదముల గలదు. అదియే కాలియ విషము హరించె ననియు నాకూతము. ఇందిట్లు విశేషణము సాభిప్రాయ మయినందున పరికర మలంకారము.

## ౨౮. శ్లేష.

* ఏకశ్రుతిచే ననేకార్థప్రతిపాదనము శ్లేష.

ప్రకృతశ్లేష యప్రకృతశ్లేష, ప్రకృతాప్రకృతోభయశ్లేష యని యిది త్రివిధము. ఆద్యద్వితీయము లందు విశేష్యము శ్లిష్టము కావచ్చును. కాకపోవచ్చును. తృతీయ భేదమున విశేషణవాచకమె శ్లిష్టము కావలెను. విశేష్యవాచకము శ్లిష్టము కారాదు. అయినచో శబ్దశక్తిమూల ధ్వని యుచ్ఛిన్నమగును.

### ప్రకృతశ్లేష.

౧౬౦. సంభూత్యర్థం సకలజగతో విష్ణునాభి ప్రపన్నం
యన్నాలం స త్రిభువనగురుర్వేదనాథో విరించిః
ధ్యేయం ధన్యాలిభిరతితరాం స్వప్రకాశ స్వరూపం
పద్మాఖ్యం తత్కిమపి లలితం వస్తు వస్తుష్టయేఽస్తు.

ఇందు రెండర్థము లున్నవి. పద్మమునకు సంబంధించినది యొకటి. పద్మాదేవి లక్ష్మికి సంబంధించినది రెండవది. పద్మార్థ మిట్లు గ్రాహ్యము. సజల జగముల యుత్పత్తికై పద్మము విష్ణువు నాభి పొందినది. త్రిభువన గురువు వేదనాథుడు విరించి యీ పద్మమునకు నాళదండ మయ్యెను. స్వప్రకాశము కల యీ పద్మమును ధన్యము లయిన భ్రమరము లారాధించినవి. అట్టి పద్మ మనెడు లలితవస్తువు మీకు తుష్టి నిచ్చుగావుత.

ద్వితీయార్థ మీ రీతి పరిగ్రాహ్యము. సకల జగముల సమగ్రైశ్వర్యమునకై విష్ణువుచే సంప్రాప్తము. బ్రహ్మయు ఆ దేవీతత్త్వము గుర్తింప సమర్థుడు కాలేదు. ధనికు లందరా దేవి నారాధింతురు. అట్టి పద్మ అను పేరుగల లలితవస్తువు తుష్టి నిచ్చుగావుత. ఈ పద్యమున లక్ష్మీదేవి నాభికమలము రెండును ప్రకృతములు. ఇందలి పదము లేకశ్రుతిచే పదద్వయము నవభాసింప చేయును. (విష్ణునా + అభిప్రపన్నం, విష్ణునాభి + ప్రపన్నం, యత్ + న + అలం, యన్నాలం.) తద్ద్వారమున భిన్నధర్మముల పురస్కారమున ననేకార్థము ప్రతిపాదించును. పదము లటు నిటు విరుపు పొందునవి యగుట సభంగశ్లేష. 'పద్మాఖ్యం' అను విశేష్యము నిందు శ్లిష్ట మయినది.

౧౬౧. కర కలిత చక్ర ఘటనో నిత్యం పీతాంబర స్తమోఽరాతిః
నిజసేవి జాడ్య నాశన చతురో హరిరస్తు భూతయే భవతాం.

ఇందు సూర్య విష్ణు పరము లయిన రెండర్థము లున్నవి. సూర్యుడు తన కిరణములచే కాలచక్రఘటనము చేయును. ఆకాశము పచ్చగ జేయును. చీకటికి శత్రువు. తన్ను సేవించు వారి హిమజడిమ నశింప జేయును. అట్టి సూర్యుడు మీకైశ్వర్య మిచ్చు గావుత.

విష్ణువు తనకరమున సుదర్శన చక్రము పూనెను. పీతాంబరుడు, అజ్ఞాననాశకుడు. తనను సేవించు వారి యజ్ఞానము పోగొట్టును. అట్టి విష్ణువు భూతి నిచ్చు గావుత. ఇందలి పదములు విరుపు పొందకనె యుభయానుకూలము లయిన యర్థములను సమర్థింప గలవు. ఇట్టి దాని "అభంగ శ్లేష" యందురు.

అ ర్థ శ్లే ష.

౧౬౨. అర్జునస్య గురుర్మాయా మనుజః పరమః పుమాన్
గుంజా పుంజధరః పాయా దపాయా దిహ కోపి వః

అర్జున గురువు మాయా మానవుడు పరమపురుషుడు గుంజాపుంజ ధరు డొకడు మి మ్మపాయము నుండి రక్షించు గావుత. ఇందు గురుపద ముభయార్థకము. ఉపదేష్ట బృహస్పతి తదర్థములు. ఇప్పటికి మూడును ప్రకృతవిషయ భేదములు.

అ ప క్రృ త శ్లే ష.

౧౬౩. హరి కర సంగా దధికం రమణీయాప్యతుల రాగ సంవలితా
సుందరి! తవాననాగ్రే కమలా భా విగలిత ప్రతిభా.

సుందరి! నీ యానన మెదుట పద్మ కాంతిప్రతిభా రహితము, పద్మ కాంతి సూర్యుని కిరణసంబంధమున నుదకమున నధివసించి యుండి రమణీయ మయినను సమాన కాంతి వలితము కాదు. ఇది పద్మపరార్థము. నీ వదన మెదుట కమలా కాంతి విష్ణువు కర సంబంధమున నధికము రమణీయ మయినను సమ కాంతి లేనిదై విగలిత ప్రతిభ యయినవి. ఇది లక్ష్మీపరార్థము. ఇం దాననము ప్రకృతము. కమలా + భా, కమల + ఆభా, అధి + కం, అధికం అను నంశము లందు సభంగశ్లేష యున్నది.

ప్ర కృ తా ప్ర కృ త శ్లే ష.

౧౬౪. అలం హి మానీ పరిదీర్ఘ గాత్రః సమాపితః ఫాల్గున సంగమేన
అత్యంతమా కాంక్షిత కృష్ణవర్త్మా భీష్మో మహాత్మాజని మాఘ తుల్యః.

భీష్మపరార్థము ప్రకృతము. భీష్ము డత్యంతము మాని. అర్జునుని సంగర సంబంధమున మిక్కిలి దీర్ఘశరీరుడు. అత్యంతము కృష్ణుని మార్గ మాకాంక్షించిన వాడు. మహాత్ముడు. మాఘ మాస సమాను డయ్యెను. మాఘమాసము హిమసంహతిచే నవయవముల బద్ధలు చేయును. ఫాల్గున మాస సంబంధము కలది. మిక్కిలి కృష్ణవర్త్మ = అగ్ని నాకాంక్షింప జేయును. ఇందు భీష్మ - మాఘములు ప్రకృతాప్రకృత విశేష్యములు శ్లిష్టములు కాలేదు. విశేషణములు శ్లిష్టము లయినవి. ఇది తృతీయభేదము, ఉపమా సంకీర్ణము.

౨౬. అ ప్ర స్తు త ప్ర శం స.

* అప్రస్తుత వ్యవహారమున ప్రస్తుత వ్యవహారప్రశంస
యప్రస్తుత ప్రశంస.
ప్రశంసనము వర్ణనమె. స్తుతి కాదు.

౧౬౫. "దిగంతే శ్రూయంతే మద మలిన గండాః కరటినః
కరిణ్యః కారుణ్యాస్పదమసమ శీలాః ఖలు మృగాః
ఇదానీం లోకేఽస్మిన్ననుపమ శిఖానాం పునరయం
నఖానాం పాండిత్యం ప్రకటయతు కస్మిన్ మృగపతిః.

మదమున మలినగండములు గజములు దిగంతమున నున్నవట! ఆడ యేనుగుల కరుణ జూడ వలెను. మృగములు సాటి రా దగవు. ఇప్పు డీ లోకమున నీ మృగపతి యసమాన శిఖలు కల నఖముల పాండిత్యము దేని యందు ప్రకటింప వలెను? ఇం దీ యప్రకృత వ్యవహారమున, ప్రౌఢపండితు లెచటనో దాగిరి. ఈ యసమానులతో నేమి? నా ప్రఖర పాండిత్య మెవరి యందు జూపుదు నన్న పండిత వీర వ్యవహార ప్రశంస గమ్యము.

౧౬౬. పురా సరసి మానసే వికచ సారసాలిస్ఖల
త్పరాగ సురభీకృతే పయసి యస్య యాతం వయః
స పల్వలజలేఽధునా మిలదనేక భేకాకులే
మరాల కుల నాయకః కథయ! రే! కథం వర్తతాం?

మరాల కుల నాయకునకు పూర్వము మానస సరోవరమున వికసించిన పద్మముల పరాగముల పరిమళించిన యుదకము నందు వయసు గతించినది. ఆ హంస యీనాడు కప్ప లెగురు గుంటనీటిలో నెట్లుండును. ? ఈ యప్రస్తుతార్ధమున నొకప్పుడు వైభవ మనుభవించిన వాని వ్యవహారము సాదృశ్యమున గోచరించును.

ఈ యలంకారమున విశేషణములు శ్లిష్టము లగుటయు నుండును. అప్రస్తుత కార్యమున ప్రస్తుత కారణము గోచరించుట, అప్రస్తుత కారణమున ప్రస్తుత కార్యము గోచరించుటయు నప్రస్తుతప్రశంసయే యగును.

కారణమున కార్య ప్రతీతి.

౧౬౪. ఆనమ్య వల్గువచనైర్వినివారితేపి
రోషాత్ప్రయాతుముదితే మయి దూరదేశం
బాలా కరాంగులి నిదేశ వశంవదేన
క్రీడా బిడాల శిశునాశు రురోధ మార్గం.

ఆ బాల నమస్కరించి మంచిమాటలతో నన్ను నివారించినది. అయినను రోషవశాన దూరదేశము పోవుటకై నే నుద్యమింపగా నామె వ్రేలితో చూపి పిల్లిపిల్లను నా దారి కడ్డము పంపినది. ఇందు మార్జారమున మార్గభేదము కుశకున మగుట "ప్రయాణము మానితి" నను ప్రస్తుతము గోచరించును.

సామాన్యమున విశేషము.

౧౬౫. కృతమపి మహోపకారం పయ ఇవ పీత్వా నిరాతంకః
ప్రత్యుత హంతుం యతతే కాకోదరసోదరః ఖలో జగతి.

మహోపకార మొనర్చినను క్షీరముల వలె మ్రింగి నిస్సంకోచముగా కాకోదర సోదరుడీ ఖలుడు జగమున చంపుటకె యత్నించును. ఇందిది సామాన్యార్ధము. దీనిచే ప్రస్తుతవిశేష మొకటి గమ్య మగును. ఈ యప్రస్తుత ప్రశంస కుపమ గూడ తగియున్నది.

విశేషమున సామాన్యము.

౧౬౬. "పాండిత్యం పరిహృత్య యస్య హి కృతే బందిత్వమాలంబితం
దుష్ప్రాపం మనసాపి యో గురుతరైః క్లేశైః పదం ప్రాపితః
రూఢస్తత్ర స చేన్నిగీర్య సకలాం పూర్వోపకారావలీం
దుష్టః ప్రత్యవతిష్ఠతే తదధునా కస్మై కిమాచక్ష్మహే ?

పాండిత్యము విడిచి వందిత్వము (చాటుస్తుతి) అవలంబించితిమి. మనసుచే గూడ పొందశక్యము కాని పదవిని గొప్పక్లేశములచే పొందించితిమి. అతడా పదవి పొంది పూర్వపు సర్వోపకారములు మాటుపెట్టి యిప్పుడు దుష్టుడై యెదురు తిరిగినాడు. దీని నెవని కేమని చెప్పి కొందుము? ఇందలి ప్రస్తుతవిశేష్యముచే "దుష్టుల కొనరించిన యుపకారము తుదకు సుఖ మీయదు" అను సామాన్యము గమ్య మగును.

## ౨౮. పర్యాయోక్తము.

* వివక్షితార్థమును భంగ్యంతరమున ప్రతిపాదించుట పర్యాయోక్తము.

వ్యంజనా ద్వారమున నే విధముగా ప్రతిపాదింప దలతుమో యా విధము కన్న వేరగు చారుతర రూపాంతర మే భంగ్యంతరము.

౧౮౦. త్వాం సుందరీ నివహ నిష్ఠుర ధైర్య గర్వ
నిర్వాసనైక చతురం సమరే నిరీక్ష్య
కేషామరిక్షితిభృతాం నవ రాజ్య లక్ష్మీః
స్వామివ్రతాత్వ మపరిసలితం బభార.

సుందర స్త్రీల నిష్ఠుర ధైర్యగర్వమును నశింప జేయగల నిన్ను యుద్ధమున జూచి యే శత్రురాజుల నవరాజ్యలక్ష్మి తొట్రుపాటు లేని స్వామి వ్రతము భరించినది? ఇందు శత్రువుల సర్వరాజ్యసంపదయు నిన్ను పొందిన దను వివక్షితార్థ మట్లె నిరూపితము కాలేదు. నవరాజ్యలక్ష్మి పాతివ్రత్యము చెడినదను విధమున భంగ్యంతరమున నిరూపితము.

## ౨౯. వ్యాజస్తుతి.

* మొదట గోచరించు నిందాస్తుతులు స్తుతినిందలలో పర్యవసించుట వ్యాజస్తుతి.

### నిందచే స్తుతి.

౧౮౧. ఉర్వీం శాసతి పయ్యుపద్రవలవః కస్యాపి న స్యాదితి
ప్రౌఢం వ్యాహరతో వచస్తవ కథం దేవ! ప్రతీమో వయం
ప్రత్యక్షం భవతో విపక్షనివహైః ద్యాముత్పతద్భిః కృథా
యద్వ్యస్మత్తులకోటి మాఃపురుషో నిర్భిద్యతే భాస్కరః.

(10)

నేను భూమి శాసించు చుండగా నెవనికి నుపద్రవము లవ మేని కలుగదని డాబుగా బలుకు నీ వచన మెట్లు మేము విశ్వసింతుము? నీ కంటి యెదుట గగన మెగిరిన శత్రువులు కోపముతో నీ వంశ మూలపురుషు డయిన భాస్కరుని భేదించు చున్నారు కదా!. ఇందిది రాజవర్ణన ప్రస్తావ మగుట నింద బాధితమై స్తుతిలో పర్యవసించును. యుద్ధహాత వీరపురుషులు భాస్కరు ప్రవేశింతు రని సంప్రదాయము.

స్తుతిచే నింద.

౧౩౨. "కిమహం వదామి? ఖల! దివ్యమతే! గుణ పక్షపాతమభితో భవతః
గుణశాలినో నిఖిల సాధు జనా యదహర్నిశం న ఖలు విస్మరసి"

దివ్యమతీ! ఖలా! నిన్ను నే నేమందును? నీ కంతట గుణపక్షపాత మున్నది. గుణశీలురు సాధుజను లందరిని నీ వహర్నిశ మేమియు విస్మరింపవు. ఇందిది దుశ్చరిత ముద్ఘాటించు ప్రస్తావము. స్తుతి బాధితమై నిందలో పర్యవసించును.

౨౯. ఆక్షేపము.

* ఉపమేయమె యుపమాన ప్రయోజనము సంపాదింప
నుపమానాక్షేప మాక్షేపము.

ఇట్లాక్షేప లక్షణము కొందరు చెప్పిరి. వారి మతమున నిది యుదాహారణము.

౧౩౩. "అభూదప్రత్యూహః కుసుమశర కోదండ మహిమా
విలీనో లోకానాం సహ నయనతాపోపి తిమిరైః
తవాస్మిన్ పీయూషం కిరతి పరితస్తన్వి! వదనే
కుతో హేతోః శ్వేతో విధురయ ముదేతి ప్రతిదినం."

తన్వీ! నీ వదన మంతట నమృతము విరజిమ్మ మదనుని మహిమ నిర్విఘ్న మయినది. లోకుల నయనతాపము తిమిరములతో గూడ విలీన మయినది. ఇక నీ తెల్లమొగము చంద్రు డేల ప్రతిదిన ముదయించును? ఇం దుపమాన ప్రయోజనముల నుపమేయమె సంపాదించుట శబ్దమువ స్పష్టముగనె యున్నది.

కొందరాక్షేప మిట్లు నిర్వచింతురు. వ్యంగ్యార్థవిశేషము నిరూపించుటకై ప్రకృతార్థము నిషేధించుట యాక్షేపము.

౧౭౪. రీతిం గిరా మమృత వృష్టికిరాం త్వదీయాం
తాం చాకృతిం కృతివరై రభినందనీయాం
లోకోత్తరా మథ కృతిం కరుణా రసార్ద్రాం
జ్ఞాతుం న కస్య చిముదేతి మనఃప్రసారః?.

అమృతపు జల్లు చల్లు నీ గీ రీతిని కృతి వరు లభినందించు నా యాకృతిని కరుణా రసార్ద్ర మయిన లోకోత్తరాకృతిని తెలియుట కెవని మనసు ప్రసరించును? నీ వచన రీత్యాదివర్ణన మశక్యము. వర్ణించుట కెవనికి మనసు ప్రసరింపదు. ఇందు మనఃప్రసార నిషేధము వర్ణనీయానిర్వాచ్యత బోధించుట కుపాత్తము.

ఆక్షేపము ననేకు లనేక విధముల నిర్వచించిరి. కొందరు నిషేధ మాత్ర మాక్షేప మని యంగీకరింతురు. చమత్కారిత్వ మన్నది యలంకార సామాన్యలక్షణముగా సంప్రాప్త మగును. ఆ చమత్కారిత వ్యంగ్యార్థ మున్ననే సంభవించును గావున వ్యంగ్యసహిత మయిన నిషేధ మాక్షేపాలంకార మగును. కాగా పై నిర్వచనములును సంగృహీతములై కా గలవు.

౩౦. విరోధము.

* ఒక యధికరణమున సంబద్ధములుగా నున్న వసంబద్ధములుగా భాసించుట విరోధము.

వాస్తవిక విరోధ మిందు విరోధము కాదు. మొదట విరోధముగ గోచరించి పిమ్మట నవిరోధ బుద్ధి తిరస్కృత మగు విరోధమె యిందు విరోధ మలంకారము. విరోధమునే విరోధాభాస మందురు. "ఆ=ఈషత్ భాసతే; ఇత్యాభాసః" కొంచెముగా నవభాసించుట యాభాసము.

౧౭౫. "కుసుమాని శరా మృణాలజాలా
న్యపి కాలాయస కర్కశాన్యభూవన్
సుదృశో దహనాయతే స్మ రాకా
భవనాకాశ మథాభవ త్పయోధిః".

ఆ సుదృశకు కుసుమములు శరము లయినవి. తామర తూండ్లును కాలాయఃకర్కశము లయినవి. రాక (పూర్ణిమాచంద్రుడు) దహన మయినది. భవనాకాశము సాగర మయినది. ఇందు కుసుమత్వ శరత్వములను కవి యొకచో నిరూపించెను. కాని యవి యేకాశ్రయ సంబంధమున నుండుట

యొచ్చుటను లేదు కావున విరోధము, మొదట విరోధము స్ఫురించినను విరహిణి వనితకు దుఃఖజనకము లగుట భావింప నివృత్త మగును.

౩౧. విభావన.

* కారణాభావ మున్నను కార్యోత్పత్తి ప్రతిపాదించుట విభావన.

౧౭౬. విన్నైవ శస్త్రం హృదయాని యూనాం వివేకభాజామపి దారయంత్యః
అనంత మాయామయ వల్గు లీలా జయంతి నీలాబ్జదలాయతాక్ష్యః.

శస్త్రము లేకుండగనే వివేకము కల యువకుల హృదయములను విదారణము చేయు అనంత మాయామయ మధుర లీలలు కల కమలాయత లోచనలకు జై! ఇందు విదారణమున శస్త్రము కారణము. అది లేక పోయినను దారణ మున్నది. మొదట విరుద్ధముగ గోచరించి కామినీవిలాసము కారణ మని భావించినప్పు డవిరుద్ధ మగును. ఇచట దారణ మన్నది పీడా విశేష మనియే వివక్షితము. ద్విధాభావము కాదు. శస్త్రము ద్వైధీకరణ కారణమె కాని కామపీడా కారణము కాదు. అయిన నిది గుర్తించునది. ముఖ్యదారణము ద్విధాభవనమె. గౌణదారణము కామాదిజనిత పీడా విశేషము. గౌణముఖ్యదారణముల కభేద మొనర్ప శస్త్రము కామపీడా కారణము కా వచ్చును.

౧౭౭. "యదవధి విలాసభవనం యౌవన ముదియాయ చంద్రవదనాయాః
దహానం విన్నైవ తదవధి యూనాం హృదయాని దహ్యంతే."

విలాసభవన మగు చంద్రవదన యౌవన ముదయించి నప్పటినుండి దహనము లేకుండగనే యువ హృదయములు దగ్ధము లగుచున్నవి. ఇందు హృదయ దాహమున యౌవనము నిమిత్త మని పర్యవసితార్థము గోచరించును. పూర్వపద్యమున మన్మథపీడా జనకములు విలాసము లుపాత్తములు కా లేదు. కాన విభావన యుక్తనిమిత్త యనుక్తనిమిత్త యని ద్వివిధ యగుచున్నది.

౩౨. విశేషోక్తి.

* ప్రసిద్ధ కారణ కలాప మున్నను కార్యానుత్పత్తి విశేషోక్తి.

కారణ మున్నను కార్య ముదయింపక పోవుట లోని విరోధము అప్రసిద్ధ కారణము లేమి భావింప నివృత్త మగును.

౧౭౮. ఉపనిషదః పరిపీతా గీతాపి చ హంత! మతిపథం నీతా
తదపి న హా! విధువదనా మానస సదనా ద్బహి ర్యాతి.

ఉపనిషత్తుల గ్రోలితిని. గీతను గూడ మతిమార్గమున బట్టితిని. కాని యా విధువదన మానస సదనము నుండి వెలికి రాదు. ఇందుపనిషదర్థ విమర్శము సకల లోకానిత్యత్వ జ్ఞానము విరతి హేతువు. అది యున్నను విరతి యుదయింపమి విశేషోక్తి సంగతము. రాగాధిక్యము ప్రతిబంధక మని ప్రతీత మగును. ఇట్టి దచింత్య నిమిత్త మని కొందఱు భావింతురు.

33. అసంగతి.

* విరుద్ధముగా గన్పడు హేతుకార్యముల వైయధికరణ్య మసంగతి.

౧౭౯. "అంగైః సుకుమారతరైః సా కుసుమానాం శ్రియం హరతి
ప్రహరతి హి కుసుమబాణో జగతీతల వర్తినో యూనః."

సుకుమారాంగములచే నా కాంత కుసుమశ్రీ హరించినది. కుసుమబాణుడు జగతిలో యువకుల ప్రహరించు చున్నాడు. ఇందు యువకుల వాస్తవ తాడన ముద్దిష్టము కాదు. కామపీడనమె వివక్షితము. "యత్రాపరాధః తత్ర దండః" యని కారణకార్యములకు సామానాధికరణ్యము ప్రసిద్ధము. కాని కుసుమశ్రీ హరణ మంగనలకు, తాడనము యువకులకు నగుట వైయధికరణ్యము మొదట విరుద్ధముగా గన్పడును. పర్యంతమున విరోధము భాసింపదు. వాస్తవముగా శ్రీహరణ మపరాధముగనె యుండదు. అంగనాంగ శోభా విశేషము భావించిన యువకులు కామపీడితులైరి యను భావార్థానుసంధానమున విరోధము నివర్తించును.

34. విషమము.

* అననురూప సంసర్గము విషమము.

౧౮౦. "అమృతలహరీ చంద్రజ్యోత్స్నా రమా వదనాంబుజా
న్యధరితవతో నిర్మర్యాద ప్రసాద మహాంబుధేః
ఉదభవదయం దేవ! త్వత్తః కథం పరమోల్బణ
ప్రలయ దహన జ్వాలా జాలాకులో మహసాం గణః."

అమృతమును చంద్రుని రమావదనము నవధీరించిన నిరవధిక ప్రసాద సాగరుడవు కదా! దేవ! నీ నుండి ప్రళయాగ్ని జ్వాలా సమాకుల మయిన యీ తేజోగణ మెట్లు వచ్చినదయా ?. ఇందమృత మాధుర్యము చంద్ర శైత్యము రమావదనాహ్లాదము ప్రసాదము మొదలగు నానాగుణములు కల

కారణము నుండి తద్విరుద్ధ గుణములు కల ప్రతాప ముదయించుట యనను రూప సంసర్గము.

అనిష్టోత్పత్తి.

౧౫౧. "దూరీకర్తుం ప్రియం బాలా పద్మేనాతాడయ ద్రుషా
స బాణేన హతస్తేన తామాశు పరిషస్వజే"

ప్రియుని దూరీకరించుట కా పిల్ల రోషమున పద్మముతో గొట్టినది, దాన నాతడు తూపు తాపము పడెను. ఆమెను వెంటనే యాలింగనము చేసికొనెను. ఇందు "ప్రియుని దూరీకరించుట" అను నిష్టార్థమై పద్మతాడనము ప్రయుక్తము. దాన ప్రియు దూరీకరణము జరుగక పోగా 'ప్రత్యుత' తదాలింగన మనిష్టము కలిగినది.

కేవలేష్టాప్రాప్తి.

౧౫౨. ప్రభాత సమయ ప్రభాం ప్రణయిని హ్నువానా రసా
దముష్య నయనాంబుజం సపది పాణినాఽమీలయత్
అనేన ఖలు పద్మినీ పరిమలాలి పాటచ్చరైః
సమీర శిశుకై శ్చిరా దనుమితో దినేశోదయః.

ప్రియుని విషయమై ప్రాతఃసమయ శోభను కప్పి పుచ్చునదై (తెల్ల వారిన దని యాతడు తెలియ కుండునట్లు చేయుటకునై) ప్రియురా లాతని నయనాంబుజ మప్పుడు కరమున గప్పివేసినది. కొంతసేపటికి ప్రియుడు పద్మినీ పరిమళము హరించు వాతపోతములచే సూర్యోదయ మూహించెను. ఇందు ప్రభాత మాయెనని ప్రియుడు తెలిసి కొనమి తనకు సుఖసాధన మని కామినీభావనము. స్వేష్టసాధనమునకై యామె యత్నించినది కాని యది సిద్ధము కాలేదు. కావున నిష్టాప్రాప్తి. ఇందలి చమత్క్రియా విశేషమున వేరు విధమునగూడ సమన్వయింప వచ్చును. ప్రియున కట్టి పరిజ్ఞానము తనకు దుఃఖసాధనము. తన్నివృత్తి తన కిష్టము. అది లభింపమి యిష్టాప్రాప్తి యున్నది.

కేవలానిష్టప్రాప్తి.

౧౫౩. "ముకులితనయనం కరిణో గండం కండూయతో విషద్రుతటే
ఉదభూ దకాండ దహన జ్వాలా జాలాకులో దేహః."

కండ్లు మూసికొని గజము విషవృక్షమున గండము దురద పోగొట్టు కొనుచుండ దాని దేహ మసమయ దహన జ్వాలా మాలా సమాకుల

మయినది. కండ్లు మూసికొనిన దగుట కండూయన జన్యసుఖ మున్న నది యిష్టప్రాప్తి కాదు. అనిష్టప్రాప్తి స్పష్టము.

### 3౫. స మ ము.

* అనురూప సంసర్గము సమము.

౧౭౪. "కువలయ లక్ష్మీం హరతే తవ కీర్తిస్తత్ర కిం చిత్రం?
యస్మాన్నిదాన మస్యా లోక నమస్యాంఘ్రిపంకజస్తు భవాన్."

నీ కీర్తి కువలయలక్ష్మి హరించు చున్నది. అది యేమి చిత్రము ? నీవు లోకాభినంద్య పదసద్మడ వగుట తన్నిదానము. ఇందు కువలయ పదమున శ్లేష యున్నది. అదియే కారణకార్యధర్మముల కైక్యము సంపాదించినది. లోకాభివాద్య చరణ కమలమున జనించిన కీర్తి కువలయ (లోక) లక్ష్మి హరించును. కు + వలయ, కువలయ పదద్వయార్థముల కైక్య మధ్యాహ్యము.

౧౭౫. బడబానల కాలకూట లక్ష్మీ మకర వ్యాల గణైః సహైధితః
రజనీ రమణో భవేన్నృణాం నకథం ప్రాణవియోగ కారణం?

బడబానలము, కాలకూటము, లక్ష్మి, మొసలి, సర్పముల సమూహ ములతో కూడ వృద్ధి పొందిన రజనీరమణుడు మానవుల కెట్లు ప్రాణ వియోగ కారణము కా కుండును ? ఇందు బడబానలాది వస్తువుల సంసర్గ మున చంద్రునకు నట్టి గుణమె కలుగుట విశదము. పూర్వపద్యమున సంసర్గ ముత్పత్తిరూపము కారణసమాన గుణమున కార్య ముదయించినది.

౧౭౬. నితరాం ధనమాప్తుమర్థిభిః క్షితిప! త్వాం సముపాస్య యత్నతః
నిధనం సములంభి తావకీ ఖలు సేవా జన వాంఛితప్రదా.

'నితరాం' ధనము పొందుటకై యాచకులు యత్నమున నిన్ను సేవించిరి. వారలకు నిధనము లభించినది. నీ సేవ జనవాంఛిత మిచ్చును గదా! ఇందు నిధన పదమునకు రెండర్థము లున్నవి. ఆ మరణము-బహుధన మను నర్థద్వయ మునకు శ్లేషచే నైక్య మున్నది. బహుధనార్థమున వాంఛి తార్థసిద్ధి యను సమభేదము సంగతము. ఇందే వ్యాజస్తుతి యున్నది. ముఖ మున స్ఫురించు ధనప్రాప్తి రూప స్తుతిలో సమాలంకార మప్రత్యూహము. మరణప్రాప్తి రూపార్థాంతరమున వ్యాజస్తుతి పూర్ణాంగ మగును. అనురూప సంసర్గము సంయోగాది స్వరూపమని భావించి నప్పుడును అనురూప్యము రెండు విధముల నుండును.

స్తుతి పర్యవసాయి.

౧౭౪. "అనాథః స్నేహార్ద్రాం విగలితగతిః పుణ్యగతిదాం
పతన్ విశ్వోద్ధర్త్రీం గదవిదలితః సిద్ధభిషజం
తృషార్తః పీయూషప్రకరనిధి మత్యంతశిశుకః
సవిత్రీం ప్రాప్తస్త్వా మహ మిహ విదధ్యాః సముచితం.

దేవి! గంగే! నే ననాథుడను, నీవు స్నేహార్ద్రవు, నాకు గతి లేదు. నీవు పుణ్యగతి నిత్తువు. నేను పతితుడ నగుచున్నాను. నీవు విశ్వ ముద్ధరింతువు. నేను వ్యాధి విదలితుడను, నీవు సిద్ధవైద్యవు. నేను తృషా పీడితుడను, నీవు సుధానిధివి, నే నత్యంతము శిశువును. నీవు తల్లివి, నేను నిన్ను జేరితిని, నీవు సముచిత మాచరింపుము. ఇం దనాథత్వాదులు కల వానికి స్నేహార్ద్రత్వాదులు కలవారితో ననురూప సంసర్గ మున్నది. ఈ యానురూప్యము భాగీరథీ స్తుతిలో పర్యవసించును.

నిందా పర్యవసాయి.

౧౭౭. యుక్తం సభాయాం ఖలు మర్కటానాం
శాఖా స్తరూణాం మృదులాసనాని
సుభాషితం చీత్కృతి రాతిథేయీ
దంతైర్నఖాగ్రైశ్చ విపాటనాని.

వానరముల సభలో చెట్ల కొమ్మలు మృదులాసనములు. ఇది యుక్తముగనే యున్నది. వాని చీత్కారమే సుభాషితము. పన్నులతో గోళ్ళతో పీకుటయే యాతిథ్యము. ఇం దప్రస్తుతగత మయిన నింద తదాక్షిప్త ప్రస్తుతమున పర్యవసించును. "మర్కటము లెట్టివో అట్టి సత్కారమె జరుగును" అను ననురూప సంసర్గ మూహ్యము, కపినింద యప్రస్తుతము. అది చెప్పుట కవితాత్పర్యము కాదు. సభలో కలహించు వారి యందిది పర్యవసించును.

౩౬. విచిత్రము.

* ఇష్టసిద్ధికై యిష్టు లొనరించు విపరీతాచరణము విచిత్రము.

౧౭౮. "బంధోన్ముక్త్యై ఖలు మఖముఖాన్కుర్వతే కర్మపాశా
నంతఃశాంత్యై మునిశతమతానల్పచింతాం వహంతి
తీర్థే మజ్జంత్యశుభజలధేః పారమారోఢుకామాః
సర్వం ప్రామాదికమిహ భవభ్రాంతిభాజాం నరాణాం."

బంధమోచనమునకై యాగాదికర్మపాశము లొనరింతురు. అంతః శాంతికై శతమునుల మతముల యనల్పచింత వహింతురు. అశుభజలధి దాట వలెనని తీర్థమున మునుంగుదురు. సంసారమున భ్రాంతి పడిన నరుల కంతయు ప్రామాదికము కదా! ఇందు మొదటి పాదమున రూపకానుప్రాణిత మయిన విచిత్ర మున్నది. యాగాదికర్మ పాశ మనుట రూపకము. అందునచె బంధమోచనము విపరీత మగును. ద్వితీయచరణమున శుద్ధవిచిత్రమె యున్నది. శాంతిలో చింత విపరీతము కదా!

౩౮. అధికము.

* ఆధారాధేయముల నొకటి విస్తృత మనుటకై వేరొకటి న్యూన మనుట యధికము.

౧౯౦. లోకానాం విపదం ధునోషి, తనుషే సంపత్తిమత్యుత్కటా
మిత్యల్పేతర జల్పితైర్జడధియాం భూపాల! మా గా మదం
యత్కీర్తిస్తవవల్లభా లఘుతర బ్రహ్మాండ సద్మోదరే
పిండీకృత్య మహోన్నతామపి తనుం కష్టేన హా! వర్తతే.

రాజా! నీవు లోకుల యాపద పోగొట్టుదువని, యధికసంపత్తి కూర్తువని మందబుద్ధుల మాటలచే మదము పొందకుము. నీ యిష్టకీర్తి యత్యల్ప మయిన బ్రహ్మాండసదనోదరమున తన యున్నత తనువు ముడుచుకొని కష్టమున వర్తించు చున్నది. ఇందు బ్రహ్మాండమున కతిసూక్ష్మత్వ కల్పనమున నాధేయ మగు కీర్తికి పరమ మహత్వము సిద్ధించును. దీనిచే వ్యాజస్తుతికి పరిపోషము కలుగు చున్నది.

౩౯. అన్యోన్యము.

* అన్యోన్యము విశేష మాధానించుట యన్యోన్యము.

గుణవిశేషాధానము.

౧౯౧. "సుదృశో జిత రత్న జాలయా సురతాంత శ్రమ బిందుమాలయా
అలికేన చ హేమకాంతినా విదధే కాపి రుచిః పరస్పరం"

ఆ సుదృశ యొక్క రత్నజాల మధఃకరించిన రతాంత శ్రమబిందు మాల, హేమకాంతి కల యలికము పరస్పర మొక కాంతి కూర్చినవి. ఇందు రుచి (కాంతి) గుణ మగుట గుణరూప విశేషాధాన మున్నది.

క్రియా విశేషాధానము.

౧౯౨. పరపూరుష దృష్టిపాత వజ్రాహతి భీతా హృదయం ప్రియస్య సీతా
అవిశత్వర కామినీ భుజంగీ భయతః సత్వరమేవ సోపి తస్యాః."

పరపురుషుల దృష్టిపాత మనెడు వజ్రపాతమున భీతయై సీత ప్రియుని హృదయము ప్రవేశించినది. అతడును పరకామిని యనెడు భుజంగి భయమున సత్వరమే యామె హృదయము జేరెను. ఇందు క్రియారూపమగు విశేష మాధానించుట కలదు.

౩౯. విశేషము.

* ప్రసిద్ధాశ్రయము వినా యాధేయము వర్ణించుట యొక విశేషము.

ఒకయాధేయ మొక్కసారి యనేకాధారగతముగ వర్ణించుట యపర విశేషము.

౧౯౩. "అయే! రాజన్నాకర్ణయ! కుతుక మాకర్ణనయన!
త్వదాధారా కీర్తిర్వసతి కిల మాలా దశదిశాం
త్వదేకాలంబోఽయం గుణగణ కదంబో గుణనిధే!
ముఖేషు ప్రౌఢానాం విలసతి కవీనా మవిరతం"

ఆకర్ణనయన! అయే! రాజా! యీ కుతుక మాకర్ణింపుము! త్వదాధార కీర్తి దశదిశా శిరసుల వసించు చున్నది. ఓ! గుణనిధీ! త్వదేకాలంబమయిన యీ గుణ కదంబము నిత్యము ప్రౌఢకవుల ముఖము లందు విలసించు చున్నది. ఇందు కీర్తిగుణములకు ప్రసిద్ధాశ్రయుడు రాజు వినా దిశామాలిగతముగా వర్ణన మున్నది.

౧౯౪. "నయనే సుదృశాం, పురో రిపూణాం
వచనే వశ్యగిరాం మహాకవీనాం
మిథిలాపతి నందినీ భుజాన్తః స్థిత
ఏవ స్థితి మాప రామచంద్రః".

రామచంద్రుడు సీతా భుజాంతర మందుండియే సుదృశల నయనమున, రిపువుల యెదుట, వశ్యవాక్కు లయిన మహాకవుల వచనమునను స్థితి పొందెను. ఇందు రాము డొక్కడాధేయము. పరిమిత సీతా హృదయాధార ముండియు యుగపదనేకాధారముగ నుండుట రెండవ విశేషము.

### ౮౦. వ్యాఘాతము.

* ఒకడొక కారణమున కార్య మొనరింప తదన్యు డా కారణమునసె తద్విరుద్ధ మాచరించుట వ్యాఘాతము.

౧౯౫. "దీనద్రుమాన్వచోభిః ఖలనికరైరనుదినం దలితాన్
పల్లవయంత్యుల్లసితా నిత్యం తైరేవ సజ్జనధురీణాః"

ఖలు లనుదినము తమ వచనములచే దీను లనెడు తరువుల దలన మొనరింప సజ్జన ధురీణు లుల్లసితులై వచనముల చేతనే వాని నిత్యము పల్లవింప జేయు చున్నారు. ఇందు ఖలుల పరుషవచనము సజ్జనుల మధురవచనమును వచనముగనె యుపాత్తము. వచనముల దలనము, వలనములనె పల్లవనమనుట విరోధము స్ఫురించును. అనంతరమున నివర్తించును.

ఒక డొనరింప దలచిన కార్యము వ్యాహతము చేయుటయు వ్యాఘాతమె యగును.

౧౯౬. "విముంచసి యది ప్రియ! ప్రియతమేతి మాం మందిరే
తదా సహ నయస్వ! మాం ప్రణయ యంత్రణా యంత్రితః
అథ ప్రకృతిభీరు రిత్యఖిల భీతిభంగ క్షమాత్
న జాతు భుజమండలాదవహితో బహిర్భావయ!"

ప్రియా! ప్రియతమ యని నన్ను మందిరముననే విడుతువా! ప్రణయాధీనుడవై నన్నును నీతో గొనిపొమ్ము. ఇక సహజభీరు వని తలతు వేని సర్వభయము పోగొట్టు నీ భుజమండలము నుండి నన్ను దూర ముంచకుము. దండకారణ్యము పోదలచిన రాము నుద్దేశించి సీత పలుకు వచన మిది. ఇందు చేయదలచిన కార్యవిఘాత మున్నది.

### ౮౧. శృంఖల : కారణమాల.

* వరుసగా నున్న వానిలో పూర్వపూర్వ ముత్తరోత్తరమునను, ఉత్తరోత్తరము పూర్వపూర్వమునను సంసృష్ట మగుట శృంఖల. శృంఖలయే కార్యకారణభావమున ననుగుణ మగుట కారణమాల.

౧౯౭. లభ్యేత పుణ్యైః గృహిణీ మనోజ్ఞా తయా సుపుత్రాః పరితః పవిత్రాః
స్ఫీతం యశస్తైః సముదేతి నూనం తేనాస్య నిత్యః ఖలు నాకలోకః.

పుణ్యములచే మనోజ్ఞ గృహిణి లభించును. గృహిణిచే నంతట పవిత్రు లయిన సుపుత్రులు లభింతురు. పుత్రులచే విస్తృతయశ ముదయించును. యశమున నాకలోకము నిత్య మగును. ఇందు కారణకథనమే ముఖ్య మన్నచో తత్కారణము దానికారణ మను రీతిని గాని, అది యొకదాని కారణ మదియు వేరొకదాని కారణ మను రీతిని గాని కారణమాల యుక్తము. కార్యోక్తియే ముఖ్య మన్నచో దానికార్య మిది, దీని కార్యమిది యని కాని, ఇది యొకదాని కార్యము, అదియు వేరొక దాని కార్యమని కారణమాల యుక్తము. ఇం దంతట మొదట చెప్పినదియె నిర్వాహ్యము. అట్టి క్రమమున నిబంధనమె యాకాంక్షానురూప మగుట రమణీయము. కాకున్న భగ్నప్రక్రమము వాటిల్లును.

## ౪౨. ఏకావళి.

* శృంఖలయే విశేష్యవిశేషణభావమున సంసర్గము కలదయిన ఏకావళి.

౧౯౭. స పండితో యః స్వహితార్థదర్శీ హితం చ తద్యత్ర పరానపక్రియాః
పరే చ తే యే శ్రితసాధుభావాః సా సాధుతా యత్ర చ కాస్తి కేశవః.

స్వహితము గుర్తించు వాడె పండితుడు. పరాపకారము లేకుండునదియే హితము. సాధుభావము కలవారలె పరులు. కేశవుడు ప్రకాశించినదె సాధుత. ఈ యుదాహరణమున పూర్వపూర్వము విశేష్య మయినది. ఉత్తరోత్తరము విశేషణ మయినది.

## ౪౩. సారము.

* శృంఖలయే యుత్కృష్టాపకృష్ట భావమున సంసర్గము కలదైన సారము.

౧౯౮. "జంబీర శ్రియ మతిలంఘ్య లీలయైవ
వ్యానమ్రీకృత కమనీయ హేమకుంభౌ
నీలాంభోరుహనయనేఽధునా కుచౌ తే
స్పర్ధేతే ఖలు కనకాచలేన సార్ధం".

ఓ! నీలాంభోరుహనయనా! లీలగా జంబీరశోభ లంఘించి రంగారు బంగారు కడవల నణచి నీ కుచములు కనకాచలముతో స్పర్ధించు చున్నవి. ఇందేకవిషయముగా నుత్తరోత్తరోత్కర్ష యున్నది. పూర్వ పూర్వవిశే

షేములు కల కుచము లుత్తరోత్తర విశేషములు కల వగుటయే యుత్కర్ష. ఇది కుచైకవిషయము. పరిమాణభేదమున ద్రవ్యభేద ముండునని కొందరందురు. కాని కుచత్వరూపమున కుచ మేకవిధమగుట ఏక విషయత్వము నూపపాదమె.

అ నే క వి ష య ము.

౨౦౦. "గిరయో గురవస్తేభ్యోప్యుర్వీ గుర్వీ తతోపి జగదండం
జగదండాదపి గురవః ప్రలయేప్యచలా మహాత్మానః"

గిరులు గొప్పవి. వాని కన్న నుర్వి గుర్వి. అంతకన్నను జగదండము గొప్పది. జగదండము కన్నను ప్రలయమందు చలనము లేని మహాత్ములు గొప్పవారు. సమన్వయము స్పష్టము. ఇం దుత్కర్ష గుణకృతము. వేదమునందు నిది యున్నది.

౨౦౧. "మహతః పరమవ్యక్తమవ్యక్తాత్పురుషః పరః
పురుషాన్న పరం కించిత్సా కాష్ఠా సా పరా గతిః"

మహత్తు కన్న నవ్యక్త ముత్కృష్టము. అవ్యక్తము కన్న పురుషు డుత్తముడు. పురుషుని కన్న నుత్తమము లేదు. అది దిక్కు. అది గతి. ఇం దుత్కర్ష స్వరూపమాత్ర కృతము. ఉత్కర్ష యిందు గుణకృత మనరాదు. పురుషుడు నిర్గుణుడు. ఇట్లే ఈ యలంకారమున నపకర్షయు నుదాహార్యము.

౨౨. కా వ్య లిం గ ము.

* ప్రకృతార్థోపపాదకముగా వివక్షిత మయిన హేతురూపార్థము కావ్యలింగము.

౨౦౨. "వినింద్యా న్యున్మత్తై రపి చ పరిహార్యాణి పతితై
రవాచ్యాని వ్రాత్యైః సపులక ముపాస్యాని పిశునైః
హరంతీ లోకానా మనవరత మేనాంసి కియతాం
కదా ప్యశ్రాంతా త్వం జగతి పునరేకా విజయతే"

ఉన్మత్తులచే వినింద్యములు, పతితులచే పరిహార్యములు, వ్రాత్యులచే నవాచ్యములు, సమాసక్తులచే సపులక ముపాస్యములు నగు నెన్నియో లోకపాపముల హరించుచును నిత్య మశ్రాంతవై జగమున నీ వొకతెవే "విజయతే" ఇందు భగవతి భాగీరథి యుత్కర్ష యనన్యసాధారణముగా నిరూపితము. అది UNIVERSITY OF HYDERABAD ...పత్తి... ...దనమునకై నిత్య

మనంత లోకపాపముల హరింపఁజాలని భాగీరథి "యత్రాంత" యని నిరూపిత యయినది. ఈ 'యత్రాంత' యను సుబంతార్థము విశేషాకారమున వివక్షిత మగుట కావ్యలింగము. పద్యము నందలి పాపము లున్మత్త పతిత వ్రాత్య పిశునుల వగుట నిట్టి వాని హరించు భాగీరథీ ప్రశస్తి యనితర లభ్యము.

౨౦౩. త్వాలంబాదంబ! స్ఫురదలఘు గర్వేణ సహసా
మయా సర్వేఽవజ్ఞా పుర పథ మనీయంత విబుధాః
ఇదానీ మౌదాస్యం యది భజసి భాగీరథి! తదా
నిరాధారో హా! రోదిమి కథయ! కేషామిహ పురః?

అంబా! నీ యాలంబమున నేను గర్వపడి విబుధుల నందరి నవజ్ఞ చేసితిని. భాగీరథి! నీ విప్పు డుదాసీనత నహించినచో నిరాధారుఁడ నెవరి యెదుట నేడ్తును? చెప్పుము!. ఇందు నిరాధారు డనుటచే నందరు ద్వేషించిరని వ్యక్త మగును. అం దవజ్ఞ చేయుట యను తిజంతార్థ ముపపాదకము.

## ౨౫. అర్థాంతరన్యాసము.

* సామాన్యముచే విశేషమును, విశేషముచే సామాన్యమును
సమర్థించుట యర్థాంతరన్యాసము.

౨౦౪. "కరికుంభ తులా మురోజయోః క్రియమాణాం కవిభి ర్విశృంఖలైః
కథమాలి! శృణోషి సాదరం? విపరీతగ్రహణా హి యోషితః."

సఖీ! విశృంఖలకవు లురోజములకు కరికుంభ తుల నిరూపింతురే! అది నీ వెట్లు సాదరము విందువు? ఇం దామె సాదరము వినుట యనుచితము. అది యనిష్టసాధన మయిన నామె యిష్టసాధనమని తలచి వినినది. అది యామె భ్రాంతి యగుట నెఱుఁగుదును. ఆమె స్త్రీ యగుటచే భ్రాంతి పొందుట ప్రతిపాదిత మయినది. ఇందు విశేషమునకు సామాన్యము సమర్థకముగ నున్నది.

౨౦౫. "భవత్యా హి వ్రాత్యాధమ పతిత పాఖండ పరిష
త్పరిత్రాణస్నేహః శ్లథయితు మశక్యః ఖలు యథా
మమాప్యేవం ప్రేమా దురితనివహేష్వంబ జగతి
స్వభావోఽయం సర్వైరపి ఖలు యతో దుష్పరిహరః."

అంబా! భాగీరథి! బ్రాత్యాధమ పతిత పాషండుల పరిషత్తు పరిత్రాణ మొనరింప వలె నను నీ యాదరము శిథిల మొనరింప శక్యము కాదు. ఎట్లన? నాకు నీ జగమున నిక్లై దుష్టులందలి ప్రేమ యశిథిలము. ఏరికి నీ స్వభావము దుష్పరిహారము కదా? ఇందును భాగీరథి స్తోత వృత్తాంతములు రెండును విశేషరూపములు. చతుర్థచరణమున సామాన్యార్థము సమర్థకముగ నున్నది.

౪౬. అనుమానము.

* అనుమితి కరణ మనుమానము.

సాధారణ మనుమానము కవిప్రతిభోల్లిఖితమై చమత్కారి యగుచో కావ్యాలంకార మగును.

౨౦౬. "తస్మిన్మణివ్రాత హతాంధకారే పురే నిశాలోప విధాన దక్షే
సద్యో వియుక్తా దివసావసానం కోకాః సశోకాః కథయంతి నిత్యం.

ఆ పురమున రాత్రిని లోపింప జేయగల మణు లంధకారము పోగొట్టినవి. అందు వియోగము పొంది శోకము కల కోకములె నిత్యము దివసావసానమును చెప్పుచున్నవి. ఇందు చెప్పుట యన్నది స్ఫుటబోధ యనుమిత్యాత్మకము. ఎప్పు డెప్పుడు కోకవియోగము కలుగునో యప్పుడప్పుడు దివసావసాన మని భాసించును. "ఇప్పుడు దివసావసాన మయినది. కోకములు సశోకము లయినవి గనుక" యని స్ఫుటబోధ.

౪౭. యథాసంఖ్యము.

* ఉపదేశక్రమమున వర్థముల సంబంధము యథాసంఖ్యము.

౨౦౭. ద్రుమ పంకజ విద్వాంసః సర్వ సంతోష పోషకాః
ముధైవ హంత! హన్యంతే కుఠార హిమ దుర్జనైః.

వృక్షము పద్మము విద్వాంసుడు సర్వ సంతోష పోషకులు. కుఠార హిమ దుర్జనులచే వ్యర్థముగా హతు లగుచున్నారు కదా!. ఇందు దీపక మనుప్రాణిత మయినది.

౨౦౮. బృందా పితృగహన చరౌ కుసుమాయుధ జనన హనన శక్తిధరౌ
అరి శూల లాంఛితకరౌ భీతిం మే హరిహరౌ హరతాం.

బృందావన శ్మశాన సంచారులు మన్మథుని జనన హనన శక్తుల ధరించిన వారు సుదర్శన శూల లాంఛితకరులు హరిహరులు నా భీతి హరింత్రు

గావుత! ఇందు సమాసమున మొత్తమన్వయము కలుగగా నవయవముల కన్వయ మర్థబలాన కలుగును.

## ౪౮. పర్యాయము.

* ఏకాధేయ మనేకాధికరణముల క్రమమున నుండుట పర్యాయము. ఏకాధికరణమున ననేకాధేయములు క్రమమున నుండుటయు పర్యాయము.

౨౦౯. ఆయాతా కమలాసనస్య భవనాత్ ద్రష్టుం త్రిలోకీతలం
గీర్వాణేషు దినాని కాని చిదధో నీత్వా పునః కౌతుకాత్
భ్రాంత్వా భూవలయే మహాకవికులోపాస్యా తవాస్యాంబుజే
రాజన్సంప్రతి సత్యధామని గిరాం దేవీ సుఖం వర్తతే.

గిరాందేవి కమలాసను భవనము నుండి త్రిలోకీతలము చూచుట కేతెంచి, గీర్వాణులలో గొన్ని దినములు గడపి, భూవలయమున మహాకవికుల ముపాసింప కౌతుకమున దిరిగి రాజా! యిప్పుడు సత్యధామ మగు నీ వద నమున సుఖమున్నది. ఇందు గిరాందేవి క్రమముగా ననేకాధికరణము లందుండుట స్పష్టము. ప్రథమచరణమున నధికారణ మార్థము. చరణత్రయమున శాబ్దము.

౨౧౦. "విమూరా దాశ్చర్య స్తిమితమథ కించి త్పరిచయా
దుదంచచ్చాంచల్యం తదను పరితః స్ఫారితరుచి
గురూణాం సంఘాతే సపది మయి యాతే సమజని
త్రపాఘూర్ణత్తారం నయనయుగ మిందీవరదృశః"

ఆ పద్మదృశ నయనయుగము దూరమున నాశ్చర్యస్తిమిత మయినది. కొంత పరిచయమున చాంచల్యముచే శోభించినది. పిమ్మట ప్రసారిత మయి నది. గురువుల సమీపములో నప్పుడు నేను రాగా సిగ్గుచే తారలు మిలమిల లాడినవి. అప్పుడె యనుకోకుండ వచ్చిన ప్రియుని చూడగా నొకతె సంభ్రమదృష్టి యిందు కలదు. ఇందు నయనయుగాధికరణమున విశేషణము లయిన స్తిమితత్వాదులకు క్రమికత్వ మున్నది. అన్నియు నొకసమయమున సంభవింపవు గదా!

## ౪౯. పరివృత్తి.

* పరుని వస్తువు గ్రహించి స్వకీయము సమర్పించుట పరివృత్తి.

౨౧౧. "అంగాని దత్వా హేమాంగి! ప్రాణాన్ క్రీణాసి చేన్నృణాం
యుక్తమేతన్న తు పున ర్లోచనాంబురుహ ద్వయం"

హేమాంగి! నీ యంగము లిచ్చి నరుల ప్రాణముల కొందువేని యుక్తము. కాని రెండు లోచనాంబురుహము లిచ్చి ప్రాణములు గొనుట యుక్తము కాదు. ఇందు సమమిచ్చి సమము గైకొనుట యను పరివృత్తి ప్రథమ భేదము. సమపరివృత్తి ప్రథమార్ధమున నున్నది ఉత్తరార్ధమున విషమ పరివృత్తి కలదు. పద్మములు రెండిచ్చి ప్రాణములు గొనుట విషమపరివృత్తి.

౨౧౨. గరిమాణమర్పయిత్వా లఘిమానం కుచయుగాత్కురంగదృశాం
స్వీకుర్వతే నమస్తే యూనాం ధైర్యాయ నిర్వివేకాయ.

గరిమ నిచ్చి కురంగదృశల కుచయుగము నుండి లఘిమ స్వీకరించు నిర్వివేక యువక ధైర్యమునకు నమస్కారము. ఇట్టి వానిలో దానాదాన వ్యవహారము కవికల్పితము. వాస్తవము కాదు. వాస్తవ మయినచో నలంకారము కాదు.

## ౫౦. పరిసంఖ్య.

* సామాన్య ప్రాప్తార్థమునకు విశేషమున వ్యావృత్తి పరిసంఖ్య.

౨౧౩. "సేవాయాం యది సాభిలాషమసి రే! లక్ష్మీపతిః సేవ్యతాం
చింతాయామసి సస్పృహం యది చిరం చక్రాయుధశ్చింత్యతాం
ఆలాపం యది కాంక్షసే మధురిపోర్గాథా తదాలప్యతాం
స్వాపం వాంఛసి చేన్నిరర్గలసుఖే చేతః! సఖే! సుప్యతాం".

ఓరీ! సఖా! చేతమా! సేవలో నీ కభిలాష యున్నచో లక్ష్మీపతిని సేవింపుము. చింతనములో స్పృహ యున్నచో చిరము చక్రాయుధుని చింతింపుము. ఆలాపము కాంక్షింతువేని మధురిపు గాథ నాలపింపుము. స్వాపము వాంఛింతువేని నిరర్గలసుఖమున నిద్రింపుము. ఇందు రాగప్రాప్తమగు సేవ పరమేశ్వరు నందును విషయాంతరమందును ప్రసక్తము కాగా "విషయాంతరము సేవింప వలదు." అని యర్థబలమున గోచరించును. ఇది శబ్దోక్తము కాదు. కావున వ్యావృత్తియార్థి. ప్రశ్నపూర్వకము కానందున శుద్ధ.

౨౧౪. కిం తీర్థం? హరిపాదపద్మ భజనం, కిం రత్నమచ్ఛా మతిః
కిం శాస్త్రం? శ్రవణేన యస్య గలతి ద్వైతాంధ కారోదయః
కిం మిత్రం? సతతోపకార రసికం తత్త్వావబోధః సఖే!
కః శత్రుర్వద! ఖేద దాన కుశలో దుర్వాసనా సంచయః.

తీర్థమేది? హరిపాద పద్మ భజనము. రత్న మేది? స్వచ్ఛమగు మతి. శాస్త్రమేది? శ్రవణమున ద్వైతాంధ కారము పోగొట్టునది. సఖా! మిత్ర మెవరు? సతతోపకార రసిక మయిన తత్త్వావబోధము శత్రు వెవరో చెప్పుము! ఖేదమిచ్చు దుర్వాసనా సంచయము. ఇందు హరి పాద భజనాదికమే తీర్థాదికము కాని యితరము కా దను నర్థము తాత్పర్య మర్యాదచే ప్రతీత మగును. అందుచే నార్థ-ప్రశ్నము లుంటచే ప్రశ్నపూర్వక పరిసంఖ్య.

౫౧ అర్థాపత్తి.

* వేరొక యర్థమున తుల్యకారణ మగుట యర్థాంతరాపత్తి యర్థాపత్తి.

౨౧౫. లీలాలుంఠిత శారదాపుర ధియామస్మాదృశానాం పురో
విద్యాసద్మ వినిర్గలత్కణముషో వల్గంతి చేద్బాలిశాః
అద్య శ్వః ఫణినాం శకుంతశిశవో దంతావళానాం శశాః
సింహానాం చ సుఖేన మూర్ధని పదం ధాస్యంతి శాలావృకాః.

హేలగా శారదాపురీ బుద్ధివైభవము కొల్లగొట్టిన మా వంటి వారల యెదుట విద్యామందిరముల దిగజారిన కణముల దొంగిలించిన బాలిశులును పలుకుదురేని నేడో రేపో పిల్లపిట్టలు త్రాచుపాముల శిరమున, కుందేళ్ళు దంతావళముల మూర్ధమున, కుక్కలు నక్కలు సింహముల శిరమునను సుఖముగ పద ముంచగలవు ఇందు బుద్ధిమద్వృత్తాంతము ప్రకృతము. దానిచే నప్రకృత ఫణ్యాది వృత్తాంత ముపస్థిత మగుచున్నది. అసమాన ధీప్రాభవుల యెదుట మూర్ఖుల చాపల్యము ఫణుల యెదుట విహగశిశు చాపలము వంటిదని రెండిటికి సామ్య మున్నది. ఫణిశకుంతములు, దంతావలశశములు, సింహసృగాలము లప్రకృతము లనేకములు నిర్దిష్టము లగుట యర్థాపత్తి మాలారూపము నయినది.

౫౨. వికల్పము.

* విరుద్ధములకు పాక్షిక ప్రాప్తి వికల్పము.

౨౧౬. "ప్రాణానర్పయ! సీతాం వా గృధ్రాంస్తర్పయ! వా ద్విజాన్
యమం భజస్వ! రామం వా యథేచ్ఛసి తథా చర!"

ప్రాణములనేని సీతనేని యర్పింపుము! గృధ్రములనేని ద్విజులనేని తర్పింపుము! యమునేని రామునేని సేవింపుము! నీ యిష్ట మాచరింపుము! ఇందిది యవభాసించును. మానరక్షణమె నీ కభీష్ట మయిన ప్రాణముల నర్పింపుము. గ్రద్దల తృప్తి పొందింపుము. యముని సేవింపుము. జీవరక్షణమె నీకు ప్రమాణ మేని సీతనర్పింపుము. ద్విజుల తోష పెట్టుము. రాముని సేవింపుము. ప్రాణ గృధ్ర యములో? సీతా ద్విజ రాములో? అన్నిటికి యౌగపద్యము సంభవింపదు. పర్యాయప్రాప్తియే. అయినను ప్రాణ సీతలకు గృధ్ర ద్విజులకు, యమ రాములకు పరస్పర మౌపమ్యము భాసించును. ఇట్లిచట వికల్పము చమత్కారియై యలంకార మయినది.

౫౩. సముచ్చయము.

* పదార్థములకు యుగపదన్వయము సముచ్చయము.

"యుగపత్" అనుట క్రమవ్యావృత్తికె. ఏకక్షణాన్వయ మని కాదు. కొంచెము కాలభేద మున్నను సముచ్చయ భంగము లేదు.

౨౧౭. ఆతామ్రా సింధుకన్యాధవ చరణ నఖోల్లాసి కాంతిచ్ఛటాభిః
జ్యోత్స్నాజాలైర్జటానాం త్రిపురవిజయినో జాత జాంబూనద శ్రీః
స్వాభావ్యాదచ్ఛ ముక్తాఫల రచిత లసద్గుచ్ఛ సచ్ఛాయ కాయా
పాయాదాయాస జాలాదమర సరిదఘవ్రాత జాత శ్రమాన్నః.

శ్రీరమాధవుని చరణనఖముల కాంతిధారలచే నెఱ్ఱనై, పరశివుని జటల జ్యోత్స్నలచే జాంబూనద శ్రీకమై స్వభావసహజముగా స్వచ్ఛ ముక్తాఫల గుచ్ఛ సచ్ఛాయమై విలసిల్లు దేవనది యాయాస జాలము కల యఘసంఘాత సంజాత శ్రమము నుండి మమ్ము రక్షించు గావుత! ఇందు తామ్ర స్వర్ణవర్ణ ధవల గుణముల కేకధర్మ్యాన్వయ మున్నది. హరిచరణ నఖ సంసర్గ సమయమున హరజటాసంసర్గము లేదు. కాన రక్త పీత వర్ణములకు యౌగపద్యము సంభవింపదు. అయినను గంగాసహజ ధవలిమతో వానికి సంబంధ మున్నదని యభ్యూహ్యము.

౫౪. సమాధి.

* కార్యమునకు కారణాంతరమున సౌకర్యము కలుగుట సమాధి.

౨౧౮. అయాతైవ నిశా మనో మృగదృశామున్నిద్ర మాతన్వతీ
మానో మే కథమేష సంప్రతి నిరాతంకం హృది స్థాస్యతి?
ఊహాపోహమిమం సరోజనయనా యావ ద్విధత్తేతరాం
తావ త్కామనృపాతపత్ర సుషమం బింబం బభాసే విధోః.

“మానవతుల మనసు మేల్కొలిపి రాత్రి రానే వచ్చినది. నా మనమున నిరాతంకముగా నీ మాన మెట్లుండును?” సరోజనయన యిట్లూహాపోహ మొనరించు నంతలో కామదేవుని గొడుగు చంద్రమండల మవభాసించినది. ఇందు రాత్రిసంనిధానముననె సిద్ధించు మానవినాశము చంద్రోదయమున ననాయాసమున సిద్ధ మగుట వర్ణితము.

౨౧౯. నవప్రసంగం దయితస్య లోభాదంగీకరోతి స్మ యదా నతాంగీ
శ్లథం తదాలింగనమప్యకస్మాత్ ఘనో నినాదైర్ఘనతాం నినాయ.

నతాంగి లోభమున దయితుని నవప్రసంగ మంగీకరింపగా వదులుగా నున్న తదాలింగనము నకస్మాత్తుగా ఘనము నినాదములచే ఘనము చేసెను. ఇందు మేఘధ్వానములచే నాలింగనము సాంగ మయినది.

౫౫. ప్రత్యనీకము.

* ప్రతిపక్షసంబంధి తిరస్కారము ప్రత్యనీకము.

లోకమున ప్రతిపక్ష తిరస్కారమునకై యనీకము ప్రయోగింతురు. ఆ శక్తి లేకున్న ప్రతిపక్షసంబంధి నొకని తిరస్కరింతురు. ప్రతిపక్షము బలము కలదగుట తాను దుర్బల మగుట యిందు గోచరించును.

౨౨౦. రే! రే! మనో! మమ మనోభవ శాసనస్య
పాదాంబుజద్వయ మనారత మామనంతం
కిం మాం నిపాతయసి సంసృతి గర్త మధ్యే
నైతావతా తవ గమిష్యతి పుత్రశోకః.

ఓరీ! మనసా? మనోభవశాసనుని పాదాంబుజము లనారతము చింతించు నన్ను సంసారపు గోతిలో పడవేయుదు వేమి? ఇంతతో నీ పుత్రశోకము పోదే!. ఇందు మనసు మనోభవహరకు నేమియు చేయజాలక తత్పదచింతకు నెదురొ్కనుటచే ప్రత్యనీకము సంగతము.

౫౬. ప్రతీపము.

* ప్రసిద్ధౌపమ్య వైపరీత్యమున నౌపమ్యము వర్ణించుట ప్రతీపము.

ప్రసిద్ధోపమాన ముపమేయము కాగా న్యూనతయు, నుపమేయ ముపమానము కాగా నాధిక్యమును భాసించుట ప్రతీపమున ఫలము. ఇదియే యుపమా వైలక్షణ్య బీజము.

౨౨౧. కింజల్పసి ముగ్ధతయా హంత! మమాంగం సువర్ణ వర్ణమితి
తద్యది పతతి హుతాశే తదా హతాశే! తవాంగవర్ణం స్యాత్.

నా యంగము సువర్ణవర్ణ (సదృశ) మని మౌగ్ధ్యమున పల్కెదవు. ఓసీ! హతాశా! ఆ సువర్ణము హుతాశమున పడినచో నీ యంగవర్ణ మగును గదే! ఇందు పూర్వార్ధమున "అంగము సువర్ణవర్ణ" మనుట యుపమ. దానిచే సువర్ణవర్ణాధిక్యము గోచరించును. దాని కాదని యుత్తరార్ధమున ప్రతీపము బాలాంగ వర్ణాధిక్య మవగమింప జేయును. హుతాశపాతము లేకున్న ప్రతీపమును దుర్లభము. ఉపమ స్వప్నమున గూడ సంభవింపదని ముగ్ధత్వహతాశత్వములచే గోచరించును. ప్రాచీనానురోధమున ప్రతీపము పృథగలంకారమని నిరూపితము.

## ౫౮. ప్రౌఢోక్తి.

* ఒకదాని యందతిశయము ప్రతిపాదించుటకై యట్టిదాని సంసర్గ ముద్భావించుట ప్రౌఢోక్తి.

౨౨౨. "మంథాచల భ్రమణవేగ వశంవదా యే
దుగ్ధాంబుధే రుదపతన్నణవః సుధాయాః
తైరేకతా ముపగతై ర్వివిధౌషధీభిః
ధాతా ససర్జ తవ దేవ! దయాదృగంతాన్"

మంథగిరి భ్రమణవేగమున క్షీరసాగరమునుండి సుధాణువు లెగురగా వానితో నైక్యము పొందిన వివిధౌషధులతో నీ దయా దృగంతములను ధాత సృజించెను. ఇందు దృగంతముల కవి చెప్పదలచినవి సంజీవకత్వాద్యమృతగుణములు మాత్రమె కాదు. నిఖిలజన వశీకారకత్వాదులను గూడ చెప్పదలచియె సుధాకణములం దౌషధీసంసర్గ మతిశయమునకై నిరూపించెను.

## ౫౯. లలితము.

* ప్రకృతధర్మి యందు ప్రకృతధర్మ ముల్లేఖింపక యప్రకృత వ్యవహార సంబంధము నిరూపించుట లలితాలంకారము.

౨౨౩. క్వ వా రామః కామప్రతిభట లలాటంతప బలః ?
తవ క్వామీ వీరాః రణశిరసి ధీరా మఖభుజాం ?
దిదక్షోస్త్రైలోక్యం ప్రలయశిఖినః పద్మమథన
ప్రగల్భైః ప్రాలేయైః ప్రశమమసి కర్తుం వ్యవసితః.

శివుని కూడ శ్రమ పెట్టు బలము కల రాము డెక్కడ ? యాగభోజుల రణశిరమున ధీరులయిన నీ వీరు లెక్కడ ? ముల్లోకముల దహించు ప్రలయాగ్నిని పద్మపరాభవ ప్రగల్భము లయిన ప్రాలేయములతో ప్రశమింప జేయుటకై యత్నపడితివి కదా !. ఇందు రావణుడు ప్రకృతధర్మి. పరులిచ్చిన పురోడాశము తిను దేవతల యెదుట ధీరు లయిన కుంభ కర్ణాది వీరుల గూడి శ్రీరామభగవాను పరాభవింప దలతువు.'' అను ప్రకృతవ్యవహారము కంఠరవమున నిరూపితము కాలేదు. మంచుకణములచే నగ్ని ప్రశమనాత్మక మయిన యప్రకృతవ్యవహార మె యుపాత్తము. విషయి యున్నది. విషయము లేదు. విషయోపాదాన మున్న నిదర్శన యగును. ఇచట లలితాలంకార మె.

## ౫౯. ప్రహర్షణము.

* సాక్షాత్తద్యత్నము లేకున్నను అభీష్టార్థలాభము ప్రహర్షణము.

౨౨౪. ''తిరస్కృతో రోషవశాత్పరిష్వజన్
ప్రియో మృగాక్ష్యా శయితః పరాఙ్ముఖః
కిం మూర్ఛితోఽసావితి కాందిశీకయా
కయా చిదాచుంబ్య చిరాయ సస్వజే.''

ఆశ్లేషించు ప్రియుని రోషవశాన మృగాక్షి తిరస్కరించినది. అతడటు తిరిగి శయనించెను. అయ్యో ! కోపించినా డేమో ? యని బెదిరి బెంబేలు పడిన యామె యాతని ముద్దిడి చిరము పరిష్వజించినది. ఇందు ప్రియునకు యత్న మేమియును లేకున్న నిష్టలాభ మున్నది.

౨౨౫. కేలీమందిర మాగతస్య శనకై రాలీరపాస్యేంగితైః
సుప్తాయాః సరుషః సరోరుహదృశః సంవీజనం కుర్వతః
జానంత్యాప్యనభిజ్ఞయేవ కపటవ్యామీలితాక్ష్యా సఖి !
శ్రాంతాసీత్యభిధాయ వక్షసి తయా పాణిర్మమాధీయత.

కేలీమందిరమునకు నేనేగితిని. చెలియల నందరిని మెల్లగా మిషపెట్టి పంపివేసి, రోషమున శయనించియున్న పద్మనయనకు వీవనతో విసురుచుంటిని. అపుడామె యంతయు తెలిసియు తెలియనిది వలె కపటమున కన్నులు మూసికొనియే "సఖి! శ్రాంత వయితివి" యని పలికి నాహస్తమును వక్షమున కూర్చుకొనినది. ఇందు భామినీ రోషనివారణ మునకై యత్నమొనరింప కాముకునకు రోషనివారణమున కన్న నధికతర సుఖప్రద మయిన కుచోపరి హస్తవిన్యాస మాసంజిత మయినది. వాంఛితార్థ సిద్ధికై యత్నమొనరింపగా నంతకన్న నధికతరార్థలాభ మను ప్రహర్షణభేద మిచట సంగత మగుచున్నది.

౬౦. విషాదనము.

* అభీష్టార్థ విరుద్ధ లాభము విషాదనము.

౨౨౬. "స్వస్వవ్యాపృతి మగ్న మానసతయా మత్తో నివృత్తే జనే
చంచూకోటి నిరాకృతార్గల ఇతో యాస్యామ్యహం పంజరాత్
ఏవం కీరవరే మనోరథమయం పీయూష మాస్వాదయ
త్యంతః సంప్రవివేశ వారణకరాకారః ఫణి గ్రామణీః."

"తమ తమ పనులలో మగ్నమానసులై జనులు నా నుండి పోగా, ముక్కుతో నర్గలము తొలగించి పంజరము నుండి వెలి కేగుదును" అని చిలుక మనోరథ సుధ నాస్వాదించుచుండగనే యేనుగు తొండము వంటి కోడెత్రాచు లోపల ప్రవేశించినది. ఇందప్రకృత శుక వృత్తాంతమున ప్రకృతమగు భగ్నాశయుని వృత్తాంతమును కవి బోధింప దలచెను గాన అప్రస్తుతప్రశంస యున్నది. అర్గలము తీసి పోవుదు ననియె శుకము తలచినది. వెడలుటకు యత్న మొనరింపలేదు. కాన విషమాలంకారము కాదు. అభీష్టార్థ విరుద్ధలాభ మున్నందున విషాదనమె యప్రస్తుతప్రశంస కూడి సుసంగత మయినది.

౨౨౭. "చేలాంచలేనానన శీతరశ్మిం సంవృణ్వతీనాం హరిదృశ్వరీణాం
గోపాంగనానాం స్మరజాత కంపాద కాండ సంపాతమియాయ నీవీ"

హరిని జూచు గోపాంగనలు చేలాంచలమున ముఖమును మాటు చేసికొనుచుండ స్మరజాతకంపమున కోకముడి యకాండ సంపాతము పొందినది. (జారినది) ఇందాననగోపన మిష్టము. తద్విరుద్ధార్థము నీవిస్ఖలనము. సాత్త్వికకంపమున నది యుత్పన్నము. కావున విషాదనము యుక్తము.

## ౬౧. ఉల్లాసము.

* అన్యదీయ గుణ దోష ప్రయుక్త మగు అన్య గుణ దోషాధాన ముల్లాసము.

గుణమున గుణము, గుణమున దోషము, దోషమున గుణము, దోషమున దోషము నని యిది చతుర్విధము.

౨౨౮. "అలభ్యం సౌరభ్యం హరతి సతతం యః సుమనసాం
క్షణాదేవ ప్రాణానపి విరహ శస్త్రక్షత హృదాం
త్వదీయానాం లీలాచలిత లహరీణాం వ్యతికరా
త్పునీతే సోఽపి ద్రాగహహ! పవమానస్త్రిభువనం"

సతత మలభ్య సుమనః సౌరభ్యము హరించునది, విరహశస్త్రమున క్షతహృదయు లగువారి ప్రాణముల క్షణమున హరించునది యగు వాయువు కూడ లీలాసంచలితము లయిన నీ లహరుల సంబంధమున మూడు లోకముల పవిత్రము చేయుచున్నది కదా! హా! హా! ఇందు గంగాలహరుల పావనత్వాతిశయమున పవమానునకు పావనత్వ గుణాంతరము వర్ణిత మయినది.

౨౨౯. "విశాలాభ్యామాభ్యాం కిమిహ నయనాభ్యాం ఖలు ఫలం
న యాభ్యామాలీఢా పరమరమణీయా తవ తనుః
అయం తు న్యక్కారో జనని! మనుజస్య శ్రవణయో
ర్యయోర్నాంతర్యాతస్తవ లహరి లీలా కలకలః."

తల్లీ! పరమరమణీయమగు నీ తను వాలీఢము కాకున్న విశాలము లయినను నయనముల కేమి ఫలము? నీ లహరి లీలాకలకలము చెవులలో జేరకుండుట మానవునకు తిరస్కారము కదా! ఇందు శ్రీభాగీరథీ రమణీయత్వ గుణమున, తద్రూపవిముఖము లయిన నయనములకు నిష్ఫలతాదోషము శబ్ద విముఖశ్రవణములకు ధిక్కారదోషము నిరూపిత మయినది. ఇట్లె యితరము లనుసంధేయములు.

## ౬౨. అవజ్ఞ.

* ఉల్లాస విపర్యయ మవజ్ఞ.

అన్యదీయ గుణదోషములచే గుణదోషాధానము లేకుండుట యని పర్యవసితార్థము.

౨౩౦. "నిష్ణాతోఽపి చ వేదాంతే వైరాగ్యం నైతి దుర్జనః
చిరం జలనిధౌ మగ్నో మైనాక ఇవ మార్దవం."

చిరకాలము జలనిధిలో మగ్నమయిన మైనాకము మార్దవము పొందనట్లు దుర్జనుడు వేదాంతమున నిష్ణాతుడయినను వైరాగ్యము పొందనేరడు. ఇందు పూర్వార్థమున ప్రపంచానిత్యతా బోధకతా రూపమయిన వేదాంతశాస్త్రగుణము ఖలునందు వైరాగ్యరూప గుణమాధానింపక పోవుట యున్నది. ఉత్తరార్థమున ద్రవత్వరూప జలనిధి గుణము మైనాకమునందు మార్దవరూప గుణమాధానింపక పోవుట వర్ణితము.

౨౩౧. "మద్వాణి! మాకురు! విషాద మనాదరేణ
మాత్సర్యమందమనసాం సహసా ఖలానాం
కావ్యారవింద మకరంద మధువ్రతానాం
ఆస్యేషు యాస్యసి సతాం విపులం విలాసం."

మద్వాణి! మాత్సర్యమున మనసు మందగించిన ఖలుల యనాదరమున విషాద మొందకుము. కావ్యారవింద మకరంద మధువ్రతు లయిన సత్పురుషుల ముఖము లందు విలాసము పొందుదువుగానిలె! ఇందు పూర్వార్థమున ననాదరరూప ఖలదోషముచే కవివాణి యందు విషాదరూపదోషము లేకుండుట శాబ్దముగా నున్నది. వాణీగత రమణీయతారూప గుణమున ఖలునందు సంతోషరూపమగు గుణము లేకపోవుట యార్థముగ నున్నది. కాన రెండవజ్ఞ లున్నవి. ఉత్తరార్థమున సరసతారూపమగు సహృదయ గుణమున కవివాణికి ఉల్లాసరూపమగు గుణాధాన ముండుటచే నుల్లాసము. విశేషోక్తిచే గతార్థమగుట అవజ్ఞ యలంకారాంతరము కాదని యందురు.

౬౩. అనుజ్ఞ.

* ఉత్కృట గుణవిశేషమునకై దోష మర్థించుట యనుజ్ఞ.

౨౩౨. ప్రణిపత్య విధే! భవంతమద్ధా వినిబద్ధాంజలిరేక మేవ యాచే
జనురస్తు కులే కృషీవలానా మపి గోవిందపదారవింద భాజాం

బ్రహ్మ! నిన్ను నమస్కరించి నిబద్ధాంజలినై యిప్పుడిది యొకటి యాచింతును. గోవిందపదారవిందములు సేవించు కృషీవలుల కులమునయిన నాకు జన్మ యుండుగావుత. ఇందు హరిభక్తిలాలసచే కృషీవల కుల జన్మ ప్రార్థన మున్నది.

## ౬౮. తిరస్కారము.

* దోషవిశేషానుబంధమున గుణముగా ప్రసిద్ధమును గూడ ద్వేషించుట తిరస్కారము.

౨౩౩. "శ్రియో మే మా సంతు క్షణమపి చ మాద్యద్గజఘటా
మద భ్రామ్యద్భృంగావలి మధుర సంగీత సుభగాః
నిమగ్నానాం యాసు ద్రవిణరస పర్యాకుల హృదాం
సపర్యాసౌకర్యం హరిచరణయో రస్తమయతే"

మదించిన యేనుగుల మదముచే భ్రమించు తుమ్మెదల మధురసంగీతములచే మనోహరములయిన శ్రీలు నాకు క్షణమేని యుండకపోవుగావుత. అర్థరసముచే హృదయము వ్యాకులపడి రాజ్యలక్ష్ములలో నిమగ్నులయిన వారికి హరి చరణముల సపర్యాసౌకర్య మస్తమించి పోవుచున్నది. ఇది హరి చరణసేవ జారిపోవునను భయమున రాజ్యసుఖమును తిరస్కరించుట యున్నది. రాజ్యసుఖము మంచిదని ప్రసిద్ధమె యయిన నిట్లు ద్విష్ట మయి నందున తిరస్కారము సంగతము.

## ౬౯. లేశము.

* అనిష్టసాధన మగుటచే గుణము దోషముగను, ఇష్టసాధన మగుటచే దోషము గుణముగను వర్ణించుట లేశము.

౨౩౪. "అపి బత! గురుగర్వం మాస్మ కస్తూరి! యాసీ
రఖిలపరిమలానాం మౌలినా సౌరభేణ
గిరిగహన గుహాయాం లీనమత్యం తదీనం
స్వజనక మమునైవ ప్రాణహీనం కరోషి".

కస్తూరి! సర్వపరిమళములలో నుత్తమ మయిన సౌరభ మున్నదని పెద్దగర్వము పొందకుము. గిరిగహనగుహలో దాగికొని మిక్కుల దీన మయిన స్వజనము నీ సౌరభముననే ప్రాణహీన మొనర్చుచున్నావు. ఇందు సౌరభ గుణము ప్రాణనాశనరూపమగు ననిష్టసాధన మగుటచే దోషముగ వర్ణించుట యున్నది.

౨౩౫. "నైర్గుణ్యమేవ సాధీయో ధిగస్తు గుణగౌరవం
శాఖినోఽన్యే విరాజంతే ఖండ్యంతే చందనద్రుమాః."

గుణములు లేకుండుటయే యుక్తము. గుణగౌరవమేమియు యుక్తము కాదు. ఇతరవృక్షము లన్నియు చక్కగా శోభించుచున్నవి. చందన వృక్షములనే ఖండించుచున్నారు. ఇందు దోషము గుణముగా వర్ణితము. ఇది యర్థాంతరన్యాసానువిద్ధ మగుట విశేషము.

### ౬౬. తద్గుణము.

* స్వగుణత్యాగపూర్వకముగా నితరగుణగ్రహణము తద్గుణము.

౨౩౬. "అధరేణ సమాగమాద్రదానా మరుణిమ్నా పిహితోऽపి శుద్ధభావః
హసితేన సితేన పక్ష్మలాక్ష్యాః పునరుల్లాసమవాప జాతపక్షః."

రదన మధరముతో గూడి యుంటచే స్వచ్ఛత యారుణ్యమున పిహిత మయినది. అయినను పక్ష్మలాక్షి సితహసితముచే జాతపక్షమై మఱల నుల్లాసము పొందినది. ఇందు పూర్వార్థమున నన్యగుణ గ్రహణమున తద్గుణము స్పష్టమె. కాని యది యుత్తరార్థములో ప్రతిప్రసవతుల్య మయిన హాసమున నపోహితమై భంగుర మయినది. హాస మధరారుణిమ పోగొట్టి ధవళి మొనర్చె నని గ్రహించినచో వేరొక తద్గుణము నిశ్చయింపవచ్చును. ఇట్టి యీ భంగుర రీతినే కొందరు పూర్వరూపాలంకార మందురు.

### ౬౭. అతద్గుణము.

* తద్విపర్యయ మతద్గుణము.

౨౩౭. "కుచాభ్యామాలీఢం సహజకఠినాభ్యామపి రమే!
న కాఠిన్యం ధత్తే తవ హృదయమత్యంతమృదులం
మృగాంగానామంతర్జనని! నివసంతీ ఖలు చిరం
న కస్తూరీ దూరీభవతి నిజసౌరభ్య విభవాత్."

రమా! సహజకఠినము లయిన నీ కుచము లాక్రమించిన నత్యంత మృదుల మయిన నీ హృదయము కాఠిన్యము ధరింపలేదు. జననీ! కస్తూరి మృగాంగనలలో చిరము వసించినను తన సౌరభ్యవిభవమునకు దూరము కాదు కదా! ఇందు పూర్వార్థమున పరగుణములు స్వీకరింపక పోవుట శాబ్దముగా నున్నది. తన గుణముల విడువమి యార్థముగా నున్నది. ఉత్తరార్థము లోని దృష్టాంతమున స్వగుణత్యాగాభావము శాబ్దము. పరగుణాగ్రహణ మార్థము.

### ౬౮. మీలితము.

* ప్రత్యక్షవస్తు లింగసామ్యమున భేదము లేమి యప్రత్యక్ష వస్తువు ప్రకాశము కాకుండుట మీలితము.

౨౩౮. జలకుంభముంభితరసం సపది సరస్యాః సమానయంత్యాస్తే
తటకుంజ గూఢ సురతం భగవానేకో మనోభవో వేద!

జలమునింపి సరసినుండి జలకుంభము తెచ్చు నీదు తటకుంజ గూఢ సురతమును భగవానుడు మన్మథు డొక్కడె తెలియవలెను. ఇందు స్వేద కంపనిశ్వాసములు సురతసూచకములు. జలకుంభానయన వేగమున నవి కలుగును. ఇట్టి భేదాగ్రహమున సురత మప్రకాశ మయినది.

### ౬౯. సామాన్యము.

* వస్తువు ప్రత్యక్ష మయినను బలవత్సజాతీయజ్ఞానమున భేదాగ్రహణము సామాన్యము.

౨౩౯. "యస్మిన్నిమానీ నికషావదాతే చంద్రాంశు కైవల్యమివ ప్రయాతే
పుచ్ఛాశ్రయాభ్యాం వికలా ఇవాద్రౌ చరంతి రాకాసు చిరం చమర్యః."

హిమస్వచ్ఛ మయిన హిమవంతము చంద్రకిరణముల నద్వైతము పొందగా పూర్ణిమ వెన్నెలలో చమరీమృగములు పుచ్ఛ మాశ్రయము లేనివై చిరము చరించు చున్నవి. ఇందు వెన్నెలకు వేరుగా హిమాచలము చమరీపృచ్ఛము గోచర మగుట లేదు. హిమాచల చమరీపృచ్ఛములు ప్రత్యక్షములె. సజాతీయచంద్రిక బలీయ మగుట పృథగ్భానము లేదని భావము. మీలితము నందు నిగూహ్యమానము ప్రత్యక్షము కాదు.

### ౭౦. ఉత్తరము.

* ప్రశ్న ప్రతిబంధక జ్ఞానవిషయార్థ ముత్తరము.

తెలియవలె ననెడి జిజ్ఞాస ప్రశ్న. అది యుత్తరరూప మయిన వాక్యమున నివర్తించును. ఉత్తరము లోని యర్థజ్ఞానము జిజ్ఞాసను శాంతింప జేయునేని యుత్తరాలంకార మగును. ఈ యుత్తర మున్నీతప్రశ్న మని నిబద్ధప్రశ్న మని రెండు విధములు.

౨౪౦. త్వమివ పథికః ప్రియో మే విటపిస్తోమేషు గమయతి క్లేశాన్
కిమితో౽న్యత్కుశలం మే? సంప్రతి యత్పాంథ! జీవామి.

ఒక పథికపురంధ్రి వేరొక పథికున కిట్లుత్తరము చెప్పుచున్నది. అతడు కుశలప్రశ్న మొనర్చెనని యూహింప వలెను. కుశలమడుగనిదే కుశలోక్తి యయుక్తము కదా!. నీవలె నా ప్రియుడు పథికుడు చెట్లగుంపులలో క్లేశముల గడపుచున్నాడు. పాంథా! నేనిపుడు జీవించియే యుంటిని. ఇంత కన్న నాకు వేరు కుశల మేమి ?

౨౮౧. 'కిమితి కృశాసి ? కృశోదరి !' 'కిం తవ పరకీయ వృత్తాంతైః ?'
'కథయ! తథాపి ముదే మమ' కథయిష్యతి యాహి! పాంథ! తవ జాయా.

"కృశోదరి! ఏలనే కృశించితివి ?" "పరకీయవృత్తాంత ములతో నీకేమి పని యున్నదయ్యా ?" "అయినను నా సంతోషమునకు చెప్పవే!" "పాంథ! నీ పెండ్లము చెప్పును లె! పొమ్ము!" ఇందు నీవు కారణము చెప్పితేని ప్రతీకార మొనర్ప గలనని మొదటి ప్రశ్న వ్యంగ్యము. – నేను పతివ్రతను. పరపురుషు నుద్దేశించి హేతువు చెప్పుట యుక్తము కాదు. నీవేమియు ప్రతీకార మొనర్ప లేవు. అని యుత్తరవ్యంగ్యము. – పిల్లా ! పాతివ్రత్య మేలనే ? అదిచాతుర్యవిలాసములు లేని జనుల హఠము మాత్రమె. స్వపరసంతోషమె సంసారసారము కదా ! అని రెండవ ప్రశ్న వ్యంగ్యము.– నాకున్న దశయే నీ భార్యకును గలదు కదయ్యా! నీవామెకే ప్రతీకార మొనర్పుము. స్వసదనము తగులబడుచుండ అది కాదని యెవరేని పరసదనాగ్ని పోగొట్టుదురా ? తన వేదనకూడ సహించి పరోపకారమె యొనర్ప వలె నందువేని ; నీ విట్టి యుపకారమున ప్రవర్తించుచో నీ భార్యకును నీ వంటివాడు వేరొక డుపకార మొనర్చును గదా! నావలెనె నీ పెండ్లము కూడ పరపురుష పరాఙ్ముఖి. నీవే యామె విరహము దూరీకరింపుము. అని వ్యంగ్యము.

౨౮౨. "రోగస్య తే చికిత్సాం నిదానమాలోచ్య సుందరి! కరిష్యే
మా హంత! కాతరా భూ రసక్రియాయాం నితాంత నిపుణోఽస్మి."

సుందరీ! నీ రోగనిదానము గుర్తించి చికిత్స చేయుదును ! అయ్యో ! నీవు బెదరకె! రసక్రియలో నేను నితాంతము నిపుణుడను. ఇందు "నాపృష్టః కస్యచిత్ బ్రూయాత్" అడుగనిదే యెరికిని జెప్పరాదు. అని వైద్యుల ప్రతిజ్ఞ. ఒక ప్రశ్న నిచట నూహింప వచ్చును. "వైద్యా! నా రోగమునకు చికిత్స చేయుదువె ?" యని ఇట్లడిగిన పిల్లది విదగ్ధనాయిక.

ఆమె ప్రశ్న సంభోగాభిప్రాయగర్భము. అది తెలిసిన యాతని యుత్తరము నట్టి యభిప్రాయము తోడనే యున్నది.

ఈ యలంకారమున ప్రశ్నోత్తరము లనేకము లుండవలెనని, యప్పుడె చమత్కార ముదయించునని, ఒక ప్రశ్న యొకయుత్తరమున్న నుత్తరాలంకారము కాదని కొందరందురు. ఒక ప్రశ్న యొక యుత్తర మయినను ఆకూతగర్భము లయినచో చమత్కార ముదయించి తీరును. అప్పు డనేక ప్రశ్నోత్తరము లపేక్షితములు కావు. ఆకూతము లేకున్న నానాప్రశ్నోత్తరముల చమత్కార మపేక్షితము. సకృదుపాదానమున గూడ చమత్కార ముండునని సహృదయహృదయ మేని యలంకారత్వ ముండు గావుత.

“రసో యత్ర వ్యక్తో విలసతి వివిక్తో గుణగణో
లభంతేఽలంకారా అపి చ వికలంకామిహ రుచం
పటు ప్రౌఢ స్ఫీతాక్షర భర పరీతః ప్రతిపదం
విమర్శ వ్యాసంగాజ్జయతి రసగంగాధరమణిః”

INDIRA GANDHI MEMORIAL LIBRARY

UNIVERSITY OF HYDERABAD

Acc. No. T/2167

Call No. T491.25 M26A

Author

**UNIVERSITY OF HYDERABAD**

**LIBRARY**

**HYDERABAD (A. P.)**

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**